ఈనాడు

విజయవాడ 17-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 216


THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 5-00 పేజీలు 20+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




Premier
ఎంఆర్‌పి మీద
ఉగాది శుభాకాంక్షలు
అత్యుత్తమ మిక్సర్
గ్రైండర్‌ని ఆరోగ్యం
మరియు ఆనందం కోసం
తగ్గింపు ధరలో కొనండి.
ఎంఆర్‌పి మీద
40% వరకు
తగ్గింపు పొందండి
ఈడూజోడుగా ఉన్న
నూతన వధూవరులకు
ప్రేమతో కానుక ఇవ్వండి.
ఆఫర్ ధర
₹9999/-
మొత్తం విలువ ₹16815/-
Premier
Cookware & Appliances
Available at all leading stores.
FOR MORE DETAILS PLEASE CONTACT: ANDHRA PRADESH : PRAKASAM / NELLORE: 8019996926, 7032449346, 9966479203, ANANTAPUR / CHITTOOR: 9848748164, 9966479203, KADAPA / KURNOOL: 9502398598, 9866454632, 9966479203, EAST & WEST GODAVARI: 8142644154, 7780236360, 9966479203, KRISHNA / GUNTUR: 9866226796, VISAKHAPATNAM / SRIKAKULAM / VIZIANAGARAM: 9966479203, 7989971231. TELANGANA : 9949869551, 8074440792, BULK PURCHASE / CORPORATE GIFT ENQUIRIES SOLICITED PLEASE CONTACT: 9966479203, 9940268833



CASIO
Reliable & Durable
మేము మా వినియోగదారులకు మంచి నాణ్యత గల సామాన్లు విక్రయిస్తాం!
హా హా!
వాళ్ళు చవక, నాణ్యత లేని కాలిక్యులేటర్స్ ఉపయోగిస్తున్నారు, కానీ నాణ్యత గురించి మాటలాడుతారు!
చవక, నాణ్యత లేని కాలిక్యులేటర్‌ని ఉపయోగించటం
వల్ల మీ స్టేటస్ పాడవుతుంది
CALCULATOR
అనగా
CASIO
CASIO
MJ-120Da
60th ANNIVERSARY SINCE 1957
AVAILABLE AT ALL LEADING STATIONERY OUTLET.



ఈనాడు



విజయవాడ 17-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 216
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఆంధ్రా అంటే లెక్కలేదా?

ప్రధాని వెంట ఏ1, ఏ2 లా..?

- ఈ దేశానికి మోదీ ఏం సందేశం ఇస్తున్నారు?
- కేసులుంటే నాయకులు మీ మాట వింటారనా
- రాష్ట్రానికి మోదీ అన్యాయం చేశారని చిన్నపిల్లాడూ చెబుతాడు
- జనసేన నాయకుడు ఆయన్ను ఎందుకు నిలదీయలేదు
- మోదీ, జగన్, పవన్‌లపై మండలిలో ముఖ్యమంత్రి చంద్రనిప్పులు
- రాయలసీమలో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయిస్తాం

"ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరు? విభజన హామీలు ఎందుకు నెరవేర్చరు? ఈ రాష్ట్రం అంటే మీకు లెక్కలేదా? బాగా అభివృద్ధి చేస్తే మీ మాట నేను వినని భయమా? వాళ్లకైతే(వైకాపా నాయకులు) కేసులు ఉన్నాయి కాబట్టి మీ మాట వింటారని ధైర్యమా? నన్ను బలహీనపరిస్తే మీ ఆటలు సాగుతాయనా? నేను భయపడను. 5 కోట్ల ప్రజల అండ నాకుంది. ఒక పార్టీగా నేను పోరాడటం లేదు. ఒక రాష్ట్ర ప్రభుత్వంగా పోరాడుతున్నా. తెలుగువారి ఆత్మగౌరవ పోరాటం ఇది. వెనకడుగు వేసేది లేదు. పోరాడుతూనే ఉంటా. సహకరించాలి. నన్ను బలపరచాలి. రాష్ట్ర ప్రజానీకం కోసం పోరాటం. ఇది అధర్మపోరు కాదు. వెనుదిరిగి చూడను. సాధించి తీరతా."

ఈనాడు - అమరావతి

అవినీతి కేసుల్లో ఏ1, ఏ2గా ఉన్నవారిని దగ్గరపెట్టుకుని ప్రధాని దేశానికి ఏం చెప్పదలుచుకున్నారని అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీని నిలదీశారు. ఇదేమైనా తమిళనాడు అనుకుంటున్నారా? అక్కడిలా ఇక్కడ రాజకీయాలు చేస్తామంటే కుదరదు అని ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్రానికి అన్యాయం చేసింది మోదీయేనని రాష్ట్రంలో ఏ చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు, ఆడబిడ్డను అడిగినా చెబుతుంది అని దుయ్యబట్టారు. తాజా పరిణామాల నేపథ్యంలో మోదీ, జగన్, విజయసాయి రెడ్డి, పవన్‌కల్యాణ్, కేంద్ర పెద్దల తీరుపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. తొలిసారి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని నేరుగా ఆగ్రహం వ్యక్తం చేశారు. విమర్శలు గుప్పించారు. 'పవన్‌కల్యాణ్ నరేంద్రమోదీని ఎందుకు విమర్శించరు? నన్నెందుకు నిలదీస్తారు? అమరావతిలో అలజడులు సృష్టించి కేంద్రానికి వెసులుబాటు కల్పించడానికా' అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుపై స్వల్పకాల చర్చ జరిగింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఇచ్చారు. కేంద్రం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటూ శాసనమండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సందర్భంగా జరిగిన చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. తొలుత పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. ఆయన స్ఫూర్తి (మిగతా 2లో)



అవిశ్వాస బాణం

- కేంద్రంపై సంధించిన తెదేపా
- కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాలు, ఆర్జేడీ, సమాజ్‌వాదీ మద్దతు
- ఎన్డీయే నుంచి లాంఛనంగా నిష్క్రమణ
- పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ప్రకటన
- గందరగోళం కారణంగా లోక్‌సభలో చర్చకురాని అవిశ్వాస తీర్మానాలు
- 19వ తేదీకి మళ్లీ నోటీసులు ఇచ్చిన తెదేపా, వైకాపా

ఈనాడు, అమరావతి - దిల్లీ

కేంద్రంపై తెలుగుదేశం పార్టీ సమరశంఖం పూరించింది. భాజపాతో దోస్తీకి రాంరాం పలకడంతోపాటు ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దీనికి కాంగ్రెస్, వామపక్షాలతో సహా పలు పార్టీలు మద్దతు పలికాయి. కేంద్రంపై వైకాపా పెడుతున్న 'అవిశ్వాసాని'కి మద్దతివ్వాలని తొలుత అనుకున్నప్పటికీ తాజా పరిస్థితుల్లో సొంతంగానే ఆ పనికి పూనుకోవాలని తీర్మానించుకుంది. దీనికి జాతీయస్థాయిలో మద్దతును కూడగట్టే చర్యలు చేపట్టింది. దీంతో అటు అమరావతిలో, ఇటు దిల్లీలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. మరోపక్క తెదేపా, వైకాపాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు శుక్రవారం లోక్‌సభలో చర్చకు రాలేదు. ఆ తీర్మానాలను సభ ముందుంచి, వాటికి 50 మంది సభ్యుల మద్దతు ఉందా? లేదా? అని తెలుసుకోవడానికి అనువైన వాతావరణం లేకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను సోమవారానికి వాయిదా వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి తెదేపా, వైకాపాలు మరోసారి నోటీసులిచ్చాయి.

ఎన్డీయే నుంచి వైదొలగాలన్న నిర్ణయాన్ని శుక్రవారం సాయంత్రం పొలిట్‌బ్యూరో సమావేశంలో చర్చించాక అధికారికంగా ప్రకటించాలని తొలుత అనుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంపై తానే స్వయంగా అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఎన్డీయే నుంచి తక్షణం బయటకు వచ్చేయాలనుకున్నారు. శుక్రవారం ఉదయం అప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్‌లో ఆ నిర్ణయం ప్రకటించేశారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసుని లోక్‌సభలో అందజేయాలని ఎంపీలను ముఖ్యమంత్రి ఆదేశించారు.



లోక్‌సభలో ఎంపీల నిరసన

తప్పుడు సంకేతాలు వెళతాయనే..

'దొంగల పార్టీ' వైకాపా ఇచ్చిన అవిశ్వాసం నోటీసుకి తెదేపా మద్దతిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని, అందుకే తెదేపా సొంతంగా అవిశ్వాసం నోటీసు అందజేయాలని చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టు.. ఎంపీలతో రాజీనామా చేయించు.. నీ ద్వారానే హోదా వచ్చేలా చేస్తామంటూ జగన్‌తోను, అమరణ దీక్ష చేయి.. నీ ద్వారానే హోదా వచ్చేలా చేస్తామంటూ పవన్‌తోనూ భాజపా నాటకాలాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు (మిగతా 11లో)

48 గంటలు గడువిస్తున్నా

- గుంటూరులో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని అమలు చేయాలి
- పాలనా వ్యవహారాల పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్‌ను పంపాలి
- లేదంటే బంద్ పిలుపు ఇచ్చి ప్రత్యక్ష ఆందోళన చేస్తా
- జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్
- తాను ప్రజల మనిషినని స్పష్టీకరణ

5లో

జనసేన మిస్డ్ కాల్ పార్టీ

- మమ్మల్ని ఎవరూ భయపెట్టలేరు
- బేరసారాలకే జగన్ అవిశ్వాసం
- ఎంతటి రాజకీయాలైనా చేస్తాం
- మంత్రులు సోమిరెడ్డి, జవహర్, రవీంద్ర విమర్శ

11లో

ఇదీ సంగతి!



ఖాతాలు తెరవటానికి కట్టిన సొమ్మంతా రుసుములకిందా, అపరాధ రుసుముల కిందా జమకట్టుకుని, ఖాతాలో డబ్బులేదని రద్దు చేశాం.

ఆలస్యం ఆంధ్రప్రదేశ్‌దే

- ప్రత్యేక ప్యాకేజీ అమలుకు మేం సిద్ధం
- వనరుల్ని ఏ విధానంలో తీసుకోవాలో ఆ రాష్ట్రమే ఇంకా నిర్ణయించుకోలేదు
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

11లో

న్యాయం జరగనందుకే వైదొలగుతున్నాం

- మా ప్రజల ఆకాంక్షల్ని కేంద్రం నిర్లక్ష్యం చేసింది
- భాజపా అధ్యక్షుడు అమిత్‌షాకు చంద్రబాబు లేఖ

11లో



రాహుల్ గాంధీ యువతంత్రం!

- పార్టీ పదవుల్లో యువతకు కోటా
- క్షేత్రస్థాయి కార్యకర్తలకు పెద్ద పీట
- కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యూహం
- ఏఐసీసీ ప్లీనరీ ప్రారంభం

6లో




నన్ను చూస్తే అంత అలుసా..!

- జయలలితకు ఒంగి ఒంగి దండాలు పెట్టేవారు కదా
- భాజపా నాయకులపై ముఖ్యమంత్రి ధ్వజం
- పవన్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు
- మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలు

ఈనాడు అమరావతి: "తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత ఉన్నప్పుడు భాజపా నాయకులు ఆమె వద్దకు ఒంగి ఒంగి నమస్కారాలు చేస్తూ వెళ్లేవారు. నన్ను చూస్తే అంత అలుసేంటి? నన్ను దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర విభజన చేశారు. మన శక్తి తగ్గించారు. ఇప్పుడీ కుట్ర రాజకీయాలేంటి?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. తమిళనాడులో మాదిరిగా ఇక్కడ రాజకీయాలు చేయాలనుకుంటే ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు. శుక్రవారం శాసనసభ సమావేశాలు ముగిశాక... తనను కలసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

విలేకరులు: పవన్‌కు ఇన్నాళ్లూ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చానని బాధపడుతున్నారా?

చంద్రబాబు: అదేమీ లేదు. నాకు వ్యతిరేకంగా మహాకుట్ర జరగడమే బాధ కలిగిస్తోంది. భాజపాకి మిత్రపక్షంగా ఉంటూ అవిశ్వాసతీర్మానం



పెట్టడం నైతికత కాదని, అందుకే అవిశ్వాసం నోటీసు ఇవ్వకముందే తెగదెంపులు చేసుకోవాలని నిర్ణయించాం. మా ప్రకటన చూశాక... మద్దతిచ్చేందుకు చాలా పార్టీలు స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. నేనుగానీ, మా పార్టీ ఎంపీలుగానీ వారి మద్దతు కోరలేదు. ఆయా పార్టీల నాయకులెవరితోను నేను ఇంత వరకు మాట్లాడలేదు.

వి: మీరు జాతీయ రాజకీయాల్లోకి వెళ్లబోతున్నారా?

చంద్రబాబు: ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. వైకాపా ఒక పక్క కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతామని అంటూనే, మరోపక్క ఆ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రధాని కార్యాలయంలో దొంగాటలాడుతున్నారు. అలాంటి పార్టీ పెట్టే అవిశ్వాసానికి మద్దతివ్వడం ఇష్టంలేకే మేమే సొంతంగా అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించాం. రాజకీయాల్లో ధైర్యంగా ఉండాలి. కావాలంటే వెళ్లి నేరుగా మద్దతివ్వాలి.

అంతేగానీ ఈ దొంగాటలెందుకు? ప్రధాని కార్యాలయంలోకి విజయసాయిరెడ్డి ఎందుకు వెళ్లారు? దీనికి ఆయనైనా సమాధానం చెప్పాలి. ప్రధాని కార్యాలయమైనా చెప్పాలి. రాష్ట్రానికి రావలసిన ప్రయోజనాల కోసం కేంద్రంపై పోరాటం కొనసాగుతుంది. మన ప్రజల పోరాటానికి కచ్చితంగా ఫలితాలు వస్తాయి. అది ఈ రోజా, రేపా, ఎల్లుండా అన్నదే ప్రశ్న. మనది న్యాయమైన కోరిక అన్నది దేశవ్యాప్తంగా అందరిలో నాటుకుంది. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 55 మంది ఎంపీలు సంతకం చేసిన తర్వాత... కేంద్రం తప్పించుకోలేదు. చర్చ చేపట్టాల్సిందే.

వి: ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపేందుకు ఢిల్లీ వెళ్తారా?

చంద్రబాబు: అలాంటి ఆలోచనేదీ ప్రస్తుతానికి లేదు. భాగస్వామ్య పక్షంగా ఉన్నంత వరకు నైతిక ధర్మానికి కట్టుబడాలి. ఇప్పుడు మొహమాటం ఏముంటుంది? మద్దతిచ్చేవారందరితో మాట్లాడతా.

వి: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్ని పక్షాలను కలుపుకొని వెళతామంటున్నారు కదా? వారు మద్దతిస్తే తీసుకుంటారా?

చంద్రబాబు: ఊహాగానాల ఆధారంగా మాట్లాడటం సరికాదు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించిన విధానం ఎవరికీ నచ్చలేదు. వాళ్లు మనస్ఫూర్తిగా ముందుకు వస్తే అప్పుడు చూద్దాం. అవిశ్వాస తీర్మానానికి ఎవరు సహకరించినా తీసుకుంటాం.

వి: ఈ మొత్తం వ్యవహారంలో గవర్నర్ పాత్ర ఉందని కొందరంటున్నారు కదా? ఇటీవల భాజపా నాయకుడు దత్తాత్రేయ సమక్షంలో పవన్ కళ్యాణ్‌తో గవర్నర్ మంతనాలు జరిపినట్టు వస్తున్న వార్తల్లో నిజమెంత?

చంద్రబాబు: దానిపై నేను ఇప్పుడేమీ మాట్లాడను. మనుషుల్ని మేనేజ్ చేయగలరుగానీ, ప్రజల్ని మేనేజ్ చేయలేరు.

వి: ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడంలో భాజపా, కాంగ్రెస్ విఫలమయ్యాయన్న భావన ఉన్న నేపథ్యంలో కేంద్ర రాజకీయాల్లో 'ఖాళీ' ఏర్పడిందని భావిస్తున్నారా?

చంద్రబాబు: అలా అని కాదుగానీ, బాధ్యతగా వ్యవహరించడంలో భాజపా, కాంగ్రెస్ రెండూ విఫలమయ్యాయి. ప్రాంతీయ పార్టీలే ఉండరాదన్న ఉద్దేశంతో, జాతీయ దృక్పథం అన్నది లేకుండా చేశారు. నమ్మకం పోయినా పర్వాలేదుగానీ, విద్వేషం ఏర్పడకూడదు.

వి: ఎన్డీయే నుంచి బయటకు వచ్చారు కదా? తదుపరి కార్యాచరణ ఏంటి?

చంద్రబాబు: ఈ రోజు ఉదయమే భాజపాతో తెగదెంపులు చేసుకుంటామని ఎవరూ ఊహించ లేదు కదా? రోజువారీ రాజకీయ పరిణామాల్ని బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటాం.

చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే...

అసెంబ్లీ సీట్లు పెంచడానికి వాళ్లకు మనసు రాలేదు..

రాష్ట్రంలో శాసనసభ స్థానాల సంఖ్య పెంచడానికి ఒక్క పైసా కూడా ఖర్చు కాదు. దానికి కూడా వాళ్లకు మనసు రాలేదు. సీట్ల పెంపుపై వివాదం కూడా లేదు. తెలంగాణ కూడా అడుగుతోంది.

లోకేష్‌కి డబ్బు అవసరమేంటి?

పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడుతున్నారో, ఆయనకే తెలియడం లేదు. లోకేష్‌పై అవినీతి ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నా. లోకేష్‌కి డబ్బు అవసరమేముంది? హెరిటేజ్‌లో ఏటా రూ.100 కోట్ల లాభాలొస్తున్నాయి. రూ.35 కోట్లు పన్నులు కట్టినా, మిగతా రూ.65 కోట్లతో హాయిగా వ్యాపారం చేసుకోవచ్చు కదా? ఎందుకింత కష్టపడాలి? లోకేష్ చిన్నప్పుడు రాత్రి ఆలస్యంగా ఇంటికి వెళ్లాకయినా వాడిని చూసేవాడిని. లోకేష్‌కి శని, ఆదివారాల్లో తప్ప తన కొడుకుని చూసుకునే పరిస్థితి లేదు. కేంద్రంపై నేను పోరాటం చేస్తుంటే, పవన్ కళ్యాణ్ నన్ను తిట్టడంలో అర్థం లేదు.

నిజనిర్ధారణ కమిటీ వేయడమే తప్పు...

పవన్‌కల్యాణ్ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై నిజనిర్ధారణ కమిటీ వేయడమే తప్పు. అంటే నా మీద నమ్మకం లేదనే కదా? వేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.75 వేల కోట్లు రాష్ట్రానికి రావాలని ఆ కమిటీ తేల్చింది. పవన్ కళ్యాణ్ తన ప్రసంగంలో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదు? ఆ నిధులు ఇవ్వమని ఎందుకు అడగలేదు? ఎందుకంత యూటర్న్? ఎందుకీ డొంకతిరుగుడు రాజకీయాలు? రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సినవి అడగాలే తప్ప, నిజ నిర్ధారణ కమిటీ ఎందుకు? జడ్జిమెంట్ ఇవ్వడానికి వీళ్లెవరు? రాష్ట్రానికి ప్రత్యేక హోదా రగులుతున్న సమస్య. రాజకీయ నాయకులైనా, మీడియా ప్రతినిధులైనా ప్రస్తుతం దాని గురించే మాట్లాడాలి. వైకాపా ప్రధాని కార్యాలయం చుట్టూ తిరుగుతూ రాజకీయం చేయాలని చూస్తోంది. పవన్ కళ్యాణ్ వాళ్ల గురించి మాట్లాడకుండా నన్ను బలహీనపరిస్తే ఏమొస్తుంది? గుంటూరులో అతిసారంతో కొందరు చనిపోయారు. దానిపై అసెంబ్లీలో చర్చించాం. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. దానిపై రాజకీయం ఎందుకు? ఎర్ర చందనం స్మగ్లర్లపై నాకంటే ఎక్కువ ఎవరు పోరాడారు?

వాస్తవాలివి.. తెలుసుకోండి!

- రాజధాని భూ సమీకరణపై మండలిలో ముఖ్యమంత్రి ప్రస్తావన
- దేశంలోని కొత్త రాజధానుల నిర్మాణంపై సమగ్ర వివరణ
- ప్రతిపక్షాలు నిజాలు తెలుసుకోవాలని హితవు

ఈనాడు, అమరావతి: రాజధాని నిర్మాణం కోసం 35వేల ఎకరాలు అవసరమా?.. అంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం శాసనమండలిలో స్పందించారు. దేశంలో కొత్తగా ఏర్పాటైన అనేక రాష్ట్రాల్లో రాజధాని/నగరాల నిర్మాణానికి వేలాది ఎకరాలు సమీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అమరావతి నిర్మాణ ప్రత్యేకతలను వివరించడంతో పాటు వివిధ రాజధానుల/నగరాల కోసం వినియోగించిన భూములు, వాటి ప్రత్యేకతలను వివరించారు. వాస్తవాలేమిటో తెలుసుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు.

రాజధాని: భువనేశ్వర్ (ఒడిశా)
విస్తీర్ణం: 34,000 ఎకరాలు (186 చదరపు కిలోమీటర్లు)
ప్రారంభ సంవత్సరం: 1949
ఆర్కిటెక్చర్: జర్మనీకి చెందిన ఒటో కొనిగ్స్బెర్గర్

రాజధాని: చండీగఢ్ (కేంద్రపాలిత ప్రాంతం)
విస్తీర్ణం: 250 చదరపు కిలోమీటర్లు
ప్రారంభ సంవత్సరం: 1966
ఆర్కిటెక్చర్: స్విస్-ఫ్రెంచ్‌కు చెందిన లే కార్బుసియర్, పోలిష్‌కు చెందిన మసీజ్ ఇరిక్కి, అమెరికాకు చెందిన ఆల్బర్ట్ మేయర్

రాజధాని: గాంధీనగర్ (గుజరాత్)
విస్తీర్ణం: 32,500 ఎకరాలు (205 చదరపు కిలోమీటర్లు)
ఆర్కిటెక్చర్: స్విస్-ఫ్రెంచ్ ఆర్కిటెక్ లే కార్బుసియర్ అప్రెంటీస్ ప్రకాశ్, మేవడా

రాజధాని: నవీ ముంబై(మహారాష్ట్ర)
విస్తీర్ణం: 42,000 ఎకరాలు (240 చదరపు కిలోమీటర్లు)
ప్రారంభ సంవత్సరం: 1971
ఆర్కిటెక్చర్: చార్లెస్ కొరియా, ప్రవీణ్‌మేథా, ఆర్.కె.ఝా

రాజధాని: నయా రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)
విస్తీర్ణం: 32,000 ఎకరాలు (180 చదరపు కిలోమీటర్లు)
ప్రారంభ సంవత్సరం: 2000

రాజధాని: జంషెడ్‌పూర్ (ఝార్ఖండ్)
విస్తీర్ణం: 35వేల ఎకరాలు (209 చదరపు కిలోమీటర్లు)

రాజధాని: అమరావతి (ఆంధ్రప్రదేశ్)
విస్తీర్ణం: 35,000 ఎకరాలు
ప్రారంభ సంవత్సరం: 2016
ఆర్కిటెక్చర్: ప్రఖ్యాత నార్మర్ ఫోస్టర్

> రాష్ట్రంలో భాజపా పగ్గాలు పవన్ చేపట్టి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయబోతున్నారని భాజపా సూరత్ నాయకుడు పీవీఎస్ శర్మ అంటున్నట్లు పత్రికల్లో వచ్చింది. పవన్‌కల్యాణ్‌తో మాట్లాడుతున్నాం, ప్రత్యేక హోదా ఇస్తున్నామని అంటున్నారు. ఆయనేమో(పవన్ కల్యాణ్) ఢిల్లీకి వెళ్లను.. ఇక్కడే ఆమరణ దీక్ష చేస్తానంటున్నారు. అంటే ఇక్కడే నిరవధిక నిరాహారదీక్ష చేస్తే మీరు ప్రత్యేక హోదా ప్రకటిస్తారా? అదే ఆయనకూ చెప్పారా?
>
> **- మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఆంధ్రా అంటే లెక్కలేదా?

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తామన్నారు. భాజపా, వైకాపా సంబంధాలపై విరుచుకుపడ్డారు.

పాదాభివందనాలు చేస్తారు? అవిశ్వాసం అంటారు?

వైకాపా నాయకులు అవిశ్వాసం అంటూ డ్రామాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి పాదాభివందనాలు చేస్తారు. 2017 మే 10న ప్రధానిని కలిసి భాజపాకు మద్దతుగా ఉన్నాం అని ప్రకటించారు. రాష్ట్రపతి ఎన్నికలకు ప్రత్యేక హోదాకు ముడిపెట్టబోం అన్నారు. రామ్‌నాథ్‌కోవింద్ రాష్ట్రపతి అభ్యర్థి అని ప్రకటించకముందే బిహార్ వెళ్లిపోయి పాదాభివందనాలు చేసి వచ్చారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఆనందిబెన్ ఏపీ గవర్నర్ అవుతారని అనుకుని అక్కడికీ వెళ్లిపోయారు. అధికారంలో ఉన్నవాళ్లకి పాదాభివందనాలు చేస్తే కేసులు మాఫీ అవుతాయనా? అంటే సీబీఐ, ఈడీకి సంకేతం ఇస్తున్నట్లే కదా! ఎంత దుర్మార్గం..? ప్రధానమంత్రి, రాష్ట్రపతి మాకు(వైకాపా వారికి) బాగా పరిచయం.. మా కేసుల జోలికి రావద్దు.. మీకేదైనా కావాలంటే సరి చేసుకుందాం.. అని చెబుతున్నట్లేగా?

నన్ను దెబ్బ తీయడానికా?

వీళ్లు(వైకాపా) రేపు ఎంపీల పదవికి రాజీనామా చేస్తే భాజపా ఒప్పుకుని ప్రత్యేక హోదా ఇస్తుందట. దానర్థం ఏమిటి? నన్ను దెబ్బతీయడానికా? అలాంటి వాళ్లైతే మీ చెప్పుచేతల్లో ఉంటారనా? రాష్ట్రం అభివృద్ధి కాకూడదనే ఉద్దేశమా? ఇది తమిళనాడు కాదు.. తమిళనాడులో అలాగే జరిగింది. స్వయంగా పన్నీరు సెల్వమే.. ప్రధాని ఫోన్ చేసి చెబితేనే డిప్యూటీ సీఎంగా ఉన్నానని చెప్పారు. ఇక ప్రధాని హుందా ఏంటి?

మోదీ... అవినీతిపరులకు మద్దతా?

ఎన్నికలప్పుడు మనం స్కాంల కాంగ్రెస్, అవినీతి కాంగ్రెస్ అని విమర్శించాం. ఇలాంటి వాళ్లని (జగన్, విజయసాయిరెడ్డి) పక్కన పెట్టుకుంటే ఏమొస్తుంది? నేరస్తులను, అవినీతిపరులను పీఎంవోలో పెట్టుకుంటే ఏం చెబుతున్నట్లు? అలాంటి వారికి ఇంటర్వ్యూలివ్వడాన్ని మీరెలా సమర్థించుకుంటారని ప్రధానిని అడుగుతున్నా. వారి మద్దతు మీకు అవసరం ఉందా? ఇది అనైతికం కాదా..

మీకు రాజకీయాల్లో ఇవి అవసరమా? ఇలాగైతే నీతివంతమైన పాలన ఎలా ఇవ్వగలుగుతారు? ప్రజలకేం సమాధానం చెబుతారు.. వారు కేసుల కోసమే ఇవన్నీ చేస్తున్నారు? ప్రధాని, రాష్ట్రపతిని వారు కలిసి వచ్చిన ఫలితం.. ట్రైబ్యునల్ ఉత్తర్వులు అనుకూలంగా వచ్చాయి. ఇవన్నీ చూస్తుంటే ఈ దేశంలో అవినీతి నిర్మూలించే పరిస్థితి ఉందా? (ఈ సందర్భంగా పీఎంవోలో విజయసాయిరెడ్డి ఉన్న ఫొటోను ముఖ్యమంత్రి సభలో చూపారు) జగన్‌తోనే జనసేన అని వైకాపా ఎంపీ వరప్రసాద్ వాఖ్యానిస్తున్నారు. (కొన్ని పత్రికల్లో వచ్చిన ఆ వార్తలను ముఖ్యమంత్రి చదివి వినిపించారు.)

ఏం... ప్రధాని ఒక్క గంట సమయం ఇవ్వలేరా?

విభజన హామీలను నాలుగు బడ్జెట్‌లలో పట్టించుకోలేదు. చివరి బడ్జెట్‌లోనూ ఏపీ పేరు పెట్టలేదు. ఇక ఎలా సహకరిస్తాం? నమ్ముకుంటే మోసం చేస్తున్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు గట్టిగా పోరాడారు. అయినా కేంద్రం స్పందించలేదు. మళ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదు. ఈ రాష్ట్రం ఒకటుందన్న ఆలోచన లేదా? చట్టంలో పెట్టినవి, రాజ్యసభలో ఇచ్చిన హామీలే అడుగుతున్నాం. కొత్తవి కావే! లెక్కలేనితనమా? ఏం... ప్రధాని ఒక్క గంట సమయం ఇవ్వలేరా? మిత్రపక్షంగా రండి కూర్చుందాం అని అన్నారా? మావి 25 సీట్లు అనే కదా..? 5 కోట్ల జనాభా అనే కదా...? మంత్రులు బయటికి వచ్చే ముందు ప్రధాని అడిగితే చెప్పా. మా మనోభావాలు వివరించా. అయినా పట్టించుకోలేదు. ఆఖరికి ద్రవ్యబిల్లులో కూడా ఏమీ చేయలేదు. ఇక ఎన్డీయేతో ఎందుకుండాలి? అవిశ్వాసం పెట్టక ముందే తెగదెంపులు చేసుకున్నాం. పద్ధతిగా వెళ్తున్నాం.

దేశానికి ఇప్పటికైనా నిజం చెప్పండి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పలేదని రాజ్యసభలో కేంద్ర మంత్రి చెప్పారు. ఆర్థిక సంఘం ఛైర్మనూ ఈ విషయమే చెప్పారు. మరి మమ్మల్ని ఎందుకు నష్టపరచడం? ఇన్ని అబద్ధాలు ఎందుకు? ఆర్థిక సంఘం అసలు ఏం చెప్పిందో ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశానికి స్పష్టత ఇవ్వాలి. ఒక వేళ ఆర్థిక సంఘం ఇవ్వొద్దని చెప్పకపోతే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరు?

మీ ఒక్కరికేనా దేశభక్తి?

తెలుగుజాతికి ఏ జాతికి రానన్ని కష్టాలు వచ్చాయి. ఎప్పటికప్పుడు రాజధాని మార్చుకుంటూ చివరికి ఇక్కడికి వచ్చాం. ఆ రోజు రాజ్యసభలో ప్రతిపక్షంలో ఉండి హామీలు ఇచ్చారు. ఈ రోజు అధికారపక్షంలో ఉండి విస్మరించారు. అరుణ్‌జైట్లీ సెంటిమెంట్స్ పని చేయవు అంటారు. సెంటిమెంటు ఎందుకు వచ్చింది? ఈ రాష్ట్ర ప్రజలకు ఇష్టం లేకుండా విభజన చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సంస్థలు రాష్ట్రానికి లేవు. ఉద్యోగాలు లేవు, పరిశ్రమలు లేవు. జీతాలు, పింఛను ఎలా అన్న భయంతో మేం విడిపోయాం. అగమ్యగోచర పరిస్థితుల్లో మీరు హామీ ఇస్తే ఇక్కడి ప్రజలకు సెంటిమెంట్ ఉండదా? పైసా ఇవ్వకుండా బయటికి పంపితే కన్నతండ్రిపైనే వ్యతిరేకత వస్తుందే? ఇక్కడా సెంటిమెంట్లు ఉన్నాయి. ఎన్డీయే సమాధానం చెప్పాలి. పేరు తప్ప ప్రత్యేక హోదాకు సమంగా ఇస్తామన్నారు. రక్షణ బడ్జెట్ కూడా అడుగుతారు వీళ్లు అని హేళన చేస్తారా? మేం సంస్కారం లేని వాళ్లమా? మీరు ఒక్కరే దేశాన్ని కాపాడతారా? ఈ దేశ రక్షణ కోసం దేశంలోని ప్రతి పౌరుడు వస్తాడు. భారతదేశం మొత్తం వస్తుంది. ఏం మీకొక్కరికే దేశభక్తి ఉందా?

రాష్ట్రంలో అలజడి సృష్టించి కేంద్రానికి వెసులుబాటు ఇవ్వాలనుకుంటున్నారా?

పవన్‌కల్యాణ్ ఉన్నట్టుండి యు టర్న్ తీసుకున్నారు. నాలుగేళ్లు మంచివాడిగా కనబడిన నేను ఉన్నట్టుండి చెడ్డవాడినయ్యాను. నేను మాట్లాడే మూడు మాటల్లో ఆరు అసత్యాలంట. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా. ప్రజలు ఎంతో విశ్వసిస్తున్నారు. నేను నియోజకవర్గానికి రూ.20 కోట్లు పంపిచాననడం ఏమిటి? రూ.500, రూ.2వేల నోట్లు రద్దు చేస్తే అవినీతి తగ్గుతుందని ఎప్పుడో చెప్పా. నన్ను ఎప్పుడూ విమర్శించని వ్యక్తులు అకస్మాత్తుగా నాపై పోరు చేస్తామంటే ఏమని అర్థం చేసుకోవాలి? హోదా ఇవ్వాల్సిన మోదీని ఒక్క మాటా అనలేదే? అంటే రాష్ట్రంలో అలజడి సృష్టించి కేంద్రానికి వెసులుబాటు ఇవ్వాలనుకుంటున్నారా? మీ కార్యక్రమం ఏమిటో కూడా చెప్పకుండా నన్ను తిడుతున్నారంటే ఏమని అర్థం చేసుకోవాలి? ప్రధానికి నేనేం భయపడటం లేదు. దేశ ప్రధానిగా ఎంత గౌరవం ఇవ్వాలో అంతే ఇచ్చా. ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్య పరిష్కారంపై మంత్రి కామినేనిని పంపి వివరించా. ఉద్దానం మూత్రపిండాల సమస్యను నా దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కారం కోసం కృషి చేశా. ఆయనపై గౌరవంతోనే ఇవన్నీ చేశాం. ఇసుక విషయంలో మరెక్కడా లేని విధంగా పారదర్శకంగా చర్యలు తీసుకున్నాం. ఎర్రచందనంపై ఏ ప్రభుత్వం చేయని పోరాటం చేస్తున్నాం. ఈ నాలుగేళ్లలో రూ.1,231కోట్ల ఎర్ర చందనం అమ్మి ఆదాయాన్ని రాబట్టాం.

మెగా ఆక్వా ఫుడ్‌పార్కు ఏర్పాటు వల్ల అక్కడ ఉద్యోగాలొస్తాయి. వాళ్లు నాకేమైనా బంధువులా? ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యల సాగులో అగ్రస్థానంలో ఉంది. విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ముగ్గురు నిపుణులతో కమిటీ వేశాం. వారిని నివేదిక ఇవ్వమన్నాం. తుందుర్రు నుంచి 26.5 కిలోమీటర్లు గొట్టపుమార్గం నిర్మించి సముద్రంలో కలుపుతున్నాం. ఇందుకు రూ.11కోట్లు మంజూరు చేశా. మొదటి దశలో రూ.4కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. పశ్చిమగోదావరి యనమదురు డ్రెయిన్ 140 కిలోమీటర్ల మేర వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు సీఈటీపీ ఏర్పాటు చేస్తున్నాం.

లెక్కలు చెప్పడం లేదనేది సరికాదు

షెడ్యూలు 10 ఆస్తుల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం చేసి సమస్యను పరిష్కరించడానికి కూడా కేంద్రానికి తీరిక లేదంటే ఏం చెప్పాలి? కేంద్రం ఇచ్చిన సొమ్ముకు సంబంధించి రూ.7,619 కోట్లకు యూసీలు ఇచ్చాం. వాటిని ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. ఇంత చేస్తున్నా యూసీలు ఇవ్వడం లేదు, లెక్కలు చెప్పడం లేదనే ప్రచారం సరికాదు. అన్ని రాష్ట్రాల మెట్రోలకు నిధులు ఇచ్చినప్పుడు మనకెందుకు ఇవ్వరు? వాన్‌పిక్, లేపాక్షి ఆస్తులు తమకు ఇవ్వమని అడుగుతున్నా కేంద్రం నుంచి స్పందన లేదు.

పొత్తువల్ల సీట్లు తగ్గాయి.. పెరగలేదు

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అనుకూల ఫలితాలు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో 47.8 శాతం ఓట్లు రాగా.. అసెంబ్లీ ఎన్నికల్లో 46.8 శాతం వచ్చాయి. అంటే 1శాతం తగ్గాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ప్రకారం తెదేపాకు 120 రావాల్సి ఉంటే 102, భాజపాకు 4 మాత్రమే వచ్చాయి. అంటే పొత్తు పెట్టుకున్నాక సీట్లు తగ్గాయి తప్ప పెరగలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మీకు పరిశ్రమలొద్దా

ఒకరు కాకినాడకు వెళ్లి కెమికల్ పరిశ్రమ రావద్దంటారు.. విశాఖ పెట్టుబడుల సదస్సులో జల్లికట్టు స్ఫూర్తితో ఆందోళన చేస్తానంటాడు. ఎన్నో రాష్ట్రాలు పోటీ పడితే కియా సంస్థ చివరికి వెనకబడిన అనంతపురం జిల్లాకు వచ్చింది. అక్కడ కొరియా టౌన్‌షిప్ ఏర్పాటు కాబోతోంది. పద్ధతి ప్రకారం పనిచేస్తున్నామనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. రాష్ట్రంలో 10 లక్షల పెట్టుబడులతో 2019 నాటికి రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని ముందుకెళ్తున్నాం.

రాయలసీమపై నాకు మించిన ప్రేమ ఉందా?

రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించడం పెద్ద కుట్ర. నేను రాయలసీమలో పుట్టా.. నాకు మించిన ప్రేమ భాజపాకు ఉందా? విశాఖను అభివృద్ధి చేసింది నేనే. భాజపాకు కర్నూలుపై అభిమానం ఉంటే సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి. అమరావతిని రెండో రాజధానిగా ప్రకటించండి. రాయలసీమలో హైకోర్టు బెంచి పెట్టమని న్యాయవాదులు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఈ మధ్య కూడా కొందరు వచ్చి కలిశారు. వారందరి కోరిక మేరకు రాయలసీమలో తప్పకుండా హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తాం. దీనిపై ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తా.

● అమరావతి శంకుస్థాపన పనులు ముఖ్యమంత్రి ఘనంగా చేపడితే.. ఆ రోజు ప్రధాని మోదీ పార్లమెంటు మట్టి, గంగాజలాలు అంటూ తీసుకొచ్చారు. పార్లమెంటు ఇప్పుడేమైనా గాంధీ, నెహ్రూ నడిచిన నేలా? ఆ పరిస్థితి మారింది. రాష్ట్రానికి అనేక హామీలనిచ్చి అన్యాయం చేశారు.

–ఎమ్మెల్సీ శమంతకమణి

● ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, దొరబాబు, ఏఎస్ రామకృష్ణ, కేఈ ప్రభాకర్, ఆర్ సూర్యారావు తదితరులు కూడా మాట్లాడారు.

మాధవ్ అభ్యంతరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీ, భాజపాపై విమర్శలు చేసే సమయంలో ఆ పార్టీ శాసనమండలి సభ్యుడు మాధవ్ అభ్యంతరం తెలిపారు. ప్రధాని కార్యాలయంలో వైకాపా ఎంపీ దాగుడుమూతలు అని పత్రికల్లో వచ్చిన కథనాలను చంద్రబాబు వినిపిస్తూ ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారని ప్రశ్నించిన సమయంలో ఆయన మాట్లాడేందుకు ప్రయత్నించారు. ప్రధాని, రాష్ట్రపతిని కలిసి వచ్చాక ట్రైబ్యునల్ ఉత్తర్వులు మారిపోతున్నాయని ప్రస్తావించిన సందర్భంలోనూ అభ్యంతరం చెప్పారు. ఈ సమయంలో మాధవ్ మాట్లాడేందుకు ప్రయత్నించగా..నువ్వు విశాఖలో పుట్టావ్.. నీకేం తెలుసు అని సీఎం ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిలదీస్తూ... నిగ్గదీస్తూ..!

శషభిషల్లేవు.. మెతక వైఖరి అసలే లేదు... ఎదురు దాడే...! ఎవరికి చెప్పాల్సింది వారికి చెబుతూ... హెచ్చరిస్తూ, విపక్షాల తీరుని ఎండగడుతూ, ఒకపక్క ఆవేదన, మరోపక్క ఆగ్రహం కలగలిసిన గొంతుతో శుక్రవారం శాసనమండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. నిబ్బరం కోల్పోకుండా, భావోద్వేగాల్ని బయటపడకుండా ప్రసంగించే చంద్రబాబు.. తన సహజ స్వభావానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా, వైకాపా, జనసేనలపై మండలి వేదికగా నిప్పులు చెరిగారు. ఇన్నేళ్లలో మాకేం చేశారని, కేంద్రాన్ని నిలదీస్తూ, నిగ్గదీస్తూ సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఆయన ప్రసంగం ఆద్యంతం ఉద్వేగ భరితంగా కొనసాగింది. ఎన్డీయేకి రాంరాం చెప్పాలని అప్పటికే నిర్ణయించడంతో... ఎలాంటి మొహమాటం లేకుండా ప్రధాని మోదీపైనా, కేంద్ర ప్రభుత్వంపైనా విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షల్ని అవహేళన చేస్తున్నట్టుగా భాజపా అగ్రనాయకులే మాట్లాడారంటూ ఎండగట్టారు.



మహిళా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ఉగాది కానుక

పట్టుచీరలు బహుకరించిన సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి: ఉగాది సందర్భంగా మహిళా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పట్టుచీరలు బహుకరించారు. వెంకటగిరి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పట్టుచీరలను శుక్రవారం శాసనసభ లాబీల్లో వారికి అందజేశారు.

23న హీరోమోటార్స్‌కు శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లాలో హీరో మోటార్స్‌కు ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. శాసనమండలిలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

అవిశ్వాసానికి కాంగ్రెస్సే మద్దతు కూడగట్టింది

విభజన హామీల అమలుపై ఏఐసీసీ ప్లీనరీలో తీర్మానం చేస్తాం: రఘువీరా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వనందుకు కేంద్రంపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని సభలో చర్చకు తీసుకోవాలని. .ఆ తీర్మానానికి తమ మద్దతు ఉందని స్వయంగా యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీనే లోక్‌సభలో చెప్పారని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. యూపీఏతో సన్నిహితంగా ఉన్న 22 పార్టీల నేతలతోనూ కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, గులాంనబీ ఆజాద్ మాట్లాడి వారి మద్దతు కూడా కూడగట్టారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దిల్లీలోని విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకహోదా అంశంపై సభలో 184వ నిబంధన కింద కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నోటీసును పక్కనపెట్టారు, ఆర్థికబిల్లులో కోత తీర్మానాలు ఇవ్వనివ్వకుండా బిల్లును ఆమోదించుకున్నారు అని రఘువీరా విమర్శించారు. అందువల్లే అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందన్నారు. రాష్ట్ర విభజనచట్టం ప్రస్తావించిన వాటితో పాటు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ప్లీనరీలో తీర్మానం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వాలను అణచివేస్తున్న కేంద్రం

- పథకాల అమలుకు కేంద్ర నిధులు రాష్ట్రానికే ఇవ్వాలి
- మంత్రి యనమల డిమాండ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వాలను అణచివేయాలని కేంద్రం చూస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. శాసనసభలో శుక్రవారం వార్షిక బడ్జెట్‌పై సభ్యులు మాట్లాడాక మంత్రి యనమల మాట్లాడారు. 'మన ప్రమేయం లేకుండానే కేంద్రం వివిధ పథకాలను అమలుచేస్తూ 90:10 లేదా 60:40 నిష్పత్తిలో ఖర్చు భరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. ఈ విధానాన్ని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. దీనికి బదులు కేంద్రం ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాలి. అవసరాలకు అనుగుణంగా పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తుంటాయి. ఇందులో కేంద్రం జోక్యం ఎందుకు? రాష్ట్రానికి సాధారణంగా వచ్చే నిధులను అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. 80శాతం అభివృద్ధి పథకాలు రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. ఆదాయం మాత్రం కేంద్రానికి 70 నుంచి 80శాతం వెళ్తుంది. కేంద్రం లెక్కలు మాత్రం విచిత్రంగా ఉంటున్నాయి. ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేదు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎంతవరకు నిధులు వస్తాయన్నది అనుమానమే. పనితీరు సంతృప్తికరంగా ఉన్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరితే యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. అన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తుండడంతో ప్రస్తుతం 42శాతం నిధులు రాష్ట్రాలకు వస్తున్నాయి. ఇందులో మన రాష్ట్రానికి 4.03శాతం మేర నిధులు వస్తున్నాయి. ఆర్థిక సంఘాల ప్రతిపాదనల మేరకు అన్ని రాష్ట్రాలకూ ఒకేలా నిధులిస్తే ప్రతిభ చూపే రాష్ట్రాలు నష్టపోతాయి. 14వ ఆర్థిక సంఘం ఏపీకి వచ్చినప్పుడు ఈ విషయాన్నే చెప్పాం. విభజనతో నష్టపోయిన ఏపీని ప్రత్యేకంగా చూడాలని కోరితే నివేదికలో ఆ ప్రస్తావన లేదు. యథావిధిగా అన్ని రాష్ట్రాలతో సమానంగా చూశారు. ప్రత్యేక ప్యాకేజీ కింద తొలుత రూ.350 కోట్లు విడుదల చేసి ప్రధాని కార్యాలయ అనుమతి లేదని వెంటనే వెనక్కి తీసేసుకున్నారు. ఇలాంటి పరిణామం ఎప్పుడూ జరగలేదు. అందువల్లే ఎన్డీఏ నుంచి బయట కొచ్చాం. పోలవరానికి కేంద్రమే నిధులిస్తుందని చట్టంలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చుకు బిల్లులు పెట్టుకుంటే ఎప్పుడో తర్వాత ఇస్తున్నారు. దీనివల్ల రూ.300కోట్ల రాష్ట్ర ప్రభుత్వంపై వడ్డీభారం పడుతోంది. రాష్ట్రానికి నిధులు ఇవ్వకూడదనే రీతిలోనే మాట్లాడుతున్నారు. గవర్నర్ పాలనలోనే రూ.17వేల కోట్లు రెవెన్యూ లోటు ఉందని లెక్కలు తేల్చారు. మేం అధికారంలోకొచ్చాక లెక్కలు వేసి రూ.16 వేల కోట్ల రెవెన్యూ లోటుందని నివేదించాం. కాగ్, ఆర్‌బీఐ దాదాపుగా ఇవే చెప్పాయి. కానీ కేంద్రం తన సొంతలెక్కలతో రాష్ట్రానికి సహకరించడం లేదు.

గ్రహం అనుగ్రహం

17–3–2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
అమావాస్య: సా. 6-18 తదుపరి
చైత్రశుక్లపక్ష పాడ్యమి
పూర్వాభాద్ర నక్షత్రం: రా. 7-30 తదుపరి ఉత్తరాభాద్ర
అమృత ఘడియలు: ఉ. 11-06 నుంచి 12-47 వరకు
వర్జ్యం: తె. 5-22 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 6-10 నుంచి 7-45 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-12; సూర్యాస్తమయం: సా.6-06

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	38.0	26.0
విశాఖపట్నం	37.0	25.8
కర్నూలు	37.0	23.7
అనంతపురం	36.8	25.5
నెల్లూరు	35.0	28.0
గుంటూరు	35.0	24.0
రాజమహేంద్రవరం	34.5	24.5
విజయవాడ	34.3	25.4
ఒంగోలు	33.8	25.6
శ్రీకాకుళం	33.5	21.5
తాడేపల్లిగూడెం	32.5	21.5
నరసాపురం	32.5	25.2
హైదరాబాద్	30.0	24.5
తిరుపతి	27.6	25.2

18న విజయవాడలో ఉగాది వేడుకలు

ఈనాడు, అమరావతి, తిరుమల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శ్రీవిళంబినామ సంవత్సర రాష్ట్రస్థాయి ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు భాషా సంస్కృతిక శాఖ సంచాలకుడు విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వాగత నృత్యం, నాదస్వరంతో వేడుకలు ప్రారంభమవుతాయని, డా.ప్రభల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగ పఠనం ఉంటుందని వెల్లడించారు. వ్యవసాయ పంచాంగం ఆవిష్కరణ, పఠనం, ఉద్యాన వన పంచాంగ ఆవిష్కరణ, వేద పండితులకు సత్కారం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నారని చెప్పారు.

45 మందికి ఉగాది కళారత్న పురస్కారాలు: ఉగాది పర్వదినం సందర్భంగా ఏటా ప్రభుత్వం అందించే కళారత్న (హంస) పురస్కారాలను శుక్రవారం ప్రకటించారు. సాహిత్యం, రంగస్థలం, సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రకళ, జానపదం, సామాజిక సేవ, వైద్యం, పరిశోధన, దూరదర్శన్, హరికథ, ఇంద్రజాలం, వాస్తు, అవధానం, జర్నలిజం, ఫొటోగ్రఫీ రంగాల్లో మొత్తం 45 మందికి ఈ పురస్కారాలు దక్కాయి. వీరికి ఉగాది రోజున తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.



శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో శ్రీవారి ఆలయం ముందు నిలిచిన నీరు

'ఉగాది లక్ష్మి'కి తిరుమల ముస్తాబు

తెలుగువారి నూతన సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం శోభాయమానంగా ముస్తాబవుతోంది. పచ్చని పందిళ్లు, రంగవల్లులు, దేదీప్యమానమైన విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలతో భక్తులను ఆకట్టుకునేలా తితిదే ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం శ్రీవిళంబినామ ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవను ఏకాంతంగా చేపడుతుంది. 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, సేనాధిపతి విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. 7 నుంచి 9 గంటల మధ్య స్వామివారిని విమాన ప్రాకారం, ధ్వజస్తంభం ప్రదక్షిణతో ఊరేగింపుగా ఆలయానికి వేంచేపు చేస్తారు. బంగారు వాకిలి ఎదుట పంచాంగ శ్రవణం ఉంటుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలిలో ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం శ్రీవారికి ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజలసేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది.

గాలిదుమారంతో వర్షం: తిరుమలలో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి గాలిదుమారంతో కూడిన వర్షపు జల్లు కురిసింది. అనూహ్యంగా కురిసిన వర్షంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉగాది అలంకరణ పనులకు స్వల్ప ఆటంకం కలిగింది.

ఈడీ కేసుల్లో కోర్టుకు హాజరైన జగన్

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల వ్యవహారంలో ఇందూటెక్ జోన్, పెన్నా సిమెంట్స్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన కేసులో నిందితులు శుక్రవారం ఈడీ ప్రత్యేక హోదా ఉన్న సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. ఇందూటెక్ జోన్, పెన్నా సిమెంట్స్‌కు సంబంధించి ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదులు కోర్టు విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నిందితులైన వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, వి.విజయసాయిరెడ్డి, ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్, పెన్నా గ్రూపు ఛైర్మన్ పుత్తంరెడ్డి ప్రతాప్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ అధికారి బి.పి.ఆచార్య హాజరయ్యారు. ఇండియా సిమెంట్స్‌కు సంబంధించిన కేసులో గ్రూపు ఛైర్మన్ ఎన్.శ్రీనివాసన్, ఆదిత్యనాథ్‌దాస్ తదితరులు హాజరయ్యారు. సీబీఐ నమోదు చేసిన కేసుల్లో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి, మాజీ గనులశాఖ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్ హాజరయ్యారు. శుక్రవారం సీబీఐ కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉన్నందున, తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వేశారు.



తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తున్న బ్యాటరీ బస్సు

తిరుమల.. పర్యావరణం మిలమిల

ఘాట్ రోడ్డులో బ్యాటరీ బస్సు సేవలు విజయవంతం

తిరుమల పరిధిలోని శేషాచల కొండలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దే ప్రక్రియలో మొదటి అడుగుపడింది. శుక్రవారం బ్యాటరీతో నడిచే ఎలక్ట్రికల్ బస్సును అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అనంతరం ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల వరకు విజయవంతంగా నడిపారు. తితిదే చరిత్రలోనే ఎలక్ట్రికల్ బస్సు తిరుమలకు చేరుకోవడం ఇదే తొలిసారి. రూ.3 కోట్లతో కొనుగోలు చేసిన ఈ బస్సు సేవలు నేటి(శనివారం) నుంచి శ్రీవారి భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. **– ఈనాడు, తిరుపతి**

9 నుంచి 13 వరకు సహాయ ఆచార్యుల రాత పరీక్షలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల సహాయ ఆచార్యుల నియామకాల భర్తీకి వచ్చేనెల 9 నుంచి 13వ తేదీ వరకు ఏపీపీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించనుంది. సబ్జెక్టుల వారీగా జరిగే పరీక్షల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు జరగనున్నాయి. హాల్‌టిక్కెట్లను ఈ నెల 25వ తేదీ నుంచి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

దక్షిణాదిపై ఎన్నాళ్లీ అక్కసు

- రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి
- కర్ణాటక చెల్లించే ప్రతి రూపాయికి కేంద్రం నుంచి వస్తోంది 47 పైసలే
- అదే యూపీకి రూ.1.79 వెళుతోంది
- కేంద్ర విధానాలపై సిద్ధరామయ్య విమర్శలు

ఈనాడు, బెంగళూరు: దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం తాత్సార ధోరణితో వ్యవహరిస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. పరిపాలనలో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కల్పించాల్సిన తరుణం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఫేస్‌బుక్‌లో ఆయన కేంద్ర- రాష్ట్ర ఆర్థిక సంబంధాలు, విదేశాలతో కేంద్రం ఏకపక్షంగా చేసుకున్న ఒప్పందాలతో జరుగుతున్న నష్టాల్ని వివరించారు. "మనది వివిధ రాష్ట్రాల సమాహారంతో ఏర్పాటైన సమాఖ్య వ్యవస్థ అనే వాస్తవాన్ని కేంద్రం విస్మరిస్తోంది. పరిపాలన, ఇతర ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవటానికి రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తి కల్పించాలి. దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదిని ఆర్థికంగా ఆదుకుంటున్నా, కేంద్రం దక్షిణాది రాష్ట్రాల్ని ఏ విధంగానూ ప్రోత్సహించటం లేదు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలకు కేంద్రం నుంచి లభిస్తున్న ఆర్థిక సాయం కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని ఈ రాష్ట్రాలు పన్ను రూపేణా చెల్లిస్తున్నాయి. కర్ణాటక నుంచి కేంద్రానికి జమ అయ్యే ప్రతి రూపాయికి ప్రతిగా 47 పైసలే అందుతోంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.1.79 దక్కుతోంది. జనాభా ప్రాతిపదికన నిధుల్ని కేంద్రం ఇంకా ఎంతకాలం కేటాయిస్తూ పోతుంది? కేంద్ర ఆర్థిక విధానాల రూపకల్పనలో రాష్ట్రాలకు భాగస్వామ్యం లేకపోవటం గర్హనీయం. విదేశాలతో కేంద్రం కుదుర్చుకుంటున్న ఒప్పందాలు పలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. వియత్నాం మిరియాల్ని శ్రీలంక ద్వారా దిగుమతికి ఒప్పందం కుదుర్చుకోవడంతో కర్ణాటక, కేరళలోని మిరియాల రైతుల బతుకులు బజారుపాలయ్యాయి. వస్తు సేవల పన్ను మాదిరి వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార విధానానికి ప్రత్యేక మండలిని ఏర్పాటు చేయాలి" అని సిద్ధరామయ్య డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే చింతమనేనికి హైకోర్టులో ఊరట

- దోషిగా నిర్ధరించిన ఉత్తర్వుల సస్పెన్షన్

ఈనాడు, హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. దోషి(కన్విక్టెడ్)గా నిర్ధరిస్తూ న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. హైకోర్టు ఉత్తర్వులతో ఎమ్మెల్యేగా అర్హత కోల్పోవాల్సి వస్తుందనే పరిస్థితి నుంచి చింతమనేనికి ఉపశమనం కలిగింది. రచ్చబండ కార్యక్రమం సందర్భంగా 2011లో అప్పటి మంత్రి వట్టి వసంతకుమార్‌పై దాడి చేశారన్న అభియోగంతో చింతమనేని, తదితరులపై కేసు నమోదైంది. విచారణ జరిపిన భీమడోలు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు గత నెల 14న చింతమనేని ప్రభాకర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఆ తీర్పుపై ఏలూరు మొదటి అదనపు సెషన్స్ కోర్టులో ఎమ్మెల్యే అప్పీల్ చేశారు. విచారణ జరిపిన సెషన్స్ న్యాయమూర్తి.. భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్ష(సెంటెన్స్) అమలును మాత్రమే నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో చింతమనేని హైకోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. దాడి ఘటన సమయంలో రచ్చబండ వేదికపై ఉన్న ఎంపీ సాక్ష్యాన్ని భీమడోలు కోర్టు విచారించలేదన్నారు. సాక్ష్యాలు పరస్పరం సరిపోకపోయినా విచారణ కోర్టు పిటిషనర్‌కు జైలుశిక్ష విధించిందన్నారు. దోషిగా పేర్కొన్న అంశాన్ని నిలువరించకపోతే ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం.. పిటిషనర్ అనర్హత వ్యవహారం తెరపైకి వస్తుందన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. దోషిగా పేర్కొన్న అంశాన్ని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

దర్శనానికి ఆధార్ అనుసంధానంపై తితిదే తర్జనభర్జన

ఈనాడు, తిరుపతి: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి ఈ నెలలో ప్రారంభించాలనుకున్న సమయ నిర్దేశిత సర్వదర్శనానికి ఆధార్ అనుసంధానంపై తితిదే అధికారులు మీమాంసలో పడ్డారు. నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు ఆధార్ లింకేజీపై డిసెంబరు 15న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చింది. మొబైల్‌కు, బ్యాంకులకు లింకేజీ కుదరదని.. కేవలం సంక్షేమ పథకాలకు వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఆధార్ అనుసంధానంతోనే స్లాట్ వ్యవస్థను రూపొందించిన తితిదేకు.. సుప్రీంకోర్టు తాజా ఆదేశం ప్రతిబంధకంగా మారింది. సమయ నిర్దేశిత దర్శనానికి ఆధార్ తప్పనిసరి చేస్తే సుప్రీం ఆదేశాలు బేఖాతరు చేసినట్లు అవుతుందా? లేదా? అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు. మార్చి చివరి కల్లా మొదలుపెట్టాలనుకున్న కొత్త విధానం మరికాస్త ఆలస్యం కానుంది. సమయ నిర్దేశిత దర్శనాన్ని గత ఏడాది డిసెంబరు 18 నుంచి 23 వరకు 117 కౌంటర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఇది విజయవంతమైంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల్ని అన్వయించుకుని ఆధార్‌తో సంబంధం లేకుండా టైం స్లాట్ విధానం అమలు చేస్తే.. టిక్కెట్లు దళారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, అప్పుడు ఈ ప్రయోగం వ్యతిరేక ఫలితాన్నిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈనాడు

వాయు నాణ్యతకు పరిణత వ్యూహం

తరతమ భేదాలతో దేశ పౌరులందరినీ అపర గరళకంఠులుగా మార్చేస్తున్న వాయుకాలుష్యాన్ని ప్రణాళికాబద్ధంగా కట్టడి చేసేందుకు కంటు కేంద్రప్రభుత్వం జాతీయ బహుముఖ కార్యాచరణ వ్యూహాన్ని ప్రకటించింది. పరిశ్రమలు, నివాస ప్రాంతాలతో పాటు రవాణా, వ్యవసాయ, విద్యుత్ రంగాల్ని ప్రధాన కాలుష్య కారకాలుగా గుర్తించిన కేంద్రం- వచ్చే మూడేళ్లలో వంద నగరాల్లో 35 శాతం మేర కశ్మల నియంత్రణను లక్షిస్తోంది. తరవాతి అయిదేళ్లలో 50 శాతందాకా వాయుకాలుష్యాన్ని అదుపు చేస్తామంటోంది. ఆ జాబితాలో ముంబయి, కోల్‌కతా, వారణాసి, ఆగ్రాలతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎనిమిది నగరాల్నీ చేర్చారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 684 పర్యవేక్షణ కేంద్రాలను వెయ్యికి విస్తరిస్తామని, వాయు నాణ్యత సూచీల పరిధిని పెంపొందిస్తామంటున్న కేంద్రం- ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి, విశ్లేషణకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామంటోంది. అంతకంతకు తీవ్రరమవుతున్న వాయుకాలుష్య ఉత్పాతం దృష్ట్యా, దీటైన కార్యాచరణ వడివడిగా పట్టాలు ఎక్కాల్సిన తరుణమిది! ఉపగ్రహ సమాచారం ప్రకారం, 2005-13 సంవత్సరాల మధ్య గాలిలోని అతిసూక్ష్మ ధూళికణాల(పీఎం 2.5)ను ఐరోపా సంఘం (ఈయూ) 20 శాతందాకా తగ్గించగలిగింది. 2010-15 మధ్య ఆ ధూళికణాల రాశిని చైనా 17 శాతం, అమెరికా 15 శాతంమేర నియంత్రించగా- అదే కాలావధిలో దేశీయంగా 13 శాతం వరకు పీఎం 2.5 ధూళికణాలు అధికంగా పోగుపడ్డాయన్న యథార్థం, జాతి నెత్తిన ఉరుముతున్న పెనుముప్పును ప్రస్ఫుటీకరిస్తోంది. తాజాగా వెలుగుచూసిన జాతీయ వాయుశుద్ధి కార్యక్రమ లక్ష్యాలతో పోలిస్తే, దేశంలో కాలుష్య సమస్య ఎన్నో రెట్లు తీవ్రతరమైనది. వంద నగరాలకే ఉద్దేశించిన పరిమిత పరిధి ప్రణాళికతో- వాయుకాలుష్యం తోకముడిచే అవకాశం మృగ్యం. ఇది జాతి యావత్తు ఏకతాటిపై పోరాడి గెలిచి తీరాల్సిన యుద్ధం!

నాలుగేళ్ల క్రితం ప్రధాని లీ కె చాంగ్ చొరవతో పొరుగున జనచైనా, కాలుష్యంపై సమరభేరి మోగించింది. పుష్కర కాలంలో అమెరికా సాధించగలిగిన సత్ఫలితాలను చైనా ఈ నాలుగు సంవత్సరాల్లోనే నమోదు చేసినట్లు షికాగో విశ్వవిద్యాలయ తాజా అధ్యయనం ప్రశంసిస్తోంది. అక్కడి ప్రధాన నగరాల్లో సగటున 32 శాతం దాకా కాలుష్యం దిగిరావడమే కాదు, ప్రజల ఆయుర్దాయం దాదాపు రెండు నెలల్లే పెరిగినట్లు అది సాధికారికంగా ధ్రువీకరిస్తోంది. రాజధాని బీజింగ్ నగరం (35 శాతం), షీ జ్యాంగ్ (39), బావోడింగ్ (38) జాతీయ సగటుకన్నా మిన్నగా రాణించాయి. అమెరికా కార్యదక్షతను తలదన్నే రీతిలో ఇంత దాటిగా కాలుష్య నియంత్రణ చైనాలో స్వల్ప వ్యవధిలోనే ఎలా సాధ్యపడింది? బొగ్గుతో నడిచే కొత్త కర్మాగారాల నిర్మాణాన్ని నిషేధించారు. ఇప్పటికే ఉన్నవాటి నుంచి ఉద్గారాల స్థాయిప్రమాణాల్ని అదుపు చేశారు. రోడ్ల మీదకొచ్చే వాహనాల సంఖ్యను భారీగా కుదించారు. కొన్ని ఉక్కు పరిశ్రమల్ని, బొగ్గు గనుల్ని మూసేశారు. వాయుకాలుష్య భూతం కోరలు పెరికే క్రమంలో ఒక్క బీజింగ్ నగరంలోనే ఏడున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించినట్లు అంచనా. మూడేళ్లలో వంద నగరాల కాలుష్యాన్ని 35 శాతందాకా తెగ్గోయాలన్న లక్ష్యం సాకారమయ్యేందుకు భారత్ సన్నద్ధత ఆ స్థాయిలో పదునుతేలాలి! చారిత్రక ఆర్థిక మాంద్యం నేపథ్యంలో లోగడ అమెరికా నెలకొల్పిన వాయుకాలుష్య నియంత్రణ రికార్డును- పటిష్ఠ వ్యూహరచన, పకడ్బందీ కార్యాచరణలతో ఇప్పుడు చైనా దీమాగా అధిగమించగలిగింది. పర్యావరణ సూచీల్లో భారత్ సైతం స్థిరమైన మెరుగుదల సాధించాలంటే- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సాకల్య క్షాళన సహా మరెన్నో చర్యల క్రతువును చురుకెత్తించాలి!

బోస్టన్ (అమెరికా) ప్రధాన కేంద్రంగా పనిచేసే ఆరోగ్య ప్రభావాల సంస్థ 175 దేశాలపై విస్తృత పరిశోధన చేపట్టి- భారత్, చైనాల్లోనే వాయుకాలుష్య దుష్ప్రభావాలు అత్యధికమని నిరుడే రోజుల్లో నిగ్గుతేల్చింది. ఆరు నెలల క్రితం లాన్సెట్ అధ్యయన నివేదిక చైనా (15.8 లక్షలు)ను మించి భారత్‌లో (18.1 లక్షలు) వాయుకాలుష్య మరణాలు నమోదైనట్లు వెల్లడించిన వివరాలు గగ్గోలు పుట్టించాయి. తనవంతుగా చైనా పటిష్ఠ వ్యూహంతో రాణిస్తుండగా, ప్రపంచంలోనే అత్యధిక వాయుకాలుష్య మరణాలకు నెలవన్న దుష్కీర్తి భారత్‌ను కుంగదీసేదే. వాస్తవానికి దేశంలో మూడొంతులకు పైగా నగరాలు, పట్టణాల్లో వాయునాణ్యతకు తూట్లుపడ్డట్లు ఆ మధ్య కేంద్ర కాలుష్య నియంత్రణ మండలే ధ్రువీకరించింది. వాయు కాలుష్య మరణాల్లో మూడొంతుల దాకా గ్రామీణ భారతంలోనే సంభవిస్తున్నాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం నాలుగు వేలకుగాను కేవలం 300 నగరాలకే వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ పరిమితమైంది. కొత్తగా 67 నగరాలు, యాభై గ్రామ ప్రాంతాలను ఆ పరిధిలో చేరుస్తామంటున్నారు. గాలిలో ఆర్సెనిక్, నికెల్, సీసం శాతాలు పెచ్చరిల్లి తిరుపతి, వరంగల్, కర్నూలు, కరీంనగర్ వంటిచోట్ల శ్వాసకోశ వ్యాధులు ముమ్మరిస్తున్నాయి. అవినీతిలో మునకలేస్తున్న కాలుష్య నియంత్రణ మండళ్ల పుణ్యమా అని పారిశ్రామిక ఉద్గారాలు విజృంభిస్తుండగా- మరోవైపు అదుపులేని వాహన కాలుష్యం, నిర్మాణ కార్యకలాపాలిటివి సంక్లిష్ట సృష్టికి శయశక్తులా పాటుపడుతున్నాయి. పరిశుభ్రతను, పర్యావరణ పరిరక్షణను సంస్కృతిగా అలవరచిన ఆస్ట్రేలియా, బార్బడోస్, జోర్డాన్, కెనడా ప్రభృత దేశాలు వాయునాణ్యతకు మారుపేరై వర్ధిల్లుతున్నాయి. అదే పద్ధతిలో ఇక్కడా పటుతర ప్రజారవాణా వ్యవస్థను తీర్చిదిద్ది, పర్యావరణ చట్ట నిబంధనావళి తు.చ. తప్పక అమలుకు నోచుకునే వాతావరణం ఏర్పరచాలి. పౌరసమాజంలో ఉమ్మడి బాధ్యత, పర్యావరణ స్పృహ ఇనుమడింపజేసే చేతన కార్యక్రమాలూ జోరందుకోవాలి. హడలెత్తిస్తున్న వాయుగండం నుంచి జాతికి సాంత్వన దక్కేదప్పుడే!

ప్రత్యర్థులపై పుతిన్ ఉక్కు పిడికిలి



'ఈ ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ విజయం ఖాయం...'- ఈ మాటలు అన్నది ఆయన అంతేవాసులో, అభిమానులో కాదు. అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌ను ఎదుర్కొంటున్న మహిళా అభ్యర్థి కసేనియా సబ్చాక్ వ్యాఖ్యలివి. రష్యన్ ఆల్ పీపుల్స్ యూనియన్ నాయకుడు సెర్గీ బబ్బూరిన్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యా తరఫున మ్యాగ్జిమ్ సురాకిన్, లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నుంచి వ్లాదిమిర్ జిరినొవ్‌స్కీ, కన్జర్వేటివ్ పార్టీ ఆఫ్ గ్రోత్ అభ్యర్థి బోరిస్ టిటోస్, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పావెల్ గ్రుడినిన్, యబ్లోక్ పార్టీ తరఫున గ్రిగోరీ యవిన్‌స్కీ పోటీలో ఉన్నప్పటికీ, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పుతిన్‌ను నిలువరించే శక్తి వీరిలో ఎవరికీ లేదు. ఆయనకు గట్టి పోటీ ఇవ్వగల, ప్రజాభిమానం గల ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీని అనర్హత పేరుతో ఎన్నికల సంఘం నిషేధించడంతోనే ఎన్నికలు ఏకపక్షంగా మారిపోయాయి. అంతర్జాతీయ సమాజం ముఖ్యంగా అమెరికా, ఐరోపా దేశాలు, ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని రిపబ్లిక్కులు ఈసారి రష్యా ఎన్నికలను ఆసక్తిగా గమనిస్తున్నాయి. రష్యా రాజ్యాంగం ప్రకారం ఈ నెల 18న జరిగే తొలి దఫా ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ దక్కని పక్షంలో, మూడు వారాల అనంతరం రెండో దఫా పోలింగ్ నిర్వహిస్తారు. 1996లో బోరిస్ ఎల్సిన్ హయాములోనే రెండోదఫా ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఈసారి అలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఎంతమాత్రం లేదు. 1952 అక్టోబరులో జన్మించిన పుతిన్ న్యాయశాస్త్రం అభ్యసించారు. తరవాత సోవియట్ సీక్రెట్ సర్వీస్ (కేజీబీ)లో చేరారు. అనంతరం ఆయన దృష్టి రాజకీయాల వైపు మళ్లింది. అంచెలంచెలుగా అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. అధికారంపై పట్టు సాధించారు. రష్యా అంటే తానే అన్న అభిప్రాయాన్ని కలిగించడంలో కృతకృత్యులయ్యారు. గత 18 సంవత్సరాలుగా రష్యాలో పుతిన్ ఏకచ్ఛత్రాధిపత్యం నడుస్తోంది. అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో ఆయన మాటకు ఎదురు లేదు. పెద్దగా ప్రశ్నించేవారూ లేరు. ఎదురాడినవారి గొంతు నొక్కేయడంలో పుతిన్ సిద్ధహస్తుడు. ప్రధానిగా పనిచేసిన మెద్వెదెవ్ పూర్తిగా ఆయన కనుసన్నల్లో మెలగేవారు. మెద్వెదెవ్‌ను అడ్డం పెట్టుకుని కథ నడిపేవారు.

అంతర్జాతీయ శక్తిగా...

గతంలో సోవియట్ యూనియన్ పేరు చెప్పగానే జోసెఫ్ స్టాలిన్, కృశ్చేవ్, లియొనిద్ బ్రెజ్నెవ్ వంటి ఉద్దండులు గుర్తుకు వచ్చేవారు. పాలనలో వారు తమదైన ముద్ర వేశారు. అంతర్జాతీయ శక్తిగా దేశాన్ని తీర్చిదిద్దడంలో అవిరళ కృషి చేశారు. ఇటు దేశీయంగా, అటు అంతర్జాతీయంగా బలమైన నాయకులుగా గుర్తింపు పొందారు. 90వ దశకంలో సోవియట్ యూనియన్ పతనం అనంతరం రష్యాను కొద్దికాలం బోరిస్ ఎల్సిన్ పాలించినప్పటికీ దేశంపై ఎంతమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఆయన తరవాత అధికార పగ్గాలు అందుకున్న వ్లాదిమిర్ పుతిన్ అప్పటికే అంతర్జాతీయంగా బలహీనమైన దేశాన్ని ముందుకు నడిపించడంలో విజయవంతమయ్యారు. 2000 సంవత్సరం నుంచి అధ్యక్షుడు, ప్రధాని పదవుల్లో ఆయన ఏదో ఒకదాన్ని చేపట్టి పట్టుకొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే మరో ఆరేళ్ల దాకా అంటే 2024 వరకు పదవిలో కొనసాగుతారు. స్టాలిన్ తరవాత సుదీర్ఘ కాలం పదవిలో కొనసాగిన నేతగా చరిత్ర సృష్టిస్తారు. గతంలో జోసెఫ్ స్టాలిన్ 1924 జనవరి నుంచి 1953 మార్చి వరకు దేశాన్ని పాలించారు. అంతర్జాతీయంగా కూడా ఎక్కువకాలం పాలించిన నాయకుడిగా పుతిన్ గుర్తింపు పొందుతారు. గతంలో మాల్దీవుల్లో అబ్దుల్ గయూమ్, జింబాబ్వే (ఒకప్పటి రొడీషియా)లో రాబర్ట్ ముగాబే, క్యూబాలో ఫిడెల్ క్యాస్ట్రో సుదీర్ఘకాలం పాలించి చరిత్రలో నిలిచిపోయారు. తాజాగా చైనా అధినేత షి జిన్‌పింగ్ శాశ్వత పాలకుడిగా కొనసాగేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేశారు. ఇప్పుడు తాజా ఎన్నికల్లో గెలిచిన అనంతరం 2024 దాకా పదవిలో కొనసాగి, ఆపైనా ఏదో ఒక మంత్రాంగం ద్వారా అధికారంలో కొనసాగడానికి పుతిన్ ప్రయత్నించే అవకాశాన్ని తోసిపుచ్చలేం!

ప్రతిపక్ష నాయకుడైన 41 సంవత్సరాల అలెక్సీ నావల్నీ బలమైన నాయకుడే. ఆయన న్యాయవాది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు 2016 నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రజల్లోకి వెళ్లి, అవినీతి వ్యతిరేక పోరాటం ద్వారా పేరు తెచ్చుకున్నారు. రష్యా రాజ్యాంగం ప్రకారం ఒక నాయకుడు ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఎన్నికల సంఘం వద్ద ముందుగా తన పేరు నమోదు చేసుకోవాలి. ఇందుకు కనీసం 500 మంది ఓటర్ల మద్దతు ప్రకటించాలి. ప్రోగ్రెస్ పార్టీ నాయకుడైన నావల్నీకి ప్రజలు పెద్దయెత్తున మద్దతుగా నిలిచారు. పాత కేసులను సాకుగా చూపి ఎన్నికల సంఘం ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానంలో నావల్నీ సవాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదంతా తనను ఎన్నికల బరి నుంచి తప్పించడానికి పుతిన్ పన్నిన పన్నాగమని ఆయన ఆరోపిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌కు 69.7 శాతం ఓట్లు లభిస్తాయని ఎన్నికల సర్వేలు చెబుతున్నాయి. ఇతర అభ్యర్థులైన గ్రుడినిన్‌కు 7.1, వ్లాదిమిర్ జిరినొవ్‌స్కీకి 5.6 శాతం ఓట్లు రావచ్చన్నది సర్వేల విశ్లేషణ. జిరినొవ్‌స్కీ ఆరోసారి ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఆయన అజెండా పెద్దదే. అందరికీ ఇళ్లు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, గతంలో సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రిపబ్లిక్కులను మళ్లీ రష్యాలో విలీనం చేయడం ఆయన లక్ష్యాలు. ఇవి ఎంతవరకు సాధ్యమన్న విషయమై ఆయనకే స్పష్టత లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇతర అభ్యర్థుల ఎన్నికల ప్రణాళికలు కూడా భారీగానే ఉన్నాయి. పుతిన్ హయాములో అంతర్గతంగా దేశ పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా రష్యా ప్రతిష్ఠను కాపాడారన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. ప్రపంచ వ్యవహారాల్లో అగ్రరాజ్యం అమెరికా పెత్తందారీ పోకడను అడ్డుకున్నారన్న అభిప్రాయంతో ప్రజలు ఉన్నారు. ముఖ్యంగా సిరియా విషయంలో అమెరికా దూకుడుకు పగ్గాలు వేశారని, ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వ దేశంగా వీటో నిబంధనను ఉపయోగించుకుని రష్యా ఉనికిని బలంగా చాటారని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఒకప్పటి సోవియట్ యూనియన్ రిపబ్లిక్ దేశమైన ఉక్రెయిన్ నుంచి 2014 మార్చిలో క్రిమియాను స్వాధీనం చేసుకోవడంలో ధైర్యంగా వ్యవహరించారన్న అభిప్రాయం ప్రజల్లో చొచ్చుకుపోయింది. 70 శాతం ప్రజలు ఈ విషయంలో పుతిన్‌ను అభినందిస్తున్నారని ఇటీవలి సర్వేలో వెల్లడైంది. క్రిమియాను స్వాధీనం చేసుకుని ఈ మార్చితో నాలుగేళ్లయిన సందర్భంగా పుతిన్ అక్కడకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఉత్పత్తి, ఐటీ వంటి రంగాల్లో దేశం వెనకబడి ఉన్నప్పటికీ, ఆయుధాల ఎగుమతిలో ఇప్పటికీ తన పట్టును నిలబెట్టుకుంటోంది. ఆయుధాల విక్రయం ద్వారా మంచి ఆదాయాన్ని దేశం పొందుతోంది. నేటికీ భారత్‌కు అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారు రష్యానే కావడం గమనార్హం. భారత్‌లోని కూడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన సాంకేతిక సాయాన్ని రష్యా అందిస్తోంది. చైనా వంటి కమ్యూనిస్టు దేశాన్ని కూడగట్టుకుని అమెరికా ప్రభావానికి అడ్డుకట్ట వేసేందుకు పుతిన్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. అమెరికాతో బంధం బలపడుతున్నప్పటికీ, రష్యాను పూర్తిగా దూరం చేసుకునే స్థితిలో భారత్ లేదు. ఇది ఒకరకంగా పుతిన్‌కు సానుకూల పరిణామమే. ఇరుగుపొరుగున గల సోవియట్ యూనియన్ రిపబ్లిక్ దేశాలకు అమెరికా అండగా ఉన్నప్పటికీ, పుతిన్ లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు. పశ్చిమ దేశాలతో రష్యా సంబంధాలు సజావుగా లేవు. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి దేశాలతో దెబ్బతిన్నాయి. అమెరికా ఎన్నికల్లో పుతిన్ జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు వివాదాన్ని రగిలించాయి. తాజాగా అనుచిత చర్యలకు పాల్పడ్డారంటూ బ్రిటన్ 23మంది రష్యా దౌత్యవేత్తలపై వేటు వేసింది. ఇందుకు ప్రతిగా రష్యా సైతం బ్రిటన్ దౌత్యవేత్తలపైనా వేటు వేస్తామని రష్యా విదేశాంగమంత్రి లావ్రొవ్ హెచ్చరించారు. మరోపక్క అమెరికా కూడా రష్యాపై ఆంక్షలను విధించింది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం, సైబర్ దాడులు వంటి వ్యవహారాల్లో మాస్కో పాత్రపై వాషింగ్టన్ ఆగ్రహంగా ఉంది.



రేపే రష్యా అధ్యక్ష ఎన్నికలు

సంస్కరణలతో మద్దతు

పుతిన్ హయాములో రష్యా పరిస్థితి అంత గొప్పగా లేనప్పటికీ, మరీ అంత అధ్వానంగా లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి రాగానే సరళీకృత ఆర్థిక విధానాలు అవలంబించడం ద్వారా ఆర్థిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బాటలు పరచారు. రష్యా ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. అమెరికా, చైనా, జపాన్‌లు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది దేశ జీడీపీ 1.7 శాతం. 2019లో అది 1.8 శాతానికి పెరగవచ్చని అంచనా. భూ సంస్కరణలను అమలుచేయడం ద్వారా పల్లెల్లో కొంతవరకు ప్రజల మద్దతును పుతిన్ పొందగలిగారు. గత నెలలో కనీస వేతనాలు పెంచడం ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. రష్యా ఎన్నికల తీరుపై పశ్చిమ దేశాల పరిశీలకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఎన్నికల యంత్రాంగాన్ని ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుని వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు, రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం వంటి చర్యలకు లెక్కేలేదు. నావల్నీని ఎన్నికలకు దూరంగా పెట్టడమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. నావల్నీ అనుచరులు సైతం వేధింపులకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం రాజకీయ ప్రత్యర్థులను నిర్బంధిస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం ఆరోపించింది. సభలు, సమావేశాలపై నిషేధాలు, పోలీసు అధికారాల దుర్వినియోగం, ఏకపక్ష అరెస్టులు, విచారణలో పక్షపాతం, భారీ జరిమానాలు, ఎక్కువ కాలం నిర్బంధించడం వంటి అనుచిత చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆమ్నెస్టీ ఆరోపిస్తోంది. ఇవేమీ పుతిన్ విజయాన్ని అడ్డుకునే పరిస్థితి లేదు. దేశీయ పరిస్థితులను పక్కనపెడితే అంతర్జాతీయంగా పుతిన్ వేసిన అడుగులు ఎన్నికల్లో కలిసి వస్తాయన్నది విశ్లేషకుల అంచనా!

- గోపరాజు మల్లపరాజు

ఉమ్మడి జాబితాలో సేద్య విపణి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రైతుల బతుకులు మాత్రం ఎంతకీ మారడం లేదు. వారు పండించిన వాటిని మధ్యవర్తులు, దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొన్న సాగుదారులు, ఏటా మద్దతు ధర రూపంలో ప్రభుత్వం పెంచే కొద్దిపాటి సొమ్ముకు ఎదురుచూస్తున్నారు. వాటి కోసం రోడ్డెక్కి, ధర్నాల వంటి ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నారు. ఈ పరిస్థితికి కారకులెవరు, రైతుల ఆదాయం పెరిగేది ఎప్పుడు వంటి ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 1950-51లో 55 శాతం ఉండేది. అది ప్రస్తుతం 16 శాతానికి పడిపోయింది. దీనికి పలు కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనవి మూడు. అవి: వ్యవసాయ పరపతి విధానంలో లోటుపాట్లు, పరిశోధనల లేమి, సేద్యం ఉత్పత్తుల విపణిలో అవకతవకలు.

ఎవరైనా వ్యవస్థాపకుడు తనకు కావాల్సిన పెట్టుబడుల్ని సమకూర్చుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్న దేశం ఇది. రైతులకు గల ఒకే ఒక్క అవకాశం బ్యాంకు! వారు పరపతి కోసం దానిమీదనే ఆధారపడాల్సి వస్తోంది. వ్యవస్థాపకులకు భారీమొత్తాల్లో అప్పులిచ్చే బ్యాంకులకు- రైతులకు కొద్దిపాటి రుణాలివ్వాలన్నా, లెక్కలేనన్ని విధివిధానాలు గుర్తుకొస్తాయి. చేసేది లేక వారు వడ్డీవ్యాపారుల్ని ఆశ్రయించి, అధిక వడ్డీలకు పెట్టుబడి సమకూర్చుకుంటున్నారు. ప్రకృతి దయతలిస్తే, పంట చేతికొస్తుంది. ఆ తరవాత విపణిలో దళారుల బెడద వల్ల, కనీస మద్దతు ధర కూడా లభించని పరిస్థితి ఎదురవుతోంది. కొన్ని సందర్భాల్లో దళారులే ఎక్కువ వడ్డీకి ఆశపడి రైతులకు రుణాలిస్తున్నారు. రైతు పండించిన దాన్ని తక్కువ ధరకే కొని, ఆ వడ్డీ భారాన్ని వారి మీదే వేస్తున్నారు. దిక్కుతోచక, గత్యంతరం లేక ఆత్మహత్యకు పాల్పడిన రైతులెందరో ఉన్నారు. కడుపు మండిన మరెందరో రోడ్లమీదకు చేరి పోరాట బాట పడుతున్నారు. మహారాష్ట్రలో రైతుల 'మహా పాదయాత్ర' ఈ కోవలోకే వస్తుంది. రైతులకు మెరుగైన రీతిలో పరపతి అందించేందుకు మునుపటి ప్రభుత్వాలు కొన్ని నిర్ణయాలు తీసుకున్నా, అవి సరైన ప్రభావం చూపలేకపోయాయి. పాలకులు తరచుగా వాడే పదం 'రుణ మాఫీ'. అటువంటి పథకాలతో రైతులకు కేవలం తాత్కాలిక ఊరట లభిస్తుంది. ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టి, నూతన సంస్కరణలు తేవాలి. కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి కృషితో దేశవ్యాప్తంగా భూమి పట్టాల ద్వారా రైతుల్ని గుర్తించాలి. ఆ సమాచారాన్ని డిజిటలీకరణ చేయాలి. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రత్యేకంగా 'రైతు పరపతి బ్యాంకు' ఏర్పాటు కావాలి. వారికి బీమాతో కూడిన పెట్టుబడి మొత్తాలు అందజేయాలి. అదే బ్యాంకు ద్వారా, వ్యవసాయరంగంతో సాంకేతికతను జోడించాల్సి ఉంది.

ప్రస్తుతం అమలవుతున్న వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానమూ పలు సమస్యలకు దారితీస్తోంది. ఇది రాష్ట్రాల పరిధికి సంబంధించిన అంశం కావడంతో, కేంద్రప్రభుత్వ జోక్యం ఉండదు. దేశంలో సంప్రదాయ పద్ధతి ప్రకారం, రైతు తన పంటను స్థానిక మార్కెట్ కమిటీ ద్వారా అక్కడి వ్యాపారులకే అమ్ముకోవాలి. అందువల్ల రైతులు విస్తృతమైన మార్కెట్ అవకాశాల్ని కోల్పోతున్నారు. మార్కెటింగ్ వ్యవస్థలో ఎన్నో లోపాలున్నాయి. దళారులు 'సిండికేటు'గా మారి ధర నిర్ణయిస్తున్నారు. ఆర్థికపరమైన పారదర్శకత లేకపోవడం మరో ప్రధాన సమస్య. అవసరమైన పరిశోధనలు జరగడం లేదు. ఇప్పటివరకు జరిగిన సంబంధిత పరిశోధనలు, సంస్కరణలు; లేదా అందిపుచ్చుకున్న సాంకేతికత- అధిక దిగుబడిమీదనే దృష్టిపెట్టాయి. అంతే తప్ప రైతు పండించిన వాటిని సరైన విధంగా మార్కెటింగ్ చేసుకొని, దాన్ని దేశంలో ఎక్కడైనా సాధ్యమైనంత ఎక్కువ ధరకు అమ్ముకొనే పద్ధతిపై చూపు సారించలేకపోయాయి. ఇందులో ప్రభుత్వాల లోపమూ ఉంది. మార్కెటింగ్‌ను అవి వ్యవసాయ రంగంలో కేవలం ఒక భాగంగా చూపుతున్నాయి. దానిమీద కోర్సులు, పరిశోధనల్ని సంబంధిత విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితం చేశాయి. అలా కాక, వ్యవసాయ విపణిని ఒక విభాగంగా రూపొందించి అన్ని విశ్వవిద్యాలయాలకూ అవకాశం ఇచ్చి ఉంటే ఎన్నో పరిశోధనలు జరిగి ఉండేవి. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలి. నిపుణులు, విద్యావేత్తలతో చర్చించి వ్యవసాయ విపణిని అన్ని విశ్వవిద్యాలయాల్లోని వాణిజ్య విభాగాలకూ అనుసంధానించాలి. ఆ రంగంలో నూతన పరిశోధనల్ని విస్తృతపరచాలి. ఆర్థిక వ్యవస్థలో కలిగే మార్పులపై ఎప్పటికప్పుడు అధ్యయనాలు సాగేలా చేయాలి.



'రైతు ఆదాయం రెట్టింపు' మార్గం

'గ్రామీణ వాణిజ్య కేంద్రాల' ఏర్పాటు ఇప్పటికీ కేంద్రం పరిశీలనలోనే ఉంది. ఇది ఆచరణకొస్తే, రైతులకు మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయి. వ్యవసాయ ఉత్పత్తుల విపణి అంశాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చాల్సిన అవసరముంది. అప్పుడే రైతుల ఆదాయాలు పెరుగుతాయి.

కేంద్రం వ్యవసాయ విపణి విధానంలో సాంకేతికతను జోడిస్తోంది. కార్పొరేట్ తరహాలో ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానాన్ని 'ఇ-నామ్' పేరిట 2016 ఏప్రిల్ 14న ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి ప్రకారం, రైతులు తమ ఉత్పత్తుల్ని సాంకేతిక సహకారంతో దేశంలోని ఏ వ్యాపారికైనా వస్తువు నాణ్యతను బట్టి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. ఇదే విధానాన్ని 14 రాష్ట్రాల్లోని 479 మార్కెట్లలో అమలుచేస్తున్నారు. 'రైతుల ఆదాయం రెట్టింపు' విషయంలో కేంద్రప్రభుత్వం ఈ పథకంపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. రైతులకు మెరుగైన పరపతి, విపణి ప్రయోజనాల దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాలూ ఇటీవల కొన్ని చర్యలు చేపట్టాయి. భూ దస్త్రాల ప్రక్షాళన, రైతులకు నిర్ణీత మొత్తంలో వ్యవసాయ పరపతి మంజూరు, సమన్వయ సమితుల ఏర్పాటు వంటివి సాగుదారుల ఆదాయాన్ని ఎంతో కొంత పెంచగలవని ఆశించవచ్చు!

- డాక్టర్ రామకృష్ణ బండారు

ఈనాడు లేఖలు

కేంద్రం కప్పదాటు వైఖరి

విశాఖకు రైల్వేజోన్ ఇచ్చే విషయంలో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఈ నాలుగేళ్లలో తమ మంత్రిత్వ శాఖతో సంప్రతింపులు జరపనేలేదని రైల్వేమంత్రి పీయూష్ గోయల్ చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలుపరచాలంటూ నాలుగు సంవత్సరాలుగా ఏపీ పార్లమెంటు సభ్యులు పదేపదే అభ్యర్థిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అసలు రైల్వేజోన్ మంజూరు పరిశీలనే తప్ప, కేటాయించాలన్న అంశం విభజన చట్టంలోనే లేదని కేంద్రమంత్రి అనడం మరింత విడ్డూరం. ఒడిశా ప్రభుత్వంతో కేంద్రం సంప్రతింపులు జరుపుతోందని, అవి ఫలప్రదం కాగానే విశాఖ జోన్ ప్రకటన వెలువడుతుందని ఇన్నేళ్లుగా భాజపా రాష్ట్ర ప్రజాప్రతినిధులు అనేక సందర్భాల్లో చెబుతూ వచ్చారు. ప్రత్యేక హోదాపై మొన్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఇప్పుడు విశాఖ జోన్‌పై రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ప్రకటనలు ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రం చిన్నచూపునకు దృష్టాంతాలుగా నిలుస్తున్నాయి.

- తల్లాప్రగడ ప్రభాకర్, హైదర్‌గూడ, హైదరాబాద్

చెట్ల నరికివేత తగదు

రాష్ట్రంలో రహదారులను అనేకచోట్ల విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను నరికివేస్తున్నారు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ పేరిట మొక్కలు నాటడానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. మరోవైపు బాగా ఎదిగి నీడనిస్తున్న చెట్లను తొలగిస్తున్నారు. రహదారుల పక్కన ప్రజలకు నీడనిస్తూ, వాయుకాలుష్య తీవ్రతను నియంత్రిస్తున్న వృక్షాలను ఇలా నరికేయడం తగని పని. పాశ్చాత్య దేశాల్లో మాదిరిగా చెట్లను మరో ప్రాంతానికి తరలిస్తున్న తరహా చర్యలనూ చేపట్టాలి. చెట్లను కూల్చివేయడానికి ముందు, వాటిని మరోచోట నాటడానికి అనువైన కార్యక్రమాలను రూపొందించాలి. అందుకు అవసరమైన యంత్రాలు, యంత్రాంగాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ కృషిలో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న సంస్థలనూ భాగస్వాములను చేయాలి.

- ఎల్. ప్రఫుల్లచంద్ర, ధర్మవరం, అనంతపురంజిల్లా

అంతర్యామి

క్షమాగుణం

క్షమ, ప్రేమ అనే రెండు గుణాలూ మానవతా విలువలకు ప్రతీకలు. ఓర్పు, సహనం అనే పదాల కంటే- 'క్షమ' ఉన్నతమైనది. ప్రేమించడం, క్షమించడం చేతగానివారికి జీవన విలువలు, మాధుర్యం అంటే ఏమిటో తెలియనట్లే! శిక్షలో కన్నా క్షమలోనే దైవత్వం కనిపిస్తుంది. క్షమ సత్యం, క్షమ ధర్మం, క్షమే ఉత్కృష్టమైనదని రామాయణం ప్రబోధిస్తుంది.

రావణ వధ అనంతరం శ్రీరాముడు, తన విజయవార్త తెలియజేయాల్సిందిగా హనుమంతుణ్ని సీతాదేవి వద్దకు పంపుతాడు. అందుకు విభీషణుడి అనుమతి తీసుకుంటాడు. అశోకవనంలోకి ప్రవేశించిన హనుమ, అక్కడ దీనురాలై ఉన్న ఆమెకు సమాచారం అందించి ఆనందపరుస్తాడు.

అప్పటివరకు సీతను భయపెట్టి వేధించిందే చాలక, నానారకాల హింసలకూ గురిచేసిన రాక్షస కాంతల్ని వధిస్తానంటాడు హనుమ. అందుకు సీతాదేవి అనుమతి కోరతాడు. అదే సందర్భంలో రామాయణ కర్త వాల్మీకి మహర్షి- ఆమె నోటివెంట క్షమ గొప్పదనాన్ని చెప్పిస్తాడు. క్షమ అనేది ఈ లోకంలో అన్నింటికన్నా దివ్యత్వం కలిగి ఉంటుంది. క్షమించడం నేర్చుకున్న మనిషికి, తన జీవితంలో దేనికీ బాధపడే అవసరం రాదు. దైవత్వ భావమే క్షమ- అని సీత తేటతెల్లం చేస్తుంది.

ఒక మనిషి అడవిలో నుంచి వెళుతున్నప్పుడు, పులి వెంటపడింది. ప్రాణభయంతో అతడు ఆ పక్కనే ఉన్న చెట్టునెక్కాడు. దాని కిందకు చేరిన అది, తల పైకెత్తి ఆశగా చూస్తోంది. అతడు పైకి కొమ్మల్లోకి వెళ్లి చూస్తే, అక్కడ ఎలుగుబంటి కనిపించింది. భయంతో వణికిపోయాడు. ఆ ఎలుగు అతడితో 'నువ్వు నాకు అతిథివి. నిన్నేమీ చేయను. పులి వెళ్లేదాకా ఇక్కడే ఈ చెట్టుపైనే ఉండు' అని ఊరడించింది. ఒక వంక భయం, మరో వంక అలసట కారణంగా అతడు ఆ చెట్టుకొమ్మల మధ్యనే నిద్రపోయాడు.

నిద్రిస్తున్న ఆ మనిషిని అదను చూసి కిందికి తోసేయాలని ఎలుగును కోరింది పులి. అది సమ్మతించలేదు. కొంతసేపటికి ఎలుగు నిద్రలోకి జారుకుంది. మనిషి నిద్ర లేచాడు. అప్పుడు ఆ మనిషితో పులి 'ఎలుగును కిందికి నెట్టు. దాన్ని తిని వెళతాను. నా ఆకలి తీరుతుంది. నువ్వు వెళ్లిపోవచ్చు' అని సలహా ఇచ్చింది. అతడు కాసేపు ఆలోచించి, ఆ ఎలుగుబంటిని కిందికి నెట్టేశాడు. అది వెంటనే



కిందపడలేదు. ఓ కొమ్మ పట్టుకొని తిరిగి చెట్టెక్కింది.

పులి ఎలుగుతో 'మనిషి ఎంత నమ్మరానివాడో చూశావా? కాపాడిన నిన్నే కిందికి నెట్టేశాడు. నీకు అపకారం చేసిన అతణ్ని కిందికి తోసెయ్. నా ఆకలి తీర్చుకుంటా' అంది. దానికి ఆ ఎలుగుబంటి 'ఈ లోకంలో క్షమించడాన్ని మించిన గొప్పదనం లేదు. నాకు అపకారం చేసినా, అతణ్ని క్షమిస్తున్నాను. కిందికి నెట్టను' అని తేల్చిచెప్పింది. అంతటి మహత్తరమైనది క్షమ. హనుమకు సీత ఈ కథంతా చెబుతుంది. తనను ఎంతగా బాధించినప్పటికీ, ఆ రాక్షస స్త్రీలను క్షమించానంటుంది.

తప్పులు చేయడం మానవ సహజం. అలా చేయనివాడు ఈ లోకంలోనే ఉండడు. చేసిన దానికి పశ్చాత్తాపం పొందే అవకాశం, తిరిగి అటువంటిదేదీ చేయని స్థితిని క్షమ కల్పిస్తుంది. నిత్యజీవితంలో మనిషికి ఎన్నో బాధలు, నష్టాలు సంభవిస్తాయి. కుటుంబసభ్యుల మధ్యనా పొరపొచ్చాలు వస్తాయి. అన్ని పరిస్థితుల్ని, వ్యక్తుల తీరుతెన్నులను అతడు అర్థంచేసుకోవాలి. క్షమాగుణంతో సర్దుబాటు చేసుకోగలిగితే, అంతటా సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి.

పగ, ప్రతీకారం అనేవి మనిషిని చంపగల ఆయుధాలు. క్షమ అనేది అతణ్ని బతికించగల అమృతం. మనిషికి అది దేవుడు ప్రసాదించిన వరం!

- రావులపాటి వెంకట రామారావు

17కు చేరిన మృతుల సంఖ్య

- మరో నలుగురు మృతి చెందినా.. అతిసార వ్యాధిగా నిర్ధరించని వైద్యులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కలుషిత నీరు తాగి మృతి చెందిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 17కు చేరింది. గుంటూరు సర్వజనాసుపత్రి(జీజీహెచ్)లో చికిత్స పొందుతూ నగరంలోని సోమువారివీధికి చెందిన నారసాని తిరపతిస్వామి(73), రాజీవ్ గృహకల్పకు చెందిన జెట్టి లక్ష్మయ్య(53) శుక్రవారం కన్నుమూశారు. గుంటూరు నిమ్మలపేటకు చెందిన పల్లపు రత్తయ్య మృతిచెందినా అతిసారంతో చనిపోయినట్లు నిర్ధరించలేదు. దీంతో మృతదేహంతో నగరపాలక సంస్థ ఎదుట వైకాపా నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్ఆర్‌తోటకు చెందిన అనిమిశెట్టి నాగరాజు, ఏటుకూరు రోడ్డుకు చెందిన బోనం శంకరరావు, ఆనందపేట ఎనిమిదో లేనుకు చెందిన పఠాన్ ఫాతీమూన్(67)లు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వీరి మృతికి కారణాలు వెల్లడించడం లేదు. వీరి నలుగురిని కూడా పరిగణనలోకి తీసుకుంటే మృతుల సంఖ్య 21కు చేరుతుంది. 14ఏళ్ల బాలుడు మరణించాడన్న వదంతులపై అధికారులు జీజీహెచ్‌లో విచారించి అలాంటిదేమీ లేదని ప్రకటించారు. గతంలో చనిపోయినవారి వివరాలతో వారి బంధువులు సర్వజనాసుపత్రికి వచ్చి తమకు కూడా పరిహారం చెల్లించాలని అధికారులను కోరుతున్నారు.

ఇప్పటికీ 83 మందికి చికిత్స..

అతిసారం తగ్గిందని మంత్రులు, అధికారులు ప్రకటిస్తున్నా సర్వజనాసుపత్రిలో ఇప్పటికీ 83మంది చికిత్స పొందుతూనే ఉన్నారు. మృతిచెందిన వారి ఇళ్లకు గురువారం రాత్రి మంత్రులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధికారికంగా గుర్తించిన 8మంది మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, చంద్రన్న బీమా చెక్కులను పంపిణీ చేశారు. గతంలో మృతుల సంఖ్య నాలుగేనని ప్రకటించినా చివరికి 8మందికి చెక్కులు ఇవ్వడం గమనార్హం. వైద్యఆరోగ్య శాఖ సమాచారం ఆధారంగా రెవెన్యూ యంత్రాంగం మృతుల వివరాలు సేకరించి నివేదిక తయారుచేస్తోంది. దీని ఆధారంగానే ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నారు. ఈనెల 5 నుంచి ఇప్పటి వరకు 540 మంది అతిసార బాధితులు చికిత్స పొందారు.

48 గంటలు గడువిస్తున్నా

- గుంటూరులో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని అమలు చేయాలి
- పాలనా వ్యవహారాల పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్‌ను పంపాలి
- లేదంటే బంద్ పిలుపు ఇచ్చి ప్రత్యక్ష ఆందోళన చేస్తా
- జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్
- తాను ప్రజల మనిషినని స్పష్టీకరణ

ఈనాడు - గుంటూరు, ఈనాడు డిజిటల్ - విజయవాడ



గుంటూరు చిన్నబజారులో ఏర్పాటుచేసిన తాత్కాలిక వైద్యశిబిరంలో అతిసారవ్యాధి బాధితులను పరామర్శిస్తున్న పవన్‌కల్యాణ్

ఏం... తమాషాలు చేస్తున్నారా?

"నిన్నటి వరకు నన్ను తెదేపా మనిషినన్నారు. ఇప్పుడేమో తెదేపా నేతలు జగన్ మనిషినంటున్నారు. ఇప్పుడు ప్రజాసమస్యలపై మాట్లాడుతుంటే భాజపా మనిషినని ముద్రవేస్తున్నారు. ఏం తమాషాలు చేస్తున్నారా? నేను గట్టిగా మాట్లాడాల్సి వస్తుంది" అని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. తాను ఎవరి మనిషినీ కానని ప్రజల మనిషినని.. వారి దర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకెళ్లేందుకే గత ఎన్నికల్లో తెదేపా, భాజపాకు మద్దతు తెలిపా. కనీసం వారి నుంచి కాఫీ కప్పు కూడా ఆశించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తప్పాయి. రాష్ట్రాభివృద్ధిపై నిర్లక్ష్యం చూపాయి" అని దుయ్యబెట్టారు. రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం చేస్తున్న తప్పులను పదేపదే వారి దృష్టికి తీసుకెళ్లినా వారిలో మార్పు రాలేదన్నారు. దీంతో ప్రజలు తనను నిలదీస్తున్నారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలపై ఆందోళనలను తీవ్రం చేయడం లేదని, దీని కోసం త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు.

గుంటూరులో కలుషిత నీరు తాగి పదుల సంఖ్యలో జనం చనిపోయారని తక్షణమే ఇక్కడ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలనా వ్యవహారాలు పర్యవేక్షించటానికి నగరానికి సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేకాధికారిగా పంపాలన్నారు. వీటిని 48 గంటల్లో పరిష్కరించకపోతే గుంటూరు బంద్‌కు పిలుపునిచ్చి ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటానని హెచ్చరించారు. "అనేక మంది చనిపోయి 500 మందికి పైగా ఆస్పత్రులపాలైనా అధికారపార్టీతో సహా ఏ రాజకీయ పార్టీ ఈ సమస్యను తీవ్రంగా పరిగణించకపోవటం బాధగా ఉంది. అమాత్యులు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లల్లో జరిగితే ఇలానే స్పందించకుండా ఉంటారా? సామాన్యుల ప్రాణాలు అంటే ప్రభుత్వానికి లెక్కలేదా? వైద్యసేవల్లో జాప్యం జరిగింది" అని ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం విజయవాడలో, గుంటూరులో పర్యటించారు. ఉదయం గుంటూరులో అతిసార వ్యాధి బారిన పడి మృతిచెందిన వారి కుటుంబాలను, చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను చేస్తామనటం విడ్డూరం

గుక్కెడు సురక్షిత నీరు ఇవ్వలేని వారు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను చేస్తామనటం విడ్డూరమని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా మురుగునీటి కాల్వల కింద తాగునీటి పైపులైన్లు ఉంటే యంత్రాంగం ఏ దశలో కూడా గుర్తించలేకపోయింది. ఎనిమిదేళ్ల నుంచి నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వాలు మిన్నకుండిపోయాయి. అదే పాలకవర్గం ఉండి ఉంటే ప్రజలు తమకున్న సమస్యలను స్థానిక కార్పొరేటర్లకు చెప్పుకుని పరిష్కరించుకునేవారు. నగరంలో అతిసారం ప్రబలుతోందని, మురుగునీరు సరఫరా అవుతున్నాయని కమిషనర్‌కు తెలియజేసినా పట్టించుకోకుండా యంత్రాంగం నిర్లక్ష్యం వహించింది. కమిషనర్లపై రాజకీయ జోక్యం పెరిగిపోయింది. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలను గాలికొదిలేసి వ్యక్తిగత లబ్ధి చూసుకోవటం వల్ల పాలనా వ్యవస్థలు గాడితప్పాయి" అని విమర్శించారు. గుంటూరు నగరానికి కేంద్రం రూ.900 కోట్లు భూగర్భ డ్రెయినేజి పనులకు కేటాయించిందని ఈ నిధులతో ఇప్పటి దాకా సగం పనులు కూడా పూర్తి చేయలేదని పవన్ అన్నారు. పనులు నాసిరకంగా జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ముడుపులు తీసుకుని పనుల్లో నాణ్యతను విస్మరిస్తే తాము ఊరుకోబోమని, ఈలోపాలపై న్యాయస్థానాలకు ఈడ్చుతామని హెచ్చరించారు.

గుంటూరు కల్తీలకు అడ్డా...

గుంటూరు కల్తీలకు అడ్డాగా మారిందని పవన్ కల్యాణ్ అన్నారు. "శుద్ధజలంలో కల్తీ నీళ్లే. నాణ్యత, ప్రమాణాలు పాటించని ప్లాంట్లను ఎలా కొనసాగిస్తున్నారు? కారంలో కల్తీలే బయటపడ్డాయి. పరిస్థితులు ఇలాఉంటే విదేశీ, సింగపూర్ పెట్టుబడులు ఎలావస్తాయి?" అని ప్రశ్నించారు.

జగన్ అసెంబ్లీకి రావాలి..

ప్రభుత్వం చేసే తప్పిదాలను అసెంబ్లీ వేదికగా ఎండగట్టడానికి తక్షణమే విపక్ష నేత జగన్ అసెంబ్లీకి రావాలని హితవు పలికారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టే విషయంలో తెదేపా, వైకాపాలకు స్పష్టత లేదని ఆరోపించారు.

ఆందోళన చేస్తున్న జర్నలిస్టులతో..

విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. ప్రెస్‌క్లబ్ దగ్గర గృహవసతి కోసం పోరాడుతున్న జర్నలిస్టు నాయకులతో మాట్లాడారు.

అమరావతి నుంచే మద్దతు సమీకరణ

చంద్రబాబుకు ఫోన్ చేసిన ఎస్పీ నేత రాంగోపాల్‌యాదవ్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి తెదేపా రెండోసారి నోటీసు ఇచ్చిన నేపథ్యంలో మద్దతు కూడగట్టేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రత్యేకంగా దిల్లీకి వెళ్లటం లేదు. వరుసగా మూడు రోజులపాటు శాసనసభ సమావేశాలకు విరామం వచ్చినప్పటికీ అమరావతిలోనే ఉంటూ జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలను గమనించనున్నారు. అవిశ్వాస తీర్మానంపై తెదేపాతో కలిసి వచ్చే ప్రాంతీయ పార్టీల నాయకులతో ఫోన్లో మాట్లాడే వీలుంది. పార్టీ ఎంపీలు మాత్రం దిల్లీలో ఇతర పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. ఇప్పటికే కొన్ని పక్షాల నేతలు బాహాటంగా తెదేపా అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికాయి. ఒకటి, రెండు పార్టీలు సోమవారంలోగా నిర్ణయం ప్రకటించనున్నాయి. శుక్రవారం సాయంత్రం సమాజ్‌వాదీ పార్లమెంటరీ పార్టీ నేత రాంగోపాల్‌యాదవ్ చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎన్‌డీఏ నుంచి తెదేపా వైదొలగటం గురించి ప్రస్తావించి.. అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల అనంతరమే!: ఎన్‌డీఏ నుంచి వైదొలిగిన తెదేపా ఇప్పటికిప్పుడు జాతీయ రాజకీయాల్లో కీలక భూమిక పోషించాలని భావించటం లేదు. అవిశ్వాస తీర్మాన వ్యవహారం ముగిశాక.. ఎన్నికల నాటికి అప్పటికున్న పరిస్థితులను బట్టి వ్యవహరించాలని అనుకుంటోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర పక్షాలను కూడగట్టటంలో కీలకంగా వ్యవహరించిన చరిత్ర తెదేపాకు ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల్లో నేరుగా పాలుపంచుకుంది. ఎన్‌డీఏకు బయటినుంచి రెండుసార్లు, భాగస్వామిగా మరోసారి వ్యవహరించింది. తిరిగి ఇప్పుడు ఎన్‌డీఏ నుంచి బయటకు రావటంతో భావసారూప్య పక్షాలతో మరోసారి కలిసి పనిచేసే అవకాశం ఉంది. దీనికోసం హడావిడిగా వ్యవహారాలు నడపాలన్న యోచనలో మాత్రం లేమని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. రాష్ట్రంలో తాజా పరిణామాల నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులపైనే ఎక్కువగా దృష్టి పెట్టాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల అనంతరమే జాతీయ స్థాయిలో ఎలాంటి పాత్ర పోషించాలన్న దానిపై దృష్టి పెడతామని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు భావన పళనికి లేకపోవటం బాధాకరం: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: భాజపా కూటమికి మద్దతిచ్చే విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉన్న భావన తమిళనాడు సీఎం పళనిస్వామికి లేదని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. ఈరోడు జిల్లాలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ... మోదీ ఇచ్చిన ఏ హామీలనూ నెరవేర్చలేదని ఇప్పటికే చంద్రబాబు ఆరోపించారని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో ఆయన కేంద్రంలోని తమ మంత్రులతో రాజీనామాలు చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ కూటమికి మద్దతు ఇవ్వబోమని కూడా ప్రకటించారని తెలిపారు. ఈ భావన తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వానికి లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

రైల్వే జోన్ నివేదికపై పూర్తిస్థాయి పరిశీలన

రైల్వేశాఖ సహాయమంత్రి రాజన్‌గోహెన్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రైల్వేజోన్ డిమాండ్‌పై ఏర్పాటుచేసిన కమిటీ ఇచ్చిన నివేదికను రైల్వేమంత్రిత్వశాఖ పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి రాజన్‌గోహెన్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు సీఎం రమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విభజన చట్టం ప్రకారం రైల్వేజోన్ పరిశీలనకోసం ఏర్పాటుచేసిన కమిటీ నివేదికను ఎందుకు బయటపెట్టడంలేదు, ఏ రాష్ట్రమైనా జోన్ ఏర్పాటును వ్యతిరేకిస్తోందా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. రైల్వేజోన్ కసరత్తులో ముడిపడిన సంక్లిష్టతను దృష్టిలో ఉంచుకొని జోన్ ఏర్పాటుకున్న సాధ్యాసాధ్యాల పరిశీలనకోసం ఏర్పాటుచేసిన కమిటీ నివేదికను మంత్రిత్వశాఖ పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు మాత్రమే పేర్కొన్నారు.

వామపక్షాల పోరాట ఫలితమే కేంద్రంపై అవిశ్వాసం

సీపీఐ, సీపీఎం నేతలు రామకృష్ణ, మధు

ఈనాడు డిజిటల్, విజయవాడ: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు వామపక్షాలు చేసిన పోరాట ఫలితమే నేడు కేంద్రంపై అవిశ్వాసం పెట్టే స్థాయికి వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సీపీఐ, సీపీఎం ముఖ్యనేతలతో సమావేశమైన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారితో అరగంటపాటు చర్చించారు. అనంతరం రామకృష్ణ, మధు విలేకర్లతో మాట్లాడుతూ..రాష్ట్రంలోని భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేసి, తిరిగి ఒంటరిగా పోటీచేసి గెలవాలని డిమాండ్ చేశారు. పవన్‌తో వామపక్షాల భేటీపై బీజేపీ నేతల దుష్ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తెదేపాకు చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసిఉద్యమించాలని సూచించారు. ఈనెల 19న విజయవాడలో ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనసమితి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి పవన్‌కల్యాణ్ అతిథిగా హాజరవుతారని చెప్పారు.

జూనియర్ వైద్యుల సమ్మె విరమణ

ఈనాడు, అమరావతి: జూనియర్ వైద్యులు గత కొద్దిరోజుల నుంచి కొనసాగిస్తున్న సమ్మెను శుక్రవారం రాత్రి నుంచి విరమించారు. పీజీ వైద్య విద్యను పూర్తిచేసిన వారు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదిపాటు పనిచేయాలన్న నిబంధనలో వెసులుబాటు, ఉపకార వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారంపై జూనియర్ వైద్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య చర్చించారు. ప్రభుత్వం నుంచి సానుకూలత కనిపించినందున శనివారం నుంచి విధులకు హాజరవుతామని వైద్యులు ప్రకటించారు. రెండేళ్లకోకసారి 15% ప్రకారం ఉపకారవేతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించి ఇప్పటికే ఉత్తర్వులను జారీచేసింది. 2016 జనవరి 1 నుంచి డిసెంబరు 31 2017 మధ్య చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేందుకు రూ.32 కోట్లను విడుదల చేసింది. 2018 జనవరి నుంచి పెంచాల్సిన ఉపకార వేతనంపై ప్రత్యేక కమిటీ ద్వారా అధ్యయనం చేయించి ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపింది. సీనియర్ రెసిడెన్సీ ఉపకార వేతనాలను కూడా ప్రభుత్వం పెంచింది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన వెంటనే డిగ్రీ పట్టాలను ఏపీ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ జరిగేలా 2013 చట్టసవరణకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. ఉపకార వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూస్తామని పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఒప్పంద ఉద్యోగుల వేతనాల పెంపు

ఈనాడు అమరావతి: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తోన్న ఒప్పంద ఉద్యోగుల గౌరవ వేతనాలు పెరిగాయి. ఈ వేతనాల పెంపుపై మంత్రివర్గ ఉపసంఘం పలుదఫాలుగా సమావేశమై చర్చించింది. వేతనాల పెంపునకు ఆమోదం తెలిపింది. ఈ పెంపు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య శుక్రవారం జారీచేశారు. ప్రజారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, ఆయుష్, కుటుంబ సంక్షేమ శాఖ, బోధనాస్పత్రులు, ఇతరచోట్ల పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్, ఎ.ఎన్.ఎం., ఇతర కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగుల వేతనాలు పెరిగాయి. ప్రజారోగ్య శాఖలో పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మగ) వారికి ఇప్పటివరకు రూ.20,600 ఇస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రూ.28000 ఇవ్వనున్నారు.

నిధులిచ్చినా ఉపయోగించుకోలేదు

మాజీ మంత్రి మాణిక్యాలరావు

గుంటూరువారితోట, న్యూస్‌టుడే: రెండేళ్ల క్రితమే కేంద్రప్రభుత్వం గుంటూరు మురుగునీటి పారుదల నిర్మాణ పనుల అభివృద్ధికి రూ.500కోట్ల నిధులిచ్చినా, సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని మాజీ మంత్రి, భాజపా నేత మాణిక్యాలరావు ఆరోపించారు. అతిసారంతో బాధపడుతూ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం ఆయన, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ తదితరులతో కలిసి పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి పర్యవేక్షకుడు రాజునాయుడు, ఏఆర్ఎంవో రమేష్‌లు వారికి వివరించారు. అనంతరం మాజీ మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలుస్తున్నా మున్సిపల్ యంత్రాంగం మరమ్మతులు జరపలేదని ఆరోపించారు. పురపాలక మంత్రి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని సూచించారు. డయేరియాకు కారణమైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. గుంటూరు ఎంపీ దిల్లీ రాజకీయాల్లో మునిగి తేలుతూ, బాధితులను, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించలేకపోతున్నారని విమర్శించారు.

మనోభావాలతో ఓట్ల కోసం ప్రయత్నాలు

రోజుకో మాట.. పూటకో అబద్ధం: విష్ణుకుమార్‌రాజు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రాజకీయ క్రీడ నడుస్తోందని భాజపా శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. రాష్ట్ర బడ్జెట్‌పై శుక్రవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రాభివృద్ధికి భారీగా నిధులిస్తున్నా అనవసర రాద్ధాంతంతో ప్రజల మనోభావాల ఆధారంగా ఓట్లను పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. "వైకాపా అవిశ్వాస తీర్మానానికి సహకరిస్తామన్న.. కొద్ది గంటలకే సొంతంగా తీర్మానాన్ని ప్రవేశపెడతామని తెదేపా ప్రకటించింది. రోజుకో మాట.. పూటకో అబద్ధంలా పరిస్థితులు మారాయి. రాష్ట్ర బడ్జెట్‌లో మద్యం ఆదాయాన్ని పెంచేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెల్లవారుజాము వరకు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఇది మహిళా లోకానికే అవమానం. దశలవారీగా మద్యం అమ్మకాలు తగ్గేలా చర్యలు తీసుకుంటే పేద, మధ్య తరగతి కుటుంబాలు బాగుపడతాయి. చంద్రన్న బీమా పథకానికి కేంద్రం నిధులిస్తున్నా అమలులో ఎక్కడా ప్రధాని ఫొటోను వాడడం లేదు. కేంద్ర నిధులతోనే గృహాల, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో కిందటేడాది 967 హత్యలు జరగ్గా ఈ సంవత్సరంలో వీటి సంఖ్య 848 దాటకుండా చూస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇతర నేరాల విషయంలో ఇలాగే లక్ష్యాలను నిర్దేశించింది. (దీనికి మంత్రి కాలువ శ్రీనివాసులు తీవ్ర అభ్యంతరం చెబుతూ ప్రభుత్వ వాస్తవ ఉద్దేశాన్ని విష్ణుకుమార్‌రాజు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు).

అతిసారాన్ని అదుపు చేయలేరా?

- అధికారులపై ముఖ్యమంత్రి ఆగ్రహం

ఈనాడు, ఈనాడు డిజిటల్- అమరావతి: గుంటూరులో అతిసారాన్ని సకాలంలో ఎందుకు అదుపు చేయలేకపోయారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులపై ఆగ్రహం ప్రకటించారు. శుక్రవారం రాత్రి సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ కేంద్రంలో గుంటూరులో అతిసార ఘటనపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అతిసారం ప్రబలిన వెంటనే అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మరణాలు అతిసారం వల్లే సంభవించాయా? సహజ మరణాలా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో పిడుగులు పడే సమాచారాన్ని ప్రజలకు మరింత ముందుగా అందించడానికి 'సెల్ బ్రాడ్‌కాస్టింగ్' సాంకేతికతను సమర్థంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకాశం జిల్లాలో శుక్రవారం పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందిన ఘటనపై సమీక్ష సందర్భంగా ప్రజలను ముందుగా అప్రమత్తం చేసేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న విధానం, కొత్తగా అనుసరిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పౌరసరఫరాలశాఖ పనితీరును సమీక్షిస్తూ రేషన్ కార్డులు రద్దుచేస్తున్నట్లు కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు.

బాధ్యులపై క్రిమినల్ చర్యలు: మంత్రులు

గుంటూరు అతిసార ఘటనలో బాధ్యులైన 8మందిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించటంపై మంత్రి స్పందించారు. మంత్రులు నారాయణ, నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రత్తిపాటి శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకర్లతో మాట్లాడారు. "ఘటన జరిగిన వెంటనే అధికారులందరినీ అప్రమత్తం చేశాం. తీసుకుంటున్న చర్యలపై సీఎం నిత్యం సమీక్షిస్తున్నారు. అతిసారంతో 8మంది చనిపోయినట్లు అధికారుల కమిటీ నిర్ధారించింది. వారికి పరిహారం అందించాం. ప్రస్తుతం ఆస్పత్రుల్లో 82 మంది కోలుకుంటున్నారు. కార్పొరేటు వైద్యం అవసరమైన వారికి ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. 40ఏళ్ల నాటి పైప్‌లైన్ జాయింట్‌ల కారణంగా ఘటన జరిగినట్లు గుర్తించాం. వాటిని మార్చడానికి నిధులిచ్చాం. ఈ పరిస్థితుల్లో పరామర్శకు వెళ్లిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఘటనను రాజకీయం చేయడం బాధాకరం." అన్నారు.

మిత్రపక్షాల్లో విభజనకు భాజపా యత్నం

- కేంద్రానికి వ్యతిరేకంగా ఇతర పార్టీల మద్దతు కూడగట్టాం: తోట నరసింహం

ఈనాడు, దిల్లీ: మిత్రపక్షాల్లో విభజన తెచ్చి..చిన్న పార్టీలను ప్రోత్సహిస్తూ ఎదగాలన్న వ్యూహాన్ని భాజపా ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడులో అమలుచేసినట్లే ఏపీలోనూ కొనసాగించాలని ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమైందని తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. అందువల్లే ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, కేంద్రంపై అవిశ్వాసం పెట్టాలని తెదేపా నిర్ణయించిందన్నారు. శుక్రవారం తెదేపా ఎంపీలు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. జయదేవ్ మాట్లాడుతూ.."వైకాపా అవిశ్వాసానికి మద్దతు తెలపలేం. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధాని కార్యాలయం చుట్టూ తిరుగుతూ మరోపక్క అవిశ్వాసం తీసుకువచ్చారు. అందువల్లే వారికి మద్దతునివ్వకుండా మేమే నిజమైన అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించాం" అన్నారు.

ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ..."మేం పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, ఇతర చిన్న పార్టీలు మద్దతిచ్చాయి.. ప్రభుత్వం మాత్రం అవిశ్వాసం, చర్చను తొక్కిపడేయాలని చూసింది. ప్రత్యేకహోదాపై ఎప్పుడూ రాజీపడలేదు. రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితి తలెత్తకూడదని, కేంద్రంతో హామీలను అమలు చేయించాలని ప్రయత్నించాం. వారికి(కేంద్రానికి) చీమ కుట్టినట్లయినా లేదు. వైకాపా అవిశ్వాసానికి తెదేపా మద్దతునిచ్చింది. కానీ, విజయసాయిరెడ్డి వైఖరి కారణంగా వారు పెట్టిన అవిశ్వాసానికి మద్దతునివ్వాలా అని ఇతర పార్టీలు భావిస్తున్నాయి. అందువల్లే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అవిశ్వాసం పెట్టాం" అన్నారు.

అవిశ్వాసం పెట్టేందుకు రెండోసారి నోటీసిచ్చాం

తెదేపా లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం మాట్లాడుతూ.."మేం అవిశ్వాసం నోటీసునిస్తే దానిని స్పీకర్ సభలో ప్రస్తావించారు. సభ ఆర్డర్‌లో లేదంటూ.. మా తీర్మానాన్ని పక్కనపెట్టేశారు. ఏపీకి న్యాయం చేసే విధానం ఎక్కడా లేదు. అందుకే ఇప్పుడు ఎన్డీయే నుంచి బయటకు వచ్చి అవిశ్వాసం పెట్టాం. మద్దతునివ్వాలని కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఒవైసీ తదితరులూ తెదేపాకు మద్దతునిస్తామన్నారు. సోమవారం మళ్లీ అవిశ్వాసం పెట్టేందుకు రెండోసారి నోటీసునిచ్చాం" అన్నారు.

ఎంపీ టీజీ వెంకటేష్ మాట్లాడుతూ..." ఎన్డీయే నుంచి బయటకు వెళ్లినందుకు తెదేపా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఏపీ భాజపా నేతలు మాట్లాడుతున్నారు. వారిక్కడ కేంద్రంలోని భాజపాకు వంత పాడడమే తప్ప, రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడం లేద"ని విమర్శించారు.

మా రాజీనామాలు మిత్రపక్షాలకో హెచ్చరిక

రాజ్యసభలో మాజీ మంత్రి సుజనాచౌదరి



ఈనాడు, దిల్లీ: 'వాస్తవాలను విస్మరించడం మూర్ఖత్వం. వాటిని సరిగ్గా అర్థం చేసుకొని ఎదుర్కోలేకపోతే ప్రతీకారం తీర్చుకుంటాయి. ఈ సభలో కూర్చున్నవారంతా ఆంధ్రప్రదేశ్‌లోని వాస్తవాలను అర్థం చేసుకోవాలి' అని కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర మంత్రివర్గం నుంచి రాజీనామా చేసిన నేపథ్యంలో 241వ నిబంధన కింద రాజ్యసభలో ఆయన తమ రాజీనామాలకు దారితీసిన కారణాలను వివరించారు. గురువారం కాంగ్రెస్ సభ్యుల ఆందోళన కారణంగా అర్థంతరంగా ఆగిన తన ప్రసంగాన్ని ఆయన శుక్రవారం కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భాజపా వ్యవహారశైలి లేదని ఆరోపించారు. 'దేశ రక్షణ కోసం ఉపయోగించే నిధులను మాకివ్వమని అడిగినట్లు మీడియాలో వచ్చిన వార్తలు మమ్మల్ని ఎంతో బాధించాయి. విభజన చట్టంలో ఉన్న, లేని అనేక సంస్థలకు శంకుస్థాపన చేసినందుకు ధన్యవాదాలు చెబుతున్నా. వాటి పురోగతి ఏమాత్రం బాగా లేదన్న విషయాన్ని ఇక్కడ చెప్పి తీరాలి. విధిలేని పరిస్థితుల్లోనే మేం రాజీనామాలు చేయాల్సి వచ్చింది. మా రాజీనామాలు మిత్రపక్షాలకో హెచ్చరిక' అని అన్నారు. 2014 ఫిబ్రవరి 20న బిల్లు పాస్ అవుతున్న సమయంలో నాటి హోంమంత్రి షిండే ఐదేళ్లపాటు ప్రత్యేకహోదా ఇస్తామంటే పదేళ్లపాటు కావాలని వెంకయ్యనాయుడు డిమాండ్ చేశారని గుర్తు చేసినప్పుడు భాజపా సభ్యులు అభ్యంతరం తెలిపారు. ప్రసంగ పాఠంలో లేనిది చదువుతున్నారని ఉపసభాపతి పీజే కురియన్ దృష్టికి తెచ్చారు. దాంతో ఉపసభాపతి వాటిని రికార్డులనుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. తాను ఈ సభలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తున్నానని, వ్యక్తుల గురించి మాట్లాడలేదని సుజనాచౌదరి పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రులు పీయూష్‌గోయల్, విజయ్‌గోయల్‌లు అభ్యంతరంచెప్పగా.. జైరాంరమేష్ సమర్థించారు.

వెనక్కి తీసుకుంటారనే నోటీసు ఇచ్చాం: సీఎంరమేశ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకుంటుందేమో అన్న భయంతోనే తెదేపా కూడా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిందని తెదేపా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ స్పష్టం చేశారు. శుక్రవార మిక్కడ ఎంపీలు తోట నరసింహం, రవీంద్రబాబు, అవంతి శ్రీనివాస్, మంత్రి గంటా శ్రీనివాసరావులతో కలిసి ఆయన మీడియతో మాట్లాడారు. వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తొలుత భావించామని అయితే గత అనుభవాలు ప్రస్తుత పరిణామాల దృష్ట్యా పార్టీ తరఫున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామన్నారు.

తెదేపా నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: సురవరం

కేంద్రంపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలన్న తెదేపా నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీకి ఇచ్చిన ప్రత్యేకహోదా హామీని ఎన్డీయే ప్రభుత్వం విస్మరించిన నేపథ్యంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నామన్నారు.

శాస్త్రవేత్తలూ... ప్రజల చెంతకు రండి

- ఏడాదికి 100 గంటలు విద్యార్థుల కోసం వెచ్చించండి
- ప్రధానమంత్రి మోదీ పిలుపు
- ఇంఫాల్‌లో ప్రారంభమైన భారత వైజ్ఞానిక సదస్సు



మణిపూర్ విశ్వవిద్యాలయంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఇంఫాల్: దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారంలో శాస్త్రసాంకేతికతలు కీలకపాత్ర వహిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి)లను దేశాభివృద్ధి కోసం సాగించే శోధనలుగా పునర్నిర్వచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజాహితం కోసం శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ప్రయోగశాలల నుంచి సమాజం మధ్యకు విస్తరించాలని పిలుపునిచ్చారు. ఇంఫాల్‌లో శుక్రవారం 105వ భారత వైజ్ఞానిక సదస్సు (ఇండియన్ సైన్స్ కాంగ్రెస్)ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలు, శాస్త్రసాంకేతికల వినియోగంలో మన దేశానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందని చెబుతూ "వైజ్ఞానిక రంగాల్లో అగ్రభాగాన ఉన్న దేశాల చెంత మన స్థానాన్ని పునరుద్ధరించుకోవాల్సిన సమయమిది" అని అన్నారు. విద్య, వైద్యం, బ్యాంకింగ్ రంగాల్లో ప్రజలను మమేకం చేయటానికి సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అభివృద్ధికి దూరంగా ఉన్నవారిని చేరుకోవటమన్నది లక్ష్యంగా నిర్దేశించుకొని సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారంలో శాస్త్రవిజ్ఞానం దోహదపడాలని చెప్పారు. ప్రతి ఒక్క శాస్త్రవేత్త ఏడాదిలో 100 గంటలు 9-12 తరగతుల విద్యార్థులకు కేటాయించి వైజ్ఞానిక, సాంకేతిక అంశాలపై వారితో చర్చించాలని తాను వ్యక్తిగతంగా అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. "పరిశోధనా సంస్థలు, ప్రయోగశాలల ద్వారాలను మన చిన్నారుల కోసం తెరవాలి. పాఠశాల విద్యార్థులకు చేరువయ్యేందుకు ఒక యంత్రాంగాన్ని అభివృద్ధిపరచుకోవాలని శాస్త్రవేత్తలకు సూచిస్తున్నా" అని మోదీ అన్నారు.

శాస్త్రవేత్తలకు సవాల్..

విద్యుత్ తయారీలో శిలాజేతర ఇంధనాల వాటాను 2030కల్లా 40శాతానికి పెంచాలనే పట్టుదలతో కేంద్ర ప్రభుత్వం ఉందని ప్రధాని మోదీ వెల్లడించారు. "ప్రస్తుతం విపణిలో అందుబాటులో ఉన్న సోలార్ మాడ్యూల్స్ సామర్థ్యం 17-18శాతం మాత్రమే. వీటికన్నా ఎంతో మెరుగైన సామర్థ్యంతో పనిచేసే సోలార్ మాడ్యూల్స్‌ను మన దేశంలోనే అదే ధరకు తయారుచేసే సవాల్‌ను మన శాస్త్రవేత్తలు స్వీకరించగలరా" అని ప్రశ్నించారు.

పశ్చిమ రాష్ట్రాలతో సమానంగా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి

ఈశాన్య రాష్ట్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. వాటి వృద్ధితోనే దేశ అభివృద్ధికి సంపూర్ణత్వం సమకూరుతుందని తెలిపారు. దేశంలోని పశ్చిమ రాష్ట్రాలతో సమానంగా ఈశాన్య రాష్ట్రాలు వృద్ధిచెందాల్సి ఉందన్నారు. శుక్రవారం ఆయన మణిపూర్‌లోని వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరేన్ సింగ్ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు.

అభివృద్ధిలో అసమతుల్యతను ఛేదించాం

దిల్లీ: తూర్పు ప్రాంతాలపై దృష్టి సారించడం, ప్రజల గడప వద్దకే పాలనను తీసుకెళ్లడం ద్వారా... దేశాభివృద్ధిలో అసమతుల్యతను తమ ప్రభుత్వం ఛిద్రం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారమిక్కడ న్యూస్-18 ఏర్పాటుచేసిన 'రైజింగ్ ఇండియా' సదస్సులో ప్రధాని ప్రసంగించారు. ఆరోగ్యం, సంక్షేమం, విద్యుత్ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ప్రపంచశక్తిగా భారత్ అవతరిస్తోందన్న విశ్వాసం ప్రజలకు కలిగించిందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా మునుపటి కంటే ఇప్పుడు ఏడు రెట్లు అధికంగా ఉందన్నారు. విద్యారంగ సంస్కరణల కోసం ఈ ఏడు నాలుగేళ్లలో లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

2 వేల నోటు రద్దు యోచనేదీ లేదు

- లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: పెద్దనోట్ల రద్దు అనంతరం ప్రవేశపెట్టిన రూ. 2 వేల నోటును రద్దుచేసే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అలాగే 10 రూపాయల ప్లాస్టిక్ నోట్లను 5 నగరాల్లో (కొచి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ప్రయోగాత్మకంగా పరిశీలించదలచి నిర్ణయించినట్లు వెల్లడించింది. ఈమేరకు ఆర్థికశాఖ సహాయమంత్రి పి.రాధాకృష్ణన్ ఓ ప్రశ్నకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కొత్త ఎంపీల ప్రమాణస్వీకారం..

యూపీ, బిహార్ ఉపఎన్నికల్లో విజయం సాధించిన ముగ్గురు లోక్‌సభ సభ్యులూ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. తొలుత సర్ఫ్‌రాజ్ ఆలమ్ (ఆర్జేడీ).. అనంతరం నాగేంద్ర ప్రతాప్‌సింగ్ పటేల్, ప్రవీణ్‌కుమార్ నిషాద్ (ఎస్పీ)లు ప్రతిపక్ష సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రమాణస్వీకారం చేశారు. పటేల్, నిషాద్‌లు ప్రమాణస్వీకారానికి ముందు మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్‌జైట్లీలతో పాటు భాజపా అగ్రనేత అడ్వాణీకి పాదాభివందనం చేశారు. ప్రతిపక్ష నేతలంతా అభినందించారు.

హాకింగ్, ముగ్గురు మాజీ ఎంపీల మృతికి సంతాపం..

ముగ్గురు మాజీ ఎంపీలు ఉత్తమ్‌భాయ్ హర్జీభాయ్ పటేల్, డాక్టర్ బోళ్ల బుల్లిరామయ్య, సుశీల బంగారులక్ష్మణ్‌లతో పాటు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మృతికి లోక్‌సభ శుక్రవారం సంతాపం తెలిపింది. వారికి సంబంధించిన వివరాలను స్పీకర్ సుమిత్ర మహాజన్ చదివి వినిపించారు. అలాగే ఇటీవల చత్తీస్‌గఢ్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లపై మావోయిస్టుల దాడిని స్పీకర్ ఖండించారు. ఈ సందర్భంగా సభ కొద్ది నిమిషాల పాటు మౌనం పాటించింది.

జాతీయగీతంలో 'సింధ్'ను తొలగించాలంటూ ప్రైవేటు బిల్లు..

జాతీయగీతంలో 'సింధ్'కు బదులు 'ఈశాన్య (నార్త్ఈస్ట్)' అనే పదాన్ని పెట్టాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ రిపున్ బోరా (అసోమ్) రాజ్యసభలో ప్రైవేటు మెంబర్ బిల్లుకు తీర్మానం ప్రతిపాదించారు. 1950లో జాతీయగీతాన్ని ఆమోదించే సమయంలోనే - అవసరమైతే భవిష్యత్తులో సవరణ చేసుకోవచ్చంటూ నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తెలిపిన విషయాన్ని బోరా గుర్తుచేశారు.

సహనాన్ని పరీక్షించవద్దు

తన సహనాన్ని పరీక్షించవద్దని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుక్రవారం రాజ్యసభలో ఆందోళన చేస్తున్న కొందరు సభ్యులను హెచ్చరించారు. తనదైన శైలి..ఇప్పటికే ప్రజలు తిలకిస్తున్నారని ప్రజల సహనానికి పరీక్ష పెట్టవద్దన్నారు. శుక్రవారం రాజ్యసభ సమావేశం అయిన వెంటనే ఆయన మాట్లాడుతూ.... సభలో నిరసనలు కనుక ఇలాగే కొనసాగితే, కార్యకలాపాలకు విఘాతం కలిగితే తీవ్ర చర్యలు తీసుకోక తప్పనిసరి పరిస్థితి తలెత్తుతుందని, అలాంటి స్థితి రానీయకండన్నారు. బ్యాంకింగ్ రంగంలో అవకతవకలు, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆవేదన వంటి ఎన్నో సమస్యలు ప్రజలను ఇబ్బందిపెడుతున్నాయన్నారు.

వాణిజ్య వాహనాల జీవిత కాలం 20 ఏళ్లే!

ఆ తర్వాత తుక్కు కింద తీసేయాల్సిందే

దిల్లీ: వాణిజ్య వాహనాల జీవిత కాలానికి 20 ఏళ్ల పరిమితిని కేంద్రప్రభుత్వం విధించనుంది. దీని ప్రకారం 2000 సంవత్సరానికి ముందు కొనుగోలు చేసిన ట్యాక్సీలు, ట్రక్కులు, బస్సులు వంటి వాహనాలకు సామర్థ్యం(ఫిట్‌నెస్)తో సంబంధం లేకుండా వాటి రిజిస్ట్రేషన్లు 2020 మార్చి 31తో రద్దవుతాయి. అంటే 2020, ఏప్రిల్ 1వ తేదీ నుంచి వాటిని రహదారులపై నడపటానికి అనుమతించరు. ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ)లో జరిగిన అత్యున్నతస్థాయి అధికారుల భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నీతి ఆయోగ్, రవాణా, భారీ పరిశ్రమలు, ఆర్థిక, పర్యావరణ మంత్రిత్వశాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అయితే, వ్యక్తిగత వాహనాలకు మాత్రం ఎలాంటి కాలపరిమితి విధించలేదు. సామర్థ్యం(ఫిట్‌నెస్) బాగున్నంత కాలం వాటిని నడిపేందుకు వీలుంటుందని సమాచారం. 2020 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఇరవై ఏళ్ల కాల పరిమితి ముగిసే వాణిజ్య వాహనాల సంఖ్య దాదాపు 7లక్షల వరకు ఉండొచ్చని కేంద్ర ప్రభుత్వ అంచనా. వీటి రిజిస్ట్రేషన్ల చెల్లుబాటు గడువు రెండేళ్లలో ముగుస్తున్నందున ఆ సమయంలో ఆ వాహనాలను తుక్కు కింద విక్రయించి వాటి స్థానంలో కొత్త వాహనాలను కొనుగోలుచేయదలిచే యజమానులకు పన్నుల్లో కొంత మినహాయింపునివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పాత వాహనాల అమ్మకాలను జీఎస్టీ పరిధి నుంచి తప్పించాలనే ప్రతిపాదన ఉంది.

రుతుపవనాలు సానుకూలమే..!

పుణే: రుతు పవనాలు ఈ ఏడాది అనుకూలంగానే (సాధారణంగా) ఉండే అవకాశం ఉందంటూ భారత వాతావరణ పరిశోధన శాఖ (ఐఎండీ) అందరిలో ఆశలు రేకెత్తించింది. లానినా పరిస్థితులుండటం ఇప్పటికి శుభసూచకమని పేర్కొంటూ ముందస్తు అంచనాలను మోసుకొచ్చింది. పసిఫిక్, హిందూ మహా సముద్రాల నుంచి అనుకూల వాతావరణం కనిపిస్తోందని వెల్లడించింది. ఈమేరకు మార్చి నెలకు సంబంధించి ఎల్‌నినో, లానినాల గమనం.. హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఐఓడీ) పరిస్థితులపై ప్రత్యేక సమాచారాన్ని వెలువరించింది. పసిఫిక్ మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎల్‌నినో ఉంటే వేడిమిని పెంచుతుంది. అవే ప్రాంతాల్లో లానినా పరిస్థితిని చల్లబరుస్తుంది. ఈ క్రమంలో రుతుపవనాలు అనుకూలంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నట్లు ఐఎండీ (పుణే) విశ్లేషణ బృందానికి చెందిన ఏ. కె. శ్రీవాస్తవ తెలిపారు.

కార్తి బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

దిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో బెయిలు కోసం కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం తనయుడు కార్తి చిదంబరం చేసుకున్న వినతిపై దిల్లీ హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. కార్తి పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఆయన బయటకొస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని సీబీఐ వాదించింది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన జస్టిస్ ఎస్. పి. గార్గ్.. తీర్పును వాయిదా వేశారు.

భాజపాకు కనీసం 110 స్థానాల మేర గండి!

- వచ్చే లోక్‌సభ ఎన్నికలపై శివసేన జోస్యం

ముంబయి: శివసేన తన మిత్రపక్షం భాజపాపై మరోసారి విరుచుకుపడింది. గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా పరాజయాన్ని.. 'అహంకారానికి దక్కిన ఓటమి'గా అభివర్ణించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత భాజపా బలం కనీసం 110 సీట్ల మేర తగ్గిపోతుందని చెప్పింది. మిత్రపక్షాలను వీడి, 'అబద్ధాల మార్గాన నడిచే' వారికి ఓటమి తప్పదని హెచ్చరించింది. "బుల్లి రాష్ట్రమైన త్రిపురను భాజపా గెల్చుకుంది. ఆ విజయోత్సాహాల్లో ఆ పార్టీ మునిగితేలుతుండగానే.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రెండు లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. త్రిపుర విజయాన్ని అది మసకబార్చింది. ఈ ఫలితాలు భాజపా శిబిరంలో ఆందోళనలు సృష్టించాయి. ఆ పార్టీకి గట్టి పట్టున్న గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ విజయకేతనం ఎగురవేసింది" అని శివసేన తన పత్రిక 'సామ్నా'లో సంపాదకీయాన్ని రాసింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 10 లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయని, వాటిలో 9 స్థానాల్లో భాజపా ఓటమిపాలైందని పేర్కొంది. "తొలుత భాజపాకు 282 మంది ఎంపీలు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 272కు పడిపోయింది" అని విమర్శించింది.

బలోపేతంపై దృష్టి పెట్టనే లేదు!

కొందరు సీపీఎం నేతల్లో ఆవేదన

దిల్లీ: అట్టడుగు స్థాయి నుంచి సీపీఎం సంస్థాగత బలోపేతంపై దృష్టిసారించకుండా పోయామన్న ఆవేదన, అభిప్రాయం కొందరు సీపీఎం నేతల్లో వ్యక్తమైంది. కమ్యూనిస్టేతర పార్టీలతో ఎన్నికల వ్యూహాల రచనపై సమయం అంతా వృధా అయిందే తప్ప సొంతపార్టీ బాగోగుల గురించి యోచించింది తక్కువేనని వారు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నిష్కర్షగా చెప్పేయాలనుకుంటున్నారు. పార్టీ బలహీనపడటానికి ఆయననే బాధ్యుడిని చేయాలని కూడా యోచిస్తున్నట్లు అభిజ్ఞవర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహన వ్యూహాల నేపథ్యంలో వామపక్ష ఓటర్లలో అయోమయం తలెత్తినట్లు కారాట్ భావిస్తున్నారు.

రాఫెల్ ఒప్పందంతో రూ. 36వేల కోట్ల నష్టం!

కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ధ్వజం

దిల్లీ: భాజపా ప్రభుత్వం కుదుర్చుకున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంతో దేశ ఖజానాకు రూ. 36 వేల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అసత్యాలు చెప్పినట్లు యుద్ధవిమానాల తయారీ సంస్థ, ఫ్రెంచి కంపెనీ డసాల్ట్ విడుదల చేసిన ధరలను బట్టి తెలుస్తోందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా యుద్ధ విమానాల కోసం భాజపా ప్రభుత్వం చెల్లించిన ధరను - యూపీఏ హయాంలో నిర్ణయించిన ధర, అలాగే ఖతర్ చెల్లించిన దాంతో పోలుస్తూ వివరించారు. ఒక్కో యుద్ధవిమానంపై రూ. 1100 కోట్లు అదనంగా చెల్లించినట్లు ఆరోపించారు.

రాహుల్ గాంధీ యువతంత్రం!

- పార్టీ పదవులన్నింట్లో యువతకు కోటా
- ఏఐసీసీ ప్లీనరీ ప్రారంభం

ఈనాడు, దిల్లీ: పార్టీ యంత్రాంగంలో నూతనోత్తేజాన్ని నింపేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చర్యలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సహా అన్ని స్థాయిల్లోనూ యువతకు కోటాను ఆయన ప్రతిపాదించే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ శుక్రవారం దిల్లీలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగే ప్లీనరీలో తొలి రోజు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆ పార్టీ శాసనసభా పక్షాల నేతలు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ అగ్రనేత సోనియాగాంధీ తదితరులు హాజరయ్యారు. ప్లీనరీలో ఆమోదించాల్సిన ముసాయిదా తీర్మానాలను సీనియర్ నేతలు శుక్రవారం రూపొందించారు. వీటిలో 2019 లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన రాజకీయ దార్శనిక పత్రం కూడా ఉన్నట్లు సమాచారం.

పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రాహుల్ గాంధీని యువ నాయకుడిగా కాంగ్రెస్ తెరపైకి తెస్తోంది. ప్రస్తుతం దేశ జనాభాలో యువత వాటా 65 శాతంగా ఉంది. అలాగని సీనియర్లకు అవకాశాలను మూసేయడంలేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాహుల్ బృందం.. యువ, సీనియర్ల మేళవింపుగా ఉంటుందని తెలిపాయి. పార్టీ పట్ల దీర్ఘకాలంగా అంకితభావాన్ని ప్రదర్శిస్తున్న కార్యకర్తలకు కీలక హోదాలను కట్టబెట్టాలని కూడా రాహుల్ గాంధీ భావిస్తున్నారు. సాధారణంగా కాంగ్రెస్ ప్లీనరీల్లో క్షేత్రస్థాయి కార్యకర్తలు.. ప్రసంగాలు వినడానికి, సీనియర్ నేతలు రూపొందించిన తీర్మానాలను ఆమోదించడానికే పరిమితమవుతుంటారు. "అయితే మండల, జిల్లా స్థాయి కార్యకర్తలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాలన్న రాహుల్ నిర్ణయానికి అనుగుణంగా.. ఈసారి ప్లీనరీలో వారికి మాట్లాడేందుకు అవకాశం దక్కనుంది. వారు సూచనలూ చేయవచ్చు. ఉపయోగపడతాయని భావిస్తే వాటిని అమలు చేస్తాం. శని, ఆదివారాల్లో రాహుల్ చేసే ప్రసంగంలో ఈ మేరకు సంకేతాలు ఉంటాయి" అని పార్టీ వర్గాలు తెలిపాయి.

యూపీఏకూ నాయకత్వం..

ఈ ప్లీనరీలో రాహుల్ గాంధీ లాంఛనంగా పూర్తిస్థాయి అధ్యక్ష బాధ్యతలను చేపడతారు. అయితే సాధ్యమైనంత త్వరగా యూపీఏ ఛైర్‌పర్సన్ పదవిని కూడా ఆయనకు అప్పగించాలని సోనియా గాంధీ భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, కాంగ్రెస్ అధ్యక్షుడి రాజకీయ సామర్థ్యంపై లోగడ విమర్శలు గుప్పించిన శరద్ పవార్, మమతా బెనర్జీ వంటి పలువురు విపక్ష నేతలు ఇప్పుడు క్రమంగా తన వైఖరిని మార్చుకోవడం ఇక్కడ ప్రస్తావనార్హం. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతిస్తోంది. విపక్షాల్లో ఆమోదయోగ్యుడైన నాయకుడిగా రాహుల్ గాంధీ స్థాయిని పెంచడానికి సోనియా ప్రయత్నిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఈ నెల 14న రాహుల్.. శరద్ పవార్‌తో భేటీ అయ్యారు. 'ప్లీనరీ తర్వాత డీఎంకే నేతలతో ఆయన సమావేశం కానున్నారు. రానున్న రోజుల్లో మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్‌తోను భేటీ అవుతారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు చెప్పారు.

మరోవైపు వచ్చేనెలలోనే కాంగ్రెస్-ఎన్‌సీపీ మైత్రిని పునరుద్ధరించే అవకాశం ఉంది. మహారాష్ట్రలో లోక్‌సభ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోనుంది.

'పొగ'బారుతున్న బాల్యం!

భారత్‌లో సిగరెట్లు తాగే పిల్లలు 6.25 లక్షల మందికి పైనే!

దిల్లీ: భారత్‌లో 6.25 లక్షల మందికిపైగా చిన్నారులు రోజూ సిగరెట్లు తాగుతున్నట్లు ఓ తాజా సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. పొగాకు ఉత్పత్తుల ఫలితంగా దేశవ్యాప్తంగా ప్రతివారం 17,887 మంది బలవుతున్నట్లు పేర్కొంది. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ, విటల్ స్ట్రేటజీస్‌లు సంయుక్తంగా 'గ్లోబల్ టొబాకో అట్లాస్' పేరున ఇటీవల ఈ నివేదికను విడుదల చేశాయి. ధూమపానం కారణంగా భారత్ రూ. 1. 8 లక్షల కోట్ల మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని నివేదిక వెల్లడించింది. ఇందులో వైద్య ఖర్చులు, ఉత్పత్తి నష్టాలు ఇమిడి ఉన్నట్లు తెలిపింది. ప్రపంచంలోని ఆరు అతిపెద్ద పొగాకు ఉత్పత్తుల సంస్థలు 2016లో 346 బిలియన్ అమెరికా డాలర్లు ఆర్జించాయనీ... ఇది భారత స్థూల జాతీయాదాయంలో 15 శాతానికి సమానమని నివేదిక పేర్కొంది.

సిగరెట్లు తాగేవారుసంఖ్య: బాలురు **4,29,500**, బాలికలు **1,95,500**, పురుషులు **9,03,42,900**, మహిళలు **1,34,66,600**,

★ ఇతర పొగాకు ఉత్పత్తులను వాడుతున్నవారు: **17,10,94,600** మంది.

★ 2016లో భారత్‌లో ఉత్పత్తయిన మొత్తం సిగరెట్లు: **8,211** కోట్లు.

తెలుగు భాషాభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలి

- హెచ్‌ఆర్‌డీ కార్యదర్శికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నిర్దేశం

ఈనాడు, దిల్లీ, ఈనాడు డిజిటల్, చెన్నై: తెలుగు భాషాభివృద్ధిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్ర మానవ వనరులమంత్రిత్వశాఖను నిర్దేశించారు. ఆశాఖ కార్యదర్శి రెడ్డిసుబ్రహ్మణ్యంను గురువారం సాయంత్రం తన నివాసానికి పిలిపించుకొని మాట్లాడారు. మైసూరులోని ప్రాచీన భాషల కేంద్రం నిర్దేశకుడి పదవిని వెంటనే భర్తీచేయాలని సూచించారు. తెలుగురాష్ట్రాల్లో ఎక్కడో చోట ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దిల్లీ జేఎన్‌యూలో తెలుగు భాషా విభాగాన్ని ఏర్పాటుచేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని నిర్దేశించారు. దాని ఉపకులపతితో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని వెంకయ్య కేంద్ర కార్యదర్శికి స్పష్టం చేశారు. నెల్లూరులో ఏర్పాటుచేసిన ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ విషయంలో సమస్య ఉందని రెడ్డిసుబ్రహ్మణ్యం చెప్పడంతో వెంకయ్య వెంటనే ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌తో మాట్లాడి సమస్య ఎక్కడుందో కనుక్కొని వెంటనే కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.



హిందుస్థాన్ విద్యాసంస్థల 50 వసంతాల సందర్భంగా ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తమిళనాడు గవర్నర్ పురోహిత్, రాష్ట్ర మంత్రి జయకుమార్, నిర్వాహకులు

నాణ్యమైన విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే వారికి ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విద్యావ్యవస్థ దేశంలోనే తమిళనాడులో అత్యుత్తమంగా ఉందన్నారు. చెన్నై నగరంలోని హిందుస్థాన్ గ్రూపు సంస్థల 50వ వార్షికోత్సవం ముగింపు వేడుకలు శుక్రవారం జరిగాయి. ఇందులో ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి ప్రసంగించారు. విద్య అంటే డిగ్రీలు మాత్రమే కాదని, మారుతున్న ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొవటానికి దోహదపడాలన్నారు.

వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిన పీఎన్‌బీ కుంభకోణం!

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణం మన వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక నిబద్ధమైన కార్పొరేట్ గవర్నెన్స్...మరింత పారదర్శకత, జవాబుదారితనం... తక్షణావసరాన్ని నొక్కి చెప్పిన పరిణామంగా పీఎన్‌బీ కుంభకోణాన్ని అభివర్ణించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సదస్సులో ఆయన మాట్లాడారు.

కేంద్ర, గిరిజన వర్సిటీల ఏర్పాటుపై చర్చ

- **హెచ్‌ఆర్‌డీ కార్యదర్శితో మంత్రి గంటా, హరిబాబు భేటీ**



కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యంతో భేటీ అయిన మంత్రి గంటా, ఎంపీ హరిబాబు

ఈనాడు, దిల్లీ: విభజన చట్టం ప్రకారం అనంతపురం, విజయనగరం జిల్లాల్లో తలపెట్టిన కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఇక్కడ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యంతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర భాజపా అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్‌లు పాల్గొన్నారు. ఈ రెండింటి ఏర్పాటుకూ ఆర్థికశాఖ వ్యయ విభాగం ఆమోద ముద్ర వేసిందని, కేబినెట్ నోట్ తయారుచేసి మిగతా శాఖల పరిశీలనకు పంపినట్లు కేంద్ర కార్యదర్శి వీరికి చెప్పారు. అవి వచ్చిన వెంటనే కేంద్ర కేబినెట్ ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పార్లమెంటులో బిల్లును అమోదించేంత వరకూ వేచిచూడకుండా తాత్కాలిక క్యాంపస్‌లోనైనా ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని గంటా, హరిబాబులు కేంద్ర కార్యదర్శిని కోరారు. ఆయన స్పందిస్తూ తాత్కాలిక క్యాంపస్‌లలో ఐఐటీ, ఎన్ఐటీ తరగతులు ప్రారంభించడం సాధ్యమవుతుందన్నారు. విశ్వవిద్యాలయాలకు అలాంటి ఆనవాయితీ లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక వసతి ప్రతిపాదనలు పంపితే సానుకూల నిర్ణయం తీసుకుంటామని సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన అయిదు జాతీయ ఉన్నత విద్యాసంస్థలకు సరైన రీతిలో నిధులు అందడంలేదని, వాటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి గంటా, సుబ్రహ్మణ్యంను కోరారు. ఉన్నత విద్యాసంస్థల నిధి నుంచి వీటికి నిధులు అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది. రూ.500 కోట్ల వరకు మంత్రిత్వశాఖలోనే నిర్ణయం తీసుకోవచ్చుని, అంతకు మించితే బోర్డు దృష్టికి వెళ్లాలని చెప్పినట్లు సమాచారం. గురువారం ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కేంద్రమంత్రి ప్రకాశ్‌జావ్‌డేకర్‌తో ఈ రెండు అంశాలపై మాట్లాడారని, త్వరగా నిర్ణయం తీసుకుంటామని హామీఇచ్చారని హరిబాబు పేర్కొన్నారు.

29న జీఎస్‌ఎల్‌వీ ప్రయోగం

షార్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు



షార్‌లో సాగుతున్న జీఎస్ఎల్‌వీ అనుసంధాన ప్రక్రియ

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈనెల 29న జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 వాహక నౌకను నింగిలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలిస్తే ఆరోజు సాయంత్రం 4.56 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ వాహక నౌక ద్వారా జీశాట్-6ఎ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే బెంగళూరు నుంచి జీశాట్-6ఎ ఉపగ్రహం షార్‌కు చేరింది. వాహక నౌక రెండో దశ పనులు కూడా పూర్తికావచ్చాయి. ప్రస్తుతం క్రయోదశ పనులు జరుగుతున్నాయి.

ఏప్రిల్ 12న పీఎస్‌ఎల్‌వీ-సీ41 ప్రయోగం

వచ్చేనెల 12వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ-సీ41 రాకెట్ ప్రయోగానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఐ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు.

జర్నలిస్టులకు గృహ యోగం!

- **నిర్మాణాలకు రూ.100 కోట్లు**
- **సభలో ప్రకటించిన ఆర్థిక మంత్రి**

ఈనాడు డిజిటల్, అమరావతి: జర్నలిస్టులకు గృహ నిర్మాణానికి రూ.100 కోట్లను ప్రాథమికంగా కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో ఆయన శుక్రవారం ఈ ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సమాచార లోపంతో బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని చూపించలేకపోయినట్లు వివరించారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోని పక్షంలో మరో విడత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పాత్రికేయులకు గృహ నిర్మాణంలో ఎంత రాయితీ ఇవ్వాలన్న దానిపై.. ఇళ్ల నిర్మాణాల విధివిధానాల రూపకల్పనకు ఏర్పాటైన కమిటీ చర్చించి నిర్ణయిస్తుందన్నారు. గృహ నిర్మాణంలో ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రాయితీలకు అదనంగా సమాచారశాఖ ద్వారా మరింత లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశాల్లోనే కమిటీ సమావేశమై విధివిధానాలను రూపొందిస్తుందని వివరించారు. **రాయలసీమలో హైకోర్టు బెంచ్:** రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి శాసనమండలిలో ప్రకటించారని మంత్రి కాలువ శ్రీనివాసులు తెలిపారు.

నిధుల కేటాయింపుపై ఏపీడబ్ల్యూజేఎఫ్ హర్షం



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు. చిత్రంలో మంత్రి కాలవ శ్రీనివాసులు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న పాత్రికేయుల గృహవసతి కోసం ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించడంపై ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య(ఏపీడబ్ల్యూజేఎఫ్) హర్షం వ్యక్తంచేసింది. సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సమాచారశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే గృహవసతికి సంబంధించి విధివిధానాల రూపకల్పనకు కమిటీ ఏర్పాటైనందున త్వరగా ఆ ప్రక్రియ పూర్తిచేసి.. పాత్రికేయుల సొంతింటి కలను సాకారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎర్రచందనం కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు

తిరుపతి(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో నిందితులకు నూతన చట్టం ద్వారా శిక్షలు వేయడం మొదలైంది. తిరుపతి అదనపు సహాయ సెషన్సు న్యాయమూర్తి టి.రామచంద్రుడు శుక్రవారం ఓ నిందితునికి అయిదేళ్ల జైలుశిక్ష, రూ.3లక్షలు జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.వెంకటనారాయణ తెలిపిన మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా నాయక్‌నేరి గ్రామానికి చెందిన కుప్పన్ షణ్ముగం 2016 జూన్ 26న ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. నూతన చట్టం కింద నిందితుడిపై మొదటి కేసు నమోదుచేశారు.

బీసీలను ఏబీసీడీఈ విభాగాలుగానే ఉంచాలి

- **జాతీయ బీసీ కమిషన్ ఛైర్‌పర్సన్ రోహిణికి బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడి వినతి**

ఈనాడు, దిల్లీ: బీసీలను ఎ, బి, సి, డి, ఇ వర్గాలుగానే ఉంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. అలా కాక బీసీ, ఎంబీసీ, ఈబీసీ అని వర్గీకరిస్తే అది రాజ్యాంగ విరుద్ధమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జాతీయ బీసీ కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ రోహిణిని కలిసి బీసీ వర్గీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని ప్రతిపాదనలను సమర్పించారు. ఈ వివరాలను తర్వాత ఆయన పత్రికలకు విడుదల చేశారు. ''ఓబీసీలను ఉపవర్గీకరణ చేయాలన్న ప్రధాని నిర్ణయం ద్వారా ఓబీసీల్లోని 2,600 కులాలకూ న్యాయం జరుగుతుంది. దీనికి ముందుగా కేంద్రం చేసిన కులగణన వివరాలను విశ్లేషించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన సామాజిక-ఆర్థిక సర్వే, కులగణన వివరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.

రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఉపవర్గీకరణ చేయాలి. బీసీలను ఉప వర్గాలుగా విభజించాక ఒక ఉప వర్గంలో కోటా మేరకు లబ్ధిదారులకు రిజర్వేషన్ వర్తింపజేయగా మిగిలిన అవకాశాలను మరో బీసీ ఉపవర్గానికి బదలాయించాలి. అంతేతప్ప వాటిని రద్దుచేయడం, పక్కనపెట్టడం వంటివి చేయకుండా చూడాలి'' అని కోరారు.





తితిదే నిఘా సిబ్బంది స్వాధీనం చేసుకున్న పిస్టల్, కత్తి ★ సుబ్రమణి

అలిపిరి తనిఖీ కేంద్రంలో.. కర్ణాటకవాసి నుంచి నకిలీ తుపాకీ స్వాధీనం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి సమీపంలోని అలిపిరి తనిఖీ కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఒక వ్యక్తి నుంచి నకిలీ తుపాకి, చాకును తితిదే నిఘా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు నడిచి వెళ్లే మార్గంలోని లగేజీ తనిఖీ కేంద్రం వద్ద కర్ణాటకకు చెందిన సుబ్రమణి అనే వ్యక్తి సంచిలో ఈ నకిలీ తుపాకిని గుర్తించారు. సమాచారం అందుకున్న తితిదే ముఖ్య నిఘా, భద్రతాధికారి ఆకె రవికృష్ణ ఈ తనిఖీ కేంద్రానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేశారు. అనంతరం తిరుమల టూటౌన్ పోలీసులకు దాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల భద్రత దృష్ట్యా మారణాయుధాలు, నిషేధిత వస్తువులను తిరుమలకు తీసుకురాకూడదన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రవరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో కలకలం

వైకాపా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేతిసంచిలో తూటాలు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోని శాసనసభ్యుడు సాయిప్రసాద్‌రెడ్డి వద్ద నాలుగు తూటాలు లభించడంతో శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో కలకలం రేగింది. ఆర్జీఐఏ ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. వైకాపా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వ్యక్తిగత పనిమీద థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో బ్యాంకాక్ వెళ్లేందుకు శుక్రవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. సీఐఎస్ఎఫ్ భద్రతాధికారుల తనిఖీలో ఆయన చేతిసంచిలో నాలుగు పాయింట్ 32ఎంఎంతూటాలు లభించడంతో వాటిని స్వాధీనంచేసుకోవడంతోపాటు ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసుల విచారణలో తూటాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉన్నట్లు తేలడంతో ఎమ్మెల్యేను వదిలిపెట్టారు. అనుమతులున్న ఆయుధాలను, తూటాలను విదేశాలకు తీసుకెళ్లాలంటే విమానాశ్రయభద్రతాధికారులకు ధ్రువీకరణపత్రాలను చూపించాలని, తద్వారా వారు వాటినిసామగ్రిలో పెట్టుకోవడానికి అనుమతిస్తారన్నారు. చేతి సంచిలో పెట్టుకోవడం నిబంధనలకు విరుద్ధమని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతుల జీవోపై ఏపీ, తెలంగాణలకు 'సుప్రీం' నోటీసులు

ఈనాడు, దిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతుల పరంగా ఇచ్చిన జీవో.502పై సుప్రీంకోర్టు నిలుపుదల(స్టే) నోటీసులు జారీ చేసింది. పదోన్నతుల్లో సీనియర్లకు అన్యాయం జరిగిందంటూ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కొందరు సబ్ కలెక్టర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పుపై స్టే విధించాలంటూ మరో పిటిషన్ వేశారు. వీటిపై జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ అభయ్‌మనోహర్ సప్రేలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎం.ఎన్.రావు, అల్లంకి రమేశ్, రవి వాదనలు వినిపించారు. జీవో నంబరు.502 అందరికీ వర్తిస్తుందని ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే, 1980-92 మధ్య డిప్యూటీ తహసీల్దార్లుగా చేరి 1995-96 సీనియారిటీ జాబితాలో ఉన్నవారికి అది వర్తించదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో ధర్మాసనం.. పిటిషనర్ల అభ్యంతరాలపై కౌంటరు దాఖలు చేయాలని, స్టే ఎందుకు విధించకూడదో తెలపాలని ఆదేశిస్తూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు, జీవో నంబరు.502 ద్వారా పదోన్నతులు పొందినవారికి నోటీసులు జారీ చేసింది.

పిడుగుపడి ఇద్దరు కార్మికుల మృతి

ప్రకాశం జిల్లాలో విషాదం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఆర్ఎల్‌పురం పంచాయతీ పరిధిలోని పెరల్ గ్రానైట్ క్వారీలో పిడుగు పడి ఇద్దరు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం సాయంత్రం క్వారీ డంప్‌యార్డులో జాకీలతో రాళ్లకు రంధ్రాలు చేస్తున్న సమయంలో పిడుగు పడటంతో.. ఒడిశాకు చెందిన కాలుచరణ్ భిషోయి(33), బ్రహ్మర సేథీ (42) అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిని చీమకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు స్థానిక వైద్యులు చెప్పారు.

పీజీఈసెట్ - పీఈసెట్ నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, అమరావతి: ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీలలో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ పీజీఈసెట్-2018 నోటిఫికేషన్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. రూ.2 వేల అపరాధ రుసుముతో మే 4 వరకు దరఖాస్తులకు గడువు కల్పించారు. ప్రవేశ పరీక్షను మే 10 నుంచి 12వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు రుసుముగా రూ.1000, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.500 చెల్లించాలని కన్వీనర్ వెల్లడించారు.

★ ఏపీ వ్యాయామ విద్య ఉమ్మడి ప్రవేశ పరీక్ష-2018 నోటిఫికేషన్‌ను ఆచార్య నాగార్జున వర్సిటీ విడుదల చేసింది. ఏప్రిల్ 22 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే4వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుము రూ.850 కాగా..ఎస్సీ, ఎస్టీలకు రూ.650గా నిర్ణయించారు.

సెన్సెక్స్ ▼ 510 **33176** | నిఫ్టీ ▼ 165 **10195** | డోజోన్స్ 24,958 ▲ 85 | నాస్‌డాక్ 7477 ▼ 04 | రూపాయి 64.94 ▼ (ఒక అమెరికా డాలరుకు) 01 పైసా | ముడి చమురు 66.17 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)		
నిఫ్టీ	16న	మార్పు %
HCL TECH	967.60	0.88
M & M	740.75	0.80
WIPRO	295.75	0.80
TECH MAHINDRA	634.70	0.45
YES BANK	312.90	0.34
AUROBINDO PHA	572.55	0.04


గ్రహణం (-)		
నిఫ్టీ	16న	మార్పు %
COAL INDIA	278.20	-5.85
ULTRATECH CEM	4026.30	-3.89
INDIAN OIL CORP	184.75	-3.80
TATA MOTORS	339.75	-3.78
ASIAN PAINTS	1122.75	-3.28
BPCL	447.55	-3.14
AMBUJA CEM	234.75	-3.12

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	59.10	68.53	బహ్రెయిన్ దీనార్	160.05	183.41
పౌండ్ స్టెర్లింగ్	82.33	95.50	కువైట్ దీనార్	179.07	222.92
యూరో	72.74	84.37	ఒమన్ రియాల్	156.73	179.31
జపనీస్ యెన్/100	55.77	64.69	సౌదీ రియాల్	15.71	18.62
ఆస్ట్రేలియా డాలరు	46.03	53.26	యూఏఈ దిర్హమ్	16.08	18.80
సింగపూర్ డాలరు	44.19	53.25	మలేషియా రింగిట్	14.74	18.13
థాయ్ బాత్/100	189.32	226.43	చైనీస్ యువాన్	7.26	11.77



అవిశ్వాసం హడలెత్తించగా..

● భారీగా క్షీణించిన మార్కెట్లు ● సెన్సెక్స్‌కు 510 పాయింట్ల నష్టం ● తోడైన వాణిజ్య యుద్ధం భయాలు

● అన్ని రంగాల షేర్లకు అమ్మకాలు ● రూ.1.86 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి

నష్టాల విషయంలో వారానికో రికార్డును సెన్సెక్స్ బద్దలుకొడుతోంది. వారం ప్రారంభంలో విశ్వాసం నింపిన మార్కెట్.. చివర్లో మాత్రం హడలెత్తించింది. ఒకవైపు రాజకీయ అనిశ్చితి, మరోవైపు వాణిజ్య యుద్ధ భయాలతో సూచీలు బేర్ గుప్పిట్లోకి చేరాయి. ఆసియా, ఐరోపా మార్కెట్లూ సైతం డీలాపడటంతో నష్టాలు ఏరులై పారాయి. సూచీలు మరోసారి కీలక మద్దతు స్థాయిలను కోల్పోవడంతో రూ.1.86 లక్షల కోట్లు సంపద హరించుకుపోయింది.

శుక్రవారం మార్కెట్లు మదుపర్లకు చుక్కలు చూపించాయి. ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగడంతో పాటు అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు తెలుగుదేశం పార్టీ ప్రకటించడం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలతో ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ ఆందోళనల ప్రభావం మన సూచీలపై సైతం పడింది. ఫలితంగా అన్ని రంగ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇక వరుసగా మూడో వారం సూచీలు డీలాపడ్డాయి. సెన్సెక్స్ 131.14 పాయింట్లు, నిఫ్టీ 31.70 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. మార్కెట్ల పతనం నేపథ్యంలో మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.86 లక్షల కోట్లు ఆవిరై రూ.143.17 లక్షల కోట్లకు చేరింది.



సమీక్ష

నిఫ్టీ 10200 దిగువకు: సెన్సెక్స్ ఉదయం 33,685.86 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. అమ్మకాల వెల్లువతో బలహీనపడిన సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 33,119.92 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్... చివరకు 509.54 పాయింట్ల నష్టంతో 33,176 దగ్గర స్థిరపడింది. ఫిబ్రవరి 6 తర్వాత సూచీ నమోదు చేసిన అత్యధిక ఒకరోజు నష్టం ఇదే కావడం గమనార్హం. ఇక నిఫ్టీ సైతం కీలకమైన 10,200 పాయింట్ల దిగువకు చేరింది. ఒకానొకదశలో 10,180.25 వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 165 పాయింట్లు కోల్పోయి 10,195.15 వద్ద ముగిసింది.

✦ జేపీ అసోసియేట్స్ షేర్లు మాత్రం దుమ్మురేపాయి. మూడు కోట్ల కంపెనీ షేర్లను దిగ్గజ మదుపరి రాకేశ్ ఝున్‌ఝున్‌వాలాకు చెందిన రేర్ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేయడంతో ఇంట్రాడేలో 15 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 9.14 శాతం లాభంతో రూ.20.90 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు చవిచూశాయి. టాటా మోటార్స్ 3.67%, ఏషియన్ పెయింట్స్ 3.06%, అదానీ పోర్ట్స్ 2.89%, హీరో మోటోకార్ప్ 2.67%, ఎన్‌టీపీసీ 2.65%, సన్‌ఫార్మా 2.63%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.45%, ఓఎన్‌జీసీ 2.26%, హెచ్‌డీఎఫ్‌సీ 2.15%, ఎల్ అండ్ టీ 2.12%, డాక్టర్ రెడ్డీస్ 2.07%, ఐటీసీ 1.85% చొప్పున నష్టాలు నమోదు చేశాయి. ఎం అండ్ ఎం, విప్రో, యెస్ బ్యాంక్ షేర్లు మాత్రం స్వల్పంగా రాణించాయి. రంగాల వారీ సూచీల్లో లోహ, చమురు- గ్యాస్, ఇంధన, పీఎస్‌యూ, విద్యుత్, బ్యాంకింగ్‌లు 2.30 శాతం వరకు నీరసపడ్డాయి. బీఎస్ఈలో 36 షేర్లు 52 వారాల గరిష్ఠానికి చేరగా, 108 షేర్లు ఏడాది కనిష్ఠానికి పడిపోయాయి. బీఎస్ఈలో మొత్తం 1,835 షేర్లు క్షీణించగా, 859 స్క్రిప్‌లు పెరిగాయి. 154 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

నెల జీతంలో 11% పొదుపు

● సంపద సృష్టికి యువత ప్రాధాన్యం

● సేవ్‌అభి సర్వే వెల్లడి

దిల్లీ: పొదుపు మార్గం ద్వారా సంపద సృష్టికి యువత (మిలీనియల్స్) ప్రాధాన్యం ఇస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 22-30 ఏళ్ల మధ్య వయసున్న వారిని మిలీనియల్స్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక- సాంకేతిక సేవల అంకుర సంస్థ సేవ్‌అభి ఈ సర్వేను నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం నెల జీతం రూ.25,000 లోపు ఉన్నవారు 11 శాతాన్ని పొదుపు కోసం కేటాయిస్తున్నారు. ఆదాయం రూ.25,000- 50,000 మధ్య ఉంటే 7.9%, రూ.50,000 మించితే 8.1% చొప్పున పొదుపునకు వినియోగిస్తున్నారు. ఈ మూడు ఆదాయ వర్గాల వారు ఇంటి అద్దె కోసం వరుసగా 35%, 21.5%, 33.5% చొప్పున వెచ్చిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. భోజనం, విహారానికి 12.3%, 21%, 11% మేర ఖర్చు చేస్తున్నట్లు తేలింది. 5,000 మంది మిలీనియల్స్‌పై ఈ సర్వేను సేవ్ అభి నిర్వహించింది. అయితే పొదుపు చేస్తున్నవారిలో 97 శాతం మంది మగవారేనని సర్వే వెల్లడించింది. 'యువత వర్తమానంలో జీవించడం తప్ప భవిష్యత్ కోసం డబ్బును దాచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వరనే విషయం తప్పు అని సర్వే తేల్చింద'ని సేవ్‌అభి వ్యవస్థాపకుడు ప్రియాంక్ భర్త్వాల్ తెలిపారు. విక్రమ్ మల్హోత్రాతో కలిసి ఈ అంకురాన్ని ఆయన నెలకొల్పారు. వీరికి ఆర్థిక- సాంకేతికత సేవల రంగంలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించే ఉద్దేశంతో పొదుపు, వ్యయాలను అనుసంధానిస్తూ 'సేవ్ ద ఛేంజ్' పేరుతో వినూత్న విధానాన్ని సేవ్‌అభి ప్రవేశపెట్టింది. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చేసే డిజిటల్ చెల్లింపుల రూపంలో జరిపే చెల్లింపులన్నీ వ్యయాల విభాగంలో కనిపిస్తాయి.

'కోరమాండల్' డివిడెండు 300%

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ బోర్డు మదుపర్లకు 300 శాతం మధ్యంతర డివిడెండును సిఫారసు చేసింది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.3 డివిడెండు చెల్లించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 3 తర్వాత డివిడెండు చెల్లింపు ఉంటుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

మార్కెట్ కబుర్లు

✦ మార్చి 31తో ముగిసే ఆర్థిక సంవత్సరం, త్రైమాసిక ఆర్థిక ఫలితాల పరిశీలన, ఆమోదం నిమిత్తం వచ్చే నెల 12, 13 తేదీల్లో **ఇన్ఫోసిస్** బోర్డు సమావేశం నిర్వహించనుంది.

✦ మధ్యప్రదేశ్‌లో రహదారి ప్రాజెక్టు నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ నుంచి రూ.1,004 కోట్ల విలువైన ఆర్డరు **దిలీప్ బిల్డ్‌కాన్‌**కు లభించింది.

✦ గత నెలలో **ఫోర్టిస్ హెల్త్‌కేర్‌**లో కొనుగోలు చేసిన 17% వాటాలో 2.17 శాతాన్ని విక్రయించినట్లు **యెస్ బ్యాంక్** తెలిపింది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర డివిడెండు కింద రూ.6 చెల్లించేందుకు (300%) **హిందుస్థాన్ జింక్** బోర్డు సిఫారసు చేసింది. డివిడెండు చెల్లింపునకు రూ.3,051 కోట్లు వెచ్చించనున్నట్లు బీఎస్ఈకి సమాచారమిచ్చింది.

✦ ఈస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ నిమిత్తం డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీఎఫ్‌సీసీఐఎల్) నుంచి రూ.2,864 కోట్ల విలువైన ఆర్డరును పొందినట్లు **ఎల్‌అండ్‌టీ** వెల్లడించింది.

✦ ఉక్కు చక్రాల సరఫరా నిమిత్తం ఐరోపా కూటమి (ఈయూ) నుంచి మరో భారీ ఆర్డరును చేజిక్కించుకున్నట్లు **స్టీల్ స్ట్రిప్స్ వీల్స్** తెలిపింది.

✦ జమ్మూ-కశ్మీర్‌లో రహదారి నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ నుంచి రూ.939.41 కోట్ల కాంట్రాక్టు లభించిందని **రాంకీ ఇన్‌ఫ్రా** తెలిపింది.

✦ తమిళనాడులో రహదారి విస్తరణ పనుల నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ నుంచి మొత్తంగా రూ.3,492 కోట్ల విలువైన ఆర్డరును **ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** డెవలపర్స్ దక్కించుకుంది.

✦ **బంధన్ బ్యాంక్** తొలి పబ్లిక్ ఆఫర్ రెండో రోజు ముగిసేనాటికి 88 శాతం షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా 8,34,96,347 షేర్లను విక్రయానికి ఉంచగా.. 7,36,14,520 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. 19న (సోమవారం) ఇష్యూ ముగుస్తుంది.

✦ **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్** తన మధ్యంతర డివిడెండ్‌ను కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు దిల్లీలో అందించింది. రూ.2.62 కోట్ల మొత్తానికి చెక్కును సంస్థ ఛైర్మన్ ఎం.వి.గౌతమ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గురువారం సాయంత్రం కేంద్ర మంత్రికి అందజేశారు.

డిసెంబరుకు 200 విక్రయశాలలు



● రూ.500 కోట్ల టర్నోవరు లక్ష్యం ● కర్ణాటకలోకి అడుగు పెట్టే యోచన

● విజయనగరంలో 'బీ న్యూ మొబైల్స్' 50వ విక్రయ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: గొలుసుకట్టు విక్రయ కేంద్రాల ద్వారా మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్న 'బీ న్యూ మొబైల్స్' కంపెనీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీగా విక్రయ కేంద్రాలను విస్తరించనుంది. 2018, డిసెంబరు నాటికి కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లో 50, తెలంగాణలో 100 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు బీ న్యూ మొబైల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.డి.బాలాజీ చౌదరి తెలిపారు. కంపెనీ 50వ విక్రయ కేంద్రాన్ని విజయనగరంలో శనివారం ప్రారంభిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. దీనికి సినీనటి తమన్నా ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి మొత్తం విక్రయ కేంద్రాల సంఖ్య రెండు వందలకు చేరుతుందన్నారు. ఫ్రాంఛైజీ విధానంలో కాక సొంతంగానే అన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 2019-20లో కర్ణాటకలోకి అడుగుపెట్టే ఆలోచన ఉన్నట్లు చెప్పారు. ఒక్కో విక్రయం కేంద్రం ఏర్పాటుకు సగటున రూ.50 లక్షలు ఖర్చవుతుంది. విస్తరణకు అవసరమైన నిధులను బ్యాంకుల ద్వారా సమకూర్చుకోనున్నామని, ఇప్పటికే ఎస్‌బీఐ నుంచి రూ.20 కోట్ల రుణాలు పొందామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యాపార టర్నోవరు రూ.250 కోట్లకు చేరగలదని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్ల టర్నోవరును లక్ష్యంగా పెట్టుకున్నామని బాలాజీ చౌదరి చెప్పారు. రూ.499 నుంచి రూ.లక్ష విలువైన అన్ని రకాల బ్రాండ్ల ఫోన్లు బీ న్యూ మొబైల్స్ విక్రయకేంద్రాల్లో లభ్యమవుతాయన్నారు. మొబైల్ ఫోన్లతో పాటు లాప్‌టాప్‌లు, ట్యాబ్‌లను విక్రయిస్తున్నామని, భవిష్యత్తులో సీసీ కెమేరాలు, బీపీ, షుగర్ పరీక్ష పరికరాలు, ఎల్ఈడీ ప్రొజెక్టర్లు మొదలైనవి కూడా విక్రయించనున్నామన్నారు.

స్థానిక యువతకు ఉపాధి: లక్ష జనాభా మించిన ప్రతి పట్టణంలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్నది తమ లక్ష్యమని, ఒక్కో విక్రయం కేంద్రం ఏర్పాటు వల్ల 10 మందికి ఉపాధి లభిస్తుందని బాలాజీ చౌదరి చెప్పారు. 'స్మార్ట్ ఫోన్ల వినియోగంపై శిక్షణ పొందిన బీ న్యూ మొబైల్స్ విక్రయ కేంద్రాల్లోని సిబ్బంది గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఫోన్ల విక్రయంతో పాటు విక్రయానంతర సేవల ద్వారా ఖాతాదారుల సంఖ్యను పెంచుకోవాలని భావిస్తున్నా'మన్నారు.

విక్రయ కేంద్రాలకు ఢోకా లేదు..

ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్నప్పటికీ.. సాధారణ విక్రయ కేంద్రాల ద్వారా మొబైల్ ఫోన్ల విక్రయాలు కొనసాగుతాయని, 2020 నాటికి 5జీ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నందున భవిష్యత్తులో మొబైల్ ఫోన్ల పరిశ్రమ వృద్ధి కొనసాగించగలదని బాలాజీ అన్నారు. ఎక్కువ మంది వినియోగదారులు ఫోన్లను కళ్లతో చూసి, తాకి మాత్రమే కొనుగోలు చేయడానికి ఇష్టపడతారని.. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి విక్రయానంతర సేవలు అంతగా అందుబాటులో ఉండవన్నారు. ఇప్పటికీ 70 శాతం స్మార్ట్ ఫోన్ల విక్రయాలు సాధారణ విక్రయ కేంద్రాల ద్వారానే జరుగుతున్నాయని వివరించారు. సామాజిక మీడియా విస్తరణ స్మార్ట్ ఫోన్ల కొనుగోళ్లను పెంచడానికి బాగా దోహదం చేస్తోందని, పెద్ద నోట్ల రద్దు తర్వాత స్మార్ట్ ఫోన్ల కొనుగోళ్లు ఆకర్షణీయంగా పెరిగాయని చెప్పారు.




బీ న్యూ మొబైల్స్ ఛైర్మన్ బాలాజీ చౌదరి

హెచ్‌సీఎల్ టెక్



రూ.960 వద్ద ప్రారంభమై రూ.947.05- 979.55 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.959.15తో పోలిస్తే రూ.8.45 (0.88%) లాభంతో రూ.967.60 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 47,41,036.

కోల్ ఇండియా



రూ.280.30 వద్ద మొదలై రూ.276.20- 281.40 మధ్య చలించి క్రితం ముగింపు రూ.295.50తో పోలిస్తే రూ.17.30 (5.85%) నష్టంతో రూ.278.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 1,10,16,304 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)			
హెచ్ఈజీ	3310.00	శారదా క్రాప్‌కెమ్	371.00
టీవీ టుడే నెట్‌వర్క్	557.95	గ్రేట్ ఈస్ట్రన్ షిప్పింగ్	346.00
కేపీఐటీ టెక్నాలజీస్	232.70	టాటా మోటార్స్	338.40
52 వారాల కనిష్ఠం (రూ.లలో)		సీఎల్ ఎడ్యుకేట్	195.00
ఇక్రా	3599.00	ఐటీసీ	183.50
మాక్స్ ఫైనాన్షియల్	442.85	మెక్‌లాయిడ్ రసెల్	147.45

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
16/03	14,025	14,175	–150	4,486	5,256	–771
15/03	4,248	4,953	–705	3,113	2,857	256
14/03	4,094	4,353	–259	2,674	3,106	–432
12/03	5,309	4,934	375	2,918	3,382	–464

16న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
17వ తేదీకి		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 370.50 (382.15) 4972566
AMBUJA CEMEN 234.75 (242.30) 3348952
ASIAN PAINTS 1122.75 (1160.80) 1946844
AUROBIND PHA 572.55 (572.30) 3887454
AXIS BANK LT 522.60 (529.65) 12146623
BAJAJ AUTO L 2910.45 (2948.75) 338593
BAJAJ FINANC 1687.90 (1726.25) 1017699
BHARTI AIRTE 416.75 (420.45) 7237424
BHARTI INFRA 334.45 (337.90) 3780358
BOSCH LTD 17921.70 (18025.20) 49848
BPCL 447.55 (462.05) 6147327
CIPLA 559.40 (571.15) 1867538
COAL INDIA L 278.20 (295.50) 11016304
DR. REDDYS 2142.15 (2182.75) 594361
EICHER MOTOR 28079.15 (28695.55) 53436
GAIL 441.00 (450.35) 2916519
HCL TECH 967.60 (959.15) 4741036
HDFC 1791.40 (1830.00) 8008654
HDFC BANK 1853.00 (1880.80) 1974084
HERO MOTOCOR 3546.10 (3640.80) 462796
HINDALCO IND 221.70 (224.90) 7793461
HINDUSTAN UN 1299.15 (1299.95) 3646692
HPCL 364.75 (371.55) 5571154
ICICI BANK 298.10 (301.45) 28835112
INDIABULLS H 1207.45 (1237.95) 1665775
INDIAN OIL 184.75 (192.05) 18690374
INDUSINDBANK 1724.70 (1741.75) 2412430
INFOSYS LTD 1171.90 (1182.50) 8977413
ITC 260.50 (265.55) 20680532
KOTAK MAHIND 1060.75 (1085.65) 2724910
LARSEN & TOU 1269.30 (1295.10) 5152611
LUPIN 761.85 (776.65) 1419793
M&M 740.75 (734.85) 4929069
MARUTI SUZIK 8676.55 (8837.55) 622932
NTPC LTD 164.85 (169.90) 12378708
ONGC 177.15 (180.30) 8194541
POWER GRID C 192.25 (194.80) 5835262
RELIANCE IND 900.05 (911.80) 14087564
SBI 252.30 (253.70) 25728297
SUN PHARMA 503.05 (516.45) 8924919
TATA CONSULT 2825.70 (2869.70) 3598741
TATA MOTORS 339.75 (353.10) 14205582
TATA STEEL L 600.20 (611.75) 11739582
TECH MAHINDR 634.70 (631.85) 3741772
ULTRATECH 4026.30 (4189.40) 527458
UPL LIMITED 719.70 (721.15) 2219725
VEDANTA LIMI 308.90 (316.95) 13398137
WIPRO 295.75 (293.40) 4834160
YES BANK LTD 312.90 (311.85) 17094363
ZEE ENTERTAI 570.35 (570.40) 2562954

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1336.80 (1373.10) 101855
ACC 1567.95 (1603.15) 253481
ASHOK LEYLAN 147.15 (150.55) 14963488
AVENUE SUPER 1365.80 (1359.80) 1177277
BAJAJ FINSER 5011.35 (5034.50) 178245
BANK OFBAROD 143.80 (143.75) 12380055
BEL 149.20 (151.30) 3598901
BHEL 86.40 (87.05) 10466068
BRITANNIA 4860.60 (4868.25) 151921
CADILA HEALT 379.10 (385.10) 837492
COLGATE PALM 1044.45 (1042.35) 306314
CONTAINER 1208.50 (1243.25) 349971
CUMMINS INDI 765.65 (783.00) 263162
DABUR INDIA 321.25 (325.05) 2715500
DLF LIMITED 226.30 (225.45) 10153974
EMAMI LIMITE 1022.00 (1050.05) 195770
GLAXOSMI CON 6516.60 (6521.75) 45587
GLAXOSMI PHA 2228.25 (2291.55) 21053
GLENMARK PHA 546.20 (553.80) 809649
GODREJ CONSU 1056.00 (1072.90) 1426673
HAVELLS INDI 516.60 (520.75) 1499134
HINDUSTAN ZI 314.90 (318.45) 6325044
ICICI PRU LI 377.95 (382.80) 783421
IDEA CELLULR 81.05 (80.15) 16944291
INTERGLOBE A 1263.45 (1265.70) 2558830
JSW STEEL LT 290.25 (295.15) 7106321
LIC HOUS.FIN 513.45 (523.20) 1455054
MARICO LIMIT 301.25 (301.10) 2642597
MCDOWELL 3121.55 (3189.35) 447479
MOTHERSON 307.45 (314.05) 4726244
MRF 70211.65 (71737.95) 4914
NHPC LTD 26.60 (26.80) 12360523
NMDC LTD 126.30 (124.30) 5286921
OIL INDIA 337.25 (337.70) 595571
ORACLE FIN S 3888.35 (3922.70) 37305
P&G HYG&HEAL 9427.50 (9449.00) 28155
PETRONET LNG 235.00 (237.40) 3572839
PIDILITE IND 916.30 (909.55) 732530
PIRAMAL ENTE 2491.75 (2450.85) 439822
PNB 98.85 (98.55) 55339873
POWER FIN CO 88.00 (88.05) 15307224
RURAL ELEC C 128.50 (128.95) 5717105
SAIL 72.85 (75.30) 11625680
SHREE CEMENT 16424.40 (16815.65) 33975
SHRIRAM TRAN 1445.80 (1460.65) 1234375
SIEMENS 1105.10 (1132.60) 205258
SUN TV LTD 903.15 (920.70) 2564212
TATA POWER 79.95 (80.25) 9813941
TITAN IND 879.25 (872.50) 2538310
TORRENT PHAR 1268.45 (1279.80) 187781

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 162.25 (165.20) 465390
ADANI ENTERP 160.50 (167.05) 12405008
ADANI POWER 27.30 (28.10) 14419571
ALL BANK 51.15 (51.00) 8838442
AMARA RAJA 782.50 (793.75) 539427
ANANT RAJIND 54.00 (55.75) 947903
ANDHRA BANK 42.20 (42.95) 13296598
APOLLO HOSPI 1071.65 (1096.00) 384296
APOLLO TYRES 265.65 (266.45) 3241898
APTECH 307.40 (311.55) 407883
BAJAJ ELECT. 586.35 (612.45) 572141
BAJAJ HIND 10.35 (10.75) 3038229
BAJAJ HOLDIN 2602.50 (2729.75) 58527
BALAJI TELE 132.25 (133.15) 181861
BALLARPUR IN 13.90 (12.95) 2194635
BALRAMPUR CH 86.40 (86.95) 4931258
BANK OF MAHA 14.80 (14.75) 2520180
BANK OFINDIA 104.00 (103.70) 19255322
BATA INDIA 699.60 (710.95) 470154
BGR ENERGY S 107.45 (110.40) 97267
BHARAT FORGE 736.60 (738.60) 1024724
BHUSHAN STEE 41.35 (41.95) 2278273
BIOCON LTD 586.30 (600.50) 2941070
BOMBAY DYE 259.95 (262.90) 5385049
CANARA BANK 268.35 (264.45) 13337818
CEAT LIMITED 1572.75 (1606.20) 435681
CENTRAL BANK 83.80 (86.50) 8569548
CHAMBAL FERT 164.70 (166.35) 691240
CHENNAI PETR 346.30 (356.65) 448912
CITY UNIBANK 174.85 (179.35) 4237800
CORPO BANK 31.45 (30.60) 2207649
COX & KINGS 236.00 (251.25) 335463
D B REALTY L 56.70 (58.45) 851071
DELTA CORP L 308.40 (309.50) 2751792
DENA BANK 20.55 (20.60) 2856698
DHANALAKBANK 22.05 (22.15) 422433
DIVIS LAB 1087.15 (1084.55) 629875
EDELWEISS CA 265.25 (269.95) 1251363
EID PARRY 292.35 (298.55) 99142
EIH 167.15 (168.30) 127004
ESSAR SHIPPI 23.30 (23.80) 18590
ESTER INDUST 68.35 (65.15) 341884
EXIDE INDUST 213.65 (217.55) 2634793
FEDERAL BANK 93.30 (93.65) 6435789
FINOLEX CABL 677.10 (683.05) 952712
G E SHIP LTD 350.05 (357.40) 200009
GAMMON INFRA 2.80 (2.95) 5338398
GATI LIMITED 104.95 (105.35) 499979
GAYATRI PROJ 199.65 (201.50) 263380
GITANJALIGEM 12.30 (12.90) 38614
GMR INFRASTR 17.95 (18.45) 39638989
GODREJ IND 546.70 (549.30) 254971
GRASIM IND 1093.55 (1107.95) 1527267
GUJ ALK&CHEM 723.50 (709.40) 138753
HCL INFOSYS 56.80 (57.60) 4189778
HEXA TECH 370.05 (380.25) 985079
HIMACHAL FUT 27.95 (27.25) 14779598
HOUSING DEV 43.05 (43.05) 16361348
IDBI 78.95 (78.85) 95136815
IDFC 51.15 (51.25) 5568590
IFCI 21.00 (22.00) 12997729
IL&FS TRANS 69.45 (69.30) 284615
IND SWIFTLAB 61.05 (63.45) 38501
INDBULLS REL 204.65 (209.30) 4038493
INDIA CEM 147.00 (150.75) 2196862
INDIAN BANK 306.05 (304.60) 2856638
INDO RAMA SY 32.95 (33.60) 169614
INDRAPRASTHA 296.20 (298.30) 1498200
IND-SWIFTLTD 7.70 (7.85) 9276
INGERSOLL-R 702.40 (704.40) 10844
IOB 18.15 (18.25) 2408254
IPCA LAB 667.55 (671.10) 157954
IRB INFRA DE 220.85 (217.80) 2985488
J&K BANK 58.90 (60.35) 1261796
JAI CORP 147.20 (150.85) 2271055
JAIN IRRIGAT 109.85 (112.30) 7843471
JAYPEE INFRA 10.70 (10.20) 22405029
JAYSHREE TEA 98.10 (96.25) 173589
JET AIRWAYS 703.80 (721.90) 2181774
JINDAL SAW 126.55 (127.95) 1510230
JINDAL STEEL 226.20 (230.70) 7506230
JK LAKSHMI C 424.25 (439.85) 101622
JK PAPER LIM 143.30 (145.15) 547896
JM FINANCIAL 131.95 (133.35) 705318
JP ASSOCIATS 20.85 (19.20) 278710720
JSW ENERGY L 77.90 (78.95) 2399328
JUBILANT FOO 2111.65 (2147.10) 825718
JUBILANT ORG 852.95 (852.90) 855641
JYOTHY LABS 359.10 (357.95) 284918
JYOTI STRUC 9.30 (9.50) 283973
KARNATA BANK 121.25 (123.65) 2498330
KEC INTL LTD 385.05 (392.75) 1215915
KOLTE PATIL 323.20 (338.00) 106862
KPIT CUMMINS 229.35 (231.30) 2250710
L&TFIN.HOLD 160.45 (162.05) 3670100
LAK VIL BANK 101.35 (104.45) 556051
M & M FINANC 433.50 (435.50) 2119037
MANAPPURAM G 104.65 (107.80) 2858301
MMTC LIMITED 67.20 (62.10) 24072078
MPHASIS LTD 875.75 (881.35) 310010
MRPL 116.70 (118.25) 703644
MTNL 20.40 (20.75) 3367704
NAGARJUNA OI 4.20 (4.20) 549239
NCC LIMITED 122.45 (126.35) 3033412
NETWORK18 FI 56.85 (57.40) 4198739
NEULAND LAB 728.35 (704.40) 66154
NIIT LTD 93.30 (94.05) 2086595
NIIT TECHNOL 927.15 (988.80) 2032160
OMAXE LTD 225.80 (226.30) 397018
ONMOBILE GLO 44.60 (45.90) 465571
ORIENT PAPER 39.40 (40.05) 86137
ORIENTALBANK 100.80 (100.85) 9683422
PARSVNATH DE 16.75 (16.55) 811161
PATEL ENGG 68.25 (70.65) 261696
PFIZER 2139.70 (2176.75) 17090
POLARIS SOFT 469.25 (472.80) 40201
POWERTRADING 95.20 (96.90) 1314964
PRAJ IND 83.65 (84.90) 1156785
PRISM CEMENT 115.65 (116.45) 692315
PROVOGUE (IN 4.65 (4.60) 184523
PUNJ LLOYD 18.15 (18.25) 1407775
PUNJAB & SIN 36.90 (36.50) 137687
PURAVANKARA 144.35 (150.05) 543076
PVP VENTURES 6.20 (5.95) 99919
PVR LIMITED 1292.90 (1312.25) 155390
RADICO KHAIT 322.25 (335.15) 764662
RAJESH EXPOR 769.10 (759.10) 406896
RALLIS INDIA 231.00 (234.35) 282145
RAMCO IND 247.50 (253.50) 102809
RAMCO SYS 415.00 (420.75) 25379
RAMKY INFRA 198.60 (196.05) 196259
RAYMOND 926.15 (942.10) 321788
RELIANCE CAP 429.65 (445.85) 4614835
RELIANCE COM 23.45 (23.60) 67745076
RELIANCE INF 428.60 (449.45) 2482831
RELIANCE POW 39.20 (39.95) 5143674
ROLTA INDIA 62.65 (63.70) 1302430
SAGAR CEMENT 906.85 (910.45) 96099
SAREGAMA 692.60 (698.30) 109849
SHANTHI GEAR 135.75 (134.00) 12538
SHIPPNG CORP 67.00 (68.60) 862033
SHREE RENUKA 15.35 (15.45) 1779915
SINTEX IND 20.20 (18.65) 19867244
SOBHA DEVELO 508.15 (529.55) 272582
SOUTHINDBANK 25.10 (25.65) 5144997
SRS LIMITED 1.10 (1.10) 1997439
STERLITE TEC 335.10 (333.60) 3563012
SUJANA METAL 1.25 (1.25) 46380
SUN PHARMA 398.20 (410.60) 173213
SUND FASTNER 595.85 (613.60) 1126324
SUZLON ENERG 11.70 (11.65) 45780242
SYND. BANK 62.70 (61.20) 17613267
TATA CHEM 682.10 (683.35) 373392
TATA COFFEE 121.95 (121.75) 560671
TATA COMMUN 624.15 (639.30) 351884
TATA GLOBAL 272.40 (279.60) 2762357
TATA METALIK 775.90 (768.95) 166819
TATA MOT DVR 189.45 (196.15) 2746178
TATA TELESER 6.70 (6.40) 1265398
THE INDIAN H 130.00 (133.00) 802990
TORRENT POWE 251.15 (252.65) 481182
TRIVENI ENGG 48.35 (49.80) 546093
TTK PRESTIGE 6461.25 (6608.40) 3816
TV TODAY NET 521.10 (512.00) 1566236
TV18 BROADCA 66.50 (67.40) 20818525
TVS MOTOR 631.80 (643.65) 737419
UCO BANK 23.15 (23.65) 1405257
UNION BANK 99.85 (101.25) 11116382
UNITECH 6.35 (6.25) 22714516
UNITED BANK 13.40 (12.30) 4650744
UNITED BREWE 1005.05 (1023.55) 242118
USHA MARTIN 19.90 (20.20) 643757
VADILAL INDU 907.25 (927.30) 22577
VENKYS 4113.85 (4129.05) 314626
V-GUARD IND 232.95 (237.60) 624557
VIJAYA BANK 56.10 (56.90) 1532562
VIP 302.35 (312.60) 799337
VOLTAS 627.20 (640.35) 1841603
ZEE LEARN LI 38.60 (38.40) 356079
ZUARI GLOBAL 192.00 (193.20) 87236
ZYDUS WELLNE 1225.20 (1231.75) 10535

ALPHAGEO 763.75 (765.45) 3291
AMAR RAJA BA 783 (793.55) 25136
ANDHRA BANK 41.80 (43) 1570419
ANDHRA CEMEN 10.91 (10.53) 35791
ANDHRA PAPER 297.25 (302.50) 3344
ANDHRA PETRO 57.15 (58.05) 37587
ANDHRA SUGAR 448.85 (457.05) 4297
ANJANI PORTL 183.50 (180.30) 8355
ASTRA MICROW 84.90 (86.10) 98632
AUROBINDO PH 572.70 (572.80) 177528
AVANTEL SOFT 531.60 (541.50) 3534
AVANTI FEEDS 2351.20 (2379.70) 11975
BALAJI AMIN 597.35 (626.50) 11882
BARTRONICS 11.85 (12.08) 13495
BHAGYA NAG 47.45 (49) 54146
BRILLIANT SE 9.68 (10.05) 694280
CAMBRIDGE TE 70.15 (70.15) 1421
CONT COFFEE 294.85 (294.80) 2124
COROMAN FERT 525.15 (527.70) 122095
CYBERMATE 2.77 (3.04) 96639
CYIENT LIMIT 631.50 (629.55) 5348
DECCAN CEMEN 548.95 (552.25) 315
DIVI'S LAB 1087.15 (1086.10) 50515
DR REDDY 2138.10 (2183.20) 35378
FOUR SOFT 73.55 (74.40) 10296
GATI CORPN 104.85 (105.15) 72982
GAYATRI PROJ 198.35 (201.45) 9096
GMR INFRASTR 17.90 (18.50) 2556692
GOLDST INFRA 201.50 (203.60) 67994
GRANULES (I) 110 (112.65) 79869

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 15.25 (16) 630189
HBL NIFE POW 51.35 (50.55) 90213
HERITAGE FOO 755.55 (761) 5900
IDL INDUSTRS 525 (529.60) 6007
ILFS ENGINEE 36 (36.75) 47539
INNAREDY COM 3.37 (3.26) 10537
IVRCL INFRAS 3.78 (3.73) 187217
KAKATIYA CEM 268.35 (270.90) 5393
KALLAM SPG 31.90 (32.05) 33710
KAVERI SEED 475.90 (493.75) 27686
KCP LTD 115.30 (117.20) 15596
KNR CONSTRUC 293.70 (294.70) 20256
LANCO INDUS 333.45 (343.40) 22232
LANCO INFRAT 1.21 (1.16) 2603960
LAURUS LABS 525.70 (533.75) 12369
LOKESH MACH 58.70 (59.05) 12384
MADHUCON PRO 24.20 (24.50) 35820
MIC ELECTRON 6.11 (6.12) 65497
MOLD-TEK.TEC 53.35 (54.95) 67947
MOLDTK PLA 317.40 (327.10) 4556
NAGARJAGRICH 42.80 (44.35) 18550
NATCO PHARMA 792.05 (786.85) 40667
NAVA BH VENT 138.35 (139.60) 19855
NCC 122.50 (126.45) 226504
NCL IND 224.75 (229.35) 58487
NEULAND LAB 722.55 (702.05) 17438
NIHAR INFO 14.10 (13.48) 390
PANYAM CEMEN 42.90 (44.35) 9743
PENNER IND 54.65 (55.90) 49462
PIONEER DIST 189.85 (187.45) 1444
PITTI LAMIN 86.35 (87.60) 19765
POKARNA 192.60 (194.75) 19205
PRAJAY ENGS 12.71 (12.59) 21789
PRISM CEMENT 115.40 (115.90) 88869
PRUDENTL PHA 4.22 (3.94) 642304
RAIN INDUSTR 386.50 (390.35) 283843
RAM INFORMAT 41.40 (41.65) 5300
SAMKRG PIST 292.90 (290.10) 1063
SATVAH. ISPA 19.55 (19.70) 10591
SMS PHARMA 77.40 (79.65) 8357
SPHERE GLOBA 34.85 (36.60) 7595
SREE RAYAL A 55.15 (56.55) 124158
SRINIVASA SH 56.65 (58.20) 11649
STEEL EXCHAN 26.85 (26.30) 84111
SUJANA METAL 1.27 (1.26) 16624
SUJANA UNIVE 0.70 (0.69) 192609
SUVEN PHARMA 178.70 (183.05) 23446
TAJ GVK HOTE 158.15 (161.15) 692
TANLA 35 (34.70) 146683
TERA SOFTWAR 47.10 (49.40) 8448
VICEROY HOTE 15.60 (15.20) 84759
VIJAY TEXTIL 44.50 (44.95) 529
VIMTA LABS 199 (201.45) 2834
VISTA PHARMA 41.85 (42.30) 150903
VIVIMED LABS 77.80 (78.75) 108060
YBRANT DIGIT 5.12 (5.15) 322095
ZENTECH 124.70 (129.55) 26988

జియో.. ఈశా వల్లే



● 2011లో అంకురార్పణ చేసింది తనే

● నవ యువతకు ప్రతీక ఆకాశ్: ముకేశ్ అంబానీ

లండన్: జియో సంచనలం అంతా ఇంతా కాదు. వచ్చిన రెండేళ్లలోనే భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డేటా వినియోగ దేశంగా నిలిపింది. అయితే జియో పుట్టుకకు కారణం తన కుమార్తె ఈశా అంబానీయేనని రిలయన్స్ ఇండస్ట్రీస్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. 'డ్రైవర్స్ ఆఫ్ ఛేంజ్' అవార్డును అందుకున్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారత మొబైల్ ఫోన్ మార్కెట్లోకి దూసుకురావడం కోసం జియో ఏకంగా 31 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టింది. 2016లో కార్యకలాపాలు ప్రారంభించిన జియో ఉచిత కాల్ సేవలు, చౌక రేట్లకే అధిక వేగం గల డేటాను అందించి ఇతర కంపెనీలకు గట్టిపోటీదారుగా మారింది. కార్లు, ఇళ్లు, వ్యాపార సంస్థల్లోనూ కొత్త తరం డేటా సేవలను అందించడానికి ఈ కంపెనీ సిద్ధమవుతోంది. మనకున్న యువ నైపుణ్యం కారణంగా 2028 కల్లా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని అంబానీ జోస్యం చెప్పారు. ఆ కార్యక్రమంలో ఆయన ఏం మాట్లాడారంటే..

'జియో ఆలోచన 2011లో నా కుమార్తె ద్వారా వచ్చింది. అప్పుడు తను యేల్ యూనివర్సిటీలో విద్యార్థిగా ఉంది. సెలవులకు ఇంటికి వచ్చింది. తనకు సంబంధించిన ప్రాజెక్టు వర్క్ ఏదో పూర్తి చేయాలని చూస్తోంది. అయితే ఇంటర్నెట్ సహకరించడం లేదు. 'నాన్నా.. మన ఇంట్లో ఇంటర్నెట్ వేగం అస్సలు లేదు' అని నాతో చెప్పింది. పక్కనే ఉన్న ఆకాశ్(ఈశా కవల సోదరుడు) మాట్లాడుతూ 'మనమింకా పాత ప్రపంచంలోనే ఉన్నాం. వాయిస్ కాల్స్‌కు డబ్బులు కడతున్నాం. కొత్త ప్రపంచంలో ప్రతిదీ డిజిటలేన'ని నాతో అన్నాడు. అప్పుడే జియో ఆవిర్భావానికి అడుగు పడింది. ఈశా, ఆకాశ్‌లు భారత యువ తరానికి చెందినవారు. చాలా సృజన ఉన్న వాళ్లు. విజయకాంక్ష ఉన్నోళ్లు. ప్రపంచంలో అత్యుత్తమంగా ఉండడానికి ఆతృతగా ఉన్న వాళ్లు. ఈ యువ భారతీయులు నన్ను బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ గురించి చెప్పి ఒప్పించారు. భారత్ సాంకేతికత విషయంలో వెనకబడి ఉండకూడదన్నారు. ఆ సమయంలో భారత్‌లో నెట్ అనుసంధానం చాలా తక్కువగా ఉండేది. డేటా కొరత ఉండడమే కాదు.. దాని ధర చాలా ఎక్కువగా ఉండేది. చాలామంది భారతీయులకు అది అందనంత ఎత్తులో ఉండేది. కానీ.. జియో వచ్చాక దేశంలో ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి తీసుకొచ్చాం. సెప్టెంబరు 2016లో జియోను ప్రారంభించాం. ఇప్పటికే అది భారత్‌లో ఓ గొప్ప మార్పుగా అవతరించింది. అమెరికా 1జీ మొబైల్ నెట్‌వర్క్, ఐరోపా 2జీ, చైనా 3జీతో ముందడుగు వేయగా.. జియో ప్రపంచంలోనే అతిపెద్ద 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్క్‌గా మారింది. 2019 కల్లా 4జీలో భారత్‌ను అగ్రగామిగా నిలబెడతాం. భారత్ వ్యాప్తంగా 2జీ నెట్‌వర్క్‌ను తీసుకురావడానికి 25 ఏళ్లు పట్టింది. కానీ జియో కేవలం మూడేళ్లలో 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్క్‌ను నిర్మించింది. 5జీకి కూడా ఇపుడు సిద్ధంగా ఉంది.'



ఈనాడు బిజినెస్



మారుతీ.. పోటీ కాలం!

● యుటిలిటీ విభాగంలో కంపెనీల హోరాహోరీ

● త్వరలో హ్యుందాయ్ క్రెటా, రెనో డస్టర్ కొత్త మోడళ్లు

● ఆకర్షణీయ ధరలతో టాటా మోటార్స్ జోరు

ముంబయి: దేశీయ వాహన విభాగంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న మారుతీ సుజుకీకి ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా యుటిలిటీ వాహన విభాగంలో అగ్రస్థానం కోసం మారుతీతో కంపెనీలు హోరాహోరీగా పోటీపడుతున్నాయి. ఇతర వాహన సంస్థలు కొత్త మోడళ్లు, ఆకర్షణీయ ధరల రూపంలో వినియోగదారులను ఆకట్టుకునే యత్నం చేస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో కాంపాక్ట్ యుటిలిటీ వాహన విభాగంలో పోటీ తీవ్రతరం కానుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ వాటా పెంచుకోవడమే లక్ష్యంగా.. హ్యుందాయ్ మోటార్ ఇండియా కాంపాక్ట్ యుటిలిటీ మోడల్ క్రెటాలో కొత్త వెర్షన్‌ను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక రెనో నిస్సాన్ సైతం కొత్త డస్టర్ వెర్షన్‌పై దృష్టి సారించింది.

నెక్సాన్ రాకతో..: ఆకర్షణీయమైన ధరలు, సరికొత్త ఫీచర్లతో నెక్సాన్, హెక్సా మోడళ్లను టాటా మోటార్స్ తీసుకురావడంతో మార్కెట్ వాటా కోసం కంపెనీల మధ్య పోటీ మరింత వేడెక్కింది. గత సెప్టెంబరులో యుటిలిటీ వాహనం నెక్సాన్‌ను విడుదల చేయకముందు టాటా మోటార్స్ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో అంతంతమాత్రంగానే ఉంది. అయితే నెక్సాన్ రాకతో యుటిలిటీ విభాగంలో టాటా మార్కెట్ వాటా 2.37% నుంచి 5.32 శాతానికి పెరిగింది.

ఇక 2017 మార్చిలో క్రాస్‌ఓవర్ డబ్ల్యూఆర్- వీని విడుదల చేసిన తర్వాత హోండాకార్స్ మార్కెట్ వాటా సైతం 3.2 % నుంచి 6.6 శాతానికి చేరడం గమనార్హం. నవంబరులో రెనో కాప్చర్‌ను విడుదల చేసినప్పటికీ.. అమ్మకాలు మందకొడిగా ఉండటంతో మార్కెట్ వాటా స్వల్పంగా తగ్గింది. హ్యుందాయ్ మార్కెట్ వాటా సైతం 1% తగ్గి 11.9 శాతానికి చేరింది. మారుతీ వాటా తగ్గినప్పటికీ.. ఒకప్పుడు ఈ విభాగాన్ని ఏలిన మహీంద్రా అగ్రస్థానానికి చేరినట్లు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. 2017-18 ఏప్రిల్- ఫిబ్రవరిలో మారుతీ మార్కెట్ వాటా 27.8% కాగా.. మహీంద్రా మొత్తం మార్కెట్ వాటా 25% దరిదాపుల్లో ఉంది.

ఈ ఏడాది మారుతీదే: ఏప్రిల్- ఫిబ్రవరిలో మహీంద్రా 2,09,322 యుటిలిటీ వాహనాలు విక్రయించగా.. మారుతీ 2,30,995 వాహనాలు అమ్మింది. ఇంకా ఒక నెల అమ్మకాలు మిగిలిఉండటంతో.. 2017-18 యుటిలిటీ విభాగంలో అగ్రస్థానాన్ని మహీంద్రా నుంచి మారుతీ సుజుకీ దక్కించుకోనుంది. విటారా బ్రెజా ఇందుకు దన్నుగా నిలిచిందని ఇండ్‌రా విశ్లేషకుడు రిచా బులానీ అంటున్నారు. గత మేలో దాదాపు 31 శాతంగా ఉన్న మారుతీ వాటా.. ఫిబ్రవరికి 28 శాతానికి చేరింది. టాటా, మహీంద్రా కొత్త మోడళ్లతో మారుతీ సుజుకీ మార్కెట్ వాటాపై ప్రభావం పడుతోందని చెబుతున్నారు. గతంలో హ్యాచ్‌బ్యాక్ వినియోగదారులు... ఇప్పుడు పెద్ద కార్ల వైపు అడుగులు వేస్తున్నారని వెల్లడించారు. కాగా 2018-19లో మహీంద్రా మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అన్నారు.

ఎస్9, ఎస్9+ పై ఎయిర్‌టెల్ ఆఫర్లు

దిల్లీ: శామ్‌సంగ్ తాజాగా విపణిలోకి విడుదల చేసిన గెలాక్సీ ఎస్9, ఎస్9+ స్మార్ట్‌ఫోన్లను సులభ వాయిదాల్లో, తమ నెలవారీ పథకాలతో కలిపి (బండిల్డ్) కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఎస్9 ధర రూ.57,900 (64 జీబీ), రూ.65,900 (256 జీబీ) కాగా, ఎస్9+ ధర రూ.64,900 (64 జీబీ), రూ.72,900 (256 జీబీ) అని సంస్థ ప్రకటించింది. ఎయిర్‌టెల్ ఖాతాదారులు మోడల్‌ను బట్టి రూ.9,900-17,900 ముందస్తుగా చెల్లించి, అనంతరం 24 నెలల పాటు రూ.2,499-2799 వరకు చెల్లిస్తూ, ఈ ఫోన్లు పొందొచ్చు. నెలవారీ వాయిదాల్లో అపరిమిత కాలింగ్, 80 జీబీ డేటా, ఇతర కంటెంట్ కూడా కలిపే ఉంటుంది. ఎయిర్‌టెల్ వెబ్‌సైట్‌లో ఆర్డరు ఇస్తే, ఇంటికే సరఫరా చేస్తారు.

రూ.9 లక్షల వరకు పెరగనున్న ఆడి ధరలు

ఏప్రిల్ 1 నుంచి వర్తింపు

దిల్లీ: వచ్చే నెల 1 నుంచి ఆడి కార్లు ప్రియం కానున్నాయి. అన్ని రకాల మోడళ్లను రూ.1 లక్ష నుంచి రూ.9 లక్షల వరకు పెరగనున్నాయి. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం పెంపును కొనుగోలుదార్లకు బదిలీ చేసే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆడి ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లో రూ.35.35 లక్షల నుంచి రూ.2.63 కోట్ల ధరల శ్రేణిలో ఎస్‌యూవీ క్యూ3 నుంచి ఆర్8 వరకు వివిధ రకాల మోడళ్లను కంపెనీ విక్రయిస్తోంది. 'బడ్జెట్లో కస్టమ్స్ సుంకాన్ని పెంచడంతో పాటు సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ భారాన్ని సాధ్యమైనంత మేరమేమే భరించేందుకు ప్రయత్నించాం. అది కుదరలేదు. దీంతో ధరల పెంపు రూపంలో ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పలేద'ని ఆడి ఇండియా అధిపతి రహీల్ అన్సారీ తెలిపారు.

26న విపణిలోకి ఒపో 'ఎఫ్7'

దిల్లీ: ఒపో తన సెల్ఫీ (స్వీయచిత్ర) ఎక్స్‌పర్ట్ శ్రేణిలో మరో కొత్త స్మార్ట్‌ఫోనును అందుబాటులోకి తేనుంది. 'ఎఫ్7'గా వ్యవహరించే దీనిని ఈ నెల 26న భారత విపణిలో విడుదల చేయనుంది. ఆ తర్వాత ఆగ్నేయాసియా విపణుల్లో ప్రవేశపెట్టనుంది. 'ఏఐ సెల్ఫీ, కవర్ షాట్, ఏఆర్ (ఆగ్యుమెంటెడ్ రియాల్టీ) స్టికర్లు లాంటి కొత్త ప్రత్యేకతలతో స్వీయచిత్ర అనుభూతిని మరో ఎత్తుకు ఎఫ్7 తీసుకెళ్తుంది. తద్వారా భారతీయ యువత హృదయాల్లో సెల్ఫీ ఎక్స్‌పర్ట్‌గా మా స్థానం మరింత బలోపేతం అవుతుంద'ని ఒపో ఒక ప్రకటనలో తెలిపింది. 6.2 అంగుళాలు, ఫుల్ హెచ్‌డీతో కూడిన పూర్తి తెర ఎఫ్7 స్మార్ట్‌ఫోనుకు ఉన్న మరో ప్రత్యేకత.



మార్చితో ముగిసే ప్రస్తుత త్రైమాసికంలో మరోసారి ప్యాసింజరు వాహన విభాగంలో ధరల పెంపు ఉండొచ్చని టాటా మోటార్స్ అంటోంది. ముడి పదార్థాలు ముఖ్యంగా ఉక్కు ధరలు పెరుగుతూనే ఉన్నాయని.. దీనిని దృష్టిలో పెట్టుకోవాల్సి వస్తోందని ఆ కంపెనీ ప్యాసింజరు వాహన వ్యాపార అధ్యక్షుడు మయాంక్ పరీఖ్ అంటున్నారు. జనవరిలో ఈ కంపెనీ రూ.25,000 వరకు ధరలను పెంచిన సంగతి తెలిసిందే. కొత్త వాహనాలు, 2020 లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలు, వినియోగదార్ల ధోరణులు, కొత్త ప్రచార వ్యూహాలు తదితరాలపై పరీఖ్ వార్తాసంస్థ కోజెన్సిస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆ విశేషాలు..

కారు కొనే వయసు తగ్గుతోంది

● ఇపుడు 35 ఏళ్ల లోపునకు చేరింది

● త్వరలో ధరలు పెంచుతాం

● ముడి పదార్థాల వ్యయాలే కారణం

● ఇండిగో, ఇండికాల ఉత్పత్తి తగ్గించాం

● 2020 కల్లా 95 శాతం మార్కెట్‌పై కన్ను

ఇంటర్వ్యూ టాటా మోటార్స్ అధ్యక్షుడు **మయాంక్ పరీఖ్**

గత రెండు మూడేళ్లుగా టాటా మోటార్స్ చాలా మారుతూ వచ్చింది. వినియోగదార్లతో మమేకమవుతున్నాం. 2020 కల్లా 95 శాతం మార్కెట్‌ను ఆకట్టుకోవాలన్నది మా లక్ష్యం. ఆ సమయానికి ఎవరైనా కారు కొనాలనుకుంటే.. మా గురించే ఆలోచించాలి. ఏప్రిల్ 2016లో టియాగో విడుదలతో కంపెనీ దేశీయ ప్రయాణికుల వాహనాల వ్యాపారం దశ మారింది. ఏప్రిల్-జనవరి (2015-16)లో విక్రయాల వృద్ధి 2 శాతంగా ఉండగా 2016-17 కల్లా 18 శాతం వృద్ధితో 125,446 వాహనాలను విక్రయించింది. ఆ తర్వాత టిగోర్, హెక్సా, నెక్సాన్ వంటి విడుదలతో ఏప్రిల్-జనవరి(2017-18)లో మొత్తం వాహన విక్రయాలు 15% పెరిగి 149,284కు చేరాయి. ఆ తర్వాత రేంజ్ రోవర్ ప్లాట్‌ఫాంలోని హెచ్5ఎస్‌ఎక్స్ ఎస్‌యూవీ, 45ఎస్‌ఎక్స్ హ్యాచ్‌బ్యాక్ మోడళ్లను వాణిజ్యీకరించడం మా తదుపరి అడుగు.

అదే మా లక్ష్యం

ఈ ఏడాది పరిశ్రమ 7.9 శాతం వృద్ధి చెందగా.. మేం 18-19% రాణించాం. గత 20 నెలలుగా పరిశ్రమ కంటే మిన్నగా మా పనితీరు ఉంది. వచ్చే ఏడాది పరిశ్రమ 8 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని సియామ్ అంటోంది. మేం అంతకంటే ఎక్కువగా రాణించే అవకాశం ఉంది. ఇందు కోసం మేం రెండు వ్యూహాలను రచించుకున్నాం. ఒకటి అన్ని విభాగాల్లోనూ మా ఉత్పత్తులను విస్తరించడం. రెండోది 2020 కల్లా 95 శాతం వాటాను దక్కించుకోవడం. ఏదైనా వాహనం కొనుగోలు చేసే ముందు మూడు దశలుంటాయి. అనుమానం, పరిశీలన, నిర్ధరణ. ఇవి దాటాకే కొనుగోలుకు వస్తారు. కానీ టాటా మోటార్స్ విషయంలో మూడేళ్ల కిందట తొలి అడుగును అధిగమించడమే కష్టంగా ఉండేది. ఇపుడు మేం పరిశీలన స్థాయికి వచ్చాం. ఇక ఆ తదుపరి స్థాయికి వెళ్లాలన్నది మా లక్ష్యం.

పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయాల వల్ల ధరల పెంపు గురించి ఆలోచిస్తున్నాం. జనవరిలో కొద్దిగా పెంచాం. కానీ ముడి పదార్థాల్లో ప్రధానమైన ఉక్కు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మేం త్వరలో ధరలు పెంచాలనుకుంటున్నాం. విద్యుత్ వాహనాలకు మా సంస్థ సుముఖంగానే ఉంది. అయితే అధిక ధరలు, ఛార్జింగ్ వసతుల కొరత అనేవి సమస్యలుగా ఉన్నాయి. వాటిని అధిగమిస్తే మరిన్ని విద్యుత్ వాహనాలను తీసుకొస్తాం.

భోం చేసే సమయంలోనే విక్రయం పూర్తి

మేం మొదటి లేదా రెండో స్థానంలో ఉన్నామా లేదా అన్నది పట్టించుకోం. భారతీయులకు అత్యంత ఇష్టమైన కార్ల కంపెనీగా పేరుండాలని మేం భావిస్తాం. ఒక కొనుగోలుదారు మూడు కార్లను ఎంచుకుంటే.. అందులో ఒకటి మాదుండాలి. సాధారణంగా కార్ల విక్రయాలు డైనింగ్ టేబుల్‌పై జరుగుతాయి. ఎందుకంటే ఓ కుటుంబం భోజనం చేసే సమయంలోనే తమకు ఏ కారు కావాలో నిర్ణయించుకుంటుంది. కేవలం లావాదేవీ మాత్రమే షాపులో జరుగుతుంది. 2020 కల్లా కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి నచ్చేవిధంగా డిజైన్, భాషను మా సంస్థ మార్చుకుంటోంది.

కొత్త పంథా అనుసరిస్తాం

ప్రీమియం ఎస్‌యూవీ విక్రయాలకు ప్రత్యేకంగా ఆలోచిస్తున్నాం. వర్చువల్ రియాల్టీ సాయంతో వచ్చే కొద్ది నెలల్లో మూడు స్టేషన్లను మూడు పెద్ద నగరాల్లో ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. మరొక విషయం ఏమిటంటే.. వినియోగదార్లు మా వద్దకు రాకపోయినా.. మేమే వినియోగదార్ల వద్దకు వెళ్లానుకుంటున్నాం. అంటే షాపింగ్ మాళ్లు, సినిమా హాళ్లలో వర్చువల్ రియాల్టీ ద్వారా విక్రయాలు చేస్తాం. ప్రస్తుతమున్న సంప్రదాయ పద్ధతిని మూసివేయాలని నేను అనను కానీ.. మార్చాల్సిన అవసరం అయితే ఉంది. భవిష్యత్‌లో మీ మొబైళ్ల ద్వారా డీలర్‌షిప్‌లు చేసుకునే వీలుంటుంది. కనీసం 80% ప్రక్రియను మొబైల్ ద్వారానే పూర్తి చేయాలి.

వినియోగదార్ల ధోరణి మారింది

1991 సమయంలో ఒక కుటుంబం తొలుత పిల్లలను చదివించి.. ఒక ఇల్లు కొని.. పిల్లల పెళ్లిళ్లు చేశాక కారు గురించి ఆలోచించేది. అంటే కారు కొనే సగటు వయసు 55 ఏళ్లుగా ఉండేది. కానీ ఇపుడు అది 35 ఏళ్ల కిందకు వచ్చింది. అందులో 30 ఏళ్ల లోపు వాళ్లు ఇంకా ఎక్కువ. ప్రతీ ఏడాదీ ఈ సగటు వయసు తగ్గుతూనే ఉంది. ఇది చాలా పెద్ద ధోరణి. అందుకే మేం మా వినియోగదార్లను బట్టే మా వ్యూహాలను మార్చుకున్నాం.

ఏప్రిల్‌లో నెక్సాన్ ఏఎమ్‌టీ

నెక్సాన్ ఏఎమ్‌టీని ఏప్రిల్‌లో తీసుకువస్తాం. ఆ తర్వాత నెక్సాన్ ఏరో వస్తుంది. ఇక జయేమ్ ఆటోమోటివ్స్‌తో కలిసి సంయుక్త సంస్థ ద్వారా టిగోర్ జేటీపీ, టియాగో జేటీపీలను ఏప్రిల్-జూన్‌లో విడుదల చేస్తాం. ఇక హెచ్5ఎక్స్‌పై పరీక్షలు నడుస్తున్నాయి. ఏప్రిల్ కల్లా అది రావొచ్చు. ఆ సమయానికి విక్రయాలు చేపడతాం. ఇది భారత్‌లో ఎస్‌యూవీకున్న నిర్వచనాన్ని మారుస్తుంది. ఇక 45ఎక్స్ వాణిజ్య ఉత్పత్తిని 18-20 నెలల్లో ప్రారంభిస్తాం. ఈ రెండు ఎస్‌యూవీల ఉత్పత్తి పుణెలోని ప్లాంటులో జరుగుతుంది. ఇండిగో, ఇండికాల ఉత్పత్తి చాలా తక్కువ చేశాం. అవి వాటి జీవితకాలంలో చరమాంకాన్ని చేరుకున్నాయనుకుంటున్నాం.



సరికొత్తగా సుజుకీ 'ఇంట్రూడర్'

దిల్లీ: సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా 'ఇంట్రూడర్' బైకులో నవీకరించిన వేరియంట్‌ను (అడ్వాన్స్‌డ్ వెర్షన్) తీసుకొచ్చింది. ధర రూ.1,06,896. ఇంట్రూడర్‌ను గత నవంబరులో సుజుకీ తీసుకొచ్చింది. 'విడుదల చేసినప్పటి నుంచి ఇంట్రూడర్ బైకుకు అనూహ్య స్పందన లభించింది. ఇప్పటికే సుమారు 15,000 వరకు విక్రయించాం. లక్ష్యానికి మించి 25 శాతం అధికంగా అమ్మకాలు నమోదు చేశామ'ని సుజుకీ మోటర్ సైకిల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (విక్రయాలు, మార్కెటింగ్) సజీవ్ రాజశేఖరణ్ తెలిపారు.

పీఎన్‌బీ కుంభకోణం వ్యవస్థాగత సమస్య కాదు: ప్రపంచ బ్యాంకు

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కుంభకోణాన్ని దేశ ఆర్థిక వ్యవస్థలోని వ్యవస్థాగత సమస్యగా భావించడం లేదని ప్రపంచ బ్యాంకు పేర్కొనడం విశేషం. అయితే అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్‌ఎఫ్) సంస్థ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించింది. ఇలాంటి మోసాలు మళ్లీ మళ్లీ జరగకుండా తగిన పాలనపరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొంది. శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు కంట్రీ డైరెక్టర్ జునైద్ కమాల్ అహ్మద్ మాట్లాడుతూ 'ఏదైనా కుంభకోణం జరిగినపుడు అది నియంత్రణ పరమైన కార్యకలాపాలకు సంబంధించిందా లేదా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిందా అన్నది పరిశీలిస్తాం. ఈ కుంభకోణం వ్యవస్థాకృత వైఫల్యం కాదని మేం భావిస్తున్నా'మన్నారు.

'ఏదైనా ప్రభుత్వం విధానకర్తగా, నియంత్రణ సంస్థగా, సేవా సరఫరాదారుగా ఉంటే.. న్యాయమూర్తి, న్యాయవాది ఒకరే అన్నట్లుగా ఉంటుంది. ప్రభుత్వం కేవలం విధానపరమైన భాగం తీసుకుని మిగతా పనులను స్వతంత్ర నియంత్రణ సంస్థలకు, థర్డ్ పార్టీ సేవా ఏజెంట్లకు విడిచిపెట్టాలి. అధికారాలను విభజిస్తే.. సేవల సరఫరాలో పారదర్శకత వస్తుంది. అది చాలా ముఖ్యమ'ని చెప్పుకొచ్చారు.

మొత్తం పరిశ్రమపై రుద్దొద్దు

● బ్యాంకులు 'ఎక్కువ' జాగ్రత్త పడుతున్నాయ్

● తాత్కాలికంగా రుణాలు తగ్గుతాయ్

● బ్యాంకుల సంఘానికి లేఖ రాశాం

● నీరవ్ మోదీ మోసంపై జీజేసీ ఛైర్మన్ ఖండేల్‌వాల్

ఈనాడు - హైదరాబాద్



ఒక్క నగల వ్యాపారి (నీరవ్ మోదీ) చేసిన మోసానికి మొత్తం పరిశ్రమను తప్పుపట్టడం సరికాదని.. నీరవ్ మోదీ మోసం వెలుగు చూసిన తర్వాత బ్యాంకులు అవసరానికి మించి జాగ్రత్త పడుతున్నాయని అఖిల భారత జెమ్స్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఛైర్మన్ నితిన్ ఖండేల్‌వాల్ అన్నారు. అయితే.. బంగారు ఆభరణాలు, విలువైన రాళ్ల పరిశ్రమపై ఈ మోసం ప్రభావం ప్రత్యేకంగా లేదన్నారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన నితిన్ 'ఈనాడు'తో మాట్లాడారు. దేశంలోని నగల వ్యాపారులు బ్యాంకుల నుంచి ఏడాదికి రూ.65,000 కోట్ల రుణాలు తీసుకుంటున్నారని, తాజా పరిణామం వల్ల బ్యాంకులు ఇచ్చే రుణాలపై తాత్కాలికంగా ప్రభావం ఉండగలదని రుణాలు 20-25 శాతం వరకూ తగ్గొచ్చని చెప్పారు. 'నగల డిజైనర్, ఫైర్‌స్టార్ డైమండ్ అధిపతి నీరవ్ మోదీ మోసపూరిత లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఓయూ) ద్వారా పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.12,968 కోట్ల వరకూ మోసం చేసినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఇది ఒక వ్యాపారికి, ఒక బ్యాంకుకు చెందిన ఒక శాఖకు మధ్య మోసపూరితంగా జరిగిన లావాదేవీ. దీని ఆధారంగా మొత్తం పరిశ్రమ తప్పుపట్టడం సరికాదు. బ్యాంకులు అవసరానికి మించి జాగ్రత్త పడుతున్నాయి. ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. బ్యాంకులు నగల వ్యాపారులకు రుణ పరిమితిని తగ్గిస్తున్నాయి. రుణాలు చెల్లించిన వారికి మళ్లీ రుణాలను ఇవ్వడం లేదు. ఆభరణాల వ్యాపారులు నిర్వహణ మూలధన నిధుల కొరత సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని' ఖండేల్‌వాల్ అన్నారు.

6 లక్షల మంది నగల వ్యాపారులు..

దేశంలో 6 లక్షల మంది నగల వ్యాపారులు ఉన్నారని, కోటి మంది ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని వివరించారు. పరోక్షంగా 5 కోట్ల మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. సమగ్రంగా బంగారు ఆభరణాలు, బంగారం, వజ్రాలు, విలువైన రాళ్ల పరిశ్రమ పరిమాణం రూ.4.5 లక్షల కోట్లు ఉంటుందన్నారు. జీజేసీలో 2,000 మంది జీవిత కాల సభ్యులు, 40 వేల మంది అసోసియేట్ సభ్యులు ఉన్నారని, మీడియాలో వచ్చిన వార్తలు ఆధారంగా నీరవ్ మోదీకి అసోసియేషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసిందని చెప్పారు.

వాణిజ్య శాఖ దృష్టికి తీసుకెళతాం

నీరవ్ మోదీ కుంభకోణం తర్వాత పరిశ్రమ ఎదుర్కొంటున్న పరిణామాలపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు లేఖ రాసామని. . మరింత పారదర్శకతకు ఎటువంటి చర్చలు తీసుకోవాలో ఐబీఏతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ఖండేల్‌వాలా అన్నారు. 'ఈ అంశాన్ని వాణిజ్య మంత్రిత్వ శాఖ దృష్టికి కూడా తీసుకువెళ్లనున్నాం. బ్యాంకులు కేవలం రుణాలు ఇచ్చి ఊరుకుంటే సరిపోదు. కంపెనీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. సంస్థల టర్నోవరులో అసాధారణ మార్పు రావడం వంటి పరిణామాలు జరిగినప్పుడు కారణాలను తెలుసుకోవాలి. మోసాలకు అవకాశం ఉన్న అంశాలను బ్యాంకులతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. గతంలో సంఘటిత రంగంలో ఆభరణాల పరిశ్రమ 5 శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు 25 శాతానికి పెరిగింది. పరిశ్రమ కూడా మరింత పారదర్శకతను కోరుకుంటోంది. జీఎస్‌టీతో కొంత పారదర్శకత వచ్చిందన్నా'రు.

కరెంట్ ఖాతా లోటు పైకి

ముంబయి: డిసెంబరు త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు(సీఏడీ) జీడీపీలో 2 శాతానికి చేరింది. విలువ పరంగా చెప్పాలంటే 13.5 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇది 8 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 1.4 శాతంగా మాత్రమే ఉంది. అధిక వాణిజ్య లోటు కారణంగా కరెంట్ ఖాతా లోటు పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి. విదేశీ మారక ఆదాయం, వ్యయాలకు మధ్య అంతరాన్ని కరెంట్ ఖాతా లోటు అంటారన్న సంగతి తెలిసిందే. ఇది సెప్టెంబరు త్రైమాసికంలో 7.2 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 1.1 శాతంగా ఉందని శుక్రవారం ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

తొమ్మిది నెలల్లోనూ..: ఏప్రిల్-డిసెంబరు 2017లో కరెంట్ ఖాతా లోటు అంతక్రితం ఏడాది ఇదేసమయంలో పోలిస్తే రెట్టింపై 0.7 శాతం నుంచి 1.9 శాతానికి చేరడం గమనార్హం. అదే సమయంలో వాణిజ్య లోటు 82.7 బిలియన్ డాలర్ల నుంచి 118.9 బిలియన్ డాలర్లకు చేరడం ఇందుకు కారణమైంది. ఏప్రిల్-డిసెంబరు 2017లో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) 30.6 బిలియన్ డాలర్ల నుంచి 23.7 బిలియన్ డాలర్లకు తగ్గాయి. నికర పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మాత్రం మూడో త్రైమాసికంలో 5.3 బిలియన్ డాలర్లుగా నమోదు కావడం విశేషం. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో విక్రయాలు 11.3 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం.

యూఎస్ విపణిలోకి డాక్టర్ రెడ్డీస్ అలర్జీ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అమెరికా విపణిలోకి లెవోసిటిరిజైన్ డైహైడ్రోక్లోరైడ్ బిళ్లలను విడుదల చేసింది. కళ్లలో నీళ్లు రావడం, ముక్కు కారడం వంటి అలర్జీలకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) అనుమతికి అనుగుణంగా 5ఎంజీ మోతాదు బిళ్లలను విక్రయించనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. యూసీబీ కంపెనీ జిజాల్ బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఔషధానికి ఇది జనరిక్ ఔషధం. కాగా మెదక్ జిల్లా జిన్నారం మండలంలోని డాక్టర్ రెడ్డీస్ ఏపీఐ ప్లాంటుల తనిఖీల్లో యూఎస్‌ఎఫ్‌డీఏ ఇన్‌స్పెక్టర్లు ప్లాంటులో నాలుగు లోపాలను గుర్తించి ఫారమ్ 483ని జారీ చేశారు. నిర్ణీత సమయంలో లోపాలను సవరిస్తామని కంపెనీ వెల్లడించింది.



పైడిపాకలోని పునరావాస కాలనీని సందర్శించిన నిపుణుల కమిటీ సభ్యులు

పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తిపై దృష్టి

నిపుణుల కమిటీ అధ్యక్షుడు మసూద్‌హుస్సేన్

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2019 నాటికి పూర్తిచేయాలంటే ఇంకా ఏం చేయాలనే విషయమై దృష్టిసారించినట్లు నిపుణుల కమిటీ అధ్యక్షుడు మసూద్‌హుస్సేన్ తెలిపారు. పోలవరం అథారిటీ సభ్యులతో కలిసి నిపుణుల కమిటీ సభ్యులు శుక్రవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. స్థానికంగా జరుగుతున్న పనుల తీరును క్షుణ్నంగా పరిశీలించారు. స్పిల్‌వే, డయాఫ్రమ్ వాల్, కాఫర్‌డ్యామ్ పనులనూ వారు తిలకించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఎస్ఈ ఎంవీ రమేష్‌బాబులతో చర్చించారు. అనంతరం పోలవరం సమీపంలోని పైడిపాకలో నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాసకాలనీని సందర్శించారు. ఇక్కడ ఎన్ని ఇళ్లు నిర్మించారు.. ఇంకా ఎన్ని నిర్మించాలి.. ఏ నమూనాలో నిర్మిస్తున్నారని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.మోహన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఈ ఆర్‌కె పటౌడి, సీడబ్ల్యూసీ డైరెక్టర్ అనిల్‌జైన్, డైరెక్టర్ జి.ఎల్.బన్సల్, పోలవరం అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్కే హల్దర్, కార్యదర్శి ఆర్‌కె గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రూ.25లక్షల ఖరీదైన గుట్కా పట్టివేత!

రసాయనాల మాటున తరలింపు

నక్కపల్లి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా నక్కపల్లి మండలం కాగిత టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గుట్కాను శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. ఐషర్ వ్యాన్‌లో భారీగా గుట్కా ప్యాకెట్లను విశాఖ వైపు తరలిస్తున్న తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న నక్కపల్లి ఎస్సై పైల సింహాచలం సిబ్బందితో కలిసి టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వ్యాన్‌ను తనిఖీలు చేయగా, ఇందులో 35 వరకు రసాయన పీపాలు, భారీగా ద్రాక్షపళ్లతో పాటు వంద వరకు గుట్కా బస్తాలను గుర్తించారు. గుట్కా రవాణాకు ఎటువంటి అనుమతిపత్రాలేవు. దీని విలువ రూ. 25లక్షలు ఉంటుందని సమాచారం. సరకుతో సహా వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సైను వివరణ కోరగా వ్యానులో గుట్కాలున్న మాట వాస్తవమేనన్నారు.

అమెరికాకు అతిపెద్ద వ్యూహాత్మక భాగస్వామి భారత్

వాషింగ్టన్: భారత్, అమెరికా మధ్య సంబంధాలు సమీప భవిష్యత్తులో మరింత బలపడతాయని 'అమెరికా పసిఫిక్ కమాండ్' కమాండర్ అడ్మిరల్ హ్యారీ హారిస్ విశ్వాసం వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం అమెరికాకు 'అతిపెద్ద వ్యూహాత్మక అవకాశం'గా భారత్‌ను ఆయన అభివర్ణించారు. సెనేట్ సాయుధ సర్వీసుల కమిటీతో సమావేశంలో హ్యారీ ఈ మేరకు మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, భద్రతాపరమైన రంగాల్లో భారత్, అమెరికా సహజ భాగస్వాములని ఆయన పేర్కొన్నారు.


ఏపీ ఉద్యోగులకు పోస్టింగులు

ఈనాడు, హైదరాబాద్: ఏపీ స్థానికత పేరుతో గతంలో రిలీవ్ చేసిన ఉద్యోగుల్లో 484 మందికి తిరిగి పోస్టింగులు ఇస్తూ జెన్‌కో శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మిగిలిన విద్యుత్ సంస్థలు కూడా మిగిలిన వారికి పోస్టింగులు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. వీరిని ఉద్యోగాల్లో చేర్చుకోవాలని హైకోర్టు ఇటీవలే ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పు మేరకు పోస్టింగులు ఇస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

బందీఖానాలే

- ఆదాయం తప్ప.. ఆర్తనాదాలు పట్టవు..!
- పెట్టింది తినాలి.. చెప్పింది చదవాలి
- రోజుకు దాదాపు 16గంటలు చదువే..చదువు!
- ప్రశ్నిస్తే బెదిరింపులు..తీవ్రంగా కొట్టడం
- విద్యార్హతలు లేని వారిని నియమిస్తున్నారు
- అనుమతి లేకుండానే వసతిగృహాల నిర్వహణ
- అపార్టుమెంట్లలో సాగుతున్న ఇంటర్ చదువులు
- భద్రతా ప్రమాణాలకు పూర్తిగా తిలోదకాలు

విద్యార్థులను ర్యాంకులు తెచ్చే మరయంత్రాలుగా పలు కళాశాలల యాజమాన్యాలు చూస్తున్నాయి. ఫలితం ర్యాంకుల సంగతి తర్వాత...ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు అర్ధంతరంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. విద్యాలయాలు ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ర్యాంకుల కోసం పిల్లల్ని బట్టి చదువులతో రుద్దడమే తప్ప వారి వికాసానికి అవసరమయ్యే వాతావరణాన్ని అందించడం లేదు. తలరాతలను రాసేస్తున్నారు. ఏ విద్యార్థి ఏం చదవాల్లో చెప్పేస్తున్నారు. ఇష్టాఇష్టాలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితులపై విద్యార్థులు తీవ్ర మనోవ్యథకు గురవుతున్నారు. విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఉమ్మడి ఏపీలో నీరదారెడ్డి, విభజన అనంతరం విశ్రాంత ఐఏఎస్ చక్రపాణి కమిటీలను ఇంటర్ విద్యామండలి వేసింది. ఈ కమిటీలు చేసిన సిఫార్సులు ఒక్కటీ అమల్లోకి రాలేదు.



ఈనాడు - అమరావతి


విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఐఐటీ, ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులకు కార్పొరేట్ కళాశాలలు బట్టిపట్టిస్తున్నాయి. పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఫలానా కోర్సుకు పనికి వస్తాడని నిర్ణయిస్తున్నారు. ఓ గదిలో పడేసి క్లాసులు, స్టడీ అవర్స్ అంటూ ఊపిరి సలపకుండా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. రోజుకు 16గంటలు వారు చదువులోనే గడిపేస్తున్నారు. మిగతా 8గంటల్లోనే నిద్ర, కాలకృత్యాలు, ఇతరత్రా పనులు. ప్రతిరోజూ పరీక్ష. వారం వారం పరీక్ష. మార్కులు తగ్గితే సెక్షన్లు మార్చేస్తున్నారు. "వేస్ట్ ఫెలోస్.. మొద్దులు.. ఎందుకు పనిరావంటూ..." తిట్లదండకం ఎత్తుకుంటున్నారు. తల్లిదండ్రులు ఏమంటారోననే భయం... తోటి విద్యార్థులు గేలి చేస్తారనే ఆందోళనతో పలువురు విద్యార్థులు కుంగిపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు జిల్లాల నుంచి రావాలంటే ఖర్చు అధికమవుతుంది. అలా రాలేని పలువురు తమ పిల్లలతో ఫోన్‌లో మాట్లాడాలన్నా కుదరని పరిస్థితి. అప్పటివరకు తల్లిదండ్రులతో గడిపిన పిల్లలు కనీసం ఫోన్‌లో మాట్లాడటానికి అవకాశం లేనందున ఆదివారమూ నిరాశతో గడుపుతున్నారు. వారానికి ఒకసారి 10నిమిషాలు మాత్రమే తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. పిల్లలు వందలు సంఖ్యలో ఉండగా.. ఫోన్లు ఐదారుకు మించి ఉండని పరిస్థితి. ఆయా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వరుస కట్టాల్సిందే. ఒక్కోసారి కొంతమందికి ఆ అవకాశమూ లభించని పరిస్థితి. సెలవు రోజుల్లో తల్లిదండ్రులు కళాశాలలకు వచ్చినా ఓ గంట మాత్రమే కలిసే పరిస్థితి నెలకొంది.

కనీస అర్హతలు లేవు..!

బోధనలో అనుభవం...విద్యార్థుల మానసిక స్థితిగతులను అర్థం చేసుకునే వారిని ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లుగా నియమించాలి. అందుకు భిన్నంగా చాలా చోట్ల తగిన విద్యార్హతలు లేకుండానే ఆయా స్థానాల్లో నియమిస్తున్నారు. కొద్ది నెలల కిందట విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఓ విద్యార్థిని కొట్టడం తీవ్ర వివాదాస్పదమైంది. ఇక విద్యార్థుల హాజరు, అధ్యాపకులు సమయానికి వస్తున్నారా? లేదా? తదితర వ్యవహారాలు చూసే ఫ్లోర్ ఇన్‌ఛార్జులకు తగిన శిక్షణ లేకపోవడంతో వారు మూర్ఖంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. తాము ఒక్కో అధ్యాపకుడికి రూ.లక్షల్లో వేతనాలు ఇస్తున్నామని అంతర్గతంగా యాజమాన్యాలు చెబుతున్నాయి. వాస్తవానికి అవి కేవలం అతి కొద్ది మందికి మాత్రమే. ఇక మిగిలిన వారికి అరకొర వేతనాలే. జూనియర్ అధ్యాపకులకు రూ.20-25వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.

అనుమతులే లేవు

రాష్ట్ర వ్యాప్తంగా 194 వసతి గృహాలను ఎలాంటి అనుమతి లేకుండానే పలు కళాశాలలు కొనసాగుతున్నాయి. నోటీసులు ఇవ్వడం మినహా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒకే క్యాంపస్‌లో కళాశాల, వసతిగృహం నిర్వహిస్తున్న కొన్ని యాజమాన్యాలు ఆ వసతిగృహం తమదికాదంటూ ఇటీవల ఇంటర్ విద్యామండలి జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇవ్వడం కొసమెరుపు. కొన్ని ప్రాంగణాల్లో ఏసీలు కూడా సక్రమంగా పనిచేయడం లేదని పలువురు విద్యార్థులు చెబుతున్నారు.



వసతిగృహాల్లో గదులకు సరైన గాలి, వెలుతురు ఉండడం లేదు. అగ్నిమాపక శాఖ నిబంధనల మేరకు పరికరాలు ఏర్పాటు చేయాలి. ఇవేమి కనిపించడం లేదు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే విద్యార్థుల భద్రతకు పూచీ కూడా లేకుండా పోతోంది. కొన్ని చోట్ల ఒక్కో గదిలో 10 మందిని ఉంచుతున్నారు. గది పెద్దదైతే 15మంది వరకూ ఉంటున్నారు. విజయవాడ గొల్లపల్లిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో చిన్నచిన్న గదుల్లోనూ 6–8 మందిని ఉంచుతున్నారు.



- ఇటీవల ఇంటర్ విద్యామండలి జారీ చేసిన ఆదేశాల ప్రకారం వసతిగృహాలు ఉన్న కార్పొరేట్ కళాశాలలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వీటిని ఏ ఒక్క కళాశాల పాటిస్తున్న దాఖలాలు లేవు.
- వసతిగృహాలు, తరగతి గదుల్లోని సమస్యలను తల్లిదండ్రులకు చెబితే టీసీపై 'రెడ్‌మార్కు' వేస్తామని బెదిరిస్తారు. ఆహారం నాణ్యంగా లేకపోవడంతో కొంతమంది విద్యార్థులకు జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయి.
- రెండు బోధనా పిరియడ్లు పూర్తయిన తర్వాత కనీసం 10 నిమిషాల సమయం లేకపోవడంతో మూత్రానికి కూడా వెళ్లలేని దుస్థితి.
- అల్పాహారం తెల్లవారుజామున 5.30-6గంటలకు పెడుతుండడంతో పలువురు విద్యార్థులు తినలేక పోతున్నారు. అంతస్తుల వారీగా శౌచాలయాలు సరిపడా లేవు. పరిశుభ్రత లేని శౌచాలయాలు, భోజనశాలల వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. చికిత్స అందించేందుకు ప్రాథమిక చికిత్స కిట్లు, ప్రత్యేక గదులు ఉండడం లేదు.
- విద్యార్థులు చేసే చిన్నచిన్న పొరపాట్లు, సక్రమంగా చదవకపోయినా, మార్కులు తగ్గినా బెత్తాలతో తీవ్రంగా కొడుతున్నారు.
- కార్పొరేట్ కళాశాలలన్నీ దాదాపు అపార్టుమెంట్లలోనే కొనసాగుతున్నాయి. వీటికి ఎలాంటి క్రీడా స్థలాలు లేవు. ఇతరత్రా మానసికోల్లాస కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనాల్లో ఎలాంటి స్థలాలు ఉండడం లేదు. నాలుగైదు అంతస్థుల భవనం అయినా లిఫ్టులు ఉండటం లేదు. ఉన్నా.. అవి సిబ్బందికి మాత్రమే వినియోగిస్తారు. సెల్లార్లలో భోజనశాల ఏర్పాటు చేస్తున్నారు.
- పీఆర్వో వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం నిబంధనలు జారీ చేసినా వాటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కళాశాలల్లో పని చేసే లెక్చరర్లకు విద్యార్థులను చేర్చే లక్ష్యాలను విధిస్తున్నారు. ఒక విద్యార్థిని చేర్పిస్తే రూ.3వేలు నుంచి రూ.5వేలు వరకు కమీషన్లు ఇస్తున్నారు.



తెల్లవారుజామున ఐదుగంటలకు విద్యార్థులను నిద్ర లేపడం.. 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పాఠాలు చదివిస్తున్నారు. ఒక్క కళాశాలకు అనుమతి తీసుకొని, వేర్వేరు ప్రాంతాల్లో శాఖలు ఏర్పాటు చేస్తున్నారు. తరగతి గదిలోనూ 90–105 మందిని కూర్చొబెడుతున్నారు. ఎవ్వరికీ సరిగా పాఠాలు అర్థంకాని పరిస్థితి.

ఆన్‌లైన్ ప్రవేశాలతోనే ముకుతాడు

కార్పొరేట్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం... ర్యాంకులు, ఉత్తీర్ణతకు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతుండటం...కొన్ని కళాశాలలు అనుమతులు లేకుండానే నడిపిస్తుండటం...ప్రతి ఏటా అక్టోబరు నుంచే ప్రవేశాలను నిర్వహిస్తుండటంతో ఆన్‌లైన్ ప్రవేశాలు జరపాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రెసిడెన్షియల్ విధానంతో పాటు రకరకాల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నందున రుసుములను ఎలా నిర్ణయించాలన్న దానిపై అధికారులకు స్పష్టత లేదు. ఆన్‌లైన్ ప్రవేశాలు చేస్తే అప్పుడు వెబ్‌సైట్లో రుసుములను కూడా ఉంచాల్సి వస్తుంది. వచ్చే విద్యా సంవత్సరానికైనా ఆ దిశగా అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇంకెన్నేళ్లు చెట్టునీడన పాఠం!

1985లో అనంతపురం జిల్లా బుక్కపట్నంలో సత్యసాయిబాబా డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. 5 ఎకరాలు స్థలమున్నా భవన నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు కాలేదు. అప్పటి నుంచి బాలుర ఉన్నత పాఠశాలలోనే దీన్ని నడుపుకొస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో పది పరీక్షలున్నందున, డిగ్రీ తరగతులు మధ్యాహ్నం నిర్వహించుకోవాలన్నారు. ఒక పక్క వార్షిక పరీక్షలు దగ్గరకొస్తున్నాయి, పాఠ్యాంశాలు పూర్తి చేయాలి, అందుకే అధ్యాపకులు ఉదయం పూట తరగతులకు ఒక గుడిని ఆశ్రయించారు. అదీ కూడా 74 మంది విద్యార్థులకు వంతుల వారీగా నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి హామీ కూడా అమలుకు నోచుకోకపోవడంతో ఇలా అవస్థలు పడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. -న్యూస్‌టుడే, బుక్కపట్నం

రండి.. భారత్‌లో చదువుకోండి

- 2023 నాటికి 2 లక్షల మంది విదేశీ విద్యార్థులే లక్ష్యం
- విస్తృత ప్రచారానికి త్వరలో కేంద్రం శ్రీకారం
- మన విద్యాసంస్థల ర్యాంకింగ్ మెరుగుకు ఉపయుక్తం

ఈనాడు, హైదరాబాద్: మన విద్యాసంస్థలకు మెరుగైన ప్రపంచ ర్యాంకింగులే లక్ష్యంగా విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు కేంద్రం ప్రయత్నాలను ప్రారంభించింది. 2023 నాటికి భారత్‌లో చదువుకునే విదేశీ విద్యార్థుల సంఖ్యను రెండు లక్షలకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు 'స్టడీ ఇన్ ఇండియా' కార్యక్రమం కింద మన విద్యాసంస్థల గురించి విదేశాల్లో ప్రచారం చేయనుంది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 86 దేశాల్లో భారత్ విద్యార్థులు 5.86 లక్షల మంది చదువుకుంటున్నారని పలు గణాంకాలు చెబుతున్నాయి. భారత్‌కు వచ్చే విదేశీ విద్యార్థులు మాత్రం 70 వేలకు మించడం లేదు. అందులోనూ చిన్న దేశాలకు చెందిన వారే అధికం. ప్రస్తుతం మన విశ్వవిద్యాలయాలు, జాతీయ విద్యాసంస్థలు ప్రపంచ ర్యాంకింగ్‌లో టాప్ 200లోపు కేవలం మూడు మాత్రమే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి 10 ప్రభుత్వ, 10 ప్రైవేటు విద్యాసంస్థలను అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాలుగా మార్చే ప్రయత్నాలు చివరి దశలో ఉన్నాయి. అదే సమయంలో విదేశీ విద్యార్థులు ఎక్కువ మంది ఉంటే ర్యాంకింగ్ పెరిగే అవకాశం ఉంది. అందుకే ఇప్పటికే ఐఐటీల్లో 10 శాతం, ఎన్ఐటీల్లో 15 శాతం సీట్లను సూపర్ న్యూమరరీ కింద విదేశీ విద్యార్థులకు కేటాయిస్తున్నారు. విదేశాల్లో జేఈఈ అడ్వాన్స్డ్‌కు పరీక్షా కేంద్రాలనూ ఏర్పాటు చేస్తున్నారు. విదేశీ విద్యార్థులు పెరిగితే ఆదాయం కూడా పెరుగుతుందని, వారు చెల్లించే రుసుములతో విద్యాసంస్థలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావిస్తున్నారు.

ఇవీ మా విద్యాసంస్థలు

స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని గతంలోనే ప్రారంభించినా తాజాగా ఆ పేరిట మన దేశంలోని విశ్వవిద్యాలయాలు, జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఎంలు మొత్తం 150 విద్యాసంస్థల గురించి పలు దేశాల్లో ప్రచారం చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్ణయించింది. అందులో ఐఐటీ హైదరాబాద్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తదితర సంస్థలు ఉండనున్నాయి. వచ్చే నెలలో కేంద్రం ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. రోడ్డు షోలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల్లో మొదట ఈ ప్రచారాన్ని ప్రారంభిస్తారు. దీనివల్ల 2020 నాటికి లక్ష, 2023 నాటికి రెండు లక్షలకు విదేశీ విద్యార్థుల సంఖ్య పెంచాలన్నది కేంద్రం లక్ష్యం.

ఫ్రాన్స్‌లో పెరిగిన భారత విద్యార్థులు..

ఫ్రాన్స్‌లో చదివే భారత విద్యార్థులు 2016లో 3,300 మంది ఉండగా 2017లో 5 వేలకు చేరారు. 2020 నాటికి భారత్ విద్యార్థుల సంఖ్యను 10 వేలకు పెంచాలని ఫ్రాన్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల భారత్‌తో ఎంఓయూ కూడా కుదుర్చుకుంది. అదే సమయంలో భారత్‌కు ఆ దేశ విద్యార్థులను అధికంగా రప్పించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

మానవ అక్రమ రవాణా కేసులో దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు

పోలీసు కస్టడీ అనంతరం బెయిల్ మంజూరు

దిల్లీ/ పాటియాలా: మానవ అక్రమ రవాణా కేసులో పంజాబీ పాప్ గాయకుడు దలేర్ మెహందీని దోషిగా తేల్చిన పాటియాలా న్యాయస్థానం శుక్రవారం అతనికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించింది. వెంటనే పంజాబ్ పోలీసులు అతన్ని కస్టడీలోకి తీసుకోగా.. అనంతరం బెయిల్ మంజూరయింది. కాగా తాను ఉన్నత న్యాయస్థానంలో అపీల్ చేయనున్నట్లు కోర్టు బయట దలేర్ విలేకరులకు తెలిపారు. దలేర్, అతని సోదరుడు షంషేర్ మెహందీలు తమ కచేరీ బృందం ద్వారా.. చట్టవ్యతిరేకంగా విదేశాలకు పంపిస్తామంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు గతంలో పోలీసులకు ఫిర్యాదులందాయి. 1998, 99ల్లో రెండు బృందాలుగా ఇలా 10 మందిని అమెరికాకు తీసుకెళ్లి విడిచిపెట్టినట్లు అభియోగాలున్నాయి.

రెస్టారెంట్ల వ్యాపార సమయం పెంచాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపార సమయాన్ని రాత్రి 10:30 గంటల నుంచి 12 గంటల వరకు పెంచాలని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తవరపు శ్రీనివాసబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన సచివాలయంలో కార్మికశాఖ మంత్రి పితాని సత్యనారాయణను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

వరంగల్ నిట్‌లో ఐదుగురు విద్యార్థుల బహిష్కరణ

మరో ఇద్దరిపై రెండేళ్ల వేటు

వరంగల్, న్యూస్‌టుడే: వరంగల్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) క్యాంపస్‌లో ఈనెల 11న రాత్రి నిర్వహించిన వసంతోత్సవం ముగింపు సభ సమయంలో జైప్రీత్‌సింగ్ అనే విద్యార్థిపై దాడి చేసిన వారిలో ఐదుగురిని బహిష్కరిస్తూ నిట్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. మరో ఇద్దరిపై రెండేళ్లపాటు సస్పెన్షన్ విధించారు. నిట్‌లో విద్యార్థి వర్గాల మధ్య జరిగిన దాడి సంఘటనపై నిట్ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎల్ఆర్‌జీ రెడ్డి అధ్యక్షతన ఆరుగురు ఆచార్యులతో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ సంఘటన పూర్వాపరాలపై విచారణ నిర్వహించి నిట్ సంచాలకుడికి నివేదిక అందించింది. నివేదికలో పేర్కొన్న విధంగా రవికాంత్ యాదవ్ (ఎంఎస్సీ, అప్లైడ్ మ్యాథ్స్), రోహిత్‌కుమార్ (ఎంఎస్సీ, ఇంజినీరింగ్ టెక్ ఫిజిక్స్)లపై రెండేళ్ల పాటు సస్పెన్షన్ విధించారు. ధీరజ్‌కుమార్, అమిత్ యాదవ్ (ఎంఎస్సీ, ఫిజిక్స్), పంకజ్‌కుమార్, అలీవారిష్, నితీష్‌కుమార్ (ఎంఎస్సీ, కెమిస్ట్రీ)లను కళాశాల నుంచి బహిష్కరిస్తూ నిట్ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ పలు సిఫారసులు చేయడంతో ఉన్నత స్థాయిలోనూ డీన్‌లు, విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని విద్యార్థులపై బహిష్కరణ వేటు విధించారు.

కార్మిక శాఖలో పదోన్నతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కార్మిక శాఖలో పలువురు అధికారుల పదోన్నతుల కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్ కమిటీ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నలుగురు డిప్యూటీ కమిషనర్లకు, సంయుక్త కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరో ఇద్దరు సంయుక్త కమిషనర్లకు, అదనపు కమిషనర్లుగా పదోన్నతులు దక్కాయి.

కర్ణాటకలో మూడు ఏనుగులు మృతి

మడికెరి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని నాగరహొళె అభయారణ్యం అంచుల్లోని కాఫీతోటల్లో మూడు ఏనుగులు మృతి చెందాయి. నాల్కేరి కాఫీ ఎస్టేట్ వద్ద తల్లి ఏనుగు పిల్లపై పడడంతో రెండూ మృతి చెందాయి. పిల్ల ఏనుగు వయసు ఆరు నెలలని అంచనా. మరో సంఘటనలో ఇక్కడికి సమీపంలోనే నీటిని తాగేందుకు వచ్చిన ఏనుగు మడుగులో ఇరుక్కుని మృతి చెందింది.

పంజాబ్ ఆప్ అధ్యక్ష పదవికి మాన్ రాజీనామా

చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో కుదుపు! ఆ పార్టీ పంజాబ్ విభాగం అధ్యక్షుడు భగవంత్ మాన్ తన పదవికి రాజీనామా చేశారు. మాదకద్రవ్యాల రవాణాలో సంబంధాలున్నాయంటూ శిరోమణీ అకాలీదళ్(ఎస్ఏడీ) నేత బిక్రమ్‌సింగ్ మజీఠియాపై చేసిన ఆరోపణలను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ వెనక్కి తీసుకుని ....క్షమాపణ చెప్పిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. రాజీనామాను మాన్ ట్విటర్‌లో శుక్రవారం ప్రకటించారు. అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పటికీ.. పంజాబ్‌లో డ్రగ్ మాఫియా, అవినీతిపై 'ఆమ్ ఆద్మీ'గా తన పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. మాన్ సంగ్రూర్ ఎంపీగా ఉన్నారు.

భారతీయ బ్యాంకులు నిబంధనలకు నీళ్లొదిలేశాయి!

- విజయ్‌మాల్యా కేసు విచారణ సందర్భంగా...బ్రిటన్ జడ్జి వ్యాఖ్య

లండన్: వ్యాపారవేత్త, నాటి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సారథి అయిన విజయ్‌మాల్యాకు కొన్ని రుణాల మంజూరులో భారతీయ బ్యాంకులు నిబంధనలను గుడ్డిగా తుంగలో తొక్కేశాయని బ్రిటిష్ న్యాయమూర్తి ఒకరు వ్యాఖ్యానించారు. విజయ్‌మాల్యా అప్పగింతకు సంబంధించిన ఒక కేసును విచారిస్తున్న వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎమ్మా ఆర్బట్‌నాట్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కేసులో ముక్కలు...ముక్కలుగా ఉన్న భారీ మొత్తంలోని సాక్ష్యాలన్నింటినీ ఒక దగ్గరకు చేర్చాలి. కొద్ది నెలల క్రితం కంటే ఇప్పుడు అసలు విషయాన్ని తాను సుస్పష్టంగా చూడగలుగుతున్నట్లు ఎమ్మా చెప్పారు. అంటే..., రుణాల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను భారతీయ బ్యాంకులు యథేచ్ఛగా ఉల్లంఘించేశాయని పునరుద్ఘాటించారు. అందుకే, మాల్యా వ్యవహారంతో సంబంధం ఉన్న కొందరు బ్యాంకు అధికారులపై కేసును వివరించాల్సిందిగా భారత అధికారులను న్యాయమూర్తి కోరారు. మాల్యాపై కుట్ర కోణానికీ....ఈ అంశానికీ సంబంధం ఉందని పేర్కొన్నారు. న్యాయమూర్తి ఈ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నప్పుడు విజయ్‌మాల్యా కోర్టులోనే ఉన్నారు. తన అప్పగింతకు సంబంధించిన ఓ కేసు విచారణకు ఆయన శుక్రవారం స్వయంగా న్యాయస్థానం ఎదుట హాజరైనారు. భారీ మోసం, నల్లధనం చెలామణికి సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో మాల్యాను భారత్‌కు అప్పగించవచ్చా అనే అంశంపై ఇక్కడి వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. వాస్తవానికి శుక్రవారం రావలసిన అవసరం లేకపోయినప్పటికీ విజయ్‌మాల్యా న్యాయస్థానం ఎదుట హాజరైనారు.

భర్త నుంచి విడాకులు కోరుతూ ట్రంప్ కోడలు దరఖాస్తు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోడలు వనెసా హేడన్ (40) తన భర్త ట్రంప్ జూనియర్ నుంచి విడాకులు కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈమేరకు మన్‌హట్టన్ కోర్టులో ఆమె గురువారం దరఖాస్తు చేసినట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. మోడల్‌గా పనిచేసిన వనెసాను తొలిసారి 2003లో ఓ ఫ్యాషన్ షోలో తన తండ్రి పరిచయం చేసిన సందర్భంగా ట్రంప్ జూనియర్ కలిశారు. అనంతరం 2005లో వారికి వివాహమైంది. 12 ఏళ్ల తర్వాత తాము వేర్వేరు మార్గాల్లో పయనించడానికి సిద్ధమైనట్లు ఆ జంట ఓ సంయుక్త ప్రకటనలో తెలిపింది. తమకు ఒకరంటే ఒకరికి ఎంతో గౌరవమని.. అలాగే తమ కుటుంబాలనూ గౌరవిస్తామని పేర్కొన్నారు. తమకు ఐదుగురు పిల్లలని.. ఇక వారే తమకు ప్రాధాన్యమని ప్రకటనలో తెలిపారు. డొనాల్డ్ ట్రంప్‌నకు మూడు వివాహాలు జరగ్గా.. ఆయన ఐదుగురు పిల్లల్లో జూనియర్ పెద్దవాడు. తండ్రి అమెరికా అధ్యక్షుడైన అనంతరం ట్రంప్ ఆర్గనైజేషన్‌ను తన సోదరుడు ఎరిక్‌తో కలిసి జూనియర్ చూసుకుంటున్నారు.

పీఎన్‌బీ కేసులో సమాంతర దర్యాప్తు ఎలా సాధ్యం?

- సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: సంచలనాత్మక పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణంలో సమాంతర దర్యాప్తు అవసరమే లేదన్న అభిప్రాయాన్ని కేంద్రప్రభుత్వం వ్యక్తం చేసింది. అదే విషయాన్ని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ శుక్రవారం చీఫ్‌జస్టిస్.దీపక్ మిశ్ర సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. కోర్టు ఆధ్వర్యంలో సమాంతర దర్యాప్తు.....పర్యవేక్షణ అనేవి ఎలా సాధ్యమని పేర్కొన్నారు. రూ.11వేల కోట్ల పైచిలుకు కుంభకోణం దర్యాప్తు ప్రగతి నివేదికను సీల్డు కవర్‌లో సమర్పించాలంటూ సీబీఐకి సుప్రీంకోర్టు సూచించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. స్థూలంగా చెప్పాలంటే...ఈ కోర్టు(సర్వోన్నత న్యాయస్థానం) కాదు...ఏ కోర్టు అయినా సరే ఈ తరహా నివేదికను కోరడం ఏ మేరకు సమర్థనీయమని అడిగారు. పీఎన్‌బీ కుంభకోణంపై స్వతంత్ర దర్యాప్తునకు అభ్యర్థిస్తూ వినీత్ ధండా అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను వేణుగోపాల్ వ్యతిరేకించారు.

రామసేతుకు ఎలాంటి నష్టమూ కలిగించం!

దేశ ప్రయోజనాల దృష్ట్యా తాము ఎట్టి పరిస్థితుల్లోనూ 'రామసేతు'కు ఎలాంటి నష్టం వాటిల్లనీయబోమని...అసలు అలాంటి ఉద్దేశమే లేదనీ కేంద్రప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. 'సేతుసముద్రం నౌకామార్గం ప్రాజెక్టు' నిమిత్తం తాము రామసేతు/ఆడమ్స్ బ్రిడ్జ్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తాం. ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని యోచిస్తున్నాం' అంటూ కేంద్ర నౌకాయాన మంత్రిత్వశాఖ తాను దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది.

లోయా మృతిపై స్వతంత్ర విచారణకు ఆదేశించే అంశంపై సుప్రీం తీర్పు వాయిదా

సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి బీహెచ్ లోయా మృతిపై స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు వాయిదా వేసింది. 2014లో ఓ వివాహ వేడుకకు హాజరైన సందర్భంలో లోయా గుండెపోటుతో మరణించారు. ఆ సమయంలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా నిందితుడిగా ఉన్న సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును లోయా విచారిస్తున్నారు. దీంతో లోయా మృతి చెందిన పరిస్థితులపై పలువురు సందేహాలు వ్యక్తంచేశారు.


చైనాలో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం

బీజింగ్: చైనాలో షీ జిన్‌పింగ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అధ్యక్ష పదవిని రెండు సార్లకు మించి చేపట్టకుండా ఉన్న పరిమితిని ఎత్తివేసి.. జీవితకాలం ఆ పదవిలో కొనసాగేందుకు ఇటీవల ఆయన మార్గం సుగమం చేసుకున్న సంగతి తెలిసిందే. మావో జెడాంగ్ తర్వాత ఆ స్థాయిలో అధికారాలను జిన్‌పింగ్ అందుకున్నారు. నూతన ప్రభుత్వ కూర్పును చైనా ప్రకటించనుంది. లీ కెఖియాంగ్ ప్రధాని పదవి మినహా.. కేబినెట్‌లోని అన్ని శాఖలు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్ బాధ్యతలను కొత్తవారు చేపట్టనున్నారు. ఉపాధ్యక్షుడి పదవీకాలంపై పరిమితిని కూడా తొలగించిన నేపథ్యంలో.. దీన్ని ఎవరికి అప్పగించనున్నారన్నదానిపై ఆసక్తి నెలకొంది.

ఏపీ భాజపా వ్యూహం ఏమిటి?

- రాష్ట్ర పార్టీ నేతలతో నేడు భేటీ కానున్న అమిత్‌షా
- తెదేపాతో వ్యవహరించాల్సిన తీరుపై సమాలోచన
- పొత్తులపైనా స్పష్టత వచ్చే అవకాశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఏపీ భాజపా నేతలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సమావేశం కానున్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ భేటీ జరగనుంది. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కోర్‌కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందంటూ తెలుగుదేశం పార్టీ కేంద్రమంత్రివర్గం, ఎన్డీయే కూటమి నుంచి బయటికెళ్లిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించడానికి ఈ సమావేశం ఏర్పాటుచేసినట్లు సమాచారం. రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయం గురించి చెబుతూ, తెదేపా తెగదెంపులు చేసుకోవడానికి వెనకున్న రాజకీయ కారణాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలన్న అంశంపై ఇందులో చర్చించనున్నారు. అలాగే భవిష్యత్తులో ఏయే రాజకీయపార్టీలతో కలిసి ఎన్నికలకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది? తెలుగుదేశం పట్ల పవన్‌కల్యాణ్ వైఖరి పూర్తి భిన్నంగా మారిన నేపథ్యంలో జనసేనతో ఎలాంటి సంబంధాలు కొనసాగించాలి, వైకాపాతో ఎలా వ్యవహరించాలన్న అంశాలపై సమావేశంలో ఒక స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. చంద్రబాబు రాజకీయ కారణాల కోసం తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో తెగదెంపులు చేసుకోలేదన్న అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో భాజపా ఉంది. దీనివల్ల చంద్రబాబు రాష్ట్రానికి ఎలా నష్టం చేశారన్న అంశాన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంపై దృష్టిసారించనున్నారు. కేంద్ర ప్రభుత్వంతో తెలుగుదేశం పూర్తి స్థాయిలో తెగదెంపులు చేసుకోవడం, మోదీ, భాజపాను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించడంతోపాటు, ప్రజావ్యతిరేకతను తమపైకి మళ్లించడానికి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎలా తిప్పికొట్టాలన్న అంశంపై కూడా అమిత్‌షా రాష్ట్ర నాయకులకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది.



ఆలస్యం ఆంధ్రప్రదేశ్‌దే

- ప్రత్యేక ప్యాకేజీ అమలుకు మేం సిద్ధం


దిల్లీ: రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మరోసారి స్పష్టం చేశారు. అయితే, ప్రత్యేక హోదాకు ఏ మాత్రం తీసిపోనివిధంగా ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామన్న హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడే ఉందని తెలిపారు. ప్యాకేజీ వల్ల లభించే అదనపు వనరులను ఏ రూపంలో తీసుకోవాలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకోలేక పోవటమే జాప్యానికి కారణమని వెల్లడించారు. ఆర్థిక సాయం హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ తొలుత ఎన్డీయే ప్రభుత్వం నుంచి, ఆ తర్వాత కూటమి నుంచి తెదేపా వైదొలగిన నేపథ్యంలో శుక్రవారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ...'పీటీఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు.

"ప్రత్యేక ప్యాకేజీ విధివిధానాలపై 2016 సెప్టెంబరులోనే అంగీకారంకుదిరింది. అయితే, ఈ ఏడాది జనవరిలో నిధులు అందుకొనే మార్గంలో మార్పులను రాష్ట్ర ప్రభుత్వం సూచించగా కేంద్ర ప్రభుత్వం దానికి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఉలుకూపలుకూ లేదు' అని ఆర్థిక మంత్రి అన్నారు.

"14వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యం కాదు. ఎందుకంటే కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి ఆర్థిక సంఘం పెంచింది. అప్పటికీ ఏదైనా రాష్ట్రం రెవెన్యూ లోటును ఎదుర్కొంటుంటే పరిహారం అందించటానికి అసాధారణ ఏర్పాట్లు అవసరం. ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రం... కేంద్ర ప్రాయోజిత పథకాలకు తన వాటాగా 10శాతం నిధులు వెచ్చించాలి. మిగిలిన రాష్ట్రాలైతే 40శాతం వాటాను భరించాలి. ప్రత్యేక హోదా ఉన్న, లేని రాష్ట్రాల మధ్య వ్యత్యాసం 30శాతం. దానికి సమానమైన నిధులను ప్రత్యేక ప్యాకేజీ కింద అయిదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు సమకూర్చుతామని చెప్పాం. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తాము చేపట్టిన పథకాలకు అవసరమయ్యే నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 90శాతం సమకూర్చాలని, మిగిలిన పదిశాతాన్ని రాష్ట్రమే భరిస్తుందని తెలిపింది. ఈ ప్రతిపాదనకు మేం అంగీకరించాం. అయితే, ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుంది. నాబార్డ్ ద్వారా నిధులు పొందేందుకు ఒక ప్రత్యేక ప్రయోజన వాహకం (స్పెషల్ పర్పస్ వెహికల్)ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, కేంద్రం తన వాటా ప్రకారం 90శాతాన్ని చెల్లిస్తుందని ఆంధ్రప్రదేశ్‌కి చెప్పాం. ఫిబ్రవరి 7న ఏపీ అధికారులు మరికొన్ని వివరాలతో వస్తామని వెళ్లారు. ఇంతవరకు ఎవరూ కేంద్ర ప్రభుత్వాన్ని మళ్లీ సంప్రదించలేదు. వారి రాకకోసం మేం ఎదురుచూస్తూనే ఉన్నాం" అని అరుణ్ జైట్లీ వివరించారు.

రెవెన్యూ లోటు చెల్లింపుపై...

2013-14 ఆర్థిక సంవత్సరం ప్రాతిపదికగా రెవెన్యూ లోటును లెక్కిస్తే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చెల్లించాల్సింది రూ.138 కోట్లే. అదే 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే కేంద్రం చెల్లించాల్సిన బకాయిలు రూ.1600 కోట్లు అని జైట్లీ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇవ్వటంలో కేంద్ర ప్రభుత్వ జాప్యం ఏమాత్రం లేదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.



న్యాయం జరగనందునే

- ఎన్డీయే నుంచి బయటకు రావటంపై అమిత్‌షాకు చంద్రబాబు లేఖ

ఈనాడు అమరావతి: 'మా రాష్ట్రానికి సముచిత ప్రాధాన్యం లభిస్తుందని, మా ప్రజలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో ఎన్డీయేలో చేరాం. ఈ ప్రయోజనం నెరవేరనప్పుడు ఎన్డీయేలో కొనసాగడంలో అర్థం లేదని భావిస్తున్నాం. అందుకే ఎన్డీయే నుంచి వైదొలగాలని నిర్ణయించాం' అని భాజపా అధ్యక్షుడు అమిత్‌షాను ఉద్దేశించి రాసిన లేఖలో తెదేపా అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఈ లేఖను అమిత్‌షాకు పంపించారు. తాము ఏ పరిస్థితుల్లో ఎన్డీయేలో చేరిందీ.. ఇప్పుడు ఎందుకు వైదొలగిందీ ముఖ్యమంత్రి వివరించారు. 'లోక్‌సభ ఎన్నికల్లోను, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాసనసభల ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేశాం. ఆ ఎన్నికల తర్వాత మాకొక మాట చెప్పాలన్న కనీస మర్యాద కూడా పాటించకుండా తెలంగాణలో మాతో పొత్తుకు భాజపా ముగింపు పలికింది' అని పేర్కొన్నారు. 'విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వ హామీల అమలు కోసం ప్రధానిని, కేంద్ర మంత్రుల్ని, మిమ్మల్ని అనేక సందర్భాల్లో కలిసి విన్నవించినా స్పందన లేదు' అని పేర్కొన్నారు. 'ప్రత్యేక హోదాతో సమానమైన అన్ని ప్రయోజనాలు కల్పిస్తామంటేనే ప్రత్యేక సాయానికి అంగీకరించాం. సాయాన్ని అమలు చేయలేదు.. సరికదా ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు 2017 ఏప్రిల్ తర్వాత, జీఎస్టీ అమల్లోకి వచ్చాక కూడా సదుపాయాలన్నీ కొనసాగిస్తున్నారు. ఇది విచారకరం. ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం సిఫారసు చేయలేదన్న విషయాన్ని మా ప్రజలు గుర్తించారు. అలాంటి సిఫారసులేమీ చేయలేదని ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులే చెప్పారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రే గురువారం ధ్రువీకరించారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. 2018-19 బడ్జెట్‌లోనైనా మా ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశించాం. మార్చి 7న కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటనతో.. కేంద్రం ఐదు కోట్ల ఆంధ్రులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోడానికి సిద్ధంగా లేదని అర్థమైంది' అని లేఖలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కంటతడి పెట్టిన బాలసుబ్రమణ్యం

రాష్ట్రానికి భాజపా ఇంత అన్యాయం చేస్తుందా? అంటూ పీడీఎఫ్ శాసనమండలి సభ్యుడు విఠపు బాలసుబ్రమణ్యం కంటతడి పెట్టారు. శుక్రవారం సాయంత్రం శాసనమండలిలో చంద్రబాబు పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై మాట్లాడాక సభ వాయిదా పడింది. సీఎం బయల్దేరే సమయంలో పీడీఎఫ్ సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం, యండవల్లి శ్రీనివాసరెడ్డి, రాము సూర్యారావు, స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు ఆయన వద్దకు వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పెద్ద నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. ఎన్డీయే నుంచి బయటకు రావడం, మంత్రి పదవుల నుంచి వైదొలగడం సాహసంగా పేర్కొన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్న ఆవేదనతోనే సభలో అన్ని విషయాలు వెల్లడించానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సీఎం పలు అంశాలపై మాట్లాడుతుండగా బాలసుబ్రమణ్యం ఉద్వేగానికి లోనై అక్కడినుంచి పక్కకు వచ్చారు. ఇదే సమయంలో మిగిలిన ఎమ్మెల్సీలు సీఎంకు ధైర్యం చెప్పారు.

జగన్ ఉచ్చులో చంద్రబాబు

- భాజపా ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేకహోదా పేరుతో భాజపా, తెలుగుదేశం పార్టీల మధ్య చిచ్చుపెట్టి రెండింటినీ విడగొట్టాలని జగన్ పన్నిన ఉచ్చులో తెదేపా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఇరుక్కున్నారని భాజపా ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఈ విషయంలో జగన్ విజయం సాధించారని పేర్కొన్నారు. తెదేపా ఎన్డీయే నుంచి వైదొలగి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఆయన శుక్రవారమిక్కడ విలేకర్లతో మాట్లాడారు. "పవన్‌కల్యాణ్, జగన్‌ను భాజపానే నడిపిస్తోందన్న ఆరోపణలు వాస్తవంకాదు. కాకినాడ సభలో పవన్ భాజపాను తీవ్రంగా విమర్శించినప్పుడు ఎవ్వరూ దాని గురించి మాట్లాడలేదు. ఈరోజు అదే వ్యక్తితో భాజపాకు ముడిపెట్టడం ఆశ్చర్యకరం. 2014 ఎన్నికల్లో భాజపా, తెదేపా కలవడంవల్లే వైకాపా ఓడిపోయింది కాబట్టి హోదా అంశాన్ని తెరమీదికి తెచ్చి రెండు పార్టీలు విడిపోయేలా జగన్ చేశారు. ఎన్డీయే నుంచి తెలుగుదేశం వైదొలగడం, కేంద్రం ఏమీ చేయలేదనడం అన్యాయం. పవన్, జగన్‌లు మోదీని విమర్శించడంలేదని తెదేపా చెప్పడం ఆశ్చర్యకరం. వారిద్దరూ మోదీని తిడుతుంటే ఆనందించాలనుకుంటున్నారా? ఏపీ అభివృద్ధికి కేంద్రం దోహదపడింది. అవిశ్వాసాన్ని ఎదుర్కొని ఓడిస్తాం. రాష్ట్రానికి ఎలాంటి సాయం చేశాం, ఎన్ని సంస్థలు ప్రారంభించాం. పోలవరానికి ఎలా సాయం చేశామన్న దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కిందిస్థాయి నుంచి భాజపా బలాన్ని పెంచుకుంటాం" అని పేర్కొన్నారు.

రాజకీయ ప్రయోజనాలకే అవిశ్వాస తీర్మానం: జీవీఎల్

అవిశ్వాస తీర్మానం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని భాజపా జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఎన్డీయే నుంచి బయటకు వెళ్లాలన్న తెదేపా నిర్ణయం వ్యూహాత్మక తప్పిదమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే.. కేంద్రం మీద నెపం వేసి ఓ దురుద్దేశంతోనే తెదేపా బయటకు వెళ్లిపోయిందన్నారు. 29 సార్లు దిల్లీకి వెళ్లినా కేంద్రం ఏమీ చేయలేదనడం ముఖ్యమంత్రి చంద్రబాబు అసమర్థను తెలుపుతోందని ఎద్దేవా చేశారు. ఏపీ రాజకీయాల్లో త్రిపుర తరహాలో ఎదగడానికి భాజపాకు ఇదో అద్భుతమైన అవకాశంగా అభివర్ణించారు.



దిల్లీలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశమైన తెదేపా ఎంపీలు సుజనాచౌదరి, సీఎం రమేశ్

అవిశ్వాస బాణం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా మహాకుట్రను పన్నుతోంది" అంటూ ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. ఏపీకి జరిగిన అన్యాయంపై ఇతర పార్టీలు కూడా సానుభూతితో ఉన్నాయని వాటి మద్దతు కూడా తీసుకుని అవసరమైన 51 మంది సంఖ్యా బలాన్ని కూడగట్టాలని ఆదేశించారు.

ఎందుకీ నాటకాలు?

"ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పినట్లు మనతో అన్నారు. ఇప్పుడు ఆర్థిక సంఘం హోదా ఇవ్వవద్దని చెప్పనేలేదని కేంద్ర మంత్రి ఇంద్రజిత్ ప్రకటించారు. ఎందుకీ నాటకం. రాష్ట్రంలో ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం మంచి విధానం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల భావోద్వేగాలు పట్టవా' ' అంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు తెదేపాను దెబ్బతీయడానికి కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించిందన్నారు. ఇప్పుడు అదే ఆలోచనతో జగన్, పవన్‌లతో నాటకాలాడుతూ భాజపా రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. "ఈ కుట్రలో భాగస్వాములయ్యే ఏ ఒక్కరిని వదిలిపెట్టం. ప్రజాకోర్టులో దోషులుగా నిలబెడతాం" అని హెచ్చరించారు. తెదేపాను బలహీనపరచడం ద్వారా రాష్ట్రాన్ని బలహీనపరిచేందుకు కేంద్రం చేస్తున్న కుట్రను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

దిల్లీలో రాజకీయ వేడి..

తెదేపా ప్రకటనతో దిల్లీలో అకస్మాత్తుగా రాజకీయాలు రాజుకున్నాయి. ఎన్డీయే నుంచి తెదేపా బయటికొచ్చి అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడం అలజడి రేపింది. ప్రభుత్వ, ప్రతిపక్షాల దృష్టంతా ఇప్పుడు దీనిపైనే కేంద్రీకృతమైంది. తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో ప్రస్తావించారు. అప్పటికే తెరాస, అన్నాడీఎంకే సభ్యులు వేరువేరు అంశాలపై వెల్‌లోకి దూసుకెళ్లి, నినాదాలు చేస్తున్నారు. ' 'కేంద్ర మంత్రివర్గంపై తమకు విశ్వాసం లేదంటూ వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చారు. సభ సజావుగా లేకపోతే 50 మంది సభ్యులను లెక్కించడం వీలుకాదు. అందువల్ల వెల్‌లో నిలబడ్డ వారంతా సీట్ల వద్దకు వెళ్లి తమకు కేటాయించిన చోట నిల్చోవాలి. అప్పుడే అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా? లేదా? అన్నది నిర్ధరించడానికి వీలవుతుంది" అని స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నాడీఎంకే, తెరాస సభ్యులకు విజ్ఞప్తి చేశారు. వారు వెనక్కు తగ్గకపోవడంతో సభ సజావుగా లేని కారణంగా అవిశ్వాస తీర్మానాలను సభ ముందుంచలేకపోతున్నట్లు చెప్పి, సభను సోమవారానికి వాయిదా వేశారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా తెదేపా, వైకాపా, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, మజ్లిస్ పార్టీ సభ్యులు లేచి నిల్చొని చేతులెత్తినా ప్రయోజనం లేకపోయింది. తామంతా లేచి నిలబడ్డా, పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ వాయిదా వేయడాన్ని కాంగ్రెస్, తెదేపా, వైకాపా సభ్యులు వ్యతిరేకించారు.

శుభాకాంక్షలు.. సంఘీభావాలు..

ఎన్డీయే నుంచి తెదేపా బయటికిరావడం దిల్లీలో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకొంది. ఎన్డీయేతర పక్షాలన్నీ దీన్ని స్వాగతించాయి. శుక్రవారం పార్లమెంటు సెంట్రల్‌హాల్‌లో విపక్ష సభ్యులంతా తెదేపా ఎంపీలను చుట్టుముట్టి శుభాకాంక్షలు తెలిపారు. మంచిపని చేశారని మద్దతు పలికారు. తెదేపా సొంతంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం కూడా రాజకీయ బలాన్ని పెంచింది. ఉదయం 9 గంటలకు అమరావతి నుంచి తెదేపా అధ్యక్షుడు ఆదేశించడం, అరగంటలోపు ఆ పార్టీ లోక్‌సభా పక్షనేత తోట నరసింహం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు అందజేయడం చకచకా జరిగిపోయాయి. దాంతో పార్లమెంటులో రాజకీయం వేడెక్కింది. ఎన్డీయేతేర పక్షాలన్నీ మీడియా ముందు, సామాజిక మాధ్యమాల్లో అవిశ్వాసాన్ని బలంగా స్వాగతించాయి. మద్దతిస్తామని ప్రకటించాయి.

మరోసారి..

చర్చ లేకుండానే సభ వాయిదాపడటంతో గురు, శుక్రవారాల్లో వైకాపా, తెదేపాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు మురిగిపోయినట్లయింది. దీంతో సభ వాయిదాపడిన వెంటనే ఇరు పార్టీలూ మళ్లీ అవిశ్వాస తీర్మానం నోటీసులు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు అందజేశాయి. శుక్రవారం 16 మంది సొంతపార్టీల ఎంపీల సంతకాలతోనే నోటీసు ఇచ్చిన తెదేపా.. సోమవారానికల్లా అవిశ్వాసం చర్చకు చేపట్టడానికి అవసరమైన 54 మంది సంతకాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది.

అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు పలికింది. పార్టీ లోక్‌సభా పక్షనేత ఖర్గే మాట్లాడుతూ "తొలి నుంచీ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతున్నాం. అవిశ్వాసంపై చర్చ జరిగినప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం. దీనికి మద్దతు కూడగట్టడానికి చాలామందితో మాట్లాడుతున్నాం' ' అని పేర్కొన్నారు. తెదేపా అవిశ్వాస తీర్మానంపై ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సంతకం చేశారు.

ఎన్డీయే నుంచి తెదేపా బయటికి రావడంపై తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ హర్షం వ్యక్తంచేశారు. తెదేపా పార్లమెంటరీ పార్టీనేత సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్‌లు పార్లమెంటు ఆవరణలోని తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి, ఆ పార్టీ లోక్‌సభా పక్షనేత సుదీప్ బందోపాధ్యాయ, దినేష్ త్రివేదీలను కలిసినప్పుడు వారు అవిశ్వాస తీర్మానానికి సంపూర్ణ మద్దతు పలికారు.

అవిశ్వాస తీర్మానానికి తమ పార్టీ మద్దతిస్తున్నట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్‌లు ప్రకటించారు. బిహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వనందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కూడా దీనికి మద్దతు పలకాలని తేజస్వీ సూచించారు. అసొంకు చెందిన ఏఐయూడీఎఫ్ అధ్యక్షుడు బద్రుద్దీన్ అజ్మల్ మద్దతు ప్రకటించారు.

చర్చించాక నిర్ణయం..

తెదేపా తీర్మానంపై తమ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాకరేతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని శివసేన నేతలు భావిస్తున్నారు. తెరాస కూడా రాష్ట్ర పార్టీలో చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తుందని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ వెల్లడించారు. కేంద్రంపై చంద్రబాబు సాగిస్తున్న పోరాటానికి మద్దతిచ్చే విషయమై కొంతకాలం వేచి చూసి, తర్వాత నిర్ణయిస్తానని మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్.డి.దేవేగౌడ తెలిపారు. మరోవైపు తెదేపా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వరాదని అన్నాడీఎంకే నిర్ణయించింది. ఆ తీర్మానాన్ని సమర్థించాలన్న పార్టీ మాజీ ఎంపీ కె.సి.పళనిస్వామిని సస్పెండ్ చేసింది.

ఏమవుతుంది?

సోమవారం కూడా తెదేపా, వైకాపాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ సభ ముందుంచేటప్పుడు ఎవరైనా సభ్యులు వెల్‌లో ఆందోళన చేస్తే మళ్లీ సభ వాయిదాపడే అవకాశం ఉంది. గురువారం వెల్‌లోకి వచ్చిన అన్నాడీఎంకే, తెరాసలకు నచ్చజెప్పి అవిశ్వాసానికి మద్దతిచ్చేలా ఒప్పిస్తామని తెదేపా నేత తోట నరసింహం ప్రకటించారు. తెదేపా వినతిని మన్నించి ఆ పార్టీలు సోమవారం వెల్‌లోకి రాకుండా, సభ ప్రశాంతంగా సాగితే.. అవిశ్వాసానికి మద్దతిస్తున్న వారి సంఖ్యను స్పీకర్ లెక్కిస్తారు. సరిపడా సంఖ్య ఉంటే అవిశ్వాసాన్ని చర్చకు తీసుకుంటున్నట్లు ప్రకటించి, సమయం కేటాయిస్తారు. ఇందుకు భిన్నంగా జరిగితే.. సభ జరిగినన్నాళ్లు ఈ రెండుపార్టీలు సెక్రటరీ జనరల్‌కు నోటీసులు ఇస్తూపోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలన్నీ ఏకమైనా మోదీ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి లేదు. భాజపాకు సొంతంగా సాధారణ మెజార్టీ ఉంది. మిత్రపక్షాలనూ కలిపితే దాని బలం మరింత పెరుగుతుంది. అవిశ్వాస తీర్మానం చర్చకొస్తే ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడటానికి.. సంఖ్యా బలాన్ని బట్టి ప్రతిపక్షాలకు అవకాశం లభిస్తుంది. ఇందులో కొన్ని అవిశ్వాసానికి అధికారికంగా ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. మరికొన్ని ప్రకటించాల్సి ఉంది. విపక్షాల్లో సంఖ్యాపరంగా మూడోస్థానంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వానికి అండగా నిలవాలని నిర్ణయించింది. 20 స్థానాలున్న బిజూ జనతాదళ్, 18 స్థానాలున్న శివసేన, 11 స్థానాలున్న తెరాసలు ప్రస్తుతానికి స్పష్టమైన అభిప్రాయాన్ని చెప్పలేదు. ఇవి అవిశ్వాసానికి మద్దతు ఇస్తే విపక్షాల సంఖ్యా బలం మరింత పెరుగుతుంది.

లోక్‌సభలో ఎన్డీయే బలం

భాజపా	-	274
శిరోమణి అకాలీదళ్	-	4
లోక్‌జనశక్తి	-	6
ఆర్ఎల్ఎస్‌పీ	-	3
జేడీయూ	-	2
అప్నాదళ్	-	2
పీడీపీ	-	1
ఎన్‌పీపీ	-	1
మొత్తం	-	293
శివసేన	-	18
మొత్తం కలిపితే	-	311
ప్రస్తుత సభ్యుల సంఖ్య (స్పీకర్‌ను మినహాయించి)	-	539
ఖాళీలు	-	5
ప్రభుత్వం గెలవడానికి కావాల్సిన సంఖ్య	-	271

అవిశ్వాసానికి మద్దతిచ్చే పార్టీల బలాబలాలు

కాంగ్రెస్	-	48
తృణమూల్ కాంగ్రెస్	-	34
తెలుగుదేశం	-	16
సీపీఎం	-	9
వైకాపా	-	9
సమాజ్‌వాదీ	-	7
ఎన్‌సీపీ	-	6
ఆప్	-	4
ఆర్‌జేడీ	-	4
ఏఐయూడీఎఫ్	-	3
ఐఎన్ఎల్‌డీ	-	2
ముస్లింలీగ్	-	2
జేఎంఎం	-	2
ఎంఐఎం	-	1
సీపీఐ	-	1
జేఅండ్‌కే ఎన్‌సీ	-	1
కేరళకాంగ్రెస్(ఎం)	-	1
ఆర్ఎస్‌పీ	-	1
మొత్తం	-	151

కేంద్రం భయపడింది

- పార్లమెంటు సాక్షిగా తెలుగువారి గొంతు నొక్కింది
- అవిశ్వాస తీర్మానం తిరస్కరణపై వైకాపా ఎంపీల వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు సాక్షిగా తెలుగువారి గొంతునొక్కే కార్యక్రమం జరిగిందని వైకాపా ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం ఆ పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావులు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము ఇచ్చిన అవిశ్వాస నోటీసును పరిగణనలోకి తీసుకోకపోవడంపై స్పీకర్, భాజపా ప్రభుత్వం ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. సభ ఆర్డరులో లేకపోయినా ఆర్థిక బిల్లును ఆమోదింపజేసుకుని, అవిశ్వాసాన్ని మాత్రం తిరస్కరించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. కేంద్రం భయపడే ఇలా చేసిందని పేర్కొన్నారు. తాము పెట్టిన అవిశ్వాసానికి కాంగ్రెస్, టీఎంసీ, ఆప్, సమాజ్‌వాదీ, బీజేడీ, వామపక్షాలు మరికొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. తెదేపా రోజుకో డ్రామా ఆడుతోందని, వైకాపా అవిశ్వాసం పెట్టింది కాబట్టి, ప్రజల మద్దతు ఆ పార్టీకే వస్తోందనే భయంతో ఇప్పుడు అవిశ్వాసమంటూ నాటకమాడుతోందని ఎంపీలు విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలనుకొనేవారే అయితే కేంద్రంలో వారి మంత్రులతో రాజీనామా చేయించిన రోజే ఎన్డీఏలో నుంచి బయటకొచ్చి అవిశ్వాసం పెట్టేవారని వ్యాఖ్యానించారు. తెదేపా పెట్టిన అవిశ్వాసాన్ని అవకాశవాద రాజకీయంగా అభివర్ణించారు. తెదేపా మరోసారి అవిశ్వాస తీర్మానం పెడితే సహకరిస్తారా అని విలేకరులు అడగ్గా.. 'తప్పకుండా.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు ఎవరు ముందుకు వచ్చినా మద్దతిస్తాం. కానీ తెదేపాకు చిత్తశుద్ధి లేదు. తెదేపాలాగా ఎన్డీఏ ప్రభుత్వానికి భయపడటం లేదు కాబట్టే 5 మంది ఎంపీలమే ఉన్నా అవిశ్వాసం పెట్టాం' అని వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు.

రాజకీయ లబ్ధి కంటే ప్రజాప్రయోజనాలే ముఖ్యం: జగన్

'రాజకీయ లబ్ధి కంటే ప్రజా ప్రయోజనాలే మాకు ముఖ్యం. ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రంపై లోక్‌సభలో మేమే మొదట అవిశ్వాస తీర్మానం పెట్టినప్పటికీ..సభలో ఎవరి తీర్మానాన్ని ముందు తీసుకుంటారనేదీ అప్రస్తుతం. రాష్ట్ర ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదా రావడమే మాకు ప్రధానం. ఈ అంశంపై నాలుగేళ్లుగా వైకాపా పోరాడుతోంది. కేంద్రంపై మేం పెట్టిన అవిశ్వాసాన్ని రాజకీయంగా విధిలేని పరిస్థితుల్లో తెదేపా అనుసరించింది. ఇది ప్రజాస్వామ్య విజయం' అని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు.

జనసేన మిస్‌డ్ కాల్ పార్టీ

తెదేపా నేతల విమర్శలు

ఈనాడు డిజిటల్, అమరావతి: 'జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పన్నీర్‌సెల్వంలా మారినా, వైకాపా పద్ధతులను దత్తత తీసుకుని మిస్‌డ్ కాల్ పార్టీలా వ్యవహరించినా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా పోరాటానికి భయపడబోం' అని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 46 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న నేత అండగా ఉన్న 36 ఏళ్ల పార్టీ మాది.. మమ్మల్ని ఎవరూ భయపెట్టలేరని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పవన్ మంగళగిరి వద్ద రెండెకరాలను కారుచౌకగా రూ.40లక్షలకు కొన్నారు కదా అని తాను కూడా కొనేందుకు వెళితే తనకు ఎకరా రూ.ఏడు కోట్లు చెప్పారని పేర్కొన్నారు. అంత స్థోమత లేక వెనక్కు తగ్గానని చెప్పారు. 'పవన్ సున్నితమైన మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఎవరితోనైనా మనసు పారేసుకుంటాడు. మూడు, నాలుగేళ్ల తర్వాత ఆరేసుకుంటాడని' ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు వామపక్ష భావజాలం ఉన్న ఆయన ఇప్పుడు పక్షపాత భావజాలాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. 'గత ప్రభుత్వంలా కాకుండా ఎర్రచందనం వేలం వేసి డబ్బులను ప్రభుత్వానికి జమ చేస్తుంటే అభినందించాల్సింది పోయి విమర్శిస్తున్నారు. ఎప్పటి నివేదికలో చూసుకుని రాష్ట్రం అవినీతిలో నెంబర్ 1 అంటూ మాట్లాడుతున్న పవన్ ప్రస్తుతం చంద్రబాబు పాలనలో అవినీతిలో అట్టడుగున 19వ స్థానానికి చేరిందని స్పష్టం చేస్తున్న ఎన్‌సీఏఈఆర్ నివేదిక చూడలేకపోవడం రాజకీయాల్లో అతని పరిస్థితిని తెలియజేస్తోంది' అని పేర్కొన్నారు. తన మద్దతుతోనే తెదేపా అధికారంలోకి వచ్చిందని భావిస్తున్న పవన్.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి మద్దతు లేకుండా తెదేపా అన్ని స్థానాలను కైవసం చేసుకున్నదని మరవరాదని తెలిపారు. ఓ మాజీ ఎమ్మెల్యే వైకాపాలోకి అడుగుపెట్టాక జగన్ పని అయిపోతే, ఇప్పుడు ఓ మాజీ ఎమ్మెల్సీ జనసేనలోకి అడుగుపెట్టడంతో పవన్ పని అయిపోయిందని చెప్పారు. పవన్‌కల్యాణ్ తీరు ఒక సినిమాలో విశ్రాంతి వరకు హీరో పాత్ర తర్వాత విలన్ పాత్ర పోషించినట్లు ఉందని విమర్శించారు. శాంతిభద్రతలపై మాట్లాడుతున్న పవన్‌కు తనపై ఓ వ్యాసం రాసిన పత్రిక కార్యాలయంపైకి వెళ్లి దౌర్జన్యం చేసినపుడు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. అధ్యయనం కోసమంటూ వేసిన నిజనిర్ధారణ సంఘం చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించమని నివేదిక ఇచ్చిందా? లేదా వీరిని తిట్టడానికి నాలుగేళ్లు పట్టిందా? అంటూ వ్యాఖ్యానించారు.

బేరసారాలకే జగన్ అవిశ్వాసం: మంత్రి జవహర్

తనపై ఉన్న కేసుల నుంచి బయటపడేందుకు కేంద్రంతో బేరసారాలకే జగన్ అవిశ్వాసం అంటున్నారు. మోదీ, జగన్, పవన్ ఒకే తాను ముక్కలు. వారంతా కలిసి రాష్ట్రానికి నష్టం కలిగించాలనుకుంటున్నారు. అందుకే ఎన్‌డీఏ నుంచి బయటకు వస్తున్నాం.

ఎంతటి రాజకీయాలైనా చేస్తాం: మంత్రి రవీంద్ర

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు యుద్ధం మొదలైంది. ఎంతవరకైనా వెళ్తాం. జాతీయ రాజకీయాల్లో తెదేపాతో పెట్టుకున్న పార్టీలు మట్టికరిచాయి. ఎన్డీఏ నుంచి తెదేపా బయటకు రావడంతో భాజపా పతనం ప్రారంభమైంది. రాష్ట్రానికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు.

మతిభ్రమించిన వాడిలా పవన్ వ్యవహారశైలి

తిరుపతి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అవినీతికి పాల్పడ్డారని ఎవరో అనుకుంటున్నారని చెప్పడం, మతిభ్రమించినట్లు అకస్మాత్తుగా వచ్చి మాట్లాడటం, అపై ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకోవడం.. ఓ పరిణతి చెందిన వ్యక్తిలా కాకుండా చిన్నపిల్లల నైజంలా పవన్‌కల్యాణ్ వ్యవహారశైలి ఉందని రాష్ట్ర పరిశ్రమల మంత్రి అమరనాథరెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన సమయంలో భాజపా కేంద్ర నాయకత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై పోరాడుతున్న ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు లోకేష్‌పై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు హర్షించడం లేదన్నారు. శుక్రవారం సాయంత్రం తిరుపతిలో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల కోసం తెదేపాపై నిందలు మోపడం తగదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతిపక్ష వైకాపాతో సైతం తెదేపా కలసి పోరాటానికి సిద్ధమవుతుండగా రాజకీయాల కోసం మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు.

ఛాంపియన్స్

రేపే ఫైనల్
భారత్ x బంగ్లా



భళా మహ్మదుల్లా

• మహ్మద్ వీరోచిత ఇన్నింగ్స్
• ఉత్కంఠ పోరులో లంకపై బంగ్లా గెలుపు

సిసలైన టీ20 మజా అంటే ఇదే! ఓవర్ ఓవర్‌కు మారిన సమీకరణాలు.. ఊహించని మలుపులు.. అభిమానుల్ని మునివేళ్ల మీద నిలబెట్టిన ఘటనలు.. వాగ్వాదాలు.. నాగిని డ్యాన్స్‌లు.. మొత్తానికి బంగ్లాదేశ్-శ్రీలంక మ్యాచ్ అదిరిపోయింది. ఈ నాకౌట్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఈ ఉత్కంఠభరిత పోరులో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మహ్మద్ మహ్మదుల్లా (43 నాటౌట్; 18 బంతుల్లో 3×4, 2×6) వీరోచిత బ్యాటింగ్‌తో 2 వికెట్ల తేడాతో లంకనుపై ఓడించిన బంగ్లా.. నిదహాస్ టీ20 టోర్నీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం భారత్‌తో టైటిల్ పోరుకు సిద్ధమైంది.

కొలంబో


శ్రీలంకకు షాక్.. కచ్చితంగా తమ జట్టే గెలుస్తుందని ఊహించిన ఆ జట్టు అభిమానులకు తీవ్ర నిరాశ! కొలంబోలో బంగ్లాదేశ్ అద్భుతమే చేసింది. దాదాపు చేజారిపోయిన మ్యాచ్‌ను గొప్పగా ఒడిసిపట్టుకుని ఎప్పటికీ గుర్తుండిపోయే విజయాన్ని అందుకుంది. శుక్రవారం మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేయగా.. మహ్మదుల్లా మెరుపులతో లక్ష్యాన్ని బంగ్లా 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ఛేదనలో వాళ్లిద్దరు: 160 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ 33 పరుగులకే లిటన్ దాస్ (0), షబ్బీర్ రెహ్మాన్ (13) వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో తమీమ్ ఇక్బాల్ (50; 42 బంతుల్లో 4×4, 2×6), ముష్ఫికర్ రహీం (28)తో కలిసి బంగ్లా ఇన్నింగ్స్ నిలబెట్టాడు. ఒక దశలో 97/2తో విజయం దిశగా సాగిన బంగ్లా.. స్వల్ప విరామంలో 4 వికెట్లు చేజార్చుకుని 137/6తో పరాజయం దిశగా సాగింది. మహ్మదుల్లా వీలుచిక్కినప్పుడల్లా షాట్లు కొట్టి బంగ్లాను పోటీలో ఉంచాడు. ఈ టోర్నీలో తొలి మ్యాచ్ ఆడిన షకిబ్ అల్ హసన్ (7) కీలక సమయంలో ఔట్ కావడం.. మెహది హసన్ (0) రనౌట్ కావడంతో బంగ్లాకు సమీకరణం మరింత కష్టంగా మారింది. ఆఖరి ఓవర్లో 12 పరుగులు చేయాల్సి ఉండగా.. తొలి బంతికి పరుగు రాకపోవడం.. రెండో బంతికి ముస్తాఫిజుర్ (0) రనౌట్ కావడంతో బంగ్లాకు ఓటమి తప్పదనిపించింది. కానీ మూడో బంతిని బౌండరీ బాది.. ఆ తర్వాత బంతికి డబుల్ తీసిన మహ్మదుల్లా.. ఐదో బంతిని ఫ్లిక్‌తో సిక్సర్‌గా మలిచి బంగ్లాకు సంచలన విజయాన్ని అందించాడు. ఆఖరి ఓవర్లో అనుకోని గొడవ తలెత్తినా.. మహ్మదుల్లా చాలా ప్రశాంతంగా ఆడాడు. తీవ్ర ఒత్తిడిలోనూ అద్భుత షాట్లు కొట్టి జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు.

మెరిసిన పెరీరా: అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంక 9 ఓవర్లలో 43 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈ దశలో లంకను కుశాల్ పెరీరా (61), తిసార పెరీరా (58) ద్వయం ఆదుకుంది. 13వ ఓవర్లో విజృంభించిన ఈ జోడీ రెండు ఫోర్లు, సిక్స్‌తో సహా 18 పరుగులు రాబట్టింది. ముస్తాఫిజుర్ వేసి 17వ ఓవర్లో అయితే తిసార.. వరుసగా రెండు భారీ సిక్స్‌లు అందుకున్నాడు. కుశాల్ ఔటైనా.. తిసార తగ్గలేదు. మరో సిక్స్‌తో 33 బంతుల్లో అర్ధసెంచరీ కూడా పూర్తి చేసుకున్నాడు. అదే జోరు కొనసాగించిన తిసార.. లంక పోరాడే స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు.

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) షబ్బీర్ (బి) షకిబ్ 4; కుశాల్ మెండిస్ (సి) సర్కార్ (బి) ముస్తాఫిజుర్ 11; కుశాల్ పెరీరా (సి) మెహదీ (బి) సర్కార్ 61; తరంగ రనౌట్ 5; శనక (సి) ముష్ఫికర్ (బి) ముస్తాఫిజుర్ 0; జీవన్ (సి) ముస్తాఫిజుర్ (బి) మెహదీ 3; తిసారా (సి)తమీమ్ (బి) రుబెల్ 58; ఉదాన నాటౌట్ 7; ధనంజయ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 159; **వికెట్ల పతనం:** 1-15, 2-22, 3-31, 4-32, 5-41, 6-138, 7-154; **బౌలింగ్:** షకిబ్ 2-0-9-1; రుబెల్ 4-0-41-1; ముస్తాఫిజుర్ 4-1-39-2; మెహదీ హసన్ 4-0-16-1; మహ్మదుల్లా 4-0-29-0; సర్కార్ 2-0-21-1

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమిమ్ (సి) కుశాల్ పెరీరా (బి) గుణతిలక 50; లిటన్‌దాస్ (సి) తిసార పెరీరా (బి) ధనంజయ 0; షబ్బీర్ (స్టంప్డ్) కుశాల్ పెరీరా (బి) ధనంజయ 13; ముష్ఫికర్ (సి) తిసార పెరీరా (బి) అపోన్సొ 28; సర్కార్ (సి) కుశాల్ పెరీరా (బి) మెండిస్ 10; మహ్మదుల్లా నాటౌట్ 43; షకిబ్ (సి) ధనంజయ (బి) ఉదాన 7; మెహదీ రనౌట్ 0; ముస్తాఫిజుర్ రనౌట్ 0; రుబెల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం:** (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) **160; వికెట్ల పతనం:** 1-11, 2-33, 3-97, 4-105, 5-109, 6-137, 7-148, 8-148; **బౌలింగ్:** ప్రదీప్ 1-0-10-0; ధనంజయ 4-0-37-2; అపోన్సొ 3-0-19-1; తిసార పెరీరా 2-0-20-0; గుణతిలక 3-0-24-1; జీవన్ 4-0-24-1; ఉదాన 2.5-0-26-1



నేడే సెమీస్
సింధు x యమగూచి

క్రికెట్లో సచిన్ తెందుల్కర్- మెక్‌గ్రాత్‌ల పోరాటం.. టెన్నిస్‌లో ఫెదరర్- జకోవిచ్‌ల సమరం.. ఫుట్‌బాల్‌లో మెస్సీ- రొనాల్డోల మధ్య పోటీ చూసేందుకు రెండు కళ్లు చాలవు! ఇప్పుడు బ్యాడ్మింటన్‌లోనూ సింధు- ఒకుహర రూపంలో అలాంటి ప్రత్యర్థులు దొరికారు! ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 10 సార్లు ఇది రుజువైంది. వీరిద్దరు బరిలో దిగితే అభిమానులకు బ్యాడ్మింటన్ విందే. క్రీడా ప్రేమికులకు కావాల్సినంత మజానే. శుక్రవారం మరోసారి ఈ విషయం స్పష్టమైంది. ఆల్‌ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఉత్కంఠభరితంగా సాగిన పోరులో మూడో సీడ్ సింధు 20-22, 21-18, 21-18తో ఏడో సీడ్ నొజొమి ఒకుహర (జపాన్)పై చిరస్మరణీయ విజయం సాధించింది. గత ఐదు సార్లు క్వార్టర్స్‌కే పరిమితమైన సింధు.. ఈసారి సెమీస్ చేరుకుని టైటిల్‌కు మరింత చేరువైంది.

సింధు అద్భుతః

తొలిసారిగా సెమీస్‌లో తెలుగు తేజం ● ఒకుహరపై విజయం
ముగిసిన శ్రీకాంత్ పోరాటం ● ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్

భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు సాధించింది. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్ అడ్డంకిని అధిగమించి తొలిసారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గంటా 24 నిమిషాల పాటు సాగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు, ఒకుహరల పోరాటం అద్వితీయం. ఒకరు స్మాష్‌లతో చెలరేగితే మరొకరు డ్రాప్‌లతో విజృంభించారు. ర్యాలీ అస్త్రానికి క్రాస్‌కోర్ట్ షాట్‌తో బదులు. పదునైన రిటర్న్‌లు.. చురుకైన బాడీ లైన్ స్మాష్‌లు.. సుతారంగా డ్రిబ్లింగ్! ఇలా ఆటలో ఉన్న అన్ని షాట్లను ఆడారు సింధు, ఒకుహర. చివరికి ఒత్తిడిని అధిగమించి.. ఆఖరి వరకు విశ్వాసం వీడని సింధునే విజయం వరించింది. భారీ అంచనాల మధ్య ప్రారంభమైన క్వార్టర్స్ పోరులో సింధు, ఒకుహర చిరుతల్లా కదిలారు. తొలి గేమ్ ఆరంభం నుంచి ప్రతి పాయింటుకు చెమటోడ్చిన ఈ ఇద్దరు అసాధారణంగా కలబడ్డారు. ఎట్టకేలకు సింధు 15-13తో ఆధిక్యం సంపాదించింది. 20-19తో గేమ్‌కూ చేరువైంది. ఐతే షటిల్‌ను బయటకు ఆడటం.. ప్రత్యర్థి స్మాష్ సంధించడంతో వరుసగా 2 పాయింట్లు కోల్పోయిన సింధు 20-22తో తొలి గేమ్‌ను చేజార్చుకుంది. రెండో గేమ్‌లో సింధు మొదట్నుంచి ఆధిపత్యం కనబరిచింది. 16-13తో సింధు పైచేయి సాధించింది. ఐతే ఒక్కసారిగా గేరు మార్చింది ఒకుహర. సింధుపై బాడీలైన్ స్మాష్‌లతో చెలరేగింది. వరుసగా 5 పాయింట్లు రాబట్టి 18-16తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మరో 3 పాయింట్లు గెల్చుకుంటే ఒకుహరదే మ్యాచ్. ఐతే షటిల్‌పై నియంత్రణ కోల్పోయిన ఒకుహర ఆట గాడి తప్పింది. వరుసగా పాయింట్లు సమర్పించుకుంది. సింధు సైతం తన అవకాశం కోసం ఓపికగా ఎదురు చూసింది. ప్రత్యర్థి తప్పులు చేసేవరకు అద్భుతమైన డిఫెన్స్ కొనసాగించింది. అందుకు ప్రతిఫలం పొందింది. వరుసగా 5 పాయింట్లు సాధించిన సింధు 21-18తో రెండో గేమ్ గెల్చుకుని మ్యాచ్‌లో ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. 11-10తో ఒకుహర ఆధిక్యంలోకి వెళ్లినా.. వెంటనే ఒక పాయింటుతో స్కోరు సమం చేసింది సింధు. ఒకుహర మరోసారి విజృంభించి 4 పాయింట్లు రాబట్టి 16-12తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ సమయంలో ఒకుహరను అడ్డుకోవడం కష్టమే అనిపించింది. ఎంతో సంయమనంతో ఆడిన సింధు ఆటను పూర్తిగా మార్చేసింది. రెండో గేమ్ మాదిరే ఒకుహర తప్పులు చేయడం.. సింధు జాగ్రత్తగా ఆడటంతో 16-16తో పాయింట్లు సమమయ్యాయి. ఒకదశలో 18-18తో ఇరువురు సమంగా నిలిచారు. ఇక అప్పుడు మొదలైంది సింధు అసలు ఆట. పదునైన స్మాష్‌లతో ఒక్కసారి చెలరేగింది. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా.. పూర్తి సాధికారితతో వరుసగా 3 పాయింట్లు రాబట్టి 21-18తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఒకుహరపై గెలుపోటముల రికార్డును 5-5తో సమం చేసింది. మరో క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ అకానె యమగూచి (జపాన్) 21-15, 21-18తో ఐదో సీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్)ను ఓడించి సింధుతో సెమీస్‌కు సిద్ధమైంది.



శ్రీకాంత్‌కు నిరాశ

పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. ప్రిక్వార్టర్స్‌లో మూడో సీడ్ శ్రీకాంత్ 11-21, 21-15, 20-22తో ప్రపంచ 42వ ర్యాంకర్ హువాంగ్ యుజియాంగ్ (చైనా) చేతిలో ఓడాడు. మూడో గేమ్‌లో 20-18తో మ్యాచ్ పాయింటుకు చేరువైన శ్రీకాంత్‌కు ఓటమి ఎదురవడం ఊహించనిదే. వరుసగా 4 పాయింట్లు చేజార్చుకుని అతడు ఓటమిపాలయ్యాడు. ఓటమి అనంతరం శ్రీకాంత్ కొత్తగా ప్రవేశపెట్టిన సర్వీస్ నిబంధనపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. "తొలి గేమ్‌లో చాలా సర్వీస్ ఫాల్ట్స్ అయ్యాయి. అలా జరుగుతుందని అనుకోలేదు. టోర్నీ మొదటి మ్యాచ్‌లో అంపైర్ ఒక్క తప్పు కూడా ఎత్తిచూపలేదు. రెండో మ్యాచ్‌లో చాలా తప్పుల్ని ప్రకటించాడు. ఈ నిబంధన హాస్యాస్పదం. ఆటలో సర్వీస్‌పైనే ఎక్కువగా దృష్టి సారించాల్సి వస్తుంది. సర్వీస్ ఫాల్ట్ అని అంపైర్ ప్రకటించగానే ఒత్తిడిలోకి వెళ్తున్నా"నని శ్రీకాంత్ ఆవేదన వ్యక్తంజేస్తున్నాడు.

విదర్భ 702/5

రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ ట్రోఫీ మ్యాచ్

నాగ్‌పూర్: రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌లో రంజీ ఛాంపియన్ విదర్భ జోరు కొనసాగిస్తోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 702 పరుగులు చేసింది. వసీం జాఫర్ (286) త్రుటిలో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు అతడు మరో పరుగు మాత్రమే జోడించాడు. వాంఖడే 99 పరుగులతో అజేయంగా ఉన్నాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 28 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఓవర్‌నైట్ స్కోరు 598/3తో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ.. కాసేపటికే జాఫర్ వికెట్ కోల్పోయింది. ఐతే వాంఖడే చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. వాద్కర్ (37)తో ఐదో వికెట్‌కు 91 పరుగులు జోడించాడు.

సంక్షిప్త స్కోర్లు

విదర్భ తొలి ఇన్నింగ్స్: **702/5** (వసీం జాఫర్ 286, గణేశ్ సతీష్ 120, అపూర్వ్ వాంఖడె 99 బ్యాటింగ్, సంజయ్ రామస్వామి 63)


చెన్నైతో బెంగళూరు అమీతుమీ

నేడే ఐఎస్ఎల్ ఫైనల్
రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1లో



బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్-4లో ఫైనల్‌కు వేళైంది. శనివారం జరిగే తుది పోరులో బెంగళూరు ఎఫ్‌సీ.. చెన్నైయన్ ఎఫ్‌సీతో అమీతుమీకి సిద్ధమైంది. తొలిసారి టైటిల్ సాధించాలని సునీల్ ఛెత్రి నేతృత్వంలోని బెంగళూరు పట్టుదలతో ఉంది. సొంతగడ్డపై ఆడబోతుండడం ఆ జట్టుకు అదనపు బలం. ఫెడరేషన్ కప్, ఐ-లీగ్ ట్రోఫీలు గెలిచిన బెంగళూరు ఐఎస్ఎల్ ట్రోఫీని ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. ఈ టోర్నీలో ఇప్పటిదాకా కెప్టెన్ ఛెత్రితో పాటు మికు ఆ జట్టు విజయాల్లో కీలకపాత్ర షోషించారు. వీళ్లిద్దరు ఇప్పటిదాకా 24 గోల్స్ కొట్టారు. 2015 విజేత చెన్నైయన్ కూడా మరో ట్రోఫీ కోసం తహతహలాడుతోంది. జెజె లాల్‌పెకులా కీలక సమయాల్లో గోల్స్ కొడుతూ జట్టుకు వెన్నెముకగా మారాడు.

తప్పు చేయలేదని తేలితేనే..



దిల్లీ: ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడేది లేనిది బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) అధినేత నీరజ్ కుమార్ నివేదికపై ఆధారపడి ఉంటుందని బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా చెప్పాడు. పాకిస్థాన్ అమ్మాయి నుంచి షమి డబ్బు తీసుకున్నాడని అతడి భార్య ఆరోపించిన నేపథ్యంలో పరిపాలకుల కమిటీ (సీఓఏ) అధినేత వినోద్ రాయ్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. "ఫిక్సింగ్ అంశంపై ఏసీయూ అధినేత నీరజ్ కుమార్ విచారణ జరుపుతున్నాడు. అతడికి ఏడు రోజుల సమయమిచ్చాం. ఏ నిర్ణయమైనా నీరజ్ నివేదిక ఇచ్చాకే తీసుకుంటాం. తుది నిర్ణయం సీఓఏ తీసుకుంటుంది" అని ఖన్నా తెలిపాడు. వేలంలో దిల్లీ డేర్‌డెవిల్స్ రూ.3 కోట్లకు షమిని కొనుక్కుంది. బీసీసీఐ ఇప్పటికే షమి సెంట్రల్ కాంట్రాక్ట్‌ను నిలిపి ఉంచిన సంగతి తెలిసిందే. షమి తప్పు చేయలేదని ఏసీఏ తేలిస్తే.. అతడికి వెంటనే కాంట్రాక్ట్ ఇస్తామని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. "షమిపై వచ్చిన అవినీతి ఆరోపణలపైనే ఏసీయూ దర్యాప్తు జరుపుతోంది. అతడు తప్పు చేయలేదని తెలిస్తే వెంటనే అతడికి సెంట్రల్ కాంట్రాక్ట్ ఇస్తాం" అని అన్నాడు. షమి వ్యక్తిగత జీవితానికి సంబంధించి తాము తీర్పులివ్వబోమని స్పష్టం చేశాడు. "షమిపై అతడి భార్య తీవ్ర ఆరోపణలు చేసిన మాట నిజమే. ఈ విషయంలో కోల్‌కతా పోలీసులు విచారణ జరుపుతున్నారు. అది పూర్తిగా వారి పరిధిలోని అంశం"అని ఆ అధికారి వివరించాడు.

ఆఖరి ఓవర్ రచ్చ.. రచ్చ...

ఈ మ్యాచ్ అంతా ఒక ఎత్తయితే బంగ్లా ఇన్నింగ్స్‌లో ఆఖరి ఓవర్ ఒక ఎత్తు. చివరి ఓవర్లో గెలవాలంటే బంగ్లా 12 పరుగులు చేయాలి. క్రీజులో మహ్మదుల్లా ఉండడంతో బంగ్లా శిబిరంలో ఆశలు మిణుకు మిణుకు మంటున్నాయి. కానీ 19వ ఓవర్ ఆఖరి బంతికి మెహదీ హసన్ (0) రనౌట్ కావడంతో మహ్మదుల్లాకు స్ట్రైక్ రాలేదు. ఆఖరి ఓవర్లో అంతా ఉత్కంఠ.. ఉదాన వేసిన షార్ట్ పిచ్ బంతిని ముస్తాఫిజుర్ బ్యాట్ తాకించలేకపోయాడు. రెండో బంతి కూడా ఇలాగే వచ్చింది. బంతి బ్యాట్‌కు తగలకపోయినా.. ముస్తాఫిజుర్ పరుగెత్తడం రనౌట్ కావడం జరిగిపోయాయి. అయితే బ్యాట్స్‌మెన్ భుజం కన్నా ఎక్కువ ఎత్తులో బంతిని విసిరినా అంపైర్ నోబాల్ ఇవ్వకపోవడంపై బంగ్లా సబ్‌స్టిట్యూట్ ఆటగాడు నూరుల్ హసన్ ప్రశ్నించడంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్యుద్ధం మొదలైంది. లెగ్ అంపైర్ నోబాల్ సిగ్నల్ ఇవ్వడం తాము చూశామని బంగ్లా ఆటగాళ్లు వాదించారు. పెవిలియన్‌లో బంగ్లా కెప్టెన్ షకిబ్ అల్ హసన్ ఇక ఆడొద్దు.. వచ్చేయండంటూ తమ బ్యాట్స్‌మెన్‌ను పిలవడంతో కలకలం రేగింది. అయితే కెప్టెన్ పిలిచినా మైదానంలో ఉన్న మహ్మదుల్లా, రుబెల్ హుస్సేన్ కొద్ది దూరం వచ్చి ఆగిపోయారు. అంతా ఉత్కంఠ.. అంపైర్లు బ్యాట్స్‌మెన్‌కు సర్ది చెప్పడం.. పెవిలియన్‌లో షకిబ్ ఆగ్రహంతో ఊగిపోవడం. .పదే పదే తమ ఆటగాళ్లను వచ్చేయమని సంజ్ఞలు చేయడంతో ఏం జరుగుతుందా అని స్టేడియంలో అభిమానులు తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు. మరోవైపు మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్‌తో పాటు బంగ్లా జట్టు కోచింగ్ సిబ్బంది కోట్నీ వాల్ష్, ఖలీద్ మసూద్ రంగప్రవేశం చేసి ఆటగాళ్లను శాంతింపజేయడంతో మళ్లీ మ్యాచ్ కొనసాగింది. ఆడిన తొలి బంతినే బౌండరీ బాదిన మహ్మదుల్లా.. ఆ తర్వాత ఐదో బంతికి స్క్వేర్‌లెగ్ మీదుగా అద్భుత సిక్సర్ బాది బంగ్లాకు మరుపురాని విజయాన్ని అందించాడు. అనూహ్య విజయంతో బంగ్లా ఆటగాళ్లు పట్టరాని ఆనందంతో మైదానంలోకి దూసుకొచ్చి నాగిని నృత్యం చేయగా.. అనుకోని ఓటమితో లంక ఆటగాళ్లు, అభిమానులు హతాశులయ్యారు. బంగ్లా కెప్టెన్ షకిబుల్ చొక్కా విప్పేసి మైదానంలోకి వచ్చి గంతులేశాడు.





షకిబ్ అతి..

ఈ మొత్తం వ్యవహారంలో బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ అతిగా ప్రవర్తించడమే అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. నిబంధనల ప్రకారం ఒక ఓవర్లో ఒక బౌన్సర్ వేసుకోవచ్చు. కానీ తర్వాత బంతిని కూడా ఉదాన భుజానికంటే ఎత్తుగా వేసినా... నోబాల్ ఇవ్వకపోవడం గురించే బంగ్లా ఆక్షేపించింది. ఈ విషయాన్ని మైదానంలో ఉన్న బ్యాట్స్‌మెన్ అంపైర్‌కు ఫిర్యాదు చేయాలి. కానీ మైదానం బయట ఉన్న షకిబ్.. అత్యుత్సాహాన్ని ప్రదర్శించి తమ ఆటగాళ్లను ఆడొద్దు వచ్చేయమనడమే ఆశ్చర్యపరిచింది.

నరైన్ బౌలింగ్ అనుమానాస్పదం



కరాచి: వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ సునీల్ నరైన్ బౌలింగ్ శైలిపై మరోసారి అనుమానం వ్యక్తమైంది. పాకిస్థాన్ ప్రిమియర్ లీగ్‌లో అతడి బౌలింగ్ శైలిని అంపైర్లు తప్పుపట్టారు. ఈ లీగ్‌లో నరైన్.. లాహోర్ ఖలాందర్స్ తరపున ఆడుతున్నాడు. బుధవారం క్వెట్టా గ్లాడియేటర్స్‌తో మ్యాచ్ అనంతరం అతడి బౌలింగ్‌పై అంపైర్లు ఫిర్యాదు నమోదు చేశారు. మరోసారి ఫిర్యాదు అందితే పీఎస్ఎల్‌లో అతడు బౌలింగ్ చేయడం కుదరదు. నరైన్ బౌలింగ్ శైలిని అంపైర్లు తప్పుపట్టడం ఇది కొత్తేం కాదు. 2015 ఐపీఎల్‌లో రెండు సార్లు ఫిర్యాదు అందడంతో అతడు నిషేధం ఎదుర్కొన్నాడు. అదే ఏడాది ఐసీసీ అనుమానాస్పద శైలి కలిగిన నరైన్‌పై బౌలింగ్ చేయకుండా నిషేధం విధించింది. 2014 ఛాంపియన్స్ లీగ్‌లో కూడా శైలి కారణంగా అతడు బౌలింగ్‌కు దూరమయ్యాడు. తాజా ఫిర్యాదు నేపథ్యంలో ఐపీఎల్‌లో అతడు పాల్గొనడం అనుమానాస్పదంగా మారింది.

ఎదురులేని ఫెదరర్

• వరుసగా 16వ విజయం
• సెమీస్‌లో ప్రవేశం
• ఇండియన్ వెల్స్ టెన్నిస్



ఇండియన్ వెల్స్: టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు ఎదురులేకుండా పోతోంది. ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తు అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్నాడు. ఇండియన్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో సెమీస్ చేరి రికార్డు స్థాయిలో ఆరోసారి టైటిల్‌కు చేరువయ్యాడు. శుక్రవారం క్వార్టర్స్‌లో ఫెదరర్ 7-5, 6-1 తేడాతో హ్యాంగ్ చంగ్ (దక్షిణకొరియా)పై విజయం సాధించాడు. దాంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ వరుసగా 16 మ్యాచ్‌ల్లో నెగ్గిన ఫెదరర్.. ఇదివరకు 2006లో సాధించిన తన వరుస విజయాల రికార్డును సమం చేశాడు. క్వార్టర్స్‌లో మొదటి సెట్లో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా తన అనుభవాన్ని రంగరించి ఆడిన ఫెదరర్ ముందంజ వేశాడు. ఇక రెండో సెట్లో ఫెదరర్‌కు పోటీయే లేకపోయింది. చంగ్‌ను ప్రేక్షకుడిని చేస్తూ 6-1తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. సెమీస్‌లో ఫెదరర్.. బోర్నా కొరిచ్ (క్రొయేషియా)తో తలపడనున్నాడు.

వీనస్ జోరు: మరోవైపు మహిళల సింగిల్స్‌లో వీనస్ విలియమ్స్ జోరు కనబరుస్తోంది. క్వార్టర్స్‌లో వీనస్ 6-3, 6-2తో స్వారెజ్ నవర్రో (స్పెయిన్)పై గెలిచి సెమీస్ చేరింది. దాంతో 2001 తర్వాత వీనస్ మళ్లీ ఈ టోర్నీలో సెమీస్ చేరినట్లయింది. వీనస్ సెమీస్‌లో డారియా కసత్కిన (రష్యా)తో తలపడనుంది.



ఆలయంలోని స్వామిఅమ్మవార్లకు పూజలు చేస్తున్న ప్రధానార్చకులు

కైలాసవాహనంపై దేవదేవుల దర్శనం

- లక్షలాది భక్తులతో కిక్కిరిసిన శ్రీశైల క్షేత్రం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల రెండో రోజైన శుక్రవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లు కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాస వాహనంపై కొలువుదీర్చారు. శ్రీభ్రమరాంబాదేవి భక్తులకు మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ ఉత్సవ మూర్తులను శ్రీశైల పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. లక్షలాది మంది భక్తులతో శ్రీశైల మహాక్షేత్రం కిక్కిరిసిపోయింది. భక్తుల రద్దీ కారణంగా దేవస్థానం ఈవో.. శ్రీమల్లికార్జునస్వామి అలంకారదర్శనం ఏర్పాటు చేశారు. 19 వరకు స్వామివారి అలంకార దర్శనం కొనసాగనుంది.

తితిదే ఆన్‌లైన్ సేవల రుసుం తగ్గింపు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను వినియోగించుకునే భక్తులకు సేవా రుసుం తగ్గింది. ఆర్జిత సేవలు, వసతి, ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఈ-హుండీ, ఈ- డొనేషన్ తదితర సేవలకు తగ్గింపు ఛార్జీలు వర్తిస్తాయి. రుసుములపై ఈవో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులతో సంప్రదింపులు జరపడంతో సానుకూల స్పందన లభించింది. క్రెడిట్ కార్డు చెల్లింపులపై సేవా రుసుం 1.5 నుంచి 0.5 శాతానికి తగ్గింది. డెబిట్ కార్డు ద్వారా అయితే రూ.2 వేల వరకు ఎలాంటి రుసుం లేకుండా మినహాయింపు వర్తిస్తుంది. రూ.2 వేల పైబడి చెల్లింపులపై 1 శాతం నుంచి 0.5 శాతానికి తగ్గింది. నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులపై ఇప్పటి దాకా రూ.1000కి రూ.16 వసూలు చేస్తుండగా ఇకపై రూ.7 మాత్రమే వసూలు చేయనున్నాయి. ఈతగ్గింపు వసూళ్లు 14 నుంచే అమల్లోకి వచ్చాయి.

'గేట్'లో సత్తా చాటిన తెలుగోళ్లు

- ఎయిరోస్పేస్ బ్రాంచీలో ప్రథమర్యాంకు
- 100లోపు ర్యాంకుల్లో పదుల సంఖ్యలో మనవాళ్లే..

ఈనాడు - హైదరాబాద్

జాతీయస్థాయిలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో తెలుగు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. కొన్ని బ్రాంచీల్లో 10 లోపు ర్యాంకులను దక్కించుకొని సత్తా చాటారు. ఎయిరోస్పేస్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ మండలం తిప్పనగుంటకు చెందిన భువనచంద్ర మొదటి ర్యాంకు సాధించాడు. తెలుగు రాష్ట్రాలకు చెంది ఎన్ఐటీ వరంగల్‌లో చదువుతున్న పలువురికి 100లోపు ర్యాంకులు దక్కాయి. వందలోపు ర్యాంకుల్లో తెలుగురాష్ట్రాల వారు పదుల సంఖ్యలో ఉంటారని అంచనా. ఎన్ఐటీ వరంగల్‌లో విద్యనభ్యసిస్తున్న బిహార్‌కు చెందిన సౌరవ్ కుమార్ సింగ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు. ఇక దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీల్లో చదివే తెలుగు విద్యార్థుల ర్యాంకులను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరిన్ని ర్యాంకులు ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశించేందుకు ఐఐటీలు సంయుక్తంగా ఏటా గేట్‌ను నిర్వహిస్తున్నాయి. దీంట్లో సాధించిన స్కోర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లు ఓఎన్‌జీసీ, గెయిల్ తదితర దాదాపు 20 సంస్థలు నేరుగా మౌఖిక పరీక్షలకు ఆహ్వానించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈసారి ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించగా, శుక్రవారం మధ్యాహ్నం ర్యాంకులను వెల్లడించారు. నిర్దేశించిన ప్రణాళికకంటే ఒకరోజు ముందుగానే ర్యాంకులను ప్రకటించడం గమనార్హం. దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది రాసి ఉంటారని అంచనా. ఈసారి పరీక్షను ఐఐటీ గువాహటి నిర్వహించింది. పరీక్ష రాసినవారిలో మెకానికల్, ఈసీఈ, సివిల్, ఈఈఈ బ్రాంచీల నుంచే 80 శాతం మంది ఉన్నారు. దీంట్లో అర్హత సాధిస్తే ఆ స్కోర్‌కు మూడేళ్ల వరకు గుర్తింపు ఉంటుంది. ఐఐటీలు, ఎన్ఐటీల్లో వందల సంఖ్యలో తెలుగు విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. గేట్ ర్యాంకుల ఆధారంగా తెలంగాణలో ఏటా 1,500 మంది, ఏపీలో సుమారు వెయ్యి మంది ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఎంటెక్‌లో చేరుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఈసారి సుమారు 1.50 లక్షల మంది పరీక్ష రాసి ఉంటారని అంచనా. సగటున 15-16 శాతం మందే ఈ పరీక్షలో అర్హత సాధిస్తున్నారు.

హైదరాబాద్ కేంద్రంగా..

సివిల్ సర్వీసెస్ మాదిరిగానే గేట్ శిక్షణకు కూడా హైదరాబాద్ హబ్‌గా మారుతోంది. ఉత్తర భారత్‌కు చెందిన వందలాది మంది నగరానికి వచ్చి శిక్షణ పొంది మంచి ర్యాంకులు పొందుతున్నారు. యూపీ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన పలువురు 2, 3, 4, 8 ర్యాంకులను సాధించారని ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ ఛైర్మన్ వైవీ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ పరీక్ష రాస్తున్న వారిలో 30 శాతం గత ఏడాది లేదా అంతకు ముందు సంవత్సరం బీటెక్ పూర్తిచేసి ఉంటారని చెబుతున్నారు. మిగిలిన వారు ప్రస్తుతం బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న వారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ చదివేందుకు సీట్లు దక్కని వారు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ పూర్తి చేసి గేట్ ర్యాంకులతో ఎంటెక్‌ను ఐఐటీ, ఎన్ఐటీ లాంటి సంస్థల్లో పూర్తి చేస్తున్నారు.

విజేతల్లో కొందరు తెలుగు విద్యార్థులు..

ర్యాంకు	విద్యార్థి పేరు	బ్రాంచి
1	పునుకోలు భువనచంద్ర	ఎయిరోస్పేస్
4	రమేష్‌కుమార్ (నారాయణ ఖేడ్)	ఇన్‌స్ట్రుమెంటేషన్
7	బట్ల అజయ్‌కుమార్ (కృష్ణా జిల్లా)	ఈసీఈ
9	దావు అజయ్‌కుమార్‌రెడ్డి (కరీంనగర్)	ఎలక్ట్రికల్
9	సాయిదీప్ (గాజువాక)	ఈసీఈ
15	మన్నెం ప్రత్యూష (నెల్లూరు)	ఈఈఈ
15	పలిక చరిత	బయో టెక్నాలజీ
33	రాజేంద్ర ముళ్లమూడి	ఈఈఈ
47	కేశిరెడ్డి వంశీకృష్ణారెడ్డి	సివిల్

విజయవాడ విద్యార్థికి మొదటిర్యాంకు



భువన్‌చంద్ర

ఈనాడు, అమరావతి: గేట్-2018 ఫలితాల్లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ మండలం తిప్పనగుంటకు చెందిన పునుకొలు భువన్ చంద్రకు మొదటి ర్యాంకు లభించింది. గేట్‌లో 100 మార్కులకుగాను 86.67 మార్కులు అతడు సాధించాడు. భువన్ చంద్ర ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశాడు. గత ఏడాది తొలిసారిగా గేట్ రాయగా 324 ర్యాంకు వచ్చింది. రెండో పర్యాయమైన ప్రస్తుతం జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇస్రో, డీఆర్‌డీవోలలో పని చేసి, దేశానికి సేవచేయాలనే ఉద్దేశంతో ఏరోస్పేస్ బ్రాంచి ఎంచుకున్నానని భువన్ చంద్ర వెల్లడించాడు. నిరుడు జులై నుంచి జనవరి వరకు రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కష్టపడి చదివానని, కోచింగ్ కేంద్రంలోని అధ్యాపకుల సూచనలతో తనకు ఈ ర్యాంకు వచ్చిందన్నాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు(ఐఐఎస్‌సీ), బెంగళూరులో ఎంటెక్ చదవాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. భువన్‌చంద్ర తల్లిదండ్రులు సుబ్బారావు, రోజారాణిలు. తిప్పనగుంటకు చెందిన వీరి కుటుంబం ప్రస్తుతం విజయవాడలో స్థిరపడింది.

పంట ధరల స్థిరీకరణకు ప్రత్యేక 'నిధి'

- ఆర్థిక మంత్రి యనమల హామీ ఇచ్చారు: సోమిరెడ్డి
- కనీస మద్దతు ధర-స్థిరీకరణ నిధిపై సభలో చర్చ

ఈనాడు, అమరావతి: బడ్జెట్‌లో ప్రకటించకపోయినా పంట ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు జిల్లాలో బీపీటీ ధాన్యాన్ని క్వింటాకు రూ.1,630 చొప్పున కొనుగోలు చేస్తామని వివరించారు. పంటలకు కనీస మద్దతు ధర, మార్కెట్ స్థిరీకరణ నిధిపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. నాఫెడ్ ద్వారా కందుల కొనుగోలుకు కేంద్రం 57 వేల టన్నులకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష టన్నుల వరకు కొనుగోలు చేస్తుందని వివరించారు. ఈ-క్రాపింగ్‌తో పని లేకుండా వ్యవసాయాధికారి ధ్రువీకరణ పత్రంపై ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.1,902 కోట్ల వ్యయంతో పంట ఉత్పత్తులు సేకరించిందన్నారు. 2009 నుంచి 2018 వరకు కందులు, మినుములు, పెసలు తదితర పప్పుధాన్యాల మద్దతు ధర 100 నుంచి 120 శాతం పైగా పెరగగా.. వరికి 55 శాతమే పెరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరకు అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారని మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి అంగీకరించారు. రైతులకు బదులు వ్యాపారులకు టోకెన్లు వెళుతున్నాయన్నారు. దీన్ని నియంత్రించాలని ఆదేశించామన్నారు. గిడ్డంగుల నిర్మాణానికి అనుమతులిచ్చినా దస్త్రాలు వెనక్కు వస్తున్నాయన్నారు. రైతులకు మద్దతు ధర, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమల్లో కేంద్రం విఫలమైందని ఈ సందర్భంగా శాసనసభ్యులు ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లాలో తేమ పేరుతో కందుల్ని వెనక్కు పంపిస్తున్నారని, సడలింపు ఇవ్వాలని కొండెపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి కోరారు.

క్రమబద్ధీకరణ ఇబ్బందుల్లేకుండా జరగాలి

అభిప్రాయపడిన మంత్రివర్గ ఉపసంఘం

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడలో ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న స్థలాల క్రమబద్ధీకరణపై ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడ్డ మంత్రి వర్గ ఉపసంఘం శాసనసభ కమిటీహాల్‌లో శుక్రవారం సమావేశమైంది. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వారిని గుర్తించి ముందు పట్టా ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని.. అయితే ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో భూధార్ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది కరకట్ట, కాలువలు ఆనుకొని నిర్మించుకొన్న ఇళ్లను క్రమబద్ధీకరించడానికి సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా లేదని అధికారులు వివరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 338 విజయవాడ వాసులకు కూడా వర్తింపజేయాలని స్థానిక ఎమ్మెల్యేలు కోరుతున్న విషయం ప్రస్తావనకు వచ్చింది. క్రమబద్ధీకరణలపై ఏకాభిప్రాయం రాకపోవడంతో ఈ నెల 27న మంత్రివర్గం మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించింది. సమావేశానికి సీసీఎల్ఏ అనిల్ చంద్ర పునేఠ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్, కృష్ణా జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ తదితరులు హాజరయ్యారు.



సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నాబార్డు నవ్యావిష్కరణ ప్రాజెక్టులు చేపట్టాలి

- రాష్ట్రానికి మరింత సహకారం అందించాలి: చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: పోషకాహార లోపం, రక్తహీనత, హృదయ శస్త్రచికిత్స స్టెంట్లపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని నాబార్డు ఇందుకు సహకరించాలని సీఎం చంద్రబాబు అన్నారు. జల సంరక్షణ ఇతివృత్తంగా రూపొందించిన 'స్టేట్ ఫోకస్ పేపర్ 2018-19'ను శుక్రవారం సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి నాబార్డు అందిస్తున్న సహకారం, భాగస్వామ్యంపై సీఎం సమీక్షించారు. నాబార్డు సహా అనేక బ్యాంకులు ఒకప్పుడు రుణాలిచ్చే వ్యవస్థలుగానే ఉండేవని ఇప్పుడు కాలానుగుణంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని గుర్తించాయన్నారు. ఏపీలో నవ్యావిష్కరణ ప్రాజెక్టులు చేపట్టాలని నాబార్డును ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంధన భద్రత, నీరు, ఆహారం, సామాజిక భద్రత కల్పనలో నాబార్డు సహకారం అందించాలన్నారు.

'నెఫ్రో ప్లస్'కు సంజాయిషీ నోటీసు

ఈనాడు, అమరావతి: రోగులకు డయాలసిస్ సేవలను కాసేపు నిలిపేసిన సంఘటనలో నెఫ్రో ప్లస్ హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంజాయిషీ నోటీసును జారీచేసింది. పీపీపీ విధానంలో చెల్లించాల్సిన మొత్తంలో 80% మార్చి 5వ తేదీనే ఎన్టీఆర్ వైద్య సేవ చెల్లించింది. మిగిలిన మొత్తం చెల్లించేందుకు ఆస్పత్రుల నుంచి సమాచారం రావాల్సి ఉందని ఎన్టీఆర్ వైద్యసేవ యాజమాన్యానికి తెలిపింది. అయినా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే గురువారం పలు ఆస్పత్రుల్లో సేవలను కొద్దిసేపు నిలిపేసింది. సచివాలయంలో శుక్రవారం సమీక్షించిన అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య విలేకర్లతో మాట్లాడుతూ సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 3రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సంజాయిషీ నోటీసును జారీచేశామని తెలిపారు.

ప్రపంచ బ్యాంకు సదస్సుకు సీఆర్‌డీఏ కమిషనర్

ఈనాడు డిజిటల్, అమరావతి: భూమి, పేదరికం మీద ప్రపంచబ్యాంకు వాషింగ్టన్‌లో నిర్వహించనున్న సదస్సుకు సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ చెరుకూరి హాజరు కానున్నారు. సదస్సులో రాజధాని అమరావతి కోసం భూ సమీకరణ పథకంపై ప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. ఈ నెల 19 నుంచి 23 మధ్య ప్రపంచబ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ సదస్సు జరగనుంది. కమిషనర్ పర్యటనకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గరళాన్ని తాగేస్తున్నాం!

- 93 శాతం మంచినీటి సీసాల్లో ప్లాస్టిక్ రేణువులు
- అత్యధికంగా పాలీప్రొపైలీన్ ఉనికి
- న్యూయార్క్ స్టేట్ విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- భారత్ సహా 9 దేశాల్లో నమూనాల పరిశీలన



ముంబయి: మంచినీటి సీసా(బాటిల్)ల్లోని నీటి సురక్షితత్వంపై తాజాగా మరో అధ్యయనం ప్రశ్నలు లేవనెత్తింది. 93 శాతం మంచినీటి సీసా నమూనాల్లో ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులుంటున్నట్లు వెల్లడించింది. భారత్, అమెరికా, బ్రెజిల్, చైనా, ఇండోనేసియా సహా మొత్తం 9 దేశాల్లో 11 సంస్థలకు చెందిన నమూనాలను విశ్లేషించడం ద్వారా న్యూయార్క్ స్టేట్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. భారత్ సహా పలు దేశాల్లో విరివిగా అమ్ముడయ్యే, ప్రముఖ సంస్థలు ఉత్పత్తిచేసిన 259 సీసాల్లోని నీటిని వారు పరిశీలించారు. భారత్‌లో ముంబయి, దిల్లీ, చెన్నైల్లోని 19 ప్రాంతాల నుంచి వీటిని సేకరించారు.

ప్లాస్టిక్ మూతల తయారీకి ఉపయోగించే 'పాలీ ప్రొపైలీన్'.. సీసాల్లోని మంచినీటిలో ఎక్కువగా కనిపిస్తున్న మూలకమని పరిశోధకులు తెలిపారు. సీసాల్లో గుర్తించిన మొత్తం ప్లాస్టిక్ రేణువుల్లో 54 శాతం 'పాలీప్రొపైలీన్'లేనని స్పష్టం చేశారు. రెండో స్థానంలో నైలాన్ (16 శాతం) ఉందని తెలిపారు. పాలీఇథిలీన్ టెరెఫ్తాలేట్ (పీఈటీ) కణాలూ తాగునీటిలో ఉంటున్నాయని పేర్కొన్నారు. సగటున లీటరు నీటికి 10.4 సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు కలుస్తున్నట్లు వెల్లడించారు. చెన్నైలో సేకరించిన ఓ బిస్లెరీ సీసాలో లీటరు నీటిలో 5 వేలకుపైగా సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు కనిపించాయని చెప్పారు. కొన్ని నమూనాల్లో లీటరు నీటికి 10 వేల కంటే ఎక్కువ ప్లాస్టిక్ కణాలు బయటపడ్డాయని తెలిపారు. ప్యాకేజింగ్ ప్రక్రియలో ఎక్కువగా కాలుష్య రేణువుల నీటిలోకి చేరుకుంటున్నాయని వివరించారు.

గతంలోనూ..: మంచినీటి సీసాల్లోని నీటి సురక్షితత్వాన్ని గతంలోనూ పలు అధ్యయనాలు ప్రశ్నించాయి. ముంబయిలోని మంచినీటి సీసాల్లో క్యాన్సర్ కారకాలుంటున్నట్లు బాబా అణు పరిశోధన కేంద్రం(బార్క్) పరిశోధకులు 2015లో ఓ అధ్యయనంలో హెచ్చరించారు. నాడు 18 బ్రాండ్లకు చెందిన 90 నమూనాలను పరిశోధకులు పరిశీలించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) అనుమతించిన పరిమితికంటే ఎక్కువగా స్థాయిలో బ్రోమేట్లు నీటి నమూనాల్లో ఉన్నట్లు గుర్తించారు. భారత్‌లో మంచినీటి సీసాల విక్రయం ద్వారా 2016లో రూ.7,040 కోట్ల వ్యాపారం జరిగింది.

పల్లెల్లోనూ నకిలీ మందులు

ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేల అసంతృప్తి

ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో నకిలీ మందుల వాడకం ప్రభుత్వం దృష్టికి రాలేదనడం దురదృష్టకరమని.. దీనిపై కేసులు కూడా నమోదు చేశారని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో శ్రావణ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి యనమల రామకృష్ణుడు సమాధానమిస్తూ నకిలీ మందులు సరఫరా విషయం ప్రభుత్వ దృష్టికి రాలేదన్నారు. దీనిపై శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నకిలీ మందుల నియంత్రణలో విఫలమయ్యారన్నారు. పల్లెల్లోని దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కల్తీ మందుల వాడకం వల్ల జబ్బు తగ్గకపోగా ప్రమాదం జరుగుతుందని ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి వివరించారు. అనంతరం మంత్రి సమాధానమిస్తూ ఇప్పటిదాకా రాష్ట్రంలో నమోదు చేసిన కేసుల వివరాలు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటనష్టాన్ని అంచనా వేసేందుకు అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఇరి)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. లంబసింగిలో ఎలాంటి సౌకర్యాలు లేవని ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ప్రశ్నించారు. దీనిపై మంత్రి అఖిలప్రియ స్పందిస్తూ..లంబసింగిలో రహదారి నిర్మాణానికి రూ.5కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. అరకు టూరిజం సర్క్యూట్ పేరుతో రూ.183 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు.

గోచీతో వచ్చినా భూములిస్తాం

భాగస్వామ్య సదస్సులో సూటుబూటు వేసుకుని ల్యాప్‌టాప్‌తో వచ్చే వారితో ఒప్పందం చేసుకుని భూములిస్తారనే అపోహలున్నాయని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. దీనిపై మంత్రి అమర్‌నాథ్ రెడ్డి సమాధానమిస్తూ సూటుబూటు వేసుకునే కాదు.. గోచీతో వచ్చినా భూములిస్తామని స్పష్టం చేశారు. విష్ణుకుమార్‌రాజు కూడా బయటకెళ్లే సమయంలోనూ సూటు బూటు వేసుకుంటారని చెప్పారు.

పురపాలిక ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు: ఏపీటీఎఫ్

ఈనాడు అమరావతి: పదో తరగతి విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడం, ప్రత్యేక తరగతులు నిర్వహించడం, సాయంత్రం అల్పాహారం అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని పురపాలిక ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న పురపాలక సంచాలకుల ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

చరిత్ర సృష్టించేది తెలుగువారే: బాలకృష్ణ

- మంత్రి సునీతతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రపంచంలో ఎక్కడైనా చరిత్ర సృష్టించేది తెలుగువారే.. అటువంటి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమారుడిగా, తెలుగుజాతిలో పుట్టినందుకు ఆనందంగా ఉందని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం ప్రాంతానికి మంత్రి పరిటాల సునీత, ఎమ్మెల్యే బీకే పార్థసారథిలతో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగుగంగ, గాలేరినగరి, హంద్రీనీవా సుజల స్రవంతి ఎన్టీఆర్ మానస పుత్రికలని పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన కృష్ణా జలాలతో హిందూపురం ప్రాంతంలో 65 చెరువులను నింపుతామన్నారు. మడకశిర ప్రాంతం వరకు సాగునీటిని తీసుకువెళ్తామని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధిలో హిందూపురం మొదటి స్థానంలో ఉండగా, రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉందన్నారు. పెనుకొండ పరిధిలోని గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకురావడం వల్ల కియా కార్ల పరిశ్రమ వచ్చిందని తెలిపారు. దీనికి అనుబంధంగా మరో 18 పరిశ్రమలు ఏర్పాటు కానుండటంతో యువతకు భారీగా ఉద్యోగ అవకాశలు లభిస్తాయన్నారు. అనంతరం మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రారంభించిన హంద్రీనీవా పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేశారన్నారు. గతంలో ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన హిందూపురం ప్రాంతానికి ఎమ్మెల్యేగా బాలకృష్ణ నీటిని తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గొల్లపల్లి రిజర్వాయర్ నీటి విడుదలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి పరిటాల సునీత తదితరులు

లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీలు

మంత్రి పరిటాల సునీత

ఈనాడు డిజిటల్, అమరావతి: పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా 33 ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను నియమించినట్లు మంత్రి పరిటాల సునీత తెలిపారు. త్వరలోనే జిల్లా, మండల స్థాయుల్లోనూ వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు మహిళలు ఆందోళనకు గురికాకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంలో ఈ కమిటీలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రైవేటు కార్యాలయాల్లోనూ ఇలాంటివి ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013పై జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహిళా హక్కులు, చట్టంలోని విధివిధానాలపై న్యాయనిపుణులు, ప్రొఫెసర్లు, పోలీసు ఉన్నతాధికారులు దృశ్యరూప ప్రదర్శన ద్వారా సచివాలయ ఉద్యోగినులకు అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ.. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు మహిళలు కుటుంబసభ్యులు, తోటి సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. తద్వారా కారకులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్ అరుణ్‌కుమార్, ఆచార్య శాంతి పాల్గొన్నారు.

ధన రాజకీయాలకు కాంగ్రెస్ తెరదించాలి!

- కలకలం రేపిన వీరప్ప మొయిలీ ట్వీట్
- తన ఖాతాను హ్యాక్ చేశారని ఆరోపణ

ఈనాడు–బెంగళూరు: "కాంగ్రెస్ నాయకత్వం ధన రాజకీయాలకు తెర దించాలి. కర్ణాటక ప్రజాపనుల శాఖ మంత్రి, గుత్తేదార్లు కలసి ఎన్నికల్లో అభ్యర్థుల్ని ఎంపిక చేసే విధానం ఉండరాదు" అంటూ మాజీ ముఖ్యమంత్రి వీరప్పమొయిలీ పేరిట వెలువడిన ట్వీట్ ఆ పార్టీని ఇరకాటంలో పడేసింది. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమితి సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ ట్వీట్ ప్రత్యక్షం కావటం చర్చకు ప్రధాన కారణమైంది. దక్షిణ కన్నడ జిల్లా కార్కళ నుంచి తన కుమారుడు హర్ష పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని వీరప్పమొయిలీ చేసిన విజ్ఞప్తికి సమితి సమావేశంలో సానుకూల స్పందన లభించలేదు. ప్రజాపనుల శాఖ గుత్తేదార్లలో ఒకరికి ఆ స్థానాన్ని కేటాయించినట్లు మంత్రి మహదేవప్ప బదులివ్వటంతో ఆగ్రహించిన మొయిలీ ఆ మేరకు ట్వీట్ చేశారని ప్రచారం జరిగింది. మొయిలీ ట్వీట్‌ను సమర్థిస్తూ భాజపా నేతలు సదానందగౌడ, శోభ కరంద్లాజె తదితరులు వరుస ట్వీట్‌లు చేశారు. దీంతో శుక్రవారం ఉదయం మొయిలీ స్పందిస్తూ.. ఆ ట్వీట్ తాను చేయలేదని.. ఎవరో తన ఖాతాను హ్యాక్ చేశారని వివరణఇచ్చారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ.. "వీరప్ప మొయిలీతో మాట్లాడాను. తను ఆ మాదిరి ట్వీట్ చేయలేదన్నారు. అందులో నిజం లేదనీ చెప్పారు" అంటూ వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదా కోరుతూ రైతు నిరశన



రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ గుంటూరు జిల్లా పొన్నూరు మండలం కసుకర్రు గ్రామానికి చెందిన రైతు పూల సుబ్రమణ్యం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. శుక్రవారంతో ఆయన దీక్ష ఐదో రోజుకు చేరుకుంది. పొన్నూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి రత్నరాజు ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. హోదా ఇస్తామని చెప్పి భాజపా మాట తప్పిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ దీక్షను విరమించేది లేదని పూల సుబ్రమణ్యం పేర్కొంటున్నారు. ఆయన గతంలో రాష్ట్ర భాజపా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. దీక్ష ప్రకటించిన నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకుల ఆదేశాలకు పదవికి, పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. –పొన్నూరు, న్యూస్‌టుడే

ఆకర్షణీయ ప్రాంతాల రూపకల్పనపై విద్యార్థులకు పోటీలు

• 18 వరకు దరఖాస్తుకు గడువు

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడలో వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఆనంద నగరాల సదస్సులో భాగంగా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. రాష్ట్రంలోని 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు హాకథాన్ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి డాల్‌బెర్గ్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో విద్యార్థులు ముగ్గురు నుంచి నలుగురు సభ్యుల బృందంగా పాల్గొనాల్సి ఉంది. ఒక బహిరంగ ప్రదేశాన్ని ప్రజలకు ఆకర్షణీయంగా, సుందరంగా ఎలా తీర్చిదిద్దుతారో తమ ఆలోచనా విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గానీ.. చిత్రం, వీడియో రూపంలో గానీ 10, 11 తేదీల్లో ప్రదర్శించాల్సి ఉంటుంది. వినూత్న ఆలోచనతో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు 12న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కారం ఉంటుంది. పేర్లు నమోదుకు ఈ నెల 18వ తేదీని తుది గడువుగా పేర్కొంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



44 ఏళ్ల వయసు... 43 విజయాలు...

డేవిస్‌కప్‌లో భారత జట్టుకు అద్భుత విజయాలు అందించిన లియాండర్ పేస్ ప్రపంచ రికార్డుకు చేరువలో ఉన్నాడు. మరొక్క విజయం సాధిస్తే చాలు డేవిస్‌కప్ చరిత్రలో అత్యధిక డబుల్స్ విజయాలు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఇటలీకి చెందిన నికోలా పీట్రాంజెలి (43 విజయాలు)ని అధిగమిస్తాడు.

మార్టినా మెచ్చినోడు

కాలానికి నిలిచినోడు!

1996, ఆగస్టు 3, అట్లాంటా! తెల్లవారితే ఒలింపిక్స్‌కు ఆఖరి రోజు! ప్రపంచ పటంలో కనీ, కనిపించని మాల్దోవా వంటి దేశాలు సైతం పతక సంబరాల్లో మునిగితేలుతున్నాయి.

కానీ.. శత కోటి భారత్ మాత్రం నిరాశలో మునిగిపోయింది. పాయింట్ల పట్టికలో పేరే లేదు. రిక్తహస్తాలతో వెనుదిరగడం ఖాయమైపోయింది. కానీ ఓ అద్భుతం! ఆశలు అడుగంటిన వేళ.. ఎలాంటి అంచనాలు లేని 22 ఏళ్ల కుర్రాడు సంచలనం సృష్టించాడు. అప్పటి దాకా ఒక్క గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్ కూడా నెగ్గని లియాండర్ పేస్ అద్వితీయ పోరాటంతో దేశానికి పతకం అందించాడు. పేస్ సాధించింది కాంస్యమే కావొచ్చు. కానీ భారతావనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. దేశంలో టెన్నిస్‌ను కొత్త పుంతలు తొక్కించింది.

అంకితభావం, ఆత్మవిశ్వాసం, పట్టుదలకు మారుపేరైన అతడి పోరాటానికి అది ఆరంభం మాత్రమే. రెండున్నర దశాబ్దాల తర్వాత కూడా ముగింపు లేదు. భారత టెన్నిస్ భారాన్ని మోస్తూ, అభిమానులను అలరిస్తూ పేస్ విజయయాత్ర కొనసాగుతూనే ఉంది. ఈ ప్రస్థానంలో అందుకున్న మైలురాళ్లు ఎన్నో! గెలిచిన మనసులు ఎన్నెన్నో! లియాండర్ అంటే పోరాట యోధుడు.. ఆటలోనూ.. జీవితంలోనూ!

ఓ సచిన్‌లా ఓ కపిల్‌లా ఓ ఆనంద్‌లా.. భారత యువత స్ఫూర్తి కోసం చూసే క్రీడా దిగ్గజాల్లో అతడు తప్పక ఉంటాడు. 44 ఏళ్ల వయసులో డేవిస్‌కప్ జట్టులో పునరాగమనం చేయడం సాధారణ విషయమా! పదేళ్ల కిందే రిటైరైన అతడి తోటి ఆటగాళ్లెందరో! భారత్ తరఫున అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఆటగాడిగా రికార్డు సృష్టించిన పేస్ దారి.. పూల దారేమీ కాదు. విజయాల వెంటే బాధలు, వివాదాలు అతణ్ని వెంటాడుతూనే ఉన్నాయి. అయిన పడ్డ ప్రతిసారీ బలంగా లేస్తూ టెన్నిస్ చరిత్రలో గొప్ప డబుల్స్ ఆటగాళ్లలో ఒకడిగా ఎదిగాడు. పేస్

గ్రాండ్‌స్లామ్ చరిత్రలో అత్యంత పెద్ద వయసులో టైటిల్ నెగ్గిన ఆటగాడిగా రికార్డు పేస్ సొంతం. భూపతి నుంచి నవ్రతిలోవా వరకు పేస్ తన సుదీర్ఘ కెరీర్‌లో ఎందరో భాగస్వాములతో కలిసి ఆడాడు. అతడి భాగస్వాముల సంఖ్య 2015లో వంద దాటడం గమనార్హం. ఇంతమంది భాగస్వాములతో ఆడిన ఆటగాళ్లు టెన్నిస్ చరిత్రలో చాలా తక్కువ. కానీ విశేషమేంటంటే తన వ్యక్తిగత టీమ్‌ను మాత్రం మార్చలేదు. ఎన్నో ఏళ్లుగా.. అదే కోచ్, అదే ఫిజియోథెరపిస్ట్, అదే యోగా ట్రెయినర్! వాళ్లెప్పుడూ మారరు. స్పోర్ట్స్ మెడిసిన్‌లో వైద్యుడైన తండ్రి వేస్ కూడా ఎప్పుడూ మద్దతుగా ఉంటాడు.

గొప్పతనమేంటంటే మహేశ్ భూపతితో ఎలా ఫలితాలు రాబట్టాడో... అనామకుడైన లుకాస్ డ్లౌహీతో కూడా అలాగే విజయాలు సాధించాడు.

16 ఏళ్ల వయసులో...

1990లో జూనియర్ వింబుల్డన్ టైటిల్ విజయంతో తొలిసారి అందరినీ ఆకర్షించాడు పేస్. జూనియర్ నంబర్‌వన్ కూడా అయ్యాడు. అదే ఏడాది అంటే, 16 ఏళ్ల వయసులోనే డేవిస్‌కప్‌లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత జట్టులో అంతర్భాగమయ్యాడు. ఎన్నో అద్భుత పోరాటాలతో, ఎన్నో అపురూపమైన విజయాలనందించి.. పేస్‌లేని డేవిస్‌కప్ జట్టును ఊహించలేని పరిస్థితిని కల్పించాడు. పరాజయంలోనూ అతడు మనల్ని నిరాశపరచడు.. పోరాటంతో ఆకట్టుకుంటాడు. జట్టులోకి ఎందరో వచ్చిపోయినా.. పేస్ ఏస్‌లు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.. 27 ఏళ్లుగా! 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు అతడి కెరీర్‌ను సుసంపన్నం చేసినా తన డేవిస్‌కప్ పోరాటాలతో పేస్ ఎక్కువగా గుర్తుండిపోతాడు.

వాళ్లంతా వద్దన్నా..

ఇన్నేళ్లు దేశానికి సేవలందించిన లియాండర్ పేస్ అంటే ఎంత గౌరవముండాలి? అతడికి ఎంత విలువ ఇవ్వాలి? కానీ చిత్రంగా అతడు జట్టులో కొన్నిసార్లు ఏకాకిగా మిగిలిపోయాడు. అందుకు ఉదాహరణ 2012 ఒలింపిక్సే. ఆ ఒలింపిక్స్ సమయానికి డబుల్స్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ఉన్న



భారత ఆటగాడు పేస్ మాత్రమే. డబుల్స్, మిక్స్‌డ్‌లో తనకు నచ్చిన భాగస్వాములను ఎంచుకునే అవకాశం అతడికి ఉంది. కానీ మహేశ్ భూపతి, రోహన్ బోపన్న అతడితో జత కట్టేందుకు తిరస్కరించారు. దీంతో చేసేదీమీ లేక ఏఐటీఏ రెండు డబుల్స్ జట్లను ఎంపిక చేసింది. పేస్ జోడీగా చాలా తక్కువ ర్యాంకు ఆటగాడు విష్ణువర్ధన్‌ను ఎంపిక చేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియాతో ఆడే అవకాశం ఇచ్చింది. తర్వాత ఏఐటీఏ నిర్ణయంపై సానియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 2016లో ఇదే సీన్ పునరావృతమైంది. ఐతే బోపన్నకు ఇష్టం లేకపోయినా ఏఐటీఏ అతడికి జోడీగా పేస్‌ను దించింది. కానీ రియోలో ఘోర వైఫల్యం తప్పలేదు. పేస్‌పై కొందరు ఆటగాళ్లలో విముఖత ఇప్పటికే కొనసాగుతూనే ఉంది. అతడితో కలిసి డేవిస్‌కప్‌లో ఆడేందుకు బోపన్న పదే పదే తిరస్కరిస్తూనే ఉన్నాడు. 2008లో కూడా డేవిస్‌కప్ ఆటగాళ్లంతా కలిసి.. పేస్ నాయకత్వంలో ఆడమంటూ ఏఐటీఏకు లేఖ రాశారు. ఐతే ఈ వివాదాలన్నింటికీ మూల కారణం భూపతితో పేస్ గొడవే అన్నది ఆరోపణ. పేస్ కెరీర్ మొత్తంలో అతణ్ని ఎక్కువగా ఇబ్బందిపెట్టిన అంశం భూపతితో గొడవే వ్యక్తిగత విభేదాలతో 2002లో ఈ జంట విడిపోయింది. ఐతే భూపతి కెరీర్ క్రమంగా మసకబారిపోయినా.. పేస్ మాత్రం ఆ ప్రభావం తనపై పడనివ్వలేదు. భిన్న ఆటగాళ్లతో జోడీ కడుతూ విజయపరంపరను కొనసాగించాడు. కానీ ఆ గొడవ మాత్రం నిరంతరం రగులుతూనే ఉంది. నిరుడు మహేశ్ భూపతి డేవిస్‌కప్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్ కాగానే పేస్‌ను జట్టు నుంచి తప్పించాడు. 27 ఏళ్ల కెరీర్‌లో డేవిస్‌కప్‌లో లేకపోవడం పేస్‌కు అదే తొలిసారి. ర్యాంకింగ్స్‌లో పడిపోయాడన్నది నిజమే అయినా.. వ్యక్తిగత సమీకరణాల కారణంగా భూపతి అతణ్ని తప్పించడాన్నది ఆరోపణ. కానీ మొక్కవోని పట్టుదలను కొనసాగించిన పేస్ ఇప్పుడు చైనాతో పోరుకు మళ్లీ జట్టులోకి వచ్చాడు.

> "నా టెన్నిస్ భాగస్వాముల్లో అత్యుత్తముడు పేసే. లియాండర్ నా ఫేవరెట్".. పేస్‌పై టెన్నిస్ దిగ్గజం మార్టినా నవ్రతిలోవా అప్పట్లో చేసిన వ్యాఖ్యలివి. ఓ ఆటగాడికి ఇంతకంటే కితాబేముంటుంది.

ఆమెతో గొడవలు..

వ్యక్తిగత జీవితంలోనూ పేస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాడు. తాను పేస్ భార్యను అంటుంది రియా పిళ్లై. తమది సహజీవనం మాత్రమే అంటాడు పేస్. ఈ వివాదం ఇప్పుడు న్యాయస్థానానికి చేరుకుంది. కొన్నేళ్లుగా విచారణ సాగుతోంది. పేస్ గృహహింస కేసును కూడా ఎదుర్కొంటున్నాడు. ఏకైక కుమార్తె ఐన కస్టడీ కోసం పోరాడుతున్నాడు. అయినా ఏకాగ్రత కోల్పోకుండా, భారత టెన్నిస్‌లో తనదైన స్థానాన్ని నిలబెట్టుకుంటూ కెరీర్‌ను కొనసాగించడం పేస్ పట్టుదలకు నిదర్శనం. చిన్నతనంలో తన తల్లిదండ్రులు విడిపోయినప్పుడు కూడా ఇంతే ధైర్యంగా నిలిచాడు పేస్.

– జంపా సీతారామ్

కోర్టులోనే కుప్పకూలి..

పేస్ కెరీర్‌లో అన్ని సమస్యలు ఒక ఎత్తయితే 2003లో జరిగిన ఆ ఘటన ఒక ఎత్తు. వచ్చింది చిన్న కష్టం కాదు మరి. అది అతడి కెరీర్‌కే కాదు ఏకంగా ప్రాణాలకే ముప్పుగా మారింది. దిగ్గజ క్రీడాకారిణి మార్టినా నవ్రతిలోవాతో కలిసి వింబుల్డన్ గెలిచిన కొన్ని రోజులకే ఓ టోర్నీలో ఆడుతుండగా అకస్మాత్తుగా కోర్టులో కుప్పకూలిపోయాడు. బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ అని తర్వాత తేలింది. దీంతో ఆ ఏడాదంతా ఆటకు దూరమయ్యాడు. కెరీర్ డోలాయమానంలో పడింది. మరొకరైతే ఎలా ఉండేదో కానీ పట్టుదల, సంకల్పంతో అనారోగ్యం నుంచి పేస్ కోలుకున్నాడు. 2004లో తిరిగి కోర్టులో అడుగుపెట్టిన అతడు నిలకడైనా విజయాలతో డబుల్స్‌లో అత్యుత్తమ ర్యాంకింగ్‌ను కొనసాగించాడు. గ్రాండ్‌స్లామ్‌ల్లోనూ మెరిశాడు. చివరగా అతడు సాధించిన గ్రాండ్‌స్లామ్ టైటిల్ 2016 ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్. దాదాపు రెండేళ్లు కావొస్తోంది. కానీ ఖాతాలో మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేర్చుకోలేడని చెప్పలేం. ఎందుకంటే అతడు లియాండర్ పేస్.

వేళ్ల కొనలు... చేస్తాయి అద్భుతాలు!




నకుల్ బంతి.. క్రికెట్లో ఈ మధ్య బాగా చర్చనీయాంశమవుతున్న మాట! పేసర్ల అమ్ములపొదిలోకి చేరిన సరికొత్త అస్త్రమిది! జహీర్ ఖాన్ మొదట ప్రయోగిస్తే.. భువనేశ్వర్ కుమార్ ఈ బంతిని వేయడంలో రాటుదేలాడు. తాజాగా శార్దూల్ ఠాకూర్ ఈ తరహా బంతులతో అందరి దృష్టిని ఆకర్షించాడు. సాధన చేస్తే ఎవరైనా ఈ బంతిని వేయొచ్చు కానీ.. 'నకుల్'తో విజయవంతమవుతోంది కొందరే..! అసలు దీని ప్రత్యేకత ఏంటి.. వేయడం ఎలా.. పేసర్లు అనుసరిస్తున్న వ్యూహం ఏంటి?

నకుల్ బంతి.. క్రికెట్‌కు ఇది కొత్తే..! ఐతే బేస్‌బాల్ క్రీడలో దశాబ్దాలుగా ప్రయోగంలో ఉంది. జహీర్ ఖాన్ విజయవంతంగా దీన్ని ఉపయోగించడంతో క్రికెట్లోనూ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎక్కువగా పేసర్లు సంధిస్తున్న ఈ బంతిని స్పిన్నర్లు నరైన్, అశ్విన్ కూడా అందిపుచ్చుకున్నారు.

నకుల్ అంటే.. వేలి కణుపు. బంతి వేగాన్ని అసాధారణంగా తగ్గించేందుకు బేస్‌బాల్‌లో వేళ్ల కొనలతో బంతిని వేస్తారు కాబట్టి దీనికి నకుల్ బంతి అని పేరు వచ్చింది.

ఏంటి తేడా..?



సాధారణ గ్రిప్

పేసర్ వేసే సాధారణ బంతికి, నకుల్ బంతికి ప్రధాన తేడా.. బంతిని పట్టుకునే విధానం, దాన్ని వేయడంలోనే ఉంటుంది. సాధారణంగా బొటన వేలిని బంతి కింద ఉంచి.. చూపుడు, మధ్య వేళ్లను బంతి సీమ్‌పై కప్పేసి బంతిని వేస్తారు. చేతి నుంచి వెలువడ్డాక అది గుండ్రంగా తిరుగుతూ దూసుకెళ్తుంది. పిచ్‌పై పడ్డాక మరింత వేగంగా ముందుకెళ్తుంది.

నకుల్ బంతిని వేసే సమయంలో బౌలర్లు.. చూపుడు వేలు, మధ్య వేళ్ల గోర్లతో సీమ్‌ను పట్టుకుంటారు. వదిలేటప్పుడు మణికట్టు బలం ఏమాత్రం ఉపయోగించరు. వేళ్లతోనే అలా బంతిని వదులుతారంతే. ఇలా చేయడం వల్ల బంతి గుండ్రంగా తిరగకుండా నేరుగా వెళ్తుంది. చూడ్డానికి ఫుల్‌టాస్ బంతిలా అనిపిస్తుంది. కానీ అకస్మాత్తుగా పిచ్‌పై పడుతుంది. వేగం బాగా తగ్గిపోయి.. అనూహ్యంగా కదులుతుంది. ఒకవేళ బంతి సీమ్‌పై పిచ్ అయ్యిందంటే ఊహించని రీతిలో బౌన్స్ అయ్యే అవకాశం కూడా ఉంది.

అందుకే బోల్తా..

నకుల్ బంతి స్లో డెలివరీ లాంటిదే. అయితే దీన్ని సరిగా అంచనా వేయలేక బ్యాట్స్‌మెన్ ఇబ్బందిపడుతుంటారు. స్లో బంతి వేసేటప్పుడు మణికట్టు స్థితిని గుర్తించవచ్చు. బ్యాట్స్‌మన్ గుర్తించి అందుకు తగ్గట్టుగా షాట్ ఆడతాడు. నకుల్ బంతి వేసేటప్పుడు.. మణికట్టు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు. బంతిని పట్టుకునే గ్రిప్ మాత్రమే భిన్నంగా ఉంటుంది. బ్యాట్స్‌మన్ దాన్ని గుర్తించడం సులభమేం కాదు. అందుకే ఆ బంతిని ఎదుర్కోవడం వారికి సమస్యగా మారుతోంది.


ఎక్కడ వేస్తారు..

సాధారణంగా బౌలర్లు గుడ్ లెంగ్త్‌కు కాస్త దూరంలో ఈ బంతిని వేస్తారు. ఇలా ఊరించే లెంగ్త్‌లో బంతిని వేయడం వల్ల బ్యాట్స్‌మన్ షాట్ ఆడేందుకు ప్రయత్నిస్తాడు. కానీ అతడు షాట్ కొట్టేందుకు ఉపక్రమించాక గానీ తెలియదు అతడు ఎదుర్కోబోయేది నెమ్మదైన బంతి అని, అది అంచనా వేయలేని రీతిలో వస్తుందని. దీని వల్ల బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని క్యాచ్‌కు వెళ్లే ప్రమాదముంటుంది. సాధారణంగా బౌలర్లు మూడు నాలుగు బంతులను వేగంగా వేసి.. అదే దిశలో తర్వాత నకుల్ బంతిని వేస్తారు. అకస్మాత్తుగా బంతి వేగం పడిపోవడంతో బ్యాట్స్‌మన్ షాట్‌ను ఆడటం కష్టసాధ్యంగా మారుతుంది.

అంత తేలికేం కాదు..

నకుల్ బంతిని వేయడం అంత సులభమేం కాదు. ప్రాక్టీస్ చేయకుండా ఈ బంతిని వేయడం కష్టమే. భువనేశ్వర్ కుమార్ దాదాపుగా ఆరు నెలలు నెట్స్‌లో శ్రమించాక దీనిపైపై పట్టు సాధించాడట. జహీర్ ఖాన్ తొలిసారి 2011 ప్రపంచకప్‌లో నకుల్ బంతితో బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బందిపెట్టాడు. శ్రీలంకలో ముక్కోణపు సిరీస్‌లో శార్దూల్ ఠాకూర్ నకుల్ బంతితో వార్తల్లో నిలిచాడు. అతడు ఈ బంతిని విజయవంతంగా వేయడం కోసం రెండేళ్లు కష్టపడ్డాడట.

నకుల్ సంధించేదిలా...



- బంతిపై పట్టుకోసం బొటనవేలిని కింద ఉంచి.. చూపుడు, మధ్య వేలి గోర్లతో పట్టుకోవాలి.
- వేసే సమయంలో మణికట్టును వంచకుండా నిటారుగా ఉంచాలి.
- బంతిని బలంగా విసరకుండా.. అలా నేరుగా వదలాలి.
- బంతి నేరుగా వెళ్లేలా వేళ్లతో తోయాలి.
- నకుల్ బంతి ఎక్కువగా గుండ్రంగా తిరగదు కాబట్టి బంతి అస్థిరంగా మారుతుంది. గాలి ఒత్తిడి కారణంగా అది అనూహ్యంగా కదులుతుంది.

లక్ష్యం కోసం

కష్టాలకు గురిపెట్టి..



దీపిక కుమారి.. ప్రపంచ ఆర్చరీలో ఆమె ఓ టాప్ ఆర్చర్. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలవడం.. రికర్వ్‌లో నంబర్‌వన్‌గా నిలవడం లాంటి ఎన్నో ఘనతలు ఆమె సొంతం. కానీ దీపిక పడ్డ బాధలకు ఈ స్థాయికి రావడం చాలా ఎక్కువ. ఎందుకంటే దీపిక కుటుంబం ఒకప్పుడు ఆకలి బాధలు తీర్చుకోవడం కోసమే చాలా కష్టపడింది. రాంచీలోని ఒక మారుమూల ప్రాంతంలోని బీద కుటుంబంలో పుట్టిన దీపిక.. ఆకలి తీర్చుకోవడానికే విలువిద్యలో కొనసాగింది. అసలు ఆమె ఆర్చరీలోకి రావడమే వింత. ఎందుకంటే ఇంట్లో పెద్ద అమ్మాయి కావడంతో చిన్న వయసులోనే కుటుంబ బాధలను అర్థం చేసుకుంది. తాను బయటకు వెళిపోతే మిగిలిన వారిపై భారం కొంతైనా తగ్గుతుందని భావించింది. రాంచికి దగ్గర్లో ఉన్న ఆర్చరీ అకాడమీకి వెళ్లిన దీపిక.. తొలి ప్రయత్నంలో దారుణంగా విఫలమైంది. సరైన పోషకాహారం లేక బలహీనంగా ఉండడంతో విల్లు సరిగా పట్టుకోవడమే రాలేదు ఆమెకు. కానీ ఉచితంగా భోజనం దొరుకుతుందనే ఒక ఒక్క కారణం ఆమెను అక్కడ నుంచి పోనీయలేదు. అకాడమీ వాళ్లను తనకు ఒక అవకాశం ఇవ్వమని ప్రాధేయపడి ఒప్పించింది. మరోవైపు ఆమె నాన్న దీపికను అకాడమీకి పంపడానికి అంగీకరించలేదు. రాంచిలో అమ్మాయిలు 16 ఏళ్లు దాటితే పెళ్లి చేసేస్తారు. దీనికితోడు అమ్మాయి బయటకు వెళ్లి ఆటలాడతానంటే అస్సలు ఒప్పుకోరు. దీపిక నాన్న దీనికి మినహాయింపేమి కాదు. కానీ దీపిక ఆయన్నీ ఎలాగోలా ఒప్పించింది. అలా 12 ఏళ్ల వయసులో బాణం చేపట్టిన దీపిక.. తన గురిని పెంచుకుంది. 2010 కామన్వెల్త్ క్రీడల్లో పసిడి, 2012 టర్కీ ప్రపంచకప్‌తో స్వర్ణంతో దీపిక ఏంటో అందరికి తెలిసిపోయింది. ఇంత పేరున్నా.. సత్తా ఉన్నా ఒలింపిక్స్‌లో పతకం తీసుకు రాలేకపోవడం ఆమెను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. అందుకే 2020 టోక్యో ఒలింపిక్స్ కోసం కఠోర సాధన చేస్తోంది.

20 ఏళ్లు వెనక్కి వెళితే.. మూడు అడుగుల పొడవు.. 15 కేజీల బరువు.. చేతి బొటను వేళ్లు, రెండు కాళ్లు లేని ఆమెను చూసి భవిష్యత్‌లో ఛాంపియన్ అవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. అసలు ఆమె శరీరక స్థితి ఏమిటి.. ఆటలేంటి? కానీ ఒకటి కాదు రెండు కాదు ఆరు ఆటల్లో మంచి నైపుణ్యం చూపిస్తూ.. పతకాల మీద పతకాలు సాధిస్తూ.. ఔరా అనిపించింది ఒక్సానా మాస్టర్స్! ప్రస్తుతం ప్యాంగ్‌చాంగ్‌లో జరుగుతున్న వింటర్ పారాలింపిక్స్‌లో 12 కి.మీ స్కీయింగ్‌లో కాంస్యం గెలిచిన ఈ అమెరికా అమ్మాయి.. బయథ్లాన్‌లో రజతంతో మెరిసింది.



భళా... ఒక్సానా

1986లో ఉక్రెయిన్‌లో చెర్నోబిల్ అణు ప్రమాదం సంభవించినప్పుడు ఏర్పడిన రేడియేషన్ వల్ల ఒక్సానా వికలాంగురాలిగా పుట్టింది. ఆమె తన తొలి ఏడు సంవత్సరాలు అనాధాశ్రమంలో పెరిగింది. ఇక్కడ వార్డెన్, ఇతర సీనియర్లతో మానసికంగా, శారీరకంగా ఇబ్బంది ఎదుర్కొంది. ఆ తర్వాత ఆమెను ఒక అమెరికా ఆవిడ దత్తత తీసుకుంది. యుఎస్‌కు వచ్చినప్పుడు ఒక్సానా వయసు ఎనిమిదేళ్లే. మంచి ఆహారం అంటే ఏమిటో తెలిసింది ఆమెకు అప్పుడే. బరువు పెరిగినా.. ఒక్సానాను ఏదో రూపంలో అనారోగ్యం వెంటాడేది. ఆమెకు రెండు చేతుల్లో ఐదేసి వేళ్లు మాత్రమే ఉండేవి. రెండు చేతుల్లోనూ బొటను వేలు లేదు. అంతేకాక ఆమె ఎడమ కాలు.. కుడి కాలు కంటే ఆరు అంగుళాల చిన్నది. కొన్ని పరీక్షల అనంతరం ఆమె కడుపులోనూ కొన్ని భాగాలు ఉండాల్సిన చోట లేవని..చేతి కండర బంధానాల్లోనూ లోపాలున్నాయని వైద్యులు తేల్చారు. అంతేకాదు ఒక్సానా పంటి అనామిల్ లేకుండానే పుట్టింది. బొటను వేళ్లు లేకపోవడంతో మిగిలిన పిల్లల్లా కనీసం స్లైడ్ బార్‌ను పట్టుకుని జారలేకపోయేది.. పదే పదే పట్టుకోల్పోయి పడిపోయేది. ఇంతటి అనారోగ్య సమస్యలు ఉన్నా.. ఒక్సానా ఛాంపియన్‌గా ఎదిగిదంటే కారణం ఆమె అకుంఠిత దీక్ష. పట్టుదల వల్లే.



ఆటలు ఆడితే..

శరీరాన్ని చురుగ్గా ఉంచేవి ఆటలు.. ఒక్సానాకు వైద్యులు చెప్పింది కూడా ఇదే. చచ్చుబడి ఉన్న ఆమె అవయువాల్లో కదలికలు తీసుకు రావాలంటే ఆటలకు మించినవి లేవని వాళ్లు సలహా ఇచ్చారు. ఆటల కోసం ఆమె చేతి వేళ్లకు శస్త్ర చికిత్సలు చేయించుకుంది. మొదట రోయింగ్‌లో అడుగుపెట్టిన ఆమె.. రాబ్ జోన్స్‌తో కలిసి 2012 పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచింది. యుఎస్ పారాలింపిక్ కోచ్ ఇలీన్ కెరీ అండతో ఆమె తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకుంది. కొలరాడోలోని నాస్డాక్ శిక్షణ శిబిరం ఒక్సానాను రాటుదేల్చింది. అక్కడే ఆమెకు మరో పారా అథ్లెట్ అరోన్ పైక్‌తో అనుబంధం ఏర్పడింది. శిక్షణలో వీళ్లిద్దరూ ఒకరికొకరు తోడు. 2014 సోచి పారాలింపిక్స్‌లో వీళ్లిద్దరూ పోటీపడ్డారు. ఈ పోటీల్లో క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో ఒక్సానా రజతం, కాంస్యం గెలిచింది. ఇప్పుడు అమెరికాలో ఒక్సానాకు ఎంతో క్రేజ్. ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని అంతర్జాతీయ అథ్లెట్‌గా ఎదిగిన ఆమెను టయోటా, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ లాంటి సంస్థలు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాయి. క్రాస్‌కంట్రీ స్కీయింగ్ మాత్రమే కాదు పారా సైక్లింగ్, బయథ్లాన్, అడాప్టివ్ రోయింగ్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ లాంటి క్రీడల్లోనూ ఒక్సానా సత్తా చాటుతోంది.

ఈనాడు సినిమా



భారతంలో అర్జునుడిలా...

మహాభారతంలో అర్జునుడి అయిదో పేరు సవ్యసాచి. ఆయన తన రెండు చేతులతో ఒకే వేగంతో విలువిద్య ప్రదర్శిస్తాడు. అలా మా కథానాయకుడు కూడా రెండు చేతుల్ని సమర్థవంతంగా వాడి తన ప్రత్యర్థులపై పోరాటం చేశాడు. ఆ కథేమిటో తెర పైనే చూడాలంటున్నారు చందు మొండేటి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సవ్యసాచి'. నాగచైతన్య కథానాయకుడు. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య - చందు కలయికలో రూపొందుతున్న చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. ఆర్.మాధవన్, భూమిక ముఖ్యపాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.ఎం) నిర్మిస్తున్నారు. ఎమ్.ఎమ్.కీరవాణి స్వరకర్త. శుక్రవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. అందులో నాగచైతన్య మాస్ లుక్‌లో దర్శనమిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "సినిమా పేరుకు తగ్గట్టుగానే నాగచైతన్య పాత్ర ఉంటుంది. నాగచైతన్యంలోని మాస్ కోణం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలోని కీలక సన్నివేశాల్ని అమెరికాలో కూడా తెరకెక్కించబోతున్నాం. జూన్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. రావు రమేష్, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: యువరాజ్, కళ: రామకృష్ణ, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, పోరాటాలు: రామ్ లక్ష్మణ్.

కథ చెప్పారా?


కొరటాల శివ


నాని

మరొక కొత్త కలయికలో సినిమాకి రంగం సిద్ధమవుతోందా? నాని కోసం కొరటాల శివ కథని సిద్ధం చేశారా? అవుననే అంటున్నాయి తెలుగు సినీ వర్గాలు. ప్రస్తుతం నాని 'కృష్ణార్జున యుద్ధం'తోనూ... కొరటాల శివ 'భరత్ అనే నేను' చిత్రంతోనూ బిజీగా ఉన్నారు. ఆ చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాక, ఈ ఇద్దరి కలయికలోనే సినిమా పట్టాలెక్కనున్నట్టు తెలిసింది. ఇదివరకు రామ్‌చరణ్‌తో పాటు, ఎన్టీఆర్‌కీ కథలు చెప్పి ఒప్పించాడు కొరటాల. అయితే ఆ ఇద్దరూ కొత్త చిత్రాలతో బిజీ అయిపోయారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కనున్న మల్టీస్టారర్ చిత్రం తర్వాతే ఎన్టీఆర్, రామ్‌చరణ్‌కి తీరిక దొరికే అవకాశం ఉంది. అందుకే ఆ లోపు నానితో సినిమా చేయాలనే ఆలోచనలో దర్శకుడు కొరటాల ఉన్నారని, ఇప్పటికే కథ కూడా వినిపించారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

యాత్రకి ముహూర్తం


మంచు విష్ణు

మంచు విష్ణు కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. ప్రగ్యా జైస్వాల్ కథానాయిక. జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వం వహించారు. కీర్తి చౌదరి, కిట్టు నిర్మాతలు. ఎం.ఎల్.కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు. ఏప్రిల్ 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించింది చిత్రబృందం. "విజయవంతమైన కలయికగా గుర్తింపు పొందిన మంచు విష్ణు - జి.నాగేశ్వరరెడ్డి నుంచి వస్తున్న మరో చిత్రమిది. 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' తరహాలోనే మరోసారి ఇంటిల్లిపాదికీ నచ్చే వినోదంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు. విష్ణు, బ్రహ్మానందం జోడీ, ఆ ఇద్దరి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు చక్కటి హాస్యం పంచుతాయి. అమెరికా, మలేసియా, హైదరాబాద్‌లో చిత్రీకరణ జరిపాము"ని తెలిపాయి చిత్రవర్గాలు. తనికెళ్ల భరణి, కోట శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, ప్రవీణ్, విద్యుల్లేఖ రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రావా, తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి, సంగీతం: తమన్.



అది సాధ్యం కాని విషయమే!

చేస్తున్న పని సంతృప్తినిస్తున్నప్పుడు, అందుకోసం ఎంత సమయమైనా కేటాయించొచ్చని చెబుతోంది కాజల్. పనే జీవితం అని నమ్మిన నేను, అందుకోసం వ్యక్తిగత జీవితాన్నీ పక్కన పెట్టిన సందర్భాలు నా కెరీర్‌లో చాలానే ఉన్నాయి అని చెప్పుకొచ్చిందామె. త్వరలోనే 'ఎమ్.ఎల్.ఎ'తో సందడి చేయబోతున్న కాజల్, ఇటీవల కథాబలమున్న చిత్రాలపైనే దృష్టి పెట్టింది. వృత్తి జీవితానికీ, వ్యక్తిగతానికీ మధ్య సమతూకం పాటించాలనే మాట తరచుగా వినిపిస్తుంటుంది, మీరు కూడా అంతేనా? అని అడిగితే... "ఆ విషయంలో సమతూకమంటే, సాధ్యం కాని విషయమే" అని జవాబిస్తోంది. "జీవితంలో ఏదో ఒకటి సాధించాలని, ఒక స్థానానికి చేరుకోవాలనే లక్ష్యం ఉన్నప్పుడు ఎవరికైనా పనిపైనే దృష్టి ఉంటుంది. నా విషయంలోనూ అంతే. కథానాయికని అయినప్పట్నుంచి నా జీవితాన్ని తిరిగి చూసుకొంటే 90 శాతం వృత్తిగత జీవితమే కనిపిస్తుంది. ఆ విషయం ఓ గొప్ప సంతృప్తినిస్తోంది. సినిమా పరంగా ప్రతి క్షణాన్నీ ఆస్వాదించా" అని చెప్పుకొచ్చింది కాజల్.

పంచ్ డైలాగ్

తల్లిదండ్రులు ఎంత ఆస్తిపరులైనా, అందులో చిల్లిగవ్వ కూడా తాకకుండా తను కష్టపడి సంపాదించి, వాళ్లకెవరైతే తిండిపెడతాడో వాడే అసలైన మగాడు

చిత్రం: అరుణాచలం

– పంపినవారు: టి.కాశీ విశ్వనాథ శర్మ, జనుపల్లి, అమలాపురం

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



కసితో... డ్యాన్స్ నేర్చుకున్నా!

'షీలా కీ జవానీ', 'చిక్నీ చమేలీ', 'కాలా చస్మా.' ఈ మూడు పాటల్లోనూ కత్రినాకైఫ్ తన స్టెప్పులతో ఓ ఊపు ఊపేసింది. వెండితెరపై ఆమె పాటలు చూస్తుంటే యువతరం ఉర్రూతలూగిపోయేంత మంచి డ్యాన్సర్‌గా పేరుతెచ్చుకొంది కత్రిన. అదే కత్రినాను ఓ డ్యాన్స్ మాస్టర్ 'ఈమె డ్యాన్స్‌లో జీరో' అన్నాడట. మరి ఆయన ఎప్పుడు...ఎందుకు అన్నాడో కత్రినా మాటల్లోనే చూద్దాం. రాణీ ముఖర్జీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'హిచ్‌కీ'. ఈ చిత్రంలో తనకున్న ఓ శారీరక సమస్య కారణంగా జీవితంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంది రాణి. తన బలహీనతనే బలంగా మార్చుకొని తనేంటో నిరూపించుకొంటుంది. ఆ నేపథ్యంలోనే కొంతమంది సెలబ్రిటీలను కెరీర్‌లో ఎదురైన సమస్యలు ఏంటి? వాటిని ఎలా అధిగమించారో అడుగుతోంది 'హిచ్‌కీ' చిత్రబృందం. ఇందులో భాగంగా కత్రినాను అడిగితే "వెంకటేష్‌తో కలిసి నేను నటించిన చిత్రం 'మల్లీశ్వరి'. ఆ సినిమా పాటల్లో నేను డ్యాన్స్ సరిగా చేసేదాన్ని కాదు అనే విషయం కొరియోగ్రాఫర్ రాజు సుందరం ముఖం చూస్తే అర్థమయ్యేది. కానీ ఆయన నన్ను ఒక్క మాట కూడా అనలేదు. సల్మాన్‌ఖాన్‌తో 'వాంటెడ్'లో నటిస్తున్నప్పుడు ఆ సినిమా కొరియోగ్రాఫర్ సల్మాన్‌తో నేను డ్యాన్సర్‌గా జీరో అని చెప్పారట. ఆ విషయం తెలిసి షాక్ గురయ్యాను. ఈ రెండు సంఘటనలు కత్రినాలో డ్యాన్స్ బాగా చేయాలనే కసిని రగిలించాయి. "కథక్ గురువు వీరు కృష్ణన్ దగ్గర రోజూ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు డ్యాన్స్ నేర్చుకున్నాను"అని గుర్తుచేసుకొంది కత్రినా. కొరియోగ్రాఫర్ బాస్కో సీజర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది కత్రిన. "'రేస్'లో నేను గొప్పగా డ్యాన్స్ చేశానని పేరు వచ్చిందంటే కారణం బాస్కో సీజర్. ఆయన నాలో కలిగించిన ఆత్మవిశ్వాసంతోనే నేను డ్యాన్స్ చేయగలిగాను. అలా జీరో డ్యాన్సర్ అనే ముద్రను నెమ్మదిగా చెరిపేసుకున్నాను"అని చెప్పింది కత్రిన.



ఇలాంటి చిత్రం వచ్చి చాలా కాలమైంది



ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన చిత్రం 'లక్ష్మీ'. ఎ.ఎల్.విజయ్ దర్శకుడు. ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్ నిర్మాతలు. హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "ప్రభుదేవాతో ఎప్పుడు సినిమా చేసినా కొన్ని కొత్త విషయాలు నేర్చుకొంటుంటా. ఆయన ప్రావీణ్యం నృత్యంలోనే కాకుండా, స్క్రిప్ట్ విషయంలోనూ కనిపిస్తుంది. అంతా కలిసి ఓ మంచి సినిమా చేశాం" అన్నారు. ప్రభుదేవా మాట్లాడుతూ "దర్శకుడు విజయ్‌తో 'అభినేత్రి' చేశా. ఆ తర్వాత 'అభినేత్రి 2' చేద్దామనుకొన్నాం. అప్పుడు ఈ సినిమా స్క్రిప్ట్ వినిపించాడు విజయ్. ఇది నృత్య ప్రధానమైన చిత్రం. డ్యాన్స్ సినిమా అని విజయ్ చెప్పగానే... అది ఒక స్థాయిలో ఉండాలనుకొన్నా. నిర్మాతలు కూడా ఆ అభిప్రాయంతోనే ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల నుంచి పిల్లల్ని ఎంపిక చేసి ఈ చిత్రం చేశాం. చిన్నారులతో కలిసి నటించడం మంచి అనుభవం" అన్నారు. "భవిష్యత్తులో తెలుగు, తమిళ భాషల్లో మరిన్ని సినిమాలు చేస్తామ'న్నారు నిర్మాతలు.

మీ ప్రేమే... నా ఆశ



బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్‌ఖాన్ బ్రెయిన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారనే ఇప్పటి వరకూ అందరూ అనుకున్నారు. కానీ ఈ విషయంపై ఆయన స్పష్టత ఇచ్చారు. "కొన్ని రోజుల నుంచి చేసిన పరీక్షల ద్వారా నాకు 'న్యూరో ఎండ్రోక్రైన్ ట్యూమర్' అని నిర్ధారించారు వైద్యులు. ఇది నయం చేయడానికి కష్టమైన వ్యాధే కానీ నా చుట్టూ ఉన్నవాళ్లు, నా అభిమానులు చూపిస్తున్న ప్రేమ జీవితంపై నాలో ఆశను చిగురింపజేస్తోంద"న్నారు. 'న్యూరో ఎండ్రోక్రైన్ ట్యూమర్' అనేది శరీరంలోని వివిధ భాగాలకు వస్తుంది. ఈ వ్యాధి చికిత్స కోసం ఇర్ఫాన్ విదేశాలకు వెళుతున్నారు. "ఈ వ్యాధితో నా ప్రయాణం విదేశాల వరకు సాగుతోంది. ఆత్మీయంగా మీరు అందించే శుభాకాంక్షలు పంపడం కొనసాగించండి" అని చెప్పారు ఇర్ఫాన్. ఇది ఓ ప్రత్యేకమైన లేదంటే, అరుదైన క్యాన్సర్ అని దిల్లీ ఎయిమ్స్ వైద్యులు చెబుతున్నారు. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఇర్ఫాన్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రల్లో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇర్ఫాన్‌కు క్యాన్సర్ అని తెలియడం... ఇదే సమయంలో దీపిక ఆరోగ్యం కూడా సరిగా లేకపోవడంతో ఈ సినిమా వాయిదా పడింది.

గాయకుడు కె.బి.కె.మోహన్ రాజు కన్నుమూత



ప్రముఖ సినీ గాయకుడు, లలిత సంగీత కళాకారుడు కె.బి.కె.మోహన్‌రాజు (85) శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. 'పూలరంగడు', 'సాక్షి', 'బ్రహ్మచారి', 'తాసీల్దారుగారి అమ్మాయి', 'దేవుడమ్మ', 'విధి విలాసం', 'పెద్దన్నయ్య' తదితర చిత్రాల్లో గీతాల్ని పాడి పేరు తెచ్చుకొన్న ఆయన, ఆల్ ఇండియా రేడియోలోనూ, టెలివిజన్‌లోనూ 1959 నుంచి వేలాది లలిత గీతాలు ఆలపించి శ్రోతల్ని అలరించారు. ఉషాకన్య, శేషయ్య దంపతులకి విజయవాడలో 1934లో జన్మించిన మోహన్‌రాజు పూర్తి పేరు కొండా బాబూ కృష్ణ మోహన్‌రాజు. బెజవాడ ఎలెక్ట్రిసిటీ బోర్డ్‌లో ఎల్.డి.సిగా చేరిన ఆయన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఛీఫ్ పర్సనల్ ఆఫీసర్ హోదాలో పదవీ విరమణ పొందారు. ఆయనకి నలుగురు అబ్బాయిలు, ఒకమ్మాయి. చిన్నప్పుడే శాస్త్రీయ సంగీతం నేర్చుకొన్న మోహన్‌రాజుకి పాఠశాలలో ఉండగానే రేడియోతో అనుబంధం ఏర్పడింది. పాటలు పాడుతూ, చిన్న చిన్న నాటకాలు వేశారు. ఉద్యోగరీత్యా మద్రాసుకి బదిలీపై వెళ్లాక సినీ నేపథ్య గాయకుడిగా ప్రయత్నాలు చేశారు. 'పూలరంగడు' చిత్రంలో తొలి అవకాశం అందుకొన్న ఆయన అందులో 'చిగురులు వేసిన కలలన్నీ సిగలో పూలుగ మారినవి' అనే గీతాన్ని ఆలపించారు. ఆ పాటే ఆయనకి పేరు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత బాపు దర్శకత్వంలో తెరకెక్కిన 'సాక్షి'లో 'ఎవరికి వారే ఈలోకం..' పాటని పాడారు. 'సంపూర్ణ తీర్థయాత్ర' అనే ఒక అనువాద చిత్రంలో 57 నిమిషాల పాట పాడారు. దేశవిదేశాల్లో నిర్వహించిన వేలాది కచేరీల్లో పాల్గొని రామదాసు కీర్తనలు, భగవద్గీత ఆలపించారు. మోహన్‌రాజు అమ్మాయి వీణ ఆయన వారసత్వం పుణికి పుచ్చుకొని కచేరీలు నిర్వహిస్తున్నారు. కె.బి.కె.మోహన్‌రాజు అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.



ఆ సంస్థ పేరు ఐబీహబ్స్. వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఆ మెట్లు ఎక్కితే... చేయాలనుకున్న వ్యాపారంలో ఓనమాలు నేర్పించి... రుణాలు ఇప్పిస్తారు. అవసరం అయితే... మార్కెటింగ్ మెలకువలూ వివరిస్తారు. స్థలం మొదలు మెంటారింగ్ వరకూ ఎన్నో చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే... సర్వ సదుపాయాలన్నీ సమకూర్చి పూర్తిస్థాయిలో వ్యాపారవేత్తగా మారుస్తారు. ఆ వివరాలే చెబుతోంది సంస్థ సీఈఓ రాధా అలేఖ్య.

ఆలోచన చెబితే... వ్యాపారం చేయిస్తాం!

● నివేద ఇంజినీరింగ్ విద్యార్థినిగా ఉన్నప్పుడే వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై ఓ స్టార్టప్ ఆలోచన చేసింది. ఆమె ఆలోచన కొత్తదే కానీ.. పనిచేయడానికి ఓ బృందం, నెట్‌వర్క్ విస్తరణ.. ఇలాంటివన్నీ తెలుసుకునేందుకు మమ్మల్ని సంప్రదించింది. తాజాగా ఆమె వ్యాపార ఆలోచనకు కర్ణాటక ప్రభుత్వం నుంచి యాభై లక్షల సాయం అందుకుంది.

● పందొమ్మిదేళ్ల మేఘన కూడా అంతే. ఆమెకు సామాజిక సేవ చేయడం ఇష్టం. స్నేహితులతో కలిసి ఓ బృందంగా ఏర్పడింది. సేవనే ఓ స్టార్టప్‌గా మలచాలనుకుంది. కానీ దానికి నిధులు ఎలా సేకరించాలో, న్యాయపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక మా దగ్గరకు వచ్చింది. ఎన్జీవోగా రిజిస్ట్రేషన్ చేయించాం. దానిద్వారా ఇప్పుడు యాభై మంది అనాథ చిన్నారులను దత్తత తీసుకుని పోషిస్తోంది.

వీళ్లిద్దరికే కాదు... చక్కటి ఆలోచనతో ముందుకొచ్చిన ఎవరికైనా సరే సాయం అందిస్తాం. అది నెట్‌వర్కింగ్ విషయంలో కావొచ్చు... సాంకేతిక సాయం, నిధుల సేకరణా, న్యాయసలహా, మార్కెటింగ్, పరిశోధనా, బ్రాండింగ్, మెంటారింగ్, వ్యాపారం చేసుకోవడానికి చోటు.. ఇలా అవసరాన్ని బట్టి సమస్తం సమకూరుస్తాం. ఒకప్పటితో పోలిస్తే... ఈతరం ఆలోచనలు మారాయి. తమ కాళ్లమీద తాము నిలదొక్కుకోవడమే కాదు...అనేక సమస్యలకీ పరిష్కారమూ చూపించాలనుకుంటున్నారు. కానీ మార్కెట్ పోటీ వల్ల ఆటుపోట్లను తట్టుకోలేరు. సరైన మార్గనిర్దేశనం లేకపోవడమూ మరో సమస్య. దాన్ని మేం గుర్తించి సరిదిద్దడానికి ప్రయత్నిస్తాం. ప్రతిదశలోని ఇబ్బందులు గుర్తించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. అయితే మా దగ్గరికి వచ్చే ప్రతిదీ వ్యాపార ఆలోచనే కాకపోవచ్చు. ఆర్థిక లాభమే ఉండక్కర్లేదు. అది సామాజిక ప్రయోజనం కోసం చేసే పోరాటం కూడా కావొచ్చు. ఆ ఆలోచన ఏదైనా సరే బలంగా నమ్మి ముందడుగు వేస్తోన్నవారి వెన్నుతట్టడమే ఐబీహబ్స్ ఉద్దేశం.

మేమంతా ఎవరంటే...

ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఐఐఎమ్ అన్నీ ప్రతిష్ఠాత్మ విద్యాసంస్థలే. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులం అంతా కలిసి ఓ బృందంగా ఏర్పడ్డాం. అంతా వేర్వేరు ప్రాంతాలకు చెందినవాళ్లం. మాలో కొందరు డాక్టర్లు, డిజైనర్లు, ఇంజినీర్లు... ఇలా అన్నిరకాల వృత్తుల వారూ ఉన్నారు. మా అందరి లక్ష్యం దేశ ప్రగతికి మా వంతు సాయం అందించడమే. మా బృందంలో మొత్తం రెండు వందల మంది ఉన్నాం. మా అందరికీ కామన్‌గా విజయ్ అనే మెంటార్ ఉన్నారు. ఆయన సలహాతోనే మేం వేర్వేరు బృందాలుగా విడిపోయాం. మాలో కొందరు సైబర్ సెక్యూరిటీస్ కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారు. మరికొందరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ విషయంలో సాయపడుతున్నారు. మేం ఇరవై మంది కలిసి యువతను వ్యాపారవేత్తలుగా మార్చాలనే ఉద్దేశంతో ఈ ఐబీహబ్స్‌ని రెండేళ్లక్రితం ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌తోపాటూ దిల్లీ, లఖనవూ, ముంబయి, బెంగళూరుల్లో నోడల్ ఏజెన్సీలు, మరో ముప్ఫై ప్రాంతాల్లో సెంటర్‌లనూ ఏర్పాటు చేశాం. గ్రామీణ యువతకూ చేరువ కావడమే మా లక్ష్యం.

ఎవరైనా సంప్రదించొచ్చు

చక్కటి ఆలోచనలు ఉన్నవారెవరైనా మమ్మల్ని సంప్రదించొచ్చు. అవసరం అనుకుంటే ఆలోచన ప్రాథమిక స్థాయిలో ఉన్నా మేం దానికో రూపం ఇస్తాం. మా వెబ్‌సైట్ www.ibhubs.co ద్వారా మా సాయం తీసుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే మా బృందం వారితో మాట్లాడుతుంది. మాకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆలోచన బాగుంది.. సాయం చేయొచ్చు అనుకున్నవాటికి ప్రాధాన్యం ఇస్తాం. మొదటి మూడు నెలలు ఉచితంగా సేవలు అందిస్తాం. ఆ తరువాత జరిగే చర్చల్లో దాని భవిష్యత్తు నిర్ణయిస్తాం. తరువాత పూర్తిస్థాయిలో సాయం చేస్తాం.



స్టార్టప్‌లకు సాయం...

ఎవరైనా సరే! వ్యాపారవేత్తగా మారడం ఒక్కరోజులో జరిగిపోదు. ఒక్కో స్టార్టప్ వివిధ దశల్ని దాటుకుని ఎదగాలంటే ఐదు నుంచి ఏడేళ్ల సమయం పడుతుంది. మా దగ్గరకు వచ్చిన ఆలోచన ...ఏ దశలో ఉందో అంచనా వేసి దాని సామర్థ్యం మేరకు సాయం ఏమేరకు అవసరమో ఆలోచిస్తాం. అలా కొందరికి ఫండింగ్ కల్పిస్తే.. ఇంకొందరికి నెట్‌వర్క్ ఎలా విస్తరించుకోవాలో సూచిస్తాం. ఇంకొన్నింటికి ఎండ్ టు ఎండ్ పద్ధతిలో ఐడియా దశ నుంచి మార్కెట్ వరకూ అన్నింటా మేం సాయం అందిస్తాం. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా రెండువందల స్టార్టప్‌లకు సాయం అందిస్తే...ఒక్క హైదరాబాద్‌లోనే ముప్ఫై స్టార్టప్‌లకు సేవలు అందిస్తున్నాం. హైదరాబాద్ కేంద్రం నుంచి కీలక కార్యకలాపాలు సాగుతాయి. దాంతో ఇక్కడ సుమారు డెబ్భైమంది పని చేస్తున్నారు. మరి మీకేంటి ప్రయోజనం అంటారా? అది ఓ స్థాయికి చేరుకున్నాక మేం ఆ సంస్థల నుంచి ఈక్విటీల రూపంలో ఆదాయం అందుకుంటాం. అలా ఇప్పటివరకూ మా సాయం పొందిన స్టార్టప్‌లు చాలానే ఉన్నాయి. వాటిల్లో ఐబీ క్రికెట్, కోసిప్, సైబర్ఐ, మేక్ ది వరల్డ్ వండర్‌ఫుల్, ఇంగ్లిష్ ఇంజిన్, లాటీల్యాబ్స్... వంటివెన్నో.

సాఫ్ట్‌వేర్ ఒకటే ఉద్యోగం కాదు...

నేను ఐఐటీ భువనేశ్వర్‌లో చదివా. మాది రాజమండ్రి. కొన్నాళ్లు చెన్నైలోని కాగ్నిజెంట్‌లో పనిచేశా. కానీ అది సంతృప్తినివ్వలేదు. సొంతంగా ఏదైనా చేయాలి... సామాజిక ప్రయోజనం ఉండాలి అనేది నా తపన. అప్పుడే నా ఆలోచనకు డాక్టర్ అశ్విని, కావ్య దొమ్మేటి...మరికొంతమంది తోడయ్యారు. నేను సీఈవోగా, వాళ్లిద్దరూ డైరక్టర్లుగా ఐబీహబ్స్‌ని ప్రారంభించాం. తలా కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాం. అమ్మానాన్నలకి నా లక్ష్యంతెలుసు కాబట్టి వాళ్లేమనలేదు. చాలామంది చదువులంటే ఐఐటీలూ, ఉద్యోగాలంటే సాఫ్ట్‌వేర్‌లే అనుకుంటారు. కానీ ఆలోచనలకు రెక్కలిస్తే...ఎన్నో అద్భుతాలు చేయొచ్చనేది మేం నిరూపించాలనుకున్నాం.

– స్వాతి కొరపాటి



మహిళలు సాధించిన స్వచ్ఛత!

మహిళలంతా కలిసి ఏర్పాటు చేసుకున్న ఓ సమాఖ్య వల్ల ఒక కాలనీ రూపురేఖలు మారిపోయాయి. కాలనీ బాగోగులు కోసం ఏర్పాటు చేసుకున్న ఆ సమాఖ్యకు ఇప్పుడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛత ఎక్సెలెన్సీ అవార్డు కూడా ప్రకటించింది. స్వచ్ఛత సాధించిన ప్రాంతాలను దేశవ్యాప్తంగా ఎంపిక చేసి ఈ పురస్కారాలు ఇస్తారు. కొన్ని రోజుల వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన రంగా కాలనీ ఒక మురికివాడలా ఉండేది. ఒక మరుగుదొడ్డి కనిపించడం కూడా అరుదే. అలాంటిది మహిళలు పొదుపు సంఘాల ద్వారా కూడబెట్టుకున్న డబ్బుతో గ్రామాన్ని పరిశుభ్రంగా చేశారు. ఊర్లో ఉన్న మహిళలు మొత్తం ఒక సమాఖ్యగా ఏర్పడి అందులో 45 పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. నెలనెలా వాటిలో తప్పకుండా ఎంతో కొంత డబ్బు కూడబెట్టడం తప్పనిసరన్న నియమం పెట్టుకున్నారు. పెళ్లిళ్లు, వ్యాపారం, అత్యవసర పరిస్థితుల్లో వాటినుంచి రుణం తీసుకోవడం వల్ల అప్పుల సమస్య కూడా తీరిపోయింది. ఎప్పటికప్పుడు గ్రామం అభివృద్ధి కోసం కూడా ఆ నిధుల్లో కొంత మొత్తం ఉపయోగించడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, వీధులు శుభ్రపరచడం, పరిసరాల పరిశుభ్రత... ఇలా సమాఖ్య తరపున అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విజయం సాధించారు. దాంట్లో భాగంగానే బహిరంగ మలవిసర్జన రహిత కాలనీగా కూడా మార్చాలనుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆ సంఘాల్లో మహిళలు వాటి అవసరం గురించి ఇంటి యజమానుల్ని ఒప్పించడం మొదలుపెట్టారు. మొదట్లో స్థలం లేదని కొందరు, అవసరం లేదని ఇంకొందరు అసలు మరుగుదొడ్డే వద్దనేవారు. కానీ వాటి ఆవశ్యకతను అర్థమయ్యేలా వివరించి ఇప్పుడా కాలనీలో సుమారు 72 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేశారు. ఇంటి యజమాని అనుమతి దొరికితే చాలు... వాటి నిర్మాణ పనులు కూడా మొత్తం ఈ సంఘాల్లో ఉన్న మహిళలే చూసుకుంటారు. ఇవన్నీ ఆ కాలనీకి స్వచ్ఛ కాలనీగా మార్చాయి. ఈనెల 23న దిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ సమాఖ్యలోని మహిళలందరూ అవార్డు అందుకోనున్నారు.

– కౌతవరపు సత్యప్రసాద్, ఈనాడు అమరావతి.

మస్కారా వేసే ముందు...



అలంకరణ చేసుకునేటప్పుడు చిన్న చిన్న కిటుకులు తెలుసుకుంటే పని సులువవుతుంది. సమయం కూడా వృథా కాదు. ఒకసారి ఆ చిట్కాలేంటో చూద్దామా.

- మస్కారా వేసుకునే ముందు ఆ సీసాను గోరువెచ్చని నీళ్లలో ఉంచితే అది సులువుగా ఇవతలకు వస్తుంది. లేదంటే రెండు అరచేతుల మధ్య మస్కారా ఉంచి అటూ ఇటూ రాపిడి చేస్తున్నట్లు రుద్దినా కూడా అదే ఫలితం ఉంటుంది.
- మేకప్ బ్రష్‌ల ధర కాస్త ఎక్కువే. వాటికి బదులుగా ఇంతకముందు ఉపయోగించని పెయింట్ బ్రష్‌లు ఉన్నా మేకప్ కోసం వాడొచ్చు. కాస్త నాణ్యత బాగున్నవి ఎంచుకోవాలంతే. అవి కూడా మనకు కావల్సినన్ని ఆకారాల్లో, రకాల్లో సులువుగా దొరుకుతాయి.
- ఐలైనర్ పెట్టుకునేటప్పుడు అద్దం ముఖానికి ఎదురుగా కాకుండా కాస్త కింద వంచాలి. అలా కాస్త తల వంచితే అద్దంలో రెప్ప స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే రెప్పమీద ముడతలు కూడా ఉండవు. సులువుగా రాసుకోవచ్చు.
- లిప్‌స్టిక్ రాసుకున్నాక పెదాల మీద చర్మం తెల్లగా పొలుసులుగా ఉన్నట్లు కనిపిస్తుంటుంది. అలా కాకుండా ఉండాలంటే పెదాలకు ముందు కొబ్బరినూనె రాసి సున్నితంగా మర్దన చేసి కాసేపయ్యాక కడిగేయాలి. చర్మానికి తేమ అంది పెదాలు ఆరోగ్యంగా కనిపిస్తాయి.
- మేకప్ ఎక్కువసేపు తాజాగా ఉండాలంటే ఒక స్ప్రే సీసాలో గులాబీనీరు నింపి నేరుగా ముఖం మీద కాకుండా గాల్లోకి కొట్టినట్లుగా చల్లుకోవాలి. దీనివల్ల మేకప్ ఎక్కువ సేపు తాజాగా ఉంటుంది. జిడ్డు సమస్య ఉండదు.
- ముఖం మీద మచ్చలు ఎక్కువగా కనిపిస్తుంటే కన్సీలర్‌ను రాసి చూడండి. ముందు కన్సీలర్ రాసుకుని దానిమీద పౌడర్ అద్ది, తరువాత మళ్లీ కన్సీలర్ రాయాలి. చివరగా పౌడర్ రాసుకుంటే సరిపోతుంది.

సర్వరోగ నివారిణి నేలవాము



ప్రతి ఒక్కరూ సులువుగా పెంచుకోగలిగిన ప్రత్యేకమైన, విలువైన మొక్కల్లో నేలవేము గురించి చెప్పుకోవాలి. నేలవేము అడుగు నుంచి రెండడుగులు మాత్రమే పెరిగే చిన్న మొక్క. ఇది ఏకవార్షికం. ఆకారంలో చిన్నదైనా ఉపయోగాలు అపారం. దీన్ని సర్వరోగనివారిణిగా వర్ణిస్తారు. యునానీ, ఆయుర్వేదం, హోమియో... ఒక్కటేమిటి, ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ వైద్యంలో వాడే మూలికల్లో దీనికి అగ్రతాంబూలం లభిస్తుంది. అలాగే ఔషధ మొక్కల్లో అత్యంత చేదుగా ఉండే వాటిలో ఇదొకటి. అందుకే దీన్ని 'కింగ్ ఆఫ్ బిట్టర్స్' అంటారు. సంస్కృతంలో దీన్ని 'కాలమేఘ' అని పిలుస్తారు. నేలవేము శాస్త్రీయ నామం ఆండ్రోగ్రాఫిస్ పానిక్యులేటా. వేపంత చేదుతో ఉండి, నేల బారున పెరిగే మొక్క కావడంతో దీన్ని నేలవేము అంటారు. ఇది మనదేశానికి చెందినదే.

ఈ మొక్క ఔషధ లక్షణాల గురించి వింటే, విస్తుపోకమానం. క్యాన్సర్‌కు మందుగానే కాకుండా క్యాన్సర్ రాకుండా కూడా దీన్ని వాడతారట. ఎయిడ్స్‌కు కూడా ఇది మంచి మందట. అధిక రక్తపోటుకూ, గుండె జబ్బులూ, కాలేయ సంబంధ వ్యాధులకు కూడా ఇది చాలా బాగా పనిచేస్తుందట. మధుమేహాన్ని కూడా అదుపులో ఉంచుతుంది. స్త్రీల వ్యాధుల విషయంలో దీని ఉపయోగం చాలా ఉంటుందట. సాధారణ జలుబూ, ఒంటి నొప్పులకు, మలేరియా లాంటి జ్వరాలకు ఇది చాలా మంచి ఔషధం. రక్తశుద్ధి, వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. పిల్లల్లో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు ఇది మంచి పరిష్కారం. అలాగే తేలు కాటుకు, పాము కాటుకు కూడా ఇది విరుగుడుగా పనిచేస్తుందట. ఒకటేమిటి, సర్వరోగనివారిణి అన్న పేరు దీనికి అతికినట్లు సరిపోతుంది.




సన్నటి చారలతో పూలు...

నేలవేము ఎలాంటి నేలలోనైనా, వాతావరణంలోనైనా పెరుగుతుంది. అయితే తేమగా ఉండే నేల దీనికి అనుకూలంగా ఉంటుంది. పూర్తి ఎండలో కంటే కొద్దిపాటి నీడలో చక్కగా పెరుగుతుంది. దీని కాండం లేతగా, ముదురాకుపచ్చ రంగులో పలకలుగా ఉంటుంది. ఆకులు సన్నగా, పొడవుగా ఉంటాయి. తెల్లని చిన్న చిన్న పూలు నాలుగు రేకలతో ఊదారంగు చారలతో లేదా చుక్కలతో ముచ్చటగా ఉంటాయి. ఇవి కొమ్మ చివర ఒక్కొక్కటిగా లేదా వదులుగా ఉండే కంకుల్లో పూస్తాయి. ఔషధపరంగా పూర్తి మొక్క ఉపయుక్తమైనదైనా ఆకులను ఎక్కువగా వాడతారు. పూలను ముందే తుంచేస్తుంటే గుబురుగా పెరిగి ఆకులు ఎక్కువగా వస్తాయి. ఇవి ఏకవార్షికమైనా ఒకసారి నాటుకుంటే గింజలు పడి మళ్లీ మళ్లీ అవే మొలుస్తాయి. కుండీలో పెంచుకుని వరండాలో పెట్టుకోవచ్చు కూడా. కొత్తగా పెంచుకోవాలనుకునేవాళ్లు చిన్న మొక్కలు తెచ్చి నాటుకోవచ్చు లేదా విత్తనాలు తెచ్చి చల్లుకుంటే వారంలోపు మొలకెత్తుతాయి. నేలవేముకు చీడపీడల భయం లేదు. వర్మికంపోస్టు లేదా కంపోస్టు కలిపిన సారవంతమైన మట్టి మిశ్రమంలో నాటుకుని నెలకొకసారి జీవామృతం లేదా పిండి ఎరువులు నీళ్లలో నానబెట్టి వేసుకుంటే మొక్క ఆరోగ్యంగా, గుబురుగా పెరుగుతుంది.

– బోడెంపూడి శ్రీదేవి, లాండ్‌స్కేప్ కన్సల్టెంట్

బంగారం-వెండి



16న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	31,320	31,400
ఆర్నమెంట్	29,230	29,330
వెండి (కిలో)	39,254	39,440
విజయవాడ		
బంగారం (24క్యా)	31,270	31,400
ఆర్నమెంట్	29,000	29,150
వెండి (కిలో)	39,800	39,800
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,250	31,350
ఆర్నమెంట్	28,950	29,080
వెండి (కిలో)	39,500	39,700
రాజమండ్రి		
బంగారం (24క్యా)	30,920	31,000
ఆర్నమెంట్	28,920	29,000
వెండి (కిలో)	38,700	38,800
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,110	31,350
ఆర్నమెంట్	28,920	29,160
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,895	2,900
వెండి (గ్రా)	41.30	41.40

(రూ. లలో)

కొవ్వును కరిగించే టొమాటో



ఒకప్పటితో పోలిస్తే యోగాలూ, వ్యాయామాలు... చేసే వారి సంఖ్య ఇప్పుడు ఎక్కువే. అలాంటి వారికి టొమాటో అమృత ఫలం అంటున్నారు నిపుణులు.

- దీన్ని నిత్యం తీసుకోవడం వల్ల క్యాన్సర్ సమస్యను దూరంగా ఉంచొచ్చు. ఇంకా దీనిలో కెలొరీలు తక్కువ. చిన్న టొమాటోలో కేవలం పదహారు కెలొరీలు మాత్రమే ఉంటాయి.
- టొమాటోలో పీచు కూడా అధికమే. బరువు తగ్గాలనుకునే వారు దీన్ని రోజూ ఒకటి నుంచి రెండు తీసుకోవచ్చు.
- టొమాటోల్లో సహజ చక్కెర్లు లభిస్తాయి. అలానే గ్లైసమిక్ ఇండెక్స్ కూడా చాలా స్వల్పం. మధుమేహం ఉన్నవారు తీసుకున్నా ఇబ్బంది ఉండదు. రక్తంలో చక్కెర స్థాయుల్లో అసమతుల్యత ఏర్పడవు. కొవ్వు నిల్వలు లేకుండా చూస్తుంది.
- దీనిలో నీటి శాతం ఎక్కువ. ఒకటి తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. శరీరానికి తేమ కూడా అందిస్తుంది. చర్మానికి కూడా మంచిది. డైటింగ్ చేసేవారు ఆహారంలో భాగం చేసుకోవచ్చు.

గర్భం అంటే భయమేస్తోంది!

● నాకు ఐదేళ్లక్రితం పెళ్లయ్యింది. ఏడాదిన్నర క్రితం గర్భం వచ్చింది. డాక్టర్ దగ్గరకు వెళ్తే పరీక్ష చేసి, ఆ గర్భం కుడివైపున ఉన్న ఫెల్లోపియన్ ట్యూబ్‌లో ఏర్పడిందని చెప్పి తీసేశారు. అదే సమయంలో ఇన్‌ఫెక్షన్ పేరుతో కుడివైపున ఉన్న ఆ ఫెల్లోపియన్ ట్యూబుని కూడా తొలగించాలని చెప్పి తీసేశారు. ఇప్పుడు మళ్లీ గర్భం దాల్చాలనుకుంటున్నా. ఈసారి కూడా ఏదయినా సమస్య వస్తుందేమోనని భయంగా ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

మీకు వచ్చిన గర్భాన్ని ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అంటారు. అంటే గర్భం గర్భాశయంలో కాకుండా మరో చోట ఏర్పడుతుంది. సాధారణంగా ఫెల్లోపియన్ ట్యూబులో పెరుగుతుంది. మీ విషయంలోనూ అదే జరిగింది. అందుకే ఆ గర్భాన్ని తొలగించారు. ఇక, ఆ ట్యూబుకు ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల దాన్ని తొలగించారు. ఈ సమస్యను పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజ్ అంటారు. మీకు మళ్లీ గర్భం వచ్చినా కూడా అది ఫెల్లోపియన్ ట్యూబులోనే ఏర్పడే అవకాశం పది నుంచి పదిహేను శాతం ఉంటుంది. సాధారణంగా అయితే అండాశయం నుంచి విడుదలైన అండాన్నీ, వీర్యకణాలను ఫెల్లోపియన్ ట్యూబు ఒకదానికి ఒకటి ఎదురెదురుగా తెచ్చి రెండింటినీ కలిసేట్టు చేయాలి. ఆ తరువాత దాన్ని గర్భాశయంలోకి పంపడం పద్ధతి. కానీ అది కూడా ఆరోగ్యకరంగా లేకపోయినా.. ఇన్‌ఫెక్షన్ ఉన్నా అండం సరిగ్గా నిలవదు. పైగా అలాంటప్పుడే మరోసారి ఫెల్లోపియన్ ట్యూబులోనే గర్భం ఏర్పడుతుంది. కాబట్టి మీరు మరోసారి పరీక్ష చేయించుకోవడం మంచిది. ఆ ఫెల్లోపియన్ ట్యూబు కూడా సరిగ్గా ఉందో లేదో గమనిస్తారు. ఇన్‌ఫెక్షన్ లాంటిది ఏదయినా ఉందని తేలితే అయితే క్లిప్ అమరుస్తారు లేదా పూర్తిగా తొలగిస్తారు. ఆ తరువాత మీరు టెస్ట్‌ట్యూబ్ బేబీ పద్ధతిని ఎంచుకోవచ్చు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

ఈ బుర్ఖా... డి విటమిన్ కోసం!



మన చర్మానికి విటమిన్ డి చాలా అవసరం. ఇది ఎండలోని అతినీలలోహిత కిరణాల్లో అధికం. ఇది లోపిస్తే... జీవక్రియ రేటు తగ్గడం, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యలు తప్పవు. మన దేశంలో దాదాపు బుర్ఖా ధరించే ఎంతోమంది మహిళలు ఈ సమస్యల్ని ఎదుర్కొంటున్నట్టు తెలుసుకుంది ముంబయికి చెందిన డిజైనర్ ముర్ఖీలీన్ ఫీర్జాదా. విటమిన్ డి లోపంతో బాధపడిన ఆమె కూడా మరికొందరు ముస్లిం మహిళలతో మాటాడింది. బుర్ఖా వేసుకోవడం వల్ల చర్మపై పూర్తిగా ఎండ పడదు. అలాంటి వారికోసం ఏదైనా చేయాలని ఆలోచించింది ముర్ఖీలీన్. అప్పుడే ఆమెకు మైక్రోసోల్ అనే వస్త్రం గురించి తెలిసింది. ఆ వస్త్రంలోంచి అతినీలలోహిత కిరణాలు ప్రసరిస్తాయి. ఆ వస్త్రం ఉతకడమూ తేలికే. ఇస్త్రీ కూడా అవసరం లేదని గుర్తించిన ఆమె అభయ పేరుతో బుర్ఖాలను రూపొందిస్తోంది. ఫ్రాన్స్‌లో మైక్రోసోల్ వస్త్రాన్నే అత్యధికంగా ఉపయోగిస్తారు. దీని గురించి తెలుసుకున్నాకే ప్రత్యేకంగా బుర్ఖాలు తయారుచేయడం మొదలుపెట్టింది.

youth@eenadu.in
ఈనాడు
శనివారం మార్చి 17, 2018
విజయవాడ
18

అంకురార్పణ



తల్లిదండ్రులు టీచర్లు విద్యార్థి ఓ ఆప్

మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ...

ప్రతి విద్యార్థినోట పలికించే చదువుల శ్లోకం... ఈ శ్లోకానికి టెక్నాలజీ హంగులు అద్దారో ముగ్గురు యువకులు! అనుభవం నేర్పిన పాఠాలతో ఇప్పుడున్న మార్కెట్ చదువుల్లోకి ఆ శ్లోక సారాంశానికి కొత్త అర్థాన్ని ఇస్తున్నారు...పిల్లల చదువుల్లో వారి పాత్రని పూర్తిస్థాయిలో పోషించేందుకు ఓ ప్రత్యేక టెక్నాలజీ వేదికను సిద్ధం చేశారు. అదే 'రిగ్నో' మొబైల్ ఆప్.

విశ్వనాథ్, నిశాంత్, అవినాశ్‌రెడ్డి... ముగ్గురూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. అయితే, వారి చదువుల కాలం ఎలా గడిచిందో ఏమోగానీ... నేటి కాలం చదువులపై లోతుగానే ఆలోచించారు. లక్షల సంపాదన వదులుకుని రిగ్నో ఆవిష్కరణ వైపు అడుగులు వేశారు. వారి ప్రధాన ఉద్దేశం ఒక్కటే... విద్యాలయాలు, గురువులు, విద్యార్థులకు మధ్య ఏర్పడిన అగాధాన్ని పూరించడం. ఎందుకంటే... నేటి చదువుల ప్రపంచంలో పిల్లలకు గురువులు, తల్లిదండ్రులతో సరైన సత్సంబంధాలు లేకపోవడమే. 'మంచి స్కూల్‌లో చేర్పించాం కదా... వాళ్లే చూసుకుంటారులే' అని తల్లిదండ్రులు... 'క్లాసులో పాఠాలు బోధించడంతోనే మా పని ముగిసిందనుకునే' ఉపాధ్యాయులు... 'చెప్పిందేదో ముక్కున పట్టి చీదేస్తే పోతుందనుకునే' విద్యార్థులు... వీరందని మైండ్‌సెట్‌ని మార్చేలా వినూత్నమైన ప్లాట్‌ఫామ్‌ని సిద్ధం చేశారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లింది మొదలు... వచ్చేంత వరకూ ఆప్ సాయంతో మానిటర్ చేయవచ్చు.

ఓ స్కూల్‌మేట్‌లా...

విద్యార్థులు తమ స్కూల్‌లోని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో నెట్‌వర్క్‌ని క్రియేట్ చేసుకునేలా రిగ్నోని రూపకల్పన చేశారు. వారి స్కూల్ నెట్‌వర్క్‌లో తల్లిదండ్రులూ భాగస్వాములు కావొచ్చు. విద్యార్థులు నేడు విధిగా ఫాలో అవుతున్న సోషల్ మీడియా మాదిరిగానే ఇదీ పని చేస్తుంది. అంటే... గుర్తు తెలియని వ్యక్తులతో కాకుండా ఒకే గూటి పక్షులతో చదువుల స్నేహాన్ని కోరొచ్చు. క్లాస్ రూం టీచర్లని ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో యాక్సెస్ చేయవచ్చు. పేరొందిన పాఠశాలల్లో ఏర్పాటు చేసుకునే క్లబ్బుల్ని ఆప్‌లో రోజూ నిర్వహించొచ్చు. దీంతో ఎప్పటికప్పుడు పిల్లలు వారిలోని సృజనాత్మక కోణాల్ని ఆవిష్కరించొచ్చు. మార్కుల కోసం మాత్రమే ఆరాటపడకుండా పిల్లల మానసిక ఎదుగుదలకి దోహదపడేలా తల్లిదండ్రులు తమ ప్రోత్సాహాన్ని ఎల్లప్పుడూ అందించొచ్చు. ఉపాధ్యాయులు కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థులతో ఎప్పుడైనా ఆసక్తికరమైన డేటా షేర్ చేయవచ్చు.

ఆసక్తికి చేయూత...

విద్యార్థులు వారి ఆసక్తిమేరకు 'రెగ్నో ఎక్స్‌ప్లోర్'లో డేటాని బ్రౌజ్ చేసి చూడొచ్చు. ఆసక్తుల్ని గమనించిన ఉపాధ్యాయులు వారికి సరిపడే డేటాని విద్యార్థులతో పంచుకోవచ్చు. అంతేనా... స్కూల్ సిలబస్, ఈవెంట్‌లు, ఇతర సమాచారాన్ని రిగ్నో నుంచే ఫాలో అవొచ్చు. దీంతో తల్లిదండ్రులు స్కూల్‌కి సంబంధించిన అప్‌డేట్స్‌ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి అభిప్రాయాల్ని యాజమాన్యంతో పంచుకోవచ్చు.



స్కూల్‌బోర్డు: విద్యార్థులు సాధించిన విజయాలు, క్రియేటివ్ వర్క్‌లను టీచర్లు షేర్ చేస్తారు.

డిస్కషన్స్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రోగ్రెస్‌పై చర్చలు జరపొచ్చు. తమ నుంచి ఏం కోరుకుంటున్నారో చర్చించుకుని చదువులోనే కాకుండా మానసిక ఎదుగుదలకి తోడ్పాటు అందించొచ్చు.


బస్ ట్రాకింగ్: రోజూ పిల్లల్ని తీసుకెళ్లే స్కూల్ బస్సులు ఆప్ నుంచే మానిటర్ చేయవచ్చు.

ఇతర వివరాలకు: http://www.rigkno.com

- వాజేంద్ర బహద్దూర్, నారాయణగూడ, న్యూస్‌టుడే


నేను కాక ఇంకెవరు?

స్కూల్, కాలేజీ, ఇంట్లో చాలా సార్లు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు విన్నా. ఆధ్యాత్మిక గురువులు రాసిన వ్యాసాలు చదివా. కానీ, నాలో ఉద్భవించే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరలేదు. నాతో నేను... నాలో నేను పదే పదే ప్రశ్నించుకునేవాడిని... 'ఈ లోకానికి ఎందుకొచ్చాను? ఏ ప్రయోజనం కోసం బతుకుతున్నా? నా పుట్టుకకు ఏదైనా పర్పస్ ఉందా?... ఇలా ప్రతినిత్యం ఎన్నో ప్రశ్నలు. చుట్టూ అల్లుకుని, కమ్ముకుని ఉన్న ప్రపంచాన్ని చూస్తూ మరెన్నో. ఓ రోజు నేను వెళ్తున్న వీధిలో ఓ చిన్న బాలుడు. డొక్కలెండిపోయి... చిరిగిన బట్టలతో కనిపించాడు. ఆ క్షణం.. 'అసలు దేవుడు ఉన్నాడా?



ఉంటే ఆ బాబుని ఎందుకలా వదిలేశాడు? వాడికి మంచి వసతి కలిగేలా చూడలేడా?'... అని ఆవేశపడ్డాను. అదే ఆలోచనతో పడుకున్నా. నాకు సమాధానంగా ఓ కల్లో ఓ వాయిస్ 'నా పని నేను ఎప్పుడో చేశా. అందుకేగా నిన్ను పుట్టించాను!!' అనేది దాని సారాంశం. లేచి చూస్తే అంతా నిశ్శబ్దం. నాకు అర్థమైంది. నేను మనిషిగా ఎందుకు పుట్టానో. 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు.. నేను కాక ఇంకెవ్వరు!!'... ఉదయం లేవగానే వీధిలో ఎక్కడైతే దిక్కులేని బాలుడిని చూశానో అక్కడికి నా అడుగులు పడ్డాయి. – ఆర్యన్

పంచుకుందాం!



ఫీల్ మై లవ్...

నీ రూపం నాకు జ్ఞాపకం కాకూడదు...
నీ దేహం నాకు దూరంగా ఉండకూడదు...
నీ చూపులే చెరసాలలలు...
బందీ అయినా దేహం భరించగలదా?
గుండెలవిసేలా రోదించా...
గూటికి చేరనంటోంది మన బంధం...

– తోరి నాగరాజు

నిన్ను మిస్ అవుతాననే!

నీ కళ్లలోకి చూడాలంటే ధైర్యం చాలడం లేదు. దాయడం తప్పే అని తెలిసినా అప్పుడు నేను నీ చేతుల్లో ఆడుతున్న బార్బీ బొమ్మని. ఎక్కడ పడిపోతాననే భయంతోనే చెప్పలేదు. నువ్వు ఏం అనకుండా ఓ చూపు చూశావ్. ఆ చూపు కోపం అయితే కాస్తన్న బలౌదామనుకున్నా. కొంతైనా బాధ తీరేది. తిట్టొచ్చు కదా తీయగా భరిద్దాం అనుకున్నా. నీ మౌనం నన్ను మరింత చిన్నబుచ్చుకునేలా చేసింది. ప్లీజ్ డార్లింగ్!! మాట్లాడు. అనిపించేదో అనెయ్. నేను తప్పు చేయలేదు. నేను నువ్వు ప్రేమించిన అమ్మాయిని. నా గురించి నాకంటే ఎక్కువగా నీకే తెలుసుగా. ప్రతి విషయాన్ని ఒకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకునే నువ్వు ఎందుకు మౌనం వహిస్తున్నావ్. ఈ ఎడబాటు తాత్కాలికం అనుకుంటున్నా. నేను దాచిన ఆ విషయం నీ మనసుని ఎంత గాయం చేసిందో ఊహించగలను. అది నేను తెలిసీతెలియని వయస్సులో వేసిన తప్పటడుగు. నీకు చెప్పేంత పెద్దది కాదనే అనుకున్నా. నేను ఎప్పుడో మర్చిపోయా. కానీ, కాలం నాకో గుణపాఠం నేర్పింది. విషయం చిన్నదైనా... పెద్దదైనా... దాయాల్సిన అవసరం లేదు. దాపరికం ప్రేమకి మానని గాయం. నన్ను



క్షమిస్తావు కదూ. ఆ రోజు నువ్వు ఫోన్ చేసి రోహిత్ ఎవరని అడిగేసరికి నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. నీకు ఎలా తెలిసిందాని కంగారు పడ్డాను. నా మెయిల్‌లో చూశానని చెప్పగానే షాక్ అయ్యా. దాయాలని నేను ఫిక్స్ అయితే... మెయిల్ పాస్‌వర్డ్‌లు ఎందుకు చెప్పుకుంటాం. నేను ఇంటర్ చదివేప్పుడు తను నాకు పరిచయం. నా ఫ్రెండ్ వాళ్ల అన్నయ్య. ప్రపోజ్ చేశాడు. నేనేం చెప్పలేదు. ఎమోషనల్‌గా ట్రాప్ చేశాడు. తర్వాత తెలిసింది చెల్లితో పందెం వేశాడంటా. నాకు వాళ్ల చెల్లే చెప్పింది. అంతే.. అప్పటి నుంచి వాడి ముఖం చూస్తే ఒట్టు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... నా బాధ కొంతైనా తీరుతుందేమోనని. నాతో నువ్వు మామూలుగా మాట్లాడి వారం దాటి పోతోంది. ప్లీజ్ రా!! చెప్పకుండా నిన్ను మోసం చేశానని నువ్వు అనుకుంటే మన ప్రేమ నిజం కాదు! – శ్రీ, వైజాగ్

ఒంటికో భాష ఉంది వింటే ఒత్తిడి చిత్తవుతుంది!



■ 45 నిమిషాల క్లాస్ అయ్యిందో లేదో... మాష్టారు గదిని వీడకముందే... చేతులు రెండూ పైకి లేస్తాయి... హాయిగా ఒళ్లు గాల్లోకి విచ్చుకుంటుంది... ఎంత రిలాక్సో!!


■ 4 పేజీల నోట్స్ రాయడం అయ్యిందో లేదు... పెన్ను ముక్కు పళ్ల మధ్యకి చేరిపోతుంది... పళ్ల మధ్య ఏదో పని ఉన్నట్టుగా తిరుగుతుంది... అప్పడా ముఖ కవళికల్లో మజానే వేరు...

■ వింటున్న విషయం బుర్రకెక్కడం లేదు... తల అడ్డంగా ఊపితే బాగోదు.. నిలువుగా ఆడిస్తే అర్థమైందనుకుంటారు.. టెన్షన్ దేనికి? ఆపకుండా తలాడిస్తుంటే ఆ కమిట్‌మెంటే వేరు!!

■ హాలంతా నిశ్శబ్దం... కాఫీ సిప్ చేస్తూ ఫోన్లకు అతుక్కుపోయారు అందరూ... ఓ ఇద్దరు మాత్రం పగలబడి నవ్వుతున్నారు... అందరి చూపు వారిపైనే.. వాళ్లకు అదేం పట్టలేదు. ఎందుకంటే... ఆ 10 నిమిషాలు బ్రేక్ టైం!


... గుర్తొస్తున్నాయి కదూ! స్కూల్ డేస్‌లోనో... కాలేజీ రోజుల్లోనో... ఆఫీస్ కెఫ్టేరియాలోనో... మీరు అచ్చం ఇలాగే. ఫన్నీగా ఎన్నో చేసుంటారు. కానీ, మీకు తెలుసా? అవన్నీ కేవలం ఫన్నీ మాత్రమే కాదు. ఈ రకమైన ప్రవర్తన, శరీర కదలికలూ మానసిక ఒత్తిడికి మందులుగా పని చేస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ప్రపంచంలోని ప్రముఖమైన విశ్వవిద్యాలయాల్లో చేసిన సర్వేలు, విశ్లేషణలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అయితే, నేటి తరం 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'లో ఇవి కేవలం 'నాస్టీ థింగ్స్'గా పరిగణిస్తే ఒత్తిడి ఎప్పుడూ వై-ఫైలా వెంటే తిరుగుతుంది. బయటపడేందుకు ఎన్ని పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఆప్స్‌ని ఇన్‌స్టాల్ చేసినా ఫోన్ ఇంటర్నల్ మెమొరీ నిండుతుంది తప్ప... మెదడు మూడ్‌ని మార్చలేవు. అందుకే ఒత్తిడిని చిత్తడి చేసే శరీర భాషని అర్థం చేసుకోవడం ఎంతైనా అవసరం. మీతో మీరు... మీలో మీరు! కాస్త నిశితంగా పరిశీలిస్తే మీకే తెలుస్తుంది. సమస్య చిన్నదైనా... పెద్దదైనా... సింపుల్‌గా ఆలోచనా దృక్పథాన్ని మార్చేయవచ్చు. అందుకు మీరేం చేయాలంటే?

ఉరకలేసే వయసుకి...




శక్తిని నింపుకొనేందుకు... 'హై పవర్ పోజ్'

ఉన్నత చదువుల్లో... ఉద్యోగాల్లో అనుకోకుండా ఒత్తిడి ఆవహిస్తుంది. భుజాలు కుంగిపోయి... కుర్చీలో కూలబడినట్లుగా... టేబుల్‌పై వాలిపోయినట్టుగా అయిపోతారు. అలాంటి సందర్భాల్లో 'హై పవర్ పోజ్'ని ఆవాహనం చేసుకుంటే మంచి ఫలితాల్ని పొందొచ్చని హార్వర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు చెబుతున్నారు. బలంగా ఊపిరి తీసుకుని హై పవర్ పోజులోకి వస్తే చాలు... కేవలం రెండు నిమిషాల్లోనే అధిక స్థాయిలో టెస్టోస్టీరాన్ విడుదలై ఒత్తిడికి కారణమయ్యే కార్టిజోల్ హార్మోన్ ప్రభావాన్ని తగ్గిస్తుందని తేల్చారు.




మీ కౌగిలిలో మీరే... 'హగ్ యువర్‌సెల్ఫ్'

మీరంటే మీకెంత ఇష్టమో తెలియాలంటే? మిమ్మల్ని మీరు కౌగిలించుకోవాల్సిందే. అప్పుడే ఒత్తిడి మీ దరిచేరదు అంటున్నారు టెక్సాస్ విశ్వవిద్యాలయ మానసిక నిపుణురాలు క్రిస్టిన్ నెఫ్. మీరో ఒంటరనో... మిమ్మల్నెవరూ అర్థం చేసుకోవడం లేదనో... మానసిక ఒత్తిడికి గురైనప్పుడు మీ కోసం మీరు ఉన్నారన్న విషయం గ్రహించాలి. మిమ్మల్ని మీరే కౌగిలించుకోవాలి. అప్పుడు విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్ కార్టిజోల్‌ని నియంత్రిస్తుంది. దీంతో ఆందోళన స్థాయి తగ్గి గుండె రక్తనాళాలపై ఒత్తిడి తగ్గి మనసుకి హాయిగా అనిపిస్తుంది.




ఇదో ఉపశమనం... 'చాప్‌స్టిక్స్'

పళ్ల మధ్యలో ఇరుక్కున్న వాటిని తీసేందుకు వాడే పెన్ను, పెన్సిల్ ముక్కు మొదలుకుని సురక్షితమైన చాప్‌స్టిక్స్ వరకూ మానసిక ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం అందిస్తాయనేది కేన్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకుల మాట. వారి పరిశోధనలో భాగంగా కొందరికి చాప్‌స్టిక్స్ ఇచ్చి క్లిష్టమైన పనుల్లో వారి పని తీరుని గమనిస్తే చాప్‌స్టిక్స్ వాడిన వారిలో ఒత్తిడి స్థాయి తక్కువగా ఉన్నట్టు తేలింది.




దర్జాగా వెనక్కి... 'షోల్డర్స్ బ్యాక్'

మెదడు ప్రభావం శరీరంపై ఏ స్థాయిలో ఉంటుందో... ఇదే మాదిరిగా శరీర భంగిమలూ మెదడును ప్రభావితం చేస్తాయన్నది శాస్త్రవేత్తల మాట. ఒత్తిడి నుంచి ఉపశమనానికి ఒళ్లు విరుచుకోవడం... లేదంటే రెండు చేతుల్నీ తల వెనక్కి పెట్టి బలంగా బిగించి పాజిటివ్ దృక్పథంతో ఆలోచిస్తే మెదడులో చురుకైన హార్మోన్లు విడుదలై ప్రశాంతంగా అనిపిస్తుందట.




చిందేయండి... 'ఫైవ్ మినిట్ డ్యాన్స్ మూవ్'

మూడ్ బాలేదని ముడుచుకుని కూర్చుంటే ఎలా? కాలం మీ కోసం ఎదురు చూడదు. అందుకే ఓ ఐదు నిమిషాలు కాలంతో పాటే చిందేయండి. అంతే... మీలో హుషారు పుట్టుకొచ్చి తిరిగి రీఛార్జ్ అవుతారని యార్క్ అండ్ షెఫీల్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు చెబుతున్నారు. దీంట్లో భాగంగా ఐదు నిమిషాలు మ్యూజిక్ ప్లే చేస్తూ కొందరిని వినమని... మరికొందరిని డ్యాన్స్ చేయమని కోరారు.. తర్వాత వారి మానసిక స్థితిని గమనిస్తే డ్యాన్స్ చేసినవారిలో గణనీయమైన మార్పు కనిపించిందట.




తలూపండి... అంతే!... 'నాడ్ యువర్ హెడ్'

సమాధానం చెప్పేటప్పుడో... చర్చల్లోనో... కచ్చితమైన అవగాహన ఉంటేనే అవుననో... కాదనో చెప్పాలి. ఒకవేళ ఏవైనా సందేహాలు ఉన్నా... అయోమయంగా అనిపించినా... కంగారు పడి ఆందోళనకు లోను కాకుండా... తలని ఆపకుండా కిందికీ... పైకీ.. ఊపుతూనే ఉండాలి. దీంతో ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందట. ఒహైయో విశ్వవిద్యాలయానికి చెందిన మానసిక శాస్త్ర నిపుణులు ఇదే చెబుతున్నారు.



వెన్ను నిటారుగా... 'సిట్ అప్ స్ట్రైట్'

ఎక్కడైనా జారబడి కూర్చుంటే అంతా నీరుగారే వాతావరణమే. నీరసం ఆవహించి మెదడు ఉత్తేజితం కాదు. అందుకే వెన్ను నిటారుగా ఉంచి కూర్చుంటే ఆత్మవిశ్వాసం పెరిగి మెదడు చురుకుగా పని చేస్తుందనేది మానసిక శాస్త్ర నిపుణుల మాట.



మీదైన నడక... 'వాక్ హ్యాపీ'

ఖుషీ సినిమాలో పవన్ కళ్యాణ్, భూమిక వెనక నడుస్తూ మాట్లాడే సంభాషణ ఎప్పటికీ మర్చిపోలేం! అక్కడ పవన్ నడకలో ఉత్సాహం, ఉత్సుకత కనిపిస్తుంది. మీ నడకలోనూ అంతే ఉత్సాహం ఉండాలి. అప్పుడే మనసంతా పాజిటివ్ ఆలోచనలతో నిండి ఉంటుందని సైకాలజీ నిపుణులు చెబుతున్నారు.



పొట్ట చెక్కలవ్వాలి... 'బెల్లీ లాఫ్'

కడుపారా నవ్వుకునేందుకు కారణాలు వెతుక్కోనక్కర్లేదు. హాయిగా నవ్వేయండి. మిత్రుల జోకులకు మెచ్యూర్డ్‌గా ప్రవర్తిస్తూ మితంగా నవ్వక్కర్లేదు. కడుపు చెక్కలయ్యేలా నవ్వండి. దీంతో రక్తంలో ఆక్సిజన్ శాతం పెరిగి ఒత్తిడి మాయం అవుతుందట. అందుకే 'ఫేక్ స్మైల్'కి బాయ్ చెప్పేసి పగలబడి నవ్వండి.

ఆ 'కండ' విజయం

ఆసక్తి.. శక్తినిస్తుంది.
ఆసరా.. నడిపిస్తుంది.
తపన... నిలబెడుతుంది.
శ్రమ.. గెలిపిస్తుంది.

శరీరసౌష్టవంపై ఆసక్తి... కష్టాలను తట్టుకోగలిగే శక్తినిచ్చింది. శ్రేయోభిలాషుల ఆసరా.. లక్ష్యం దిశగా నడిపించింది. తనని తాను నిరూపించుకోవాలన్న తపన... కష్టాలను ఎదుర్కొనేలా నిలబెట్టింది. అకుంఠిత శ్రమ.. పోటీల్లోనే కాదు, పేదరికాన్ని గెలిచే నేర్పునిచ్చింది. ఓ యువకుడిని ప్రపంచానికి పరిచయం చేసింది.

లూధియానాలో జరిగిన ఇంటర్నేషనల్ బాడీబిల్డింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించిన ఓ కండలవీరుణ్ని ఎవరూ పట్టించుకోవడం లేదని కన్నీళ్లు పెట్టుకుంటున్న ఓ మహిళ వీడియో సోషల్‌మీడియాలో సంచలనమైంది. ఎక్కువమంది ఆ యువకుడి వివరాలను తెలుసుకోవడానికి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఆ వివరాలను ఈతరం సేకరించింది. అతని పేరు సుధీర్. వీడియోలో కన్నీళ్లు పెట్టుకుంది ఆయన భార్య అపర్ణ. వీరికి పెళ్లై నెలరోజులే అయింది. కర్నూలు జిల్లా పాణ్యం మండలంలోని బలపనూరు వీరి గ్రామం. సరైన వసతులు, తిండి లేకుండానే అతను సాధించిన విజయాలు స్ఫూర్తి నింపేవే. అద్భుతమైన లక్ష్యం అతన్ని ఊరిస్తుంటే... అకుంఠిత శ్రమ నడిపించింది.

అప్పుచేసి ఆహారం

శరీరసౌష్టవం కావాలంటే ప్రతిరోజూ ఖరీదైన పౌష్టిక ఆహారం తీసుకోవాలి. అంత ఆర్థిక స్థోమత సుధీర్‌కు లేదు. దీంతో అప్పులు తెచ్చి లక్ష్యం కోసం శ్రమించాడు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన బాడీబిల్డింగ్ కోచ్ హరిసందు ఆన్‌లైన్‌లో సుధీర్‌కు శిక్షణ ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో కోచ్ ఇస్తున్న చిట్కాలతో రాటుదేలుతున్నాడు.



రోజూ 9 గంటలు

'రోనీ కోల్మన్'లా కండలు పెంచాలని ప్రయత్నిస్తున్నా. ఉదయం 6-8గంటల వరకు జిమ్ శిక్షకుడిగా పనిచేస్తూ వర్క్‌అవుట్లు చేస్తాను. 9-11 గంటల వరకు పూర్తిగా కసరత్తులపై దృష్టి పెడతాను. తర్వాత ప్రోటీన్లు, కూరగాయాలు, చికెన్ తీసుకుంటాను. సాయంత్రం 4-5 గంటల వరకు వ్యాయామం చేస్తాను. 6-8గంటల వరకు ఆర్జీఎం కళాశాలలో జిమ్ శిక్షకుడిగా వ్యవహరిస్తాను. రోజుకు 9గంటలపాటు జిమ్‌లోనే ఉంటాను. మార్చి 18న గోవాలో బాస్‌క్లాసిక్ వారు నిర్వహించే ఇంటర్నేషనల్ బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నాను. 'మిస్టర్ ఇండియా' సాధించడమే నా లక్ష్యం. **- సుధీర్**

పెరిగిన ప్రోత్సాహం

2015 ఆగస్టులో మొదటిసారి పోటీలకు వెళ్లి 'ఏపీ బాడీబిల్డింగ్ అసోసియేషన్' ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన మిస్టర్ రాయలసీమ పోటీల్లో ప్రతిభ చాటాడు. 60కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. అప్పటి నుంచి సుధీర్ ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఆ తర్వాత ఎన్నో జాతీయ పోటీల్లో పతకాలు గెలిచాడు. మిస్టర్ ఆంధ్ర, మిస్టర్ తెలంగాణగా నిలిచాడు.

సంకల్పం

నెలరోజుల క్రితం సుధీర్ అపర్ణ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. డిగ్రీపూర్తిచేసి బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్న అపర్ణ భర్తకు పూర్తి సహకారం అందిస్తోంది. డైట్‌ను సకాలంలో అందించడంతోపాటు పోటీలు జరిగే రాష్ట్రాలకు వెంటవెళ్లి ప్రోత్సహిస్తోంది. 2018 ఫిబ్రవరి 10న పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో షేరోక్లాసిక్ నిర్వహించిన ఇంటర్నేషనల్ బాడీబిల్డింగ్ పోటీలలో 70 కేజీల విభాగంలో వెండి, కాంస్య పతకాలు సాధించి ఔరా అనిపించాడు. రాష్ట్రానికి కండలవీరుడు తెస్తున్న పతకాల వెనుక శ్రమను గుర్తించి ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10లక్షల నగదు అందజేసి సన్మానించారు.

- ఎడ్లపాటి సురేంద్ర,
ఈనాడు డిజిటల్ - కర్నూలు